సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 279

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం 30-12-2024



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



అక్కినేనితో కొత్త శిఖరాలకు తెలుగు సినిమా

సినీ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు చేర్చారంటూ ప్రధాని 'మన్ కీ బాత్'లో ప్రశంసించారు. భారతీయ విలువలను ఆయన సినిమాలు ప్రతిబింబించాయన్నారు.

- వివరాలు 6లో▶



హెచ్-1బీ వీసాలకు ట్రంప్ దన్ను

హెచ్-1బీ వీసాల పరిరక్షణ కోసం అవసరమైతే యుద్ధానికైనా సిద్ధమన్న ఎలాన్ మస్క్ వ్యాఖ్యలకు కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు పలికారు.

- వివరాలు 6లో▶



హంపి అ'ద్వితీయం'

రెండోసారి ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ కైవసం

భారత చెస్ గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ ఆణిముత్యం కోనేరు హంపి రెండోసారి ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. న్యూయార్క్‌లో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో 37 ఏళ్ల హంపి 8.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో తొలిసారి 2019లో విజేతగా నిలిచిన హంపి... 2012లో కాంస్య పతకం, 2023లో రజత పతకం సాధించింది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన భారత ప్లేయర్‌గా హంపి గుర్తింపు పొందింది. టైటిల్ నెగ్గిన హంపికి 60 వేల డాలర్లు (రూ. 51 లక్షల 23 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

వివరాలు 14లో▶

న్యూస్‌రీల్

కొత్త ఏడాదికి సన్నద్ధమా?



కొత్త ఏడాదిలో వృత్తి/వ్యాపారం/ఉద్యోగంలో రాణించాలని అందరిలోనూ ఎన్నో ఆకాంక్షలు. ఈ జాబితాలో ఆర్థిక లక్ష్యాలకూ చోటివ్వాలి. ఆపై ఆచరణ పక్కాగా ఉండాలి. అప్పుడే కారు, సొంతిల్లు, రిటైర్మెంట్ వంటి కీలక లక్ష్యాలను సరైన ప్రణాళికతోనే చేరుకోగలరు. ప్రస్తుత ఏడాది ఆర్థిక నిర్ణయాలు, పెట్టుబడులు, రుణాలను ఒక్కసారి సమీక్షించుకోవాల్సిన తరుణం కూడా ఇదే. ఆర్థిక సన్నద్ధతను పరీక్షించుకోవాల్సిన సందర్భం కూడా ఇదే.

- వివరాలు 15లో▶

పడగొట్టి... పట్టు వదిలేసి!



ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్‌లో జరుగుతున్న నాలుగో టెస్టులో భారత్ ముందు భారీ సవాల్ నిలిచింది. ఓవరాల్‌గా ఆస్ట్రేలియా జట్టు తమ ఆధిక్యాన్ని 333 పరుగులకు పెంచుకుంది.

- వివరాలు 14లో▶

విషాదాలు.. విజయాలు



2024లో భారతావని తీపి, చేదులెన్నింటినో చవిచూసింది. హిందువుల ఐదు శతాబ్దాల కలను సాకారం చేస్తూ అయోధ్యలో బాలరాముని దివ్య ధామం కొలువుదీరింది. అస్తవ్యస్త అభివృద్ధి తగదని కేరళ కొండల్లో ప్రకోపం రూపంలో ప్రకృతి హెచ్చరించింది.

- వివరాలు 6లో▶

ఏపీ సీఎస్‌గా విజయానంద్



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా విజయానంద్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 3లో▶



ప్రభుత్వ ఉద్యోగులమైనా..

ఏం 'ప్రయోజనం'?

నల్లగొండ జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మహిళా ఉద్యోగి ఒకరు అనారోగ్య కారణాలతో వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) కింద విధుల నుంచి తప్పుకొన్నారు. తద్వారా అందే సొమ్ముతో తన ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయించుకోవచ్చని భావించారు. ఆమెకు గ్రాట్యుటీ, టీజీఎల్ఐసీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యుటేషన్ తదితర ప్రయోజనాల కింద మొత్తంగా రూ.60 లక్షల వరకు అందాల్సి ఉంది. కానీ ఏడాదిన్నర గడిచినా పెన్షన్ మినహా ఇతర ప్రయోజనాలేవీ అందలేదు. దీనితో తన ఆరోగ్య సమస్యకు పరిష్కారం లభించలేదని ఆమె వాపోతున్నారు.

మూడేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు అందని ఆర్థిక ప్రయోజనాలు

- వేతనాలు, పెన్షన్లు మినహా ఇతర ప్రయోజనాలన్నింటికీ బ్రేక్
- పదవీ విరమణ పొందినా.. జీపీఎఫ్ లోన్‌కు దరఖాస్తు చేసినా..
- మెడికల్ రీయింబర్స్‌మెంట్ అయినా.. సరెండర్ లీవ్స్ బిల్లులైనా..
- అన్నిరకాల బిల్లులను ఆపేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ
- ఇన్సూరెన్స్ బాండ్ల గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా అందని లబ్ధి
- ఏళ్లకేళ్లు ఎదురు చూపులతో విసిగిపోతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- పదవీ విరమణ ప్రయోజనాలు అందక రిటైర్డ్ ఉద్యోగులకు తిప్పలు

మొత్తం బకాయిలు రూ. **3,800** కోట్లు

జీవిత బీమా పథకం మెచ్యూరిటీల సొమ్ము రూ.850 కోట్లు	రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద చెల్లించాల్సినవి రూ.875 కోట్లు
జీపీఎఫ్ రుణాల కోసం అవసరమైన మొత్తం రూ. 450 కోట్లు	మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈఎల్స్, సప్లిమెంటరీ బిల్స్ రూ. 1,600 కోట్లు (సుమారుగా)

2లో

దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

179 ప్రాణాలు బుగ్గిపాలు

- ల్యాండింగ్ గేర్ వైఫల్యంతో రన్‌వేపై అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టిన జెజూ ఎయిర్ విమానం
- మంటలు చెలరేగడంతో ప్రయాణికులు సజీవదహనం
- ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు
- ల్యాండింగ్‌కు ముందే పైలట్‌కు ఏటీసీ నుంచి 'బర్డ్ స్ట్రైక్' వార్నింగ్
- మరో రన్‌వేపై దిగాలని సూచన.. అలా దిగలేని పరిస్థితి ఉందంటూ సిగ్నల్ పంపిన పైలట్
- ఆ తర్వాత క్షణాల వ్యవధిలోనే అదుపుతప్పిన విమానం



బుగ్గిపాలైన విమానం వద్ద సహాయక చర్యలు. (ఇన్‌సెట్)లో విమానాన్ని పక్షి ఢీకొనడంతో వ్యాపిస్తున్న మంటలు



త్రుటిలో తప్పిన మరో మూడు ప్రమాదాలు

వివరాలు 6లో▶

సంక్రాంతికే కానీ..!

- ఇంకా పూర్తికాని రైతు భరోసా విధివిధానాల రూపకల్పన కసరత్తు
- సాగయిన భూమికే పెట్టుబడి సాయం ఆలోచనపై ఉప సంఘం సభ్యుల భిన్నాభిప్రాయాలు
- వానాకాలం, యాసంగి సీజన్లలో పంటల హెచ్చుతగ్గుల అంశంపై చర్చ

- ఖరీఫ్‌లో పత్తి వేసి, రబీలో నీరులేక పంట వేయని భూములకు సాయం ఎలా?
- ఆయిల్ పామ్, మామిడి, ఇతర తోటలకు పెట్టుబడి సాయం ఎలా ఇవ్వాలి?
- రైతు భరోసా ఎంత మేర, ఎలా ఇవ్వాలి?.. ఒకేసారా? రెండు సీజన్లకు విడివిడిగానా?
- మంత్రి వర్గ ఉపసంఘంలో సుదీర్ఘంగా చర్చలు.. త్వరలో మరోమారు భేటీకి నిర్ణయం
- పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం




సాక్షి, హైదరాబాద్: రైతులకు పెట్టుబడి సాయం అందించే 'రైతు భరోసా'పై కాంగ్రెస్ సర్కారు కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. సంక్రాంతి నుంచే రైతు భరోసా సొమ్మును రైతులకు అందిస్తామని సర్కారు ప్రకటించినా.. విధివిధానాల రూపకల్పన ఇంకా ఓ కొలిక్కి రాలేదు. రైతు భరోసాకు ఎవరు అర్హులు? ఎవరు అనర్హులనే దానిపై ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నా.. ఎలా ఇవ్వాలి, ఎంత మేర ఇవ్వాలి, ఉద్యాన పంటలకు పెట్టుబడి సాయం ఎలా అందించాలి, ఇందుకోసం ఏ విధానాన్ని అనుసరించాలన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ క్రమంలో రైతుభరోసాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆదివారం మళ్లీ సమావేశమై చర్చించింది.

అధికాదాయ వర్గాలు మినహా..

ఐటీ చెల్లింపుదారులు, సివిల్ సర్వీస్, గ్రూప్-1 స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వంటి వారికి మినహా సాగుభూమి ఉన్న ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినట్టు సమాచారం. ఎన్ని ఎకరాలకు సీలింగ్

మిగతా 3వ పేజీలో ▶

ఇదంజగత్



అదుపులోనే శాంతిభద్రతలు



డీజీపీ జితేందర్

అన్ని రకాల నేరాలు కలిపి 9.87 శాతం పెరుగుదల

16లో



సైబర్ మోసాలపై పలువురు సైబర్ భద్రత నిపుణులు, పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. విలువైన సూచనలు ఇస్తున్నారు. వీటిపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వివరాలు 12లో▶



ఫీజు భారం పెరిగింది!

విదేశీ చదువుకు డాలర్ దెబ్బ

- అమెరికాలో ఎమ్మెస్ కలకు ఆటంకాలు
- పతనమవుతున్న రూపాయి విలువతో భారత విద్యార్థులకు కష్టాలు
- ట్యూషన్ ఫీజులో సగటున 10 శాతం పెరుగుదల!
- అదనపు రుణం ఇవ్వబోమంటున్న బ్యాంకులు.. దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు, తల్లిదండ్రులు

వివరాలు 3లో▶

జనవరిలోగా బీజేపీకి కొత్త అధ్యక్షుడు!

ఢిల్లీలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పురోగతిపై భేటీ



సమావేశంలో నడ్డాతో కిషన్‌రెడ్డి, డీకే అరుణ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: జనవరి నెలాఖరులోగా బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు రానున్నారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. జనవరి 10 నాటికి అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షుల ఎన్నిక పూర్తికానుండగా, రాష్ట్రాల అధ్యక్షుల ఎన్నికలు 15 నాటికి పూర్తవుతాయి. ఆ తర్వాత జనవరి నెలాఖరు కల్లా పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించనున్నారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కీలక సమావేశంలో గత ఏడాది కాలంగా జరుగుతున్న పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన పురోగతిపై అన్ని రాష్ట్రాల అధ్యక్షుల నుంచి నివేదిక తీసుకున్నారు. అంతేగాక పార్టీ అంతర్గత ఎన్నికలపై కూలంకషంగా చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, పార్టీ జాతీయ పదాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ నుంచి డి.పురందేశ్వరి సమావేశానికి హాజరయ్యారు.

నడ్డా దిశా నిర్దేశం

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని ఏడాది పొడవునా నిర్వహించడం, దేశంలోని వివిధ ప్రదేశాలలో అటల్‌జీ జీవితానికి సంబంధించిన సామాజిక కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించడంపై నడ్డా దిశానిర్దేశం చేశారు. వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో తీసుకున్న ప్రధాన నిర్ణయాలు, విజయాలు, ప్రధానంగా కార్గిల్ యుద్ధం, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన, పోఖ్రాన్ అణు పరీక్ష, స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారి ప్రాజెక్ట్, కిసాన్ క్రెడిట్ కార్డ్ వంటి విజయాలను ప్రదర్శించనున్నారు. ఇలావుండగా వివాదాస్పద అంశాలపై ప్రకటనలు, వ్యాఖ్యలకు పార్టీ నేతలు దూరంగా ఉండాలని పార్టీ అధిష్టానం సూచించింది.

బాబు శిష్యుడు కాబట్టే.. విగ్రహం రూపు మార్చారు

రేవంత్‌పై ఎమ్మెల్సీ కవిత ధ్వజం



నిజామాబాద్ నాగారం: 'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి.. అందుకే తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే తెలంగాణ తల్లి ఉండకూడదన్న ఉద్దేశంతో విగ్ర హం రూపు రేఖలు మార్చేశారు. కాంగ్రెస్ తల్లి విగ్రహాలను సెక్రటేరియట్‌లో ఉంచారు. ఇక మ నం ఆమెనే కొలవాలట' అంటూ ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. 'తెలంగాణ తల్లి మాదిరా.. కాంగ్రెస్ తల్లి మీదిరా' అంటూ నినదించారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత తొలిసారి ఆదివారం నిజామా బాద్ పర్యటనకు వచ్చిన కవితకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆమె పట్టణంలోని సుభాష్‌నగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చేసి తెలంగాణ ఆడబిడ్డలను రేవంత్‌రెడ్డి అవమానించాడన్నారు. గురుకులాలను నడపడం కూడా ప్రభుత్వానికి చేతకావడం లేదని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే 57 మంది పిల్లలు చనిపోయారని తెలి పారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పటి వరకు కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకే ఉద్యోగాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే బీజేపీ కేసులు పెడుతోందని, ఇక రాష్ట్రంలో అక్రమ కేసుల గురించి చెప్పనవసరం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'రింగు' యమ కాస్ట్‌లీ!



కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి రూ.52.5 కోట్ల వ్యయం

మొత్తం రూ.8,500 కోట్ల ఖర్చవుతుందన్న ఎన్‌హెచ్‌ఏఐ.. ఎలివేటెడ్ కారిడార్ తరహా నిర్మాణం

3 భారీ వంతెనలు, 190 చిన్న వంతెనలు, అండర్‌పాస్‌ల వల్లే ఎక్కువ ఖర్చు

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణానికి రూ.8,500 కోట్లు ఖర్చవుతుందని ఎన్‌హెచ్‌ఏఐ డీపీఆర్‌లో పేర్కొంది. 162 కి.మీ నిడివితో ఉండే ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతి కిలోమీటరుకు ఏకంగా రూ. 52.5 కోట్లు ఖర్చు కానుంది. 8 వరసలుగా ప్రతిపాదించినప్పటికీ, ప్రస్తుత ట్రాఫిక్ రద్దీ తక్కువగా ఉండటంతో 4 వరసలను మాత్రమే నిర్మించనున్నారు. భవిష్యత్తులో దాన్ని 8 వరసలకు విస్తరిస్తారు. మరి 4 వరసల నిర్మాణానికే ఇంత భారీ వ్యయం ఎందుకు అవుతోందో చూద్దాం..



5 మీటర్ల ఎత్తుతో నిర్మాణం

ఇది పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్ వే. ఢిల్లీ చుట్టూ నిర్మిస్తున్న ఔటర్ రింగురోడ్డు స్థాయిలో దీనికి ప్లాన్ చేశారు. కొన్ని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్తులో ఆటంకాలు తలెత్తని రీతిలో నిర్మించబోతున్నారు. నగరం, నగర శివారు ప్రాంతాల్లో అప్పుడప్పుడు రికార్డు స్థాయి వర్షపాతం నమోదై లోతట్టు ప్రాంతాలను మెరుపు వరదలు ముంచెత్తుతాయి. కొన్నిరోజుల పాటు ఆ ప్రాంతాలు నీటిలోనే ఉంటాయి. ఇలాంటి వరదలు ఈ రోడ్డును ఇబ్బంది పెట్టకుండా భూ ఉపరితలం నుంచి 5 మీటర్ల ఎత్తుతో ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని నిర్ణయించారు. దాదాపు 16.4 అడుగుల ఎత్తుతో ఇంచుమించు ఎలివేటెడ్ కారిడార్ తరహాలో ఉంటుంది. అంతెత్తు మట్టి కట్ట నిర్మించి దానిమీద రోడ్డును నిర్మిస్తారు. 162 కి.మీ రోడ్డును అంత ఎత్తుతో నిర్మించేందుకు భారీ వ్యయం కానుంది.

3 నదులు.. 3 భారీ వంతెనలు

ఈ మార్గంలో 3 నదుల మీదుగా ఈ రోడ్డు సాగాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో 4 వరసల రోడ్డుకు సరిపోయే వెడల్పుతో 3 భారీ వంతెనలు నిర్మిస్తారు. వలిగొండ వద్ద మూసీ నదిని దాటాల్సి ఉంది. వలిగొండ మండలం పొద్దుటూరు వద్ద కిలోమీటరు పొడవుతో భారీ వంతెనకు డిజైన్ చేశారు. దీనికి దాదాపు రూ.100 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. పుల్కల్ మండలం శివంపేట గ్రామం వద్ద మంజీరా నదిని దాటాల్సి ఉంది. ఇక్కడ 600 మీటర్ల పొడవైన వంతెన నిర్మిస్తారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.75 కోట్లు అవుతుందని భావిస్తున్నారు. ఇక తూప్రాన్ సమీపంలో హరిద్రా నదిని దాటుతుంది. అక్కడ అర కి.మీ పొడవైన వంతెన నిర్మిస్తారు. దీనికి రూ.70 కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది.

190 చిన్న వంతెనలు, అండర్ పాస్‌లు

ఇతర రోడ్ల మీదుగా సాగే వాహనాలు దాటేందుకు, కాలువలు, వాగుల్లో పారే నీళ్ల దాటేందుకు వీలుగా రోడ్డు పొడవునా చిన్న వంతెనలు, అండర్ పాస్‌లను ప్లాన్ చేశారు. ఇవి మొత్తం 190 ఉంటాయి. వీటిల్లో 105 అండర్ పాస్‌లు ఉన్నాయి. దిగువన 10 అడుగుల ఎత్తుతో దారి ఉంటుంది. వాటి గుండా ఇతర రోడ్ల వాహనాలు సాగుతాయి. ఈ కల్వర్టులు, అండర్‌పాస్‌లు ఉండే చోట్ల రింగురోడ్డు 5.5 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తారు. ఇక కాల్వలు, చెక్ డ్యామ్‌లు, చెరువు కాలువలు, గుట్టల నుంచి జాలువారే నీటి ప్రవాహానికి రింగురోడ్డు అడ్డుగా మారకుండా 85 చిన్న కల్వర్టులు నిర్మించనున్నారు. కేవలం నీళ్ల మాత్రమే కాకుండా, వీటి గుండా ట్రాక్టర్ల లాంటి వాహనాలు వెళ్లేలా రోడ్డు కూడా ఉంటుంది. ఇలా పెద్ద, చిన్న వంతెనలు, కల్వర్టులు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి దాదాపు రూ.2 వేల కోట్ల వరకు ఖర్చవుతుందని డీపీఆర్‌లో పొందుపరిచారు. ఇక తారు పొరలు కూడా చాలా మందంగా ఉండనున్నాయి. వాహనాలు 120 కి.మీ. వేగంతో దూసుకుపోయేలా నిర్మిస్తున్నందున, అవి జారిపోయే ప్రమాదం లేకుండా రోడ్డుపైన ప్రత్యేక మెటీరియల్‌తో పొరలు నిర్మించనున్నారు. దిగువ తారు పొరలు కూడా చాలా మందంగా నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి మొత్తంగా రూ.8,500 కోట్ల వ్యయం అవనుంది.

ప్రభుత్వ ఉద్యోగులమైనా.. ఏం 'ప్రయోజనం'?

రెండేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగులకు అందని ఆర్థిక ప్రయోజనాలు

వేతనాలు, పెన్షన్లు మినహా ఇతర ప్రయోజనాలన్నింటికీ బ్రేక్

అన్నిరకాల బిల్లులను ఆపేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ

రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రానికి చెందిన ఓ టీచర్ (స్కూల్ అసిస్టెంట్) ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవి విరమణ పొందారు. రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక ప్రయోజనాలను ముందే లెక్కలు వేసుకుని.. జూన్‌లో కుమార్తె వివాహం జరిపించేందుకు సిద్ధమయ్యారు. ఏప్రిల్‌లో రిటైర్ అయినా.. తర్వాతి రెండు నెలల్లో తనకు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని భావించారు. కానీ పెళ్లి తేదీ సమీపిస్తున్నా ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందలేదు. దీంతో రూ.20 లక్షల మేర అప్పులు చేసి కుమార్తె పెళ్లి చేశాడు. ప్రభుత్వం నుంచి సొమ్ము అందగానే అప్పులు తిరిగి కట్టేయవచ్చని అంచనా వేసుకున్నారు. కానీ ఇంకా అందలేదు. అప్పులపై ఇప్పటికే రూ.2 లక్షలకుపైగా వడ్డీలు కట్టారు. ప్రభుత్వం నుంచి సొమ్ము ఇంకెప్పుడు వస్తుందోననే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేవలం నెలవారీ వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు తప్ప మిగతా ప్రయోజనాలేవీ అందడం లేదు. ఆయా బిల్లుల చెల్లింపును ఆర్థిక శాఖ నిలువరించడంతో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయి. దీనితో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులు, ఇల్లు కట్టుకోవడం సహా ముఖ్యమైన అవసరాలకు సొమ్ము అందక.. బయట అడ్డగోలు వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

అన్నిరకాల ప్రయోజనాలూ ఆపేసి..

సాధారణంగా ఉద్యోగులకు ఏటా ఆర్జిత సెలవులను నగదు మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ఇలా సుమారు ఒక నెల వేతనానికి సరిపడా సొమ్ము అందుతుంది. వైద్య చికిత్సలకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఉద్యోగుల జీవిత బీమా పథకం కింద బాండ్స్ మెచ్యూరిటీ అయితే అందాల్సిన సొమ్ము, పదవీ విరమణ పొందితే వచ్చే గ్రాట్యుటీ తదితర ప్రయోజనాలు రావాల్సి ఉంటుంది. కానీ సుమారు మూడేళ్లుగా ఉద్యోగులకు వేతనాలు, రిటైరైన వారికి పెన్షన్ డబ్బులు మినహా ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదు. మొత్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు, పదవీ విరమణ పొందిన వారికి సంబంధించి వివిధ రకాల బిల్లులు కలిపి సుమారు రూ.3,800 కోట్ల మేర ప్రభుత్వం బకాయిపడినట్లు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

దాచుకున్న డబ్బులు కూడా ఇవ్వరా?

ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాల కింద అందే వాటిలో మెజారిటీ అంశాలు ఉద్యోగులు వ్యక్తిగతంగా జమ చేసుకున్నవే. ఉద్యోగుల సాధారణ భవిష్య నిధి (జీపీఎఫ్), జీవిత బీమా (టీజీఎల్‌ఐ) పథకాల కింద నెలవారీ వేతనాల నుంచి నిధులు జమ అవుతాయి. ఇలా దాచుకున్న నిధి నుంచి అత్యవసర పరిస్థితిలో కొంత మేర రుణరూపంలో వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఇక జీవిత బీమా పథకానికి సంబంధించి ఉద్యోగి వయసు 58 సంవత్సరాలు నిండితే.. ఆ బాండ్ కాలపరిమితి పూర్తి కావడంతో అందుకు సంబంధించి ఆర్థిక ప్రయోజనం వెంటనే ఉద్యోగి ఖాతాలో జమ కావాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 ఏళ్లుగా ఉన్న నేపథ్యంలో... జీవితబీమా పథకం బాండ్లు మెచ్యూరిటీ అయిన ఉద్యోగుల సంఖ్య సుమారు 25 వేల మంది వరకు ఉంటుంది. వీరికి జీవిత బీమా పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు రూ.850 కోట్లుగా అంచనా. జీపీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రెండేళ్లుగా పైసా అందలేదు. ఇలా రూ.450 కోట్ల మేర చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నట్లు ఉద్యోగ సంఘ నేతలు అంచనా వేస్తున్నారు.



మెడికల్ రీయింబర్స్‌మెంట్ రావట్లేదు..

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి నగదు రహిత కార్డుల అంశం కొలిక్కి రాలేదు. దీంతో ఉద్యోగులు వారి వైద్య చికిత్సల కోసం చేసిన ఖర్చులను తిరిగి పొందేందుకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకం కింద దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ బిల్లులు కూడా రెండున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో రూ.లక్ష లోపు ఉన్నవాటిలో కొన్నింటిని కొత్త ప్రభుత్వంలో చెల్లించినా.. అంతకంటే ఎక్కువ మొత్తంతో కూడిన బిల్లులు మాత్రం పరిష్కారం కాలేదు.

తిప్పలు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

2021 ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు ప్రభుత్వం పెంచింది. దానితో మూడేళ్లపాటు రిటైర్మెంట్లు ఆగిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉద్యోగుల పదవీ విరమణలు మొదలయ్యాయి. ఈ ఏడాది నవంబర్ నెలాఖరు నాటికి దాదాపు 9,500 మంది పదవీ విరమణ పొందారు. వీరిలో 90శాతం మంది ఉద్యోగులకు ఇంకా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదు. ఈ రూపంలో దాదాపు రూ.875 కోట్లు రావాల్సి ఉందని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. వాస్తవానికి పదవీ విరమణ పొందిన నెలరోజుల్లోనే ఈ ప్రయోజనాలు ఉద్యోగులకు అందాలి. ఇలా సమకూరే నిధితో వారు తదుపరి జీవన ప్రణాళికను అమలు చేసుకుంటారు. కానీ ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పెరుగుతున్న అసంతృప్తి

ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడంపై ఉద్యోగులలో అసంతృప్తి పెరుగుతోంది. డీఏ బకాయిలు, పీఆర్సీ అమల్లో జాప్యంపై ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న ఉద్యోగులు.. బిల్లుల చెల్లింపులన్నీ నిలిచిపోవడంతో సంఘాల నేతలను నిలదీస్తున్నారని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జిల్లాల వారీగా వివిధ ఉద్యోగ సంఘాల కార్యవర్గాల ఎన్నికల సమయంలో.. పోటీ చేసినవారంతా ఉద్యోగుల ఆర్థిక అంశాలే ఎజెండాగా ముందుకు సాగారని గుర్తు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపుపై స్పందన లేకపోవడంతో ఇబ్బందిగా మారిందని వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘ నేత ఎ.జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. జిల్లాల్లో కార్యవర్గ సమావేశాలు నిర్వహించాలన్నా ఉద్యోగులు నిలదీసే పరిస్థితి ఉందని వాపోయారు.

> **బిల్లులు చెల్లించకుంటే.. ఉద్యమిస్తాం**
>
> 
>
> ప్రభుత్వ ఉద్యోగుల చెల్లింపులకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్‌ఎంఐఎస్) అమల్లోకి వచ్చిన తర్వాత నుంచీ సమస్యలు పెరిగాయి. అంతకు ముందు జిల్లా ఖజానా విభాగం(డీటీఓ) లేదా ఉప ఖజానా కార్యాలయాల (ఎస్టీఓ) పరిధిలో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగంగా జరిగేది. గత ప్రభుత్వంలో ఐఎఫ్‌ఎంఐఎస్ విధానాన్ని తెచ్చి, చెల్లింపులన్నీ కేంద్రీకృతం చేశారు. ఎలాంటి బిల్లును క్లియర్ చేయాలన్నా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల, రెండు నెలల్లో పరిష్కారం కావాల్సిన అంశాలు.. ఇప్పుడు ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కావడం లేదు. అన్నింటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితితో ముడిపెట్టడం వల్ల ఉద్యోగులకు చెల్లింపులు భారీగా పేరుకుపోయాయి. ఇప్పటికే పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌ను కలసి ఉద్యోగుల సమస్యలను నివేదించాం. చిన్నపాటి బిల్లులు మాత్రమే క్లియర్ అయ్యాయి. ఈ నెలాఖరు కల్లా మెజార్టీ బిల్లులు పరిష్కరిస్తామన్నారు. లేకుంటే వచ్చే నెలలో జేఏసీ తరఫున సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమిస్తాం.
>
> – ఏలూరి శ్రీనివాసరావు, టీజీఓ కేంద్ర సంఘం అధ్యక్షుడు

మహిళలు, బాలికలపై దాడులు పెరగడం సిగ్గుచేటు

- హోంశాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ పనితీరు తీవ్ర ఆందోళనకరం
- కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదు
- మాజీ మంత్రి టి.హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. వారిపై గతంలోకంటే ఇప్పుడు దాడులు పెరిగాయని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో నేరాల రేటు 22.5 శాతం పెరిగిందన్నారు. అత్యాచార కేసులు 28.94 శాతం పెరిగాయని, ఏడాదిలో మొత్తం 2,945 కేసులు నమోదయ్యాయని వివరించారు. మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి రాష్ట్రంలో రోజుకు సగటున 8 కేసులు నమోదవుతున్నాయని, ఇందులో 82 శాతం మైనర్ బాలికల అపహరణ కేసులు నమోదవడం సిగ్గుచేటని అన్నారు. ఇవన్నీ గమనిస్తే.. కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత లేదని స్పష్టమవుతోందని, ప్రజా భద్రత పూర్తిగా దిగజారిందని ఆయన ధ్వజమెత్తారు. అంబర్‌పేటలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ గంగారెడ్డి, ఆయన భార్య హత్య (నాలుగు నెలల క్రితం) కేసు ఇంకా పరిష్కారం కాలేదని, ఆర్నెల్లక్రితం హత్యకు గురైన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి కేసులో కూడా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో 163కి పైగా ప్రధాన కేసులు ఇప్పటికీ పరిష్కారం కాలేదని, రూ.10 కోట్ల విలువైన ఆర్థిక మోసాలకు సంబంధించి రికవరీ జరగలేదని ఆక్షేపించారు. రాష్ట్రంలో నేరాల గుర్తింపు రేటు 31 శాతంగా ఉందని, ఈ విషయంలో బిహార్‌లాంటి రాష్ట్రాలతో పోటీపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు గోల్డెన్ పీరియడ్ సమయాన్ని వృథా చేయడం వల్ల బాధితులకు న్యాయం జరగడం లేదని పేర్కొన్నారు. నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్న పరిస్థితి పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. హోంశాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యం వల్ల తెలంగాణ పోలీసులకు ఉన్న మంచి నైపుణ్యాన్ని, శక్తిని కోల్పోతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడానికి సీఎం రేవంత్‌రెడ్డే కారణమని హరీశ్‌రావు అన్నారు.

కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు బతికితే చాలనుకుంటున్నారు

మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో పిల్లలు ప్రాణాలతో బతికుంటే చాలని తల్లిదండ్రులు అనుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్లలో పెడుతున్న బువ్వ తమకొద్దని, ఇక్కడ తాము ఉండలేమంటూ విద్యార్థులు తల్లిదండ్రులను వేడుకుంటున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురుకులాల దీనస్థితి చూస్తే బాసర సరస్వతి తల్లి మనసు తల్లడిల్లుతోందన్నారు. అనంతపేట్ కేజీబీవీలో విషాహారం తిని పదిమంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన దుస్థితి బాధాకరమని, విషాహారం తిని వాంకిడి గురుకుల విద్యార్థిని మరణించిన ఘటన మరువకముందే ఇలాంటివి పునరావృతం కావడం సిగ్గుచేటని హరీశ్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న పోలీసుల ఆత్మహత్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ములుగు జిల్లాలో ఎస్సై, సిద్దిపేటలో కానిస్టేబుల్ కుటుంబం, కామారెడ్డిలో ఎస్సై, కానిస్టేబుల్, సిరిసిల్లలో కానిస్టేబుల్ కుటుంబం, మెదక్ కుల్చారంలో హెడ్ కానిస్టేబుల్.. ఇలా స్వల్ప కాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. పని ఒత్తిడి, పెండింగ్ హామీలను తీర్చడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే పోలీసులపై తీవ్ర ప్రభావం పడుతోందని హరీశ్‌రావు తెలిపారు.

కన్హా శాంతివనం రాష్ట్రానికే గర్వకారణం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



గురూజీ కమ్లేశ్ పటేల్‌తో కలసి శాంతివనంలో పర్యటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

నందిగామ: తెలంగాణలో కన్హా శాంతివనం ఏర్పాటు కావడం రాష్ట్రానికే గర్వకారణమని ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం పరిధిలోని కన్హా శాంతి వనాన్ని ఆదివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాద య్య, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, సీఎం సలహా దారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, కన్హా శాంతివనం గురూజీ కమ్లేశ్ డి.పటేల్ (దాజీ)ని కలసి శాంతివనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతివనంలో చిన్నారులు, విద్యార్థులకు అందించే సాఫ్ట్ స్కిల్స్‌పై సీఎం ఆరా తీశారు. కళ్లకు గంతలు కట్టుకొని రంగులను గుర్తించడం, పదాలను చదవడం వంటి నైపుణ్యాలను పిల్లలు ప్రదర్శించడం చూసి ఆయన విద్యార్థులను అభినందించారు. ఇలాంటి స్కిల్స్ ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీరామచంద్ర మిషన్ ద్వారా ఎంతో మంది తమ జీవితాలను మెరుగుపరచుకోవడంలో దాజీ మార్గదర్శకత్వం గొప్ప విషయమని అన్నారు. తర్వాత శాంతివనంలోని మెడిటేషన్ హాల్ సమీపంలో ముఖ్యమంత్రి మొక్కను నాటారు. దాజీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాంతివనాన్ని సందర్శించడం సంతోషకరమని అన్నారు.

నేడు శాసనసభ ప్రత్యేక భేటీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించనున్న అసెంబ్లీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ నేడు ప్రత్యేకంగా సమావేశం కానుంది. భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించే ఎజెండాతో సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సంతాప ప్రతిపాదనను ప్రవేశపెట్టి, మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను ఉటంకించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్రను విశదీకరిస్తూ ప్రసంగించనున్నారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఈ సమావేశంలో మన్మోహన్ సింగ్ సేవల గురించి ప్రసంగించనున్నారు. సంతాప తీర్మానాన్ని ఆమోదించాక సభ వాయిదా పడనుంది. కాగా, సోమవారం జరిగే అసెంబ్లీ సమావేశాల ఏర్పాట్లను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు ఆదివారం పరిశీలించారు. సభ నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సిబ్బందిని స్పీకర్ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్‌లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడిన స్పీకర్.. సమావేశాల నిర్వహణకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు.

అది మన బాధ్యత.. ఎంపీ మల్లురవి: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను స్మరించుకోవడం మన బాధ్యత అని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అభిప్రాయపడ్డారు. ఆయనను గుర్తు చేసుకునేందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందుకు మల్లు రవి.. సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గొప్ప మేధావికి తెలంగాణ రాష్ట్రం ఇస్తున్న నివాళిగా ఈ సమావేశం నిలిచిపోతుందని మల్లు రవి పేర్కొన్నారు.

విజన్ అంటేనే అప్పులేనా?

ఏపీ సీఎం చంద్రబాబుపై బుగ్గన మండిపాటు



సాక్షి, హైదరాబాద్: ఆర్నెళ్లలో ఏకంగా రూ.1,12,750 కోట్ల అప్పులతో టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో రికార్డు సృష్టించిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధికారం నుంచి దిగిపోయేనాటికి రాష్ట్ర అప్పులు రూ.7,21,918 కోట్లేనని కూటమి ప్రభుత్వమే తేల్చిందని గుర్తు చేశారు. అందులో రూ.3,90,247 కోట్ల అప్పులు టీడీపీ హయాంలో 2014–19 మధ్య చేసినవేనన్నారు. చంద్రబాబు హయాంలో సగటు అప్పుల శాతం 22.6 కాగా కోవిడ్ సమయాన్ని కలిపినా వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా సగటు అప్పుల శాతం 13.5 మాత్రమేనన్నారు. సీఎం చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నట్లుగా విజన్ అంటే అప్పులేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రం దివాలా తీస్తోందని, మరో శ్రీలంకగా మారుతోందని వైఎస్సార్‌సీపీ హయాంలో రోజూ దుష్ప్రచారానికి పాల్పడిన ఎల్లో మీడియాకి కూటమి సర్కారు అప్పులు కనిపించడం లేదా? అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు పచ్చి అబద్ధాలు ప్రచురించారని మండిపడ్డారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో తన బంధువులున్నారంటూ ఎల్లో మీడియాలో వచ్చిన తప్పుడు కథనాలను తీవ్రంగా ఖండించారు. బుగ్గన ఆదివారం హైదరాబాద్ సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు.

- టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు వారాలు తిరగకుండానే జూన్ 24న రూ.6 వేల కోట్లు, జూలై 24న రూ.10 వేల కోట్లు, ఆగస్టులో రూ.3 వేల కోట్లు, సెప్టెంబర్‌లో రూ.4 వేల కోట్లు, అక్టోబర్‌లో రూ.6 వేల కోట్లు, నవంబర్‌లో రూ.4 వేల కోట్లు, డిసెంబర్‌లో రూ.9,237 కోట్ల అప్పులు చేసింది. ఇవి కాకుండా ప్రభుత్వ గ్యారెంటీతో మార్క్‌ఫెడ్, ఎన్సీడీసీ ద్వారా ఈనెల 20న రూ.1,000 కోట్లు, 26న మరో రూ.1,800 కోట్లు, జూలై 19న రూ.3,200 కోట్లతో పాటు బ్యాంక్‌ల నుంచి పౌర సరఫరాల సంస్థ పేరుతో జూన్ 28న రూ.2 వేల కోట్లు, ఏపీఎండీసీ ద్వారా మరో రూ.5 వేల కోట్ల అప్పులు చేయడంతో ప్రభుత్వ గ్యారెంటీతో చేసిన అప్పులే రూ.13 వేల కోట్లకు పెరిగాయి. రాజధాని పేరుతో రూ.31 వేల కోట్ల అప్పులు చేస్తున్నారు. ఈ మూడు కేటగిరీల్లో కలిపి రాష్ట్రం అప్పు రూ.1,12,750 కోట్లు. గ్యారెంటీలు, నాన్ గ్యారెంటీల ద్వారా చేసిన బడ్జెటేతర అప్పులు ఎంతో ఏప్రిల్‌లో తెలుతాయి. బడ్జెట్‌లో ద్రవ్యలోటును రూ.68,742 కోట్లుగా చూపారు.
- విజన్ డాక్యుమెంట్లను ప్రకటించి తానో పెద్ద విజనరీ అని ప్రచారం చేసుకోవడం చంద్రబాబుకు అలవాటే. 'మనసులో మాట' పుస్తకంలోని ఆలోచనలే ఈ విజన్లు. కానీ ఏ ఒక్క లక్ష్యాన్నైనా సాధించారా? సూపర్ సిక్స్ సహా ఏక్క హామీనైనా అమలు చేశారా? హామీలపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదు? ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకి రూ.3 వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో చికిత్సలు నిలిచిపోతున్నాయి. రూ.2,800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. అటు రోగులు ఇటు విద్యార్థులు అల్లాడుతున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏపీ సీఎస్‌గా విజయానంద్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా విజయానంద్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుత సీఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్ పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. దీంతో ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి విజయానంద్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన వచ్చే నవంబర్ 30వ తేదీ వరకు ఈ పోస్టులో కొనసాగనున్నారు.

పంటరుణాల పంపిణీని వేగవంతం చేయాలి

టీజీకాబ్‌–2025 కేలండర్, డైరీ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: పంటరుణాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆది వారం తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ (టీజీకాబ్)ను సందర్శించారు. బ్యాంకు నిర్వహణ, పంటరుణాల పంపిణీ, ఇతర ఆర్థికపరమైన అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రుణ మాఫీ పొందిన రైతులకు కొత్తరుణాలను వేగంగా మంజూరు చేయాలన్నారు. గతంలో పలు డీసీసీబీల్లో కొందరు అధికారులు, పాలకవర్గాల నిర్లక్ష్యంతో పొరపాట్లు జరిగాయని, ఇకపై అలాంటి పొరపాట్లు జరగకుండా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది ప్రత్యేక సంవత్సరంగా పరిగణించాలని, అద్భుత పనితీరు కనబర్చిన వారికి ప్రోత్సాహకాలుంటాయని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. ఆ తర్వాత టీజీకాబ్‌–2025 కేలండర్, డైరీని తుమ్మల ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ బి.గోపి ఇతర అధికారులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీల్లో వైద్యులు..

దేశంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) మంజూరు చేసిన వైద్యులు, స్పెషలిస్టుల కంటే ప్రస్తుతం విధుల్లో ఉన్నవారు తక్కువే. 2023 మార్చి నాటికి దేశంలో మంజూరైన వైద్యుల సంఖ్య 41,931 కాగా, ఉన్నవాళ్లు 32,901 మంది. ఏపీలో 2,313 మందికి 2,293 మంది, తెలంగాణలో 1188 మందికి 757 ఉన్నారు. పీహెచ్‌సీల్లో అత్యధిక డాక్టర్లు మహారాష్ట్రలో ఉన్నారు. 2000కుపైగా వైద్యులు ఉన్న రాష్ట్రాలు 7 మాత్రమే.

రాష్ట్రం	మొత్తం డాక్టర్లు
మహారాష్ట్ర	4,065
బిహార్	2,945
ఉత్తరప్రదేశ్	2,827
తమిళనాడు	2,594
ఏపీ	2,293
రాజస్థాన్	2,236
కర్ణాటక	2,052

ఆధారం: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ

త్వరలో హైదరాబాద్ - డాలస్ విమానం

- హైదరాబాద్ నుంచి పెరిగిన ఇంటర్నేషనల్ కనెక్టివిటీ
- ప్రస్తుతం 20 నగరాలకు సదుపాయం

చి'వరి'కి పొరుగు కూలీలే దిక్కు

- వరినాట్లకు ఇతర రాష్ట్రాల కూలీలు
- బిహార్, కోల్‌కతా, మహారాష్ట్ర నుంచి రాక
- స్థానికంగా కూలీలు దొరక్క రైతుల పాట్లు

ఆధ్యాత్మిక పల్లె.. కొలనుపాక

వివరాలు
సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో

రూపాయి పడింది... ఫీజు భారం పెరిగింది!

అమెరికాలో ఎమ్మెస్ కలకు ఆటంకాలు ● పతనమవుతున్న రూపాయి విలువతో కష్టాలు

- ట్యూషన్ ఫీజులో సగటున 10 శాతం పెరుగుదల!
- అదనపు రుణం ఇవ్వనంటున్న బ్యాంకులు
- దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు, తల్లిదండ్రులు



సాక్షి, హైదరాబాద్: డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ క్రమంగా పతనమవుతుండటంతో, ఇప్పటికే అమెరికాలో చదువుతున్న వారితో పాటు కొత్తగా ఎమ్మెస్ కోసం అక్కడికి వెళ్లాలని భావిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై అదనపు భారం పడుతోంది. యూఎస్ వెళ్లేందుకు అన్ని సన్నాహాలూ చేసుకున్న విద్యార్థులు అంచనాలు తారుమారవడంతో ఆందోళన చెందుతున్నారు. 2022 ఫాల్ సీజన్ (సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్)లో డాలర్ విలువ రూ.79 కాగా ఇప్పుడది రూ.85.03కు ఎగబాకడం గమనార్హం. 2014లో డాలర్ విలువ రూ. 60.95 మాత్రమే కావడం గమనార్హం. రూపాయి విలువ తగ్గిపోవడంతో విదేశీ యూనివర్సిటీలకు చెల్లించాల్సిన ఫీజుల మొత్తం గణనీయంగా పెరిగిపోతోంది. ట్యూషన్ ఫీజు 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. పెరిగిన మారకం విలువకు తగ్గట్టుగా బ్యాంకులు అదనంగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధపడటం లేదు. ఇప్పటికే అప్పులు చేసిన విద్యార్థులు పెరిగిన భారానికి తగిన మొత్తం ఎలా సమకూర్చుకోవాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. పెరిగిన మారకం విలువకు తగ్గట్టుగా బ్యాంకులు అదనంగా రుణాలు ఇచ్చేందుకు సిద్ధపడటం లేదు. ఇప్పటికే అప్పులు చేసిన విద్యార్థులు పెరిగిన ఖర్చును ఎలా సమకూర్చుకోవాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. రూపాయితో పోల్చు కుంటే డాలర్ విలువ గత రెండేళ్లలోనే 8 శాతం పెరగడం విద్యార్థులపై పెనుభారం మోపుతోంది. మరోవైపు పార్ట్ టైం ఉద్యోగాలకు అవకాశాలు సన్నగిల్లడంతో విద్యార్థులు భారత్‌లోని తల్లిదండ్రుల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికాతో పాటు కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ తదితర దేశాల్లో పరిస్థితి ఈ విధంగానే ఉందనే వార్తలొస్తున్నాయి.

2025లో రూ.5.86 లక్షల కోట్ల భారం

భారత్ నుంచి ఏటా సగటున 13 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తున్నారు. వీరిలో 38 శాతం వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వారే ఉంటున్నారు. 2025లో ఈ సంఖ్య 15 లక్షలకు చేరుతుందని అంచనా. ఇక 2019లో విదేశీ విద్యకు భారతీయులు చేసిన ఖర్చు రూ. 3.10 లక్షల కోట్లు కాగా 2022 నాటికి ఇది 9 శాతం పెరిగి రూ.3.93 లక్షల కోట్లకు చేరింది. ప్రస్తుతం డాలర్ విలువ పెరగడంతో 2024లోఇది 8 నుంచి 10 శాతం మేర పెరిగి రూ. 4.32 లక్షల కోట్లకు చేరుతుందని భారత ప్రభుత్వం అంచనా వేసింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో 2025లో ఇది రూ.5.86 లక్షల కోట్ల వరకు వెళ్లే అవకాశం ఉందని విదేశీ మంత్రిత్వ శాఖ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఫీజుకే అదనంగా రూ. 2.40 లక్షల వ్యయం

స్ప్రింగ్ (మార్చి నుంచి జూన్) సీజన్‌లో చదువుకు సన్నాహాలు మొదలు పెట్టినప్పుడు వర్సిటీల ఫీజు సగటున రూ.24 లక్షలుగా విద్యార్థులు అంచనా వేసుకున్నారు. అయితే ప్రస్తుతం రూపాయి నేల చూపులు చూడటంతో ఇప్పుడు కనీసం రూ.2.40 లక్షలు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక వసతి ఖర్చులు దీనికి అదనం కాగా.. మొత్తం మీద అమెరికాలో రూ.43 లక్షలతో ఎంఎస్ పూర్తవుతుందని అంచనా వేసుకుంటే, ఇప్పుడదని రూ. 52 లక్షల వరకు వెళుతుందని అంచనా.

ఉపాధి భరోసా ఏదీ?

అమెరికా వెళ్లే విద్యార్థి ముందుగా అక్కడ ఏదో ఒక పార్ట్‌టైం ఉద్యోగం వెతుక్కుంటాడు. 2019కి ముందుతో పోలిస్తే 2023లో ఈ అవకాశాలు 40 శాతం తగ్గాయని విదేశీ మంత్రిత్వ శాఖ అధ్యయనంలో గుర్తించారు. కరోనా తర్వాత ఏ దేశం నుంచి వచ్చిన విద్యార్థి అయినా పార్ట్ టైం ఉద్యోగం కోసం పోటీ పడాల్సి వస్తోంది. దీంతో అవకాశాలకు భారీగా గండి పడింది. కెనడాలో 2.22 లక్షల మంది భారత విద్యార్థులున్నారు. ఇక్కడ అమెరికాతో పోల్చుకుంటే 30 శాతం ఫీజులు తక్కువ ఉంటాయి. దీంతో ఈ దేశానికి వెళ్లేవారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇటీవల అక్కడ అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీసా నిబంధనల్లో మార్పులు తెచ్చారు. 2020–21లో చదువు పూర్తి చేసిన వారికి పార్ట్‌టైం ఉద్యోగాలు వచ్చే పరిస్థితి తగ్గింది. దీంతో విద్యార్థులు అనేక కష్టాలు పడుతున్నారు. బ్రిటన్, ఆస్ట్రేలియాలోనూ ప్రతికూల పరిస్థితులే కన్పిస్తున్నాయి.

ఈ పరిస్థితి ఊహించలేదు

అమెరికా వస్తున్నప్పుడు రూ. 50 లక్షల వరకు అప్పు చేశా. రూపాయి విలువ పతనంతో ట్యూషన్ ఫీజు మొత్తం పెరిగింది. ప్రస్తుతం వ్యక్తిగత ఖర్చులు తగ్గించుకోవడానికి ఒకే గదిలో నలుగురం ఉంటున్నాం. అయినా ఇబ్బందిగానే ఉంది. పార్ట్ టైం ఉద్యోగం చేసినా పెద్దగా ఆదాయం ఉండటం లేదు. ఇంటికి ఫోన్ చేయాలంటే బాధగా అన్పిస్తోంది. ఇలాంటి పరిస్థితి ఊహించలేదు.

– పాయం నీలేష్ (అమెరికాలో ఎంఎస్ విద్యార్థి)

వెళ్లాలా? వద్దా? అనే డైలమాలో ఉన్నా..

యూఎస్ వెళ్లడానికి బ్యాంక్ లోన్ ఖాయమైంది. కానీ ఈ సమయంలోనే రూపాయి పతనంతో యూనివర్సిటీకి చెల్లించాల్సిన మొత్తం పెరిగింది. బ్యాంకు వాళ్లు అదనంగా లోన్ ఇవ్వనన్నారు. మిగతా ఖర్చుల కోసం నాన్న అప్పుచేసి డబ్బులు సిద్ధం చేశారు. ఇప్పుడు ఆ డబ్బులు సరిపోయే పరిస్థితి లేదు. అమెరికా వెళ్లాలా? వద్దా? అనే డైలమాలో ఉన్నా.

– నీలిమ (అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్న విద్యార్థిని)

విదేశీ విద్యకు ఒక్కో విద్యార్థికి అవుతుందనుకున్న సగటు వ్యయం (రూ.లక్షల్లో)

దేశం	వర్సిటీకి	వసతి	ఇతరాలు	మొత్తం
అమెరికా	24.90	9.90	8.30	43.10
కెనడా	16.60	8.30	7.40	32.30
ఆస్ట్రేలియా	18.20	10.70	13.20	42.10
బ్రిటన్	21.50	8.05	7.70	37.25

(అమెరికాలో ఇప్పడయ్యే వ్యయం అంచనా రూ.52 లక్షలు)

ఏ దేశంలో భారతీయ విద్యార్థులు ఎంత మంది?

సంవత్సరం	అమెరికా	కెనడా	ఆస్ట్రేలియా	బ్రిటన్	ఇతర దేశాలు	మొత్తం
2019	1,93,124	2,17,410	75,791	52,545	5,51,130	10,90,000
2022	2,10,000	2,00,000	1,00,009	1,50,000	5,20,379	11,80,388
2025	3,00,000	2,50,000	1,70,000	1,70,000	6,10,000	15,00,000

(ఇందులో సగటున 38 శాతం వరకు తెలుగు రాష్ట్రాల వారే)



అహ్మదాబాద్ ఐఐఎం విద్యార్థులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అపజయాలతో కుంగిపోవద్దు

ఏకాగ్రత, కచ్చితత్వంతో విజయతీరాలకు చేరవచ్చు

అహ్మదాబాద్ ఐఐఎంలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్ ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: 'అపజయాలే విజయానికి మైలురాళ్లు. ఎదురుదెబ్బలు తగిలాయని నిరుత్సాహపడకండి. మీ విలువలు, కష్టపడే తత్వం, మీరు సేవ చేయాల్సిన ప్రజలతో మమేకమై ఉండండి. ఈ మార్గం మిమ్మల్ని విజేతలుగా నిలుపుతుంది. మీరు అనుకున్నది సాధించి పెడుతుంది' అని రాష్ట్ర పౌరసరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి కెప్టెన్ ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉద్బోధించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఐఐఎం విద్యార్థులనుద్దేశించి అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యుద్ధ విమానాలు నడిపే పైలట్‌గా ప్రారంభమైన తన వృత్తి జీవితం రాజకీయాల వైపునకు ఎలా మళ్లిందో, తను చేసిన కృషి ఏంటో వివరించారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 'దేశ ప్రగతికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పునాది లాంటిది. స్వతంత్ర భారతదేశంలో గత 77 ఏళ్లుగా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది. ఇదే దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతోంది. ప్రజాస్వామ్యం కారణంగానే వ్యక్తులైనా, వ్యవస్థలైనా ప్రజలకు సేవచేసే అవకాశం కలుగుతోంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో కేడెట్‌గా నా ప్రస్థానాన్ని ప్రారంభించి భారత వాయుసైన్యంలో యుద్ధవిమానాలు నడిపే పైలట్‌గా పనిచేశాను. రాష్ట్రపతులు ఆర్.వెంకట్రామన్, శంకర్‌దయాళ్‌శర్మల హయాంలో రాష్ట్రపతి భవన్‌లో సీనియర్ అధికారిగా పనిచేసే అవకాశం వచ్చింది. అప్పుడే ప్రజాస్వామ్యంపై నా అంకితభావం మరింత బలోపేతమైంది. ఆ కారణంగానే ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చాను. తొలిసారి 1994 ఎన్నికల్లో కోదాడ నుంచి ఓటమి చెందాను. అది చేదు అనుభవమే అయినా అంకిత భావంతో పాటు నిలకడగా ఎలా ఉండాలో నేర్పింది. ఆ తర్వాత 1999లో అదే స్థానం నుంచి విజయం సాధించాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల ఎమ్మెల్యే గా, నల్లగొండ ఎంపీగా వరుసగా ఏడు ఎన్నికల్లో విజయం సాధించాను. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు' అని ఆయన ఐఐఎం విద్యార్థులకు ఉద్బోధించారు.

విద్యా సంస్కరణలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యా సంస్థల్లో అవసరమైన సంస్కరణలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి తెలిపారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో సమగ్రంగా చర్చించాలని, దీనికోసం సమయం కోరినట్టు ఆదివారం ఆయన మీడియాకు వెల్లడించారు. వంద రోజుల్లో విద్యా కమిషన్ అనేక అంశాలపై దృష్టి పెట్టిందని, ఇందులో ప్రధానంగా నాలుగు అంశాలపై కీలకమైన సిఫార్సులు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ స్కూళ్లు ఎలా ఉండాలి? ఏ విధంగా వాటిని ప్రజలకు చేరువ చేయాలనే దానిపై ప్రతిపాదనలు చేస్తామని చెప్పారు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో పలు సంస్కరణలు, సిఫార్సులు చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకంపై వస్తున్న విమర్శలు, వాటికి పరిష్కారాలను నిశితంగా అధ్యయనం చేశామని, దీన్ని గాడిలో పెట్టే మార్గాలను సూచించినట్టు మురళి తెలిపారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీపై వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి, కార్యాచరణకు చేరువైన మార్గాలు అన్వేషించామన్నారు. అలాగే రాష్ట్రంలో ఫీజుల నియంత్రణకు తీసుకోవాల్సిన చట్టపరమైన సంస్కరణలపై కూడా ప్రతిపాదనలు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

వివిధ వర్గాలతో విస్తృత చర్చలు

నివేదికను రూపొందించే ముందు వివిధ ప్రాంతాలు, పలు సంస్థలతో సంప్రదింపులు జరిపినట్టు మురళి తెలిపారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో తీసుకొచ్చిన సంస్కరణలను కూడా ప్రామాణికంగా తీసుకున్నామన్నారు. 33 జిల్లాల్లో రెసిడెన్షియల్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రీ స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలను కమిషన్ సందర్శించిందని తెలిపారు. 13 పర్యాయాలుగా ఎన్జీవో, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్‌తో మంతనాలు జరిపి, అభిప్రాయాలు సేకరించినట్టు వెల్లడించారు.

ఆర్కిటెక్ట్ విద్యార్థినికి అండ

సాక్షి, హైదరాబాద్: ఆర్కిటెక్ట్ విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండగా నిలిచారు. పేద కుటుంబానికి చెందిన చొల్లేటి ప్రణతి ఇటలీలోని ప్రఖ్యాత విద్యాసంస్థ పొలిటెన్సికో డి టోరినో (పొలిటో)లో ఆర్కిటెక్చర్ కన్‌స్ట్రక్షన్ విభాగంలో మాస్టర్స్ సీటు సాధించింది. అక్కడ చదువుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆమెను ఆదివారం తన ఇంటికి పిలిపించి.. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష సాయం అందజేశారు.

ముగిసిన పుస్తక ప్రదర్శన

- చివరి రోజు భారీగా తరలివచ్చిన సందర్శకులు
- ప్రదర్శన సందర్భంగా వంద కొత్త పుస్తకాల ఆవిష్కరణ



ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి

సాక్షి, హైదరాబాద్/ కవాడిగూడ: పదిరోజుల పుస్తకాల పండుగ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు ప్రదర్శనకు పుస్తక ప్రియులు భారీగా తరలి వచ్చారు. ఈ పది రోజుల్లో సుమారు వంద కొత్త పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రతీ సంవత్సరం వందలాది పుస్తక ప్రచురణ సంస్థలతో, లక్షలకొద్ది పుస్తకాలతో హైదరాబాద్ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ కమిటీ నేతృత్వంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఈ నెల 19వ తేదీన ప్రారంభమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల తోపాటు జాతీయ, అంతర్జాతీయ ప్రచురణ సంస్థలతో 350 స్టాళ్లను ఏర్పాటు చేశారు. గతేడాది కంటే ఈ సారి స్టాళ్ల సంఖ్య పెరిగింది. ముగింపు వేడుకల్లో హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి, ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ, పుస్తకాల పండుగను ప్రభుత్వం ప్రోత్సహించడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఊళ్లో తప్పనిసరిగా గ్రంథాలయం ఉండాలని, గ్రంథాలయాల్లో చదివిన వాళ్లు ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని చెప్పారు.

మూడు పుస్తకాల ఆవిష్కరణ..

చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ రచయిత, రిటైర్డ్ జడ్జి మంగారి రాజేందర్ రాసిన 'కోర్టు తీర్పుల్లో సాహిత్య మెరుపులు', స్థపతి ఈమని శివనాగిరెడ్డి రచన 'తెలంగాణ శిథిలాలు.. వ్యథాభరిత కథనాలు', రామోజు హరగోపాల్ రాసిన 'తెలంగాణ చరిత్ర తొవ్వలో– 2'అనే పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.

హాస్టల్ భవనానికి నిధులు మంజూరు చేయిస్తా..

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

అబిడ్స్: మానవత్వానికి, సమాజ సేవకు, కష్టానికి ప్రతి రూపంగా రెడ్లు నిలుస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కులమతాలకు అతీతంగా సమాజ సేవ చేయడంలో రెడ్లు ముందుంటారని స్పష్టం చేశారు. అబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రెడ్లలో కూడా ఎంతోమంది నిరుపేదలు ఉన్నారన్నారు. రెడ్ల హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి తరలి వచ్చిన వివిధ దేశాల్లోని పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు పలకరిస్తూ సందడి చేశారు. అనంతరం రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, భూపతిరెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికే కానీ..

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలనే అంశాన్ని సీఎంకే వదిలేసినట్టు తెలిసింది. అయితే 10 ఎకరాల్లోపు సొంత భూమి ఉన్న రైతులందరికీ సాగు చేసిన కమతాలను లెక్కకట్టి పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఎంత భూమి ఉన్నా ప్రభుత్వం నిర్ణయించిన సీలింగ్ లోపు అందరికీ రైతుభరోసా ఇవ్వాల్సిందేనని ఉప సంఘం సభ్యులు పేర్కొన్నట్టు తెలిసింది. కుటుంబం యూనిట్‌గా రైతు భరోసాను అమలు చేయాలనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయని... పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మార్గదర్శకాలను రైతుభరోసాకు వర్తింపజేస్తే వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడినట్టు సమాచారం.

సాగుభూములకు సరే.. నిర్ధారణ ఎలా?

సాగు చేసే భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో.. సాగును నిర్ధారించే అంశంపైనా ఉప సంఘం భేటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. ఖరీఫ్‌లో సాగు ఎక్కువగా ఉంటే రబీలో తగ్గుతుందని.. ఖరీఫ్‌లో పత్తి సాగు చేసే రైతులు రబీలో నీరు లేక ఏ పంట వేయక బీడు పెట్టే పరిస్థితి మహబూబ్ నగర్, మెదక్, ఆదిలాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల్లో ఉందని సభ్యులు గుర్తు చేసినట్టు తెలిసింది. వారికి ఎలా రైతు భరోసా వర్తింపజేస్తారనే అంశం ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. అంతేగాకుండా ఆయిల్ పామ్, మామిడి, ఇతర పండ్ల తోటలకు సంబంధించి రైతు భరోసాను ఎలా వర్తింపజేస్తారనే విషయంలోనూ స్పష్టత రాలేదని తెలిసింది. ఒకసారి పంట వేస్తే మళ్లీ పెట్టుబడి అవసరం ఉండదు కాబట్టి ఇలాంటి భూములకు రైతుభరోసా ఎలాగనే సందేహాలు వ్యక్తమైనట్టు సమాచారం. ఇక ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే సాగయ్యే భూములకు రెండు సీజన్లలో రైతుభరోసా ఇవ్వడంపైనా సుదీర్ఘ చర్చ జరిగినట్టు తెలిసింది. మరోవైపు సీజన్‌కు రూ.7,500 చొప్పున ఒకేసారి రూ.15 వేలు ఇవ్వాలా? లేక విడివిడిగా ఇవ్వాలా అన్న అంశం ప్రస్తావనకు వచ్చిందని... రూ.7,500 కాకుండా సీజన్‌కు రూ.6,000 చొప్పున ఒకేసారి రెండు సీజన్ల మొత్తాన్ని రైతు ఖాతాల్లో వేయాలనే ప్రతిపాదన కూడా వచ్చినట్టు సమాచారం.



సబ్‌కమిటీ భేటీలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, భట్టి విక్రమార్క, పొంగులేటి

రోడ్లు, నాలా కన్వర్షన్లు, కొత్త రిజిస్ట్రేషన్లపై ఫోకస్!

రోడ్లు, నాలా కన్వర్షన్ అయిన భూములు, పెద్ద మొత్తంలో కొత్తగా రిజిస్ట్రేషన్ అయిన భూములకు రైతు భరోసా నిలిపివేయాలని ఉపసంఘం నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే గుట్టలు, కొండలు, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో రిజిస్టరైన భూములకు కూడా ఇవ్వొద్దనే భావనకు వచ్చినట్టు సమాచారం. మొత్తంగా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు వేసిన భూములకు సంబంధించి మాత్రమే రైతు భరోసా అందించేలా విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

రైతులెవరూ నష్టపోకుండా 'రైతుభరోసా': భట్టి

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72,659 కోట్లు కేటాయించడమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు మాట ఇచ్చిన విధంగా రైతు భరోసా ఇచ్చి తీరుతామన్నారు. రైతులెవరూ నష్టపోకుండా రైతు భరోసా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాల యంలో రైతు భరోసా మంత్రివర్గ ఉపసంఘం భేటీ కేబినెట్ సబ్‌కమిటీ భేటీ అయింది. భట్టితోపాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు వ్యవసాయ శాఖ అధికారులు ఇందులో పాల్గొన్నారు. యాసంగి పంటకు రైతు భరోసా ఇచ్చేందుకు ఖరారు చేయాల్సిన విధివిధానాలపై చర్చించారు. గతంలో పెట్టుబడి సాయం పథకం అమలు నుంచి నేటి వరకు ఏం జరిగింది? రైతుల అభిప్రాయాలు ఏమిటన్న అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లా డుతూ.. రుణమాఫీ కింద ఇప్పటికే రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామని, రైతు కమిషన్‌ను నియమించామని, రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.



నీకు నువ్వు తప్ప మరెవ్వరూ శాంతిని తేలేరు.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 30 డిసెంబర్ 2024

ఆత్మావలోకనం

మానవ అస్తిత్వాన్ని గురించిన చర్చ ప్రపంచంలో చిరకాలంగా ఉంది. మానవ దేహం సజీవంగా ఉన్నంత వరకు అందులో చైతన్యం ఉంటుంది. ఆ చైతన్యాన్నే ప్రాణం అంటున్నాం. శరీరాన్ని విడిచి ప్రాణం పోవడమే మరణం. మరణించిన తర్వాత శరీరాన్ని దహనం చేయడమో, పూడ్చిపెట్టడమో చేస్తారు. మరణం తర్వాత ప్రాణం ఏమవుతుందనే దానిపై రకరకాల ఊహలు ఉన్నాయి; దీనిపై రకరకాల ఆధ్యాత్మిక సిద్ధాంతాలు ఉన్నాయి; రకరకాల మత విశ్వాసాలు ఉన్నాయి. శరీరాన్ని సజీవంగా నిలిపి ఉంచే చైతన్యాన్నే ఆధ్యాత్మికవేత్తలు ఆత్మ అంటారు.

'నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః/ న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః' అని శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో చెప్పాడు. ఆత్మను ఆయుధాలు ఖండించలేవు, అగ్ని దహించలేదు, నీరు తడపలేదు, గాలి ఆరబెట్టలేదు. గీతాసారం ప్రకారం ఆత్మ సమస్త ప్రకృతి శక్తుల ప్రభావానికీ అతీతమైనది. జీర్ణవస్త్రాన్ని విడిచి కొత్త వస్త్రాన్ని తొడుక్కున్నట్లే, జీర్ణశరీరాన్ని విడిచిన ఆత్మ తిరిగి కొత్త శరీరాన్ని వెతుక్కుని వెళుతుందనే నమ్మకం కూడా ఉంది. 'పునరపి జననం పునరపి మరణం/ పునరపి జననీ జఠరే శయనం' అని ఆదిశంకరుడు చెప్పాడు. శరీరం మరణించినా, ఆత్మకు మాత్రం జనన మరణ పరిభ్రమణం తప్పదని ఆయన సారాంశం. ఆత్మకు మరణం లేదనే నమ్మకం ప్రపంచంలోని చాలా మతాల్లో ఉంది. ఆత్మ మరణం లేనిదే కాదు, ఆద్యంత రహితమైనది కూడానని జైనుల సిద్ధాంతం. సమస్త సృష్టిలోని సూక్ష్మాతి సూక్ష్మ క్రిమి కీటకాలు మొదలుకొని మనుషులు సహా భారీ జంతువుల వరకు సమస్త జీవుల్లోనూ ఆత్మ ఉంటుందని జైనుల విశ్వాసం.

చైనాకు చెందిన తావో మతమైతే– ప్రతి వ్యక్తిలోనూ 'హున్', 'పో' అనే రెండు రకాల ఆత్మ ఉంటుందని, ఈ రెండు రకాలు 'యాంగ్', 'యిన్' అనే సానుకూల, ప్రతికూల శక్తులతో నిండి ఉంటుందని చెబుతుంది. తావో మతం కూడా పునర్జన్మలను నమ్ముతుంది. ఆధునికుల్లో చాలా మంది మతాలకు అతీతంగా ఆత్మ అస్తిత్వాన్ని తెలుసుకోవడానికి, దానిని నిర్వచించడానికి ప్రయత్నించారు. 'నేను' అనే స్పృహ ఆత్మకు మూలమని, అలాగని ఆత్మ అస్తిత్వాన్ని నిరూపించడం గాని, ఖండించడం గాని సాధ్యం కాదని జర్మన్ తత్త్వవేత్త ఇమ్మాన్యుయేల్ కాంట్ చెప్పాడు.

ఆత్మ అస్తిత్వాన్ని గురించి ఎన్నో సిద్ధాంతాలు, కల్పనలు, విశ్వాసాలు ఉన్నాయి. ఆత్మ పదార్థమా, కాదా అనే సంగతి ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. ఒకవేళ పదార్థమే అయితే, అది ఏ స్థితిలో ఉంటుందో కూడా చెప్పలేదు. అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త డంకన్ మెక్‌డూగల్ ఆత్మకు బరువు ఉంటుందని, ఆ బరువు ఇరవై ఒక్క గ్రాములని ఒక ప్రయోగం చేసి మరీ చెప్పాడు. ఆ తర్వాతి కాలంలో రాబర్ట్ ఎల్ పార్క్, బ్రూస్ హుడ్ వంటి శాస్త్రవేత్తలు మెక్‌డూగల్ ప్రయోగంలో శాస్త్రీయత లేదంటూ కొట్టి పారేశారు.

మరణానంతరం ఆత్మ ఏమవుతుందనే దానిపై మత సిద్ధాంతాలు ఎలా ఉన్నా, దీనిపై చాలామందికి తీరని సందేహాలు ఉన్నాయి. మరణంతోనే ఒక జీవి చరిత్ర పరిసమాప్తమైపోతుందని, ఆత్మ అనేది ఏదీ ఉండదని హేతువాదులు అంటారు. ఆధ్యాత్మికవేత్తల్లోనే కాదు, సాహితీవేత్తల్లోనూ ఆత్మ అస్తిత్వానికి సంబంధించిన పరిపరి విధాల అభిప్రాయాలు ఉన్నాయి. 'మరుజన్మ ఉన్నదో లేదో/ ఈ మమతలప్పుడేమవుతాయో' అన్నారు ఆత్రేయ. 'చచ్చిపోయి జీవి ఎచ్చట కేగునో/ ఏమి యగునో ఎవరికెరుగ రాదు/ ఎరుకలేని వారలేమేమొ చెప్పగా/ విని తపించువారు వేన వేలు' అన్నారు అబ్బూరి రామకృష్ణారావు. ఆయన తన జీవిత చరమాంకంలో చెప్పిన పద్యమిది.

ఆత్మ గురించి, 'ఆత్మజ్ఞానం' గురించి వివిధ మతాల్లో అనేకానేక సిద్ధాంతాలు ఉన్నాయి. ఆత్మ అస్తిత్వంపై అనేక విశ్వాసాలు ఉన్నాయి. ఆత్మ ఉందనేందుకు శాస్త్ర సాంకేతిక నిరూపణలు లేకున్నా, ఆత్మ అనే భావన సహస్రాబ్దాలుగా మానవాళిపై ప్రభావం చూపుతోంది. ఆత్మ భావన ప్రభావం మత సిద్ధాంతాలతో పాటు తత్త్వశాస్త్రంలోను, సాహిత్యంలోను, ఇతర సృజనాత్మక కళలలోను కనిపిస్తుంది. 'ఆత్మ' భావన చాలావరకు ఆస్తికుల ప్రవర్తనను నియంత్రిస్తూ వస్తోంది. కర్మ సిద్ధాంతానికి, పాప పుణ్యాల విచక్షణకు, పాపభీతికి మూలం 'ఆత్మ' భావనే! ఆత్మ అస్తిత్వాన్నే గుర్తించనివారు ప్రపంచ జనాభాలో అతి తక్కువమంది మాత్రమే ఉంటారు. కృత్రిమ మేధ మనుషుల రోజువారీ జీవితాలను ప్రభావితం చేస్తున్న వర్తమాన కాలంలో కూడా ఆత్మ అస్తిత్వాన్ని నమ్మేవాళ్లే ఎక్కువ.

ఇప్పటి వరకు ప్రపంచానికి తెలిసి ఆధునిక శాస్త్రవేత్తలెవరూ ఆత్మ అస్తిత్వాన్ని గురించి పెద్దగా పరిశోధనలు సాగించలేదు. అయితే, అమెరికా రక్షణశాఖ ప్రధాన కేంద్రం 'పెంటగాన్' ఈ అంశంపై 1983లోనే పరిశోధన చేసింది. మనిషి మరణించినా ఆత్మ మరణించదంటూ లెఫ్టినెంట్ కల్నల్ వేయన్ మెక్‌డోనల్ తన పరిశోధన పత్రంలో రాశారు. అమెరికా గూఢచర్య సంస్థ 'సీఐఏ' 2003లో బహిర్గతపరచిన రహస్య పత్రాల్లో ఇది కూడా ఉంది. అయితే, ఇటీవలే ఇది వెలుగులోకి రావడంతో పాశ్చాత్య పత్రికలు, ప్రసార సాధనాల్లో పలు వ్యాఖ్యానాలతో కూడిన కథనాలు వెలువడ్డాయి. ధ్యానస్థితిలో సూక్ష్మశరీరయానం అనుభవాల గురించి ఆధ్యాత్మికవేత్తలు, యోగసాధకులు చెబుతుంటారు. దీనినే 'ఔటాఫ్ బాడీ ఎక్స్‌పీరియెన్సెస్' అంటున్నారు. గూఢచర్యంలో ఇలాంటి అనుభవాలను ఉపయోగించుకోవడం ఎలా అనేదానిపైనే మెక్‌డోనల్ పరిశోధన చేశారు. దీనిపై శాస్త్రవేత్తలు ఏమేరకు ఆత్మావలోకనం చేసుకుంటారో చూడాలి.

కేజ్రీవాల్ నాయకత్వానికి అగ్ని పరీక్ష

అభిప్రాయం



సాయంతన్ ఘోష్

2025 ఢిల్లీ శాసనసభ ఎన్నికలు అరవింద్ కేజ్రీవాల్‌కు సవాలుగా నిలుస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఢిల్లీని ఏలుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఈసారైనా గద్దె దింపాలని బీజేపీ పట్టుదలగా ఉంది. దానికితోడు ఆప్ దళిత వ్యతిరేక పార్టీ అంటూ ఇద్దరు నేతలు నిష్క్రమించడం, దాని మద్దతుదారుల్లో చీలికను సృష్టించింది. అలాగే, పొత్తుకు ఆప్ నిరాకరించడంతో ఎన్నికల్లో నిర్ణాయక శక్తిగా ఉండే ముస్లింల ఓట్లను ఆకర్షించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది. వివాదాల నీడ, అంతర్గత పార్టీ వ్యవహారాలు, సంకీర్ణ రాజకీయాల సంక్లిష్టత వంటివి కేజ్రీవాల్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. అయితే, పడినా నిలబడ గలిగే కేజ్రీవాల్ సామర్థ్యం, సంక్షేమంపై ఆయన దృష్టికోణం, వాగ్దానాలను అమలు చేయడంలో పార్టీ ట్రాక్ రికార్డ్ ఆయనకు బలమైన పునాది కాగలవు.

2025 ఢిల్లీ శాసనసభ ఎన్నికలు అరవింద్ కేజ్రీవాల్‌కూ, ఆమ్ ఆద్మీ పార్టీకీ కీలకమైన ఘట్టంగా మారబోతున్నాయి. గత దశాబ్ద కాలంగా ఢిల్లీ రాజకీయాల్లో ఆధిపత్యం చలాయించిన కేజ్రీవాల్‌కు ఇప్పుడు సవాళ్లు పెరుగుతున్నాయి. తీవ్రమైన పోటీ మధ్య దేశ రాజధానిపై తన పట్టును నిలుపుకోవడానికి ప్రయత్నిస్తూ, చావో రేవో అనే పరిస్థితులను ఆయన ఎదుర్కొంటున్నారు.

అవినీతి వ్యతిరేక పోరాట యోధుడి స్థానం నుండి ఢిల్లీ ముఖ్యమంత్రి వరకు కేజ్రీవాల్ సాగించిన ప్రయాణం సాధారణమైనదేమీ కాదు. 2015, 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆయన పార్టీ ఘనవిజయం సాధించింది. ఆయన నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మొత్తం 70 సీట్లలో వరుసగా 67, 62 స్థానాలను గెలుచుకుని బలీయమైన రాజకీయ శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అయితే, అప్పటి నుండి రాజకీయ చిత్రం గణనీయంగా మారిపోయింది. అందుకే ఇప్పుడు 2025 శాసనసభ ఎన్నికలు కొత్త సవాళ్లను విసురుతున్నాయి.

దూకుడు పెంచిన బీజేపీ

ఢిల్లీపై బీజేపీ రెట్టించిన బలంతో వ్యూహాత్మక దృష్టిని కేంద్రీకరించడం దీనికి అత్యంత ముఖ్యమైన కారకాల్లో ఒకటి. ఇప్పటివరకూ ఆప్ నుంచి ఢిల్లీని చేజిక్కించుకోలేక పోయిన బీజేపీ, కేజ్రీవాల్‌ను గద్దె దింపేందుకు ఏ అవకాశాన్నీ వదలడం లేదు. న్యూఢిల్లీ నియోజక వర్గం నుంచి ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మను ఆ పార్టీ పోటీకి దింపింది. దీనితో పోటీ ఇక్కడ తీవ్రంగా మారింది. అదే సమయంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దింపడంతో ఈ పోటీ మరింత రసవత్తరం కానుంది.

కేజ్రీవాల్ పదవీకాలం ఏమీ వివాదాలు లేకుండా సాగలేదు. ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఇటీవల ఆమోదం తెలపడంతో ఆయన ప్రచారంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అవినీతి ఆరోపణలు, తదుపరి న్యాయ పోరాటాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బ తీస్తాయి. అంతేకాకుండా ఆయన రాజకీయ ప్రత్యర్థులకు మందుగుండు సామగ్రిని ఇవి అందించగలవు.

పైగా, ఆప్‌లోని అంతర్గత చోదక శక్తులు కూడా సవాళ్లను విసిరాయి. ఆప్ దళిత వ్యతిరేక పార్టీ అని ఆరోపించిన రాజేంద్ర పాల్ గౌతమ్, రాజ్‌కుమార్ ఆనంద్ వంటి కీలక నేతలు రాజీనామా చేయడం పార్టీ మద్దతుదారుల్లో చీలికకు కారణమైంది. వీళ్ల ఫిరాయింపులు... ఒకప్పుడు ప్రధాన బలాలుగా ఉన్న సామాజిక న్యాయం, అందరినీ కలుపుకొనిపోవడం లాంటి విషయాల్లో ఆప్ నిబద్ధతపైనే ప్రశ్నలను లేవనెత్తాయి.



సంక్షేమం కొనసాగింపు

ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, కేజ్రీవాల్ ఓటర్లను గెలుచుకోవడానికి తన పాలనా రికార్డును, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారు. ఢిల్లీ జనాభాలోని వివిధ వర్గాల అవసరాలను తీర్చే లక్ష్యంతో ఆప్ అనేక కార్యక్రమాలను ప్రకటించింది. ఇళ్లకు ఉచిత విద్యుత్తు కొనసాగింపు, మహిళలకు ఆర్థిక సహాయం అందించే 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన', సీనియర్ సిటిజన్లకు ఉచిత ఆరోగ్య సంరక్షణ అందించే 'సంజీవని యోజన', ఆటో రిక్షా డ్రైవర్లకు ప్రయోజనాలు వంటివి ఇందులో ఉన్నాయి. ఈ పథకాలు సంక్షేమం, అభివృద్ధిపై కొనసాగుతున్న ఆప్ దృష్టిని ప్రతిబింబిస్తాయి. ఇది దాని ఎన్నికల వ్యూహానికి మూలస్తంభం.

విద్య, ఆరోగ్య సంరక్షణపై కేజ్రీవాల్ దృష్టి సారించడం కూడా ఆయన రాజకీయ విజయానికి ముఖ్యమైన అంశమైంది. ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడం, మొహల్లా క్లినిక్‌ల స్థాపన విస్తృతంగా ప్రశంసలు అందుకున్నాయి. ఆప్ తన వాగ్దానాలను నెరవేర్చే పార్టీగా కీర్తిని పెంచడంలో ఇవి ప్రధాన పాత్ర పోషించాయి. 2025 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ప్రతికూల కథనాలను ఎదుర్కోవడానికీ, ఢిల్లీ పౌరుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న నాయకుడిగా తన ఇమేజ్‌ను బలోపేతం చేసుకోవడానికీ కేజ్రీవాల్ ఈ విజయాలను హైలైట్ చేసే అవకాశం ఉంది.

ప్రతిపక్ష పార్టీల కూటమి అయిన 'ఇండియా' బ్లాక్‌లోని గమనాత్మక శక్తులు కూడా రాబోయే ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఆప్, కాంగ్రెస్ జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములు అయినప్పటికీ, అవి ఢిల్లీలో మాత్రం ప్రత్యర్థులుగా ఉన్నాయి. ఆప్, కాంగ్రెస్ మధ్య ఎన్నికలకు ముందు పొత్తు లేకపోవడం వల్ల బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయి బీజేపీకి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని కేజ్రీవాల్ చేసిన ప్రకటన సంకీర్ణ రాజకీయాల సంక్లిష్టతలనూ, ఇండియా కూటమిలో ఐక్యతను కొనసాగించడంలో ఉన్న సవాళ్లనూ నొక్కి చెబుతోంది.

బలమైన వర్గాలు కీలకం

సాంప్రదాయికంగా ఆమ్ ఆద్మీ పార్టీకి బలమైన మద్దతు పునాదిగా ఉన్న దళితుల ఓట్లు 2025 ఎన్నికలలో కూడా కీలకమైన అంశం కానున్నాయి. కానీ కీలక దళిత నేతల ఫిరాయింపులు, దళిత వ్యతిరేక పార్టీ అనే ఆరోపణలు ఆప్‌కు అవగాహనా సమస్యను సృష్టించాయి. దళిత ఓటర్లను ప్రలోభపెట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు ఈ అసంతృప్తిని పెట్టుబడిగా వాడుకునే అవకాశం ఉంది. కేజ్రీవాల్ ఈ ఆందోళనలను శీఘ్రంగా పరిష్కరించాలి. దళిత సంఘాలు ఆప్‌కు తమ మద్దతును కొనసాగించడానికి, చాలా ముఖ్యమైన సమస్యల పట్ల ఆప్ నిజమైన నిబద్ధతను ప్రదర్శించాలి.

అదేవిధంగా ఢిల్లీ జనాభాలో దాదాపు 15–18 శాతంగా ఉన్న ముస్లిం ఓట్లు కూడా అంతే కీలకం కానున్నాయి. చారిత్రకంగా, ఢిల్లీలో ఎన్నికల ఫలితాలను నిర్ణయించడంలో ముస్లిం సమాజం ముఖ్య పాత్ర పోషించింది. 2015 అసెంబ్లీ ఎన్నికలలో, ఆప్ ఈ విషయంలో గణనీయమైన పురోగతిని చవిచూసింది. 77 శాతం ముస్లిం ఓటర్లు అప్పుడు ఆ పార్టీకి మద్దతునిచ్చారని అంచనా.

అయితే, 2020 నాటికి, ఈ మద్దతు కొద్దిగా తగ్గింది. 69 శాతం మంది ముస్లింలు ఆప్‌కు మద్దతు ఇచ్చారు. అయితే, 2025 ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా పోటీ చేయాలని ఆప్ నిర్ణయించింది. కాబట్టి, ముస్లిం ఓటర్లలో పెరుగుతున్న పరాయీకరణ భావాన్ని కాంగ్రెస్ త్వరితగతిన ఉపయోగించుకునే వీలుంది. దీనివల్ల ఈ క్లిష్టమైన వర్గంపై ఆప్ ప్రభావం మరింతగా తగ్గుతుంది.

2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, కేజ్రీవాల్ నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నారు. ఆ యా పార్టీలు గతంలో కంటే ఎక్కువ పట్టుదలగా ఉన్నాయి. పైగా సవాళ్లు పెరిగాయి. బీజేపీ దూకుడు ప్రచారం, వివాదాల నీడ, అంతర్గత పార్టీ వ్యవహారాలు, సంకీర్ణ రాజకీయాల సంక్లిష్టత వంటివి కేజ్రీవాల్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి.

అయినప్పటికీ, పడినా నిలబడగలిగే సామర్థ్యం, ఓటర్లతో అనుసంధానం కాగలిగే నైపుణ్యం కేజ్రీవాల్ బలాలు. పాలనపై, సంక్షేమంపై ఆయన దృష్టికోణం, వాగ్దానాలను అమలు చేయడంలో తన ట్రాక్ రికార్డ్ వంటివి ఆయన ప్రచారానికి బలమైన పునాదిని అందిస్తాయి. రాబోయే ఎన్నికలు కేజ్రీవాల్ నాయకత్వ పటిమనూ, కల్లోల రాజకీయాల్లో ఎదురీదే ఆయన సామర్థ్యాన్నీ పరీక్షించనున్నాయి.

వ్యాసకర్త కాలమిస్ట్, రీసెర్చ్ స్కాలర్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అతి కూడదు!



తలనొప్పి ఉపశమనం కోసం మందులు అతిగా వాడితే, అది దీర్ఘకాల తలనొప్పిగా పరిణమిస్తుంది. 1–2 శాతం సాధారణ జనం ఎంఓహెచ్ (మెడికేషన్ ఓవర్‌యూజ్ హెడేక్)తో సతమతమవుతున్నారు. పార్శ్వపు తలనొప్పి, ఒత్తిడి తలనొప్పి ఉన్నవాళ్లలో ఇది యాభై శాతం వరకూ ఉంది.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

నిండని శూన్యం



ఆహారం, మద్యం, మాదక ద్రవ్యాలు, ఆభరణాలు, దుస్తులు, గ్యాడ్జెట్స్, సోషల్ మీడియా... ఏదైనా అతిగా వినియోగించడం వల్ల ఒక నిమిషం బాగుండొచ్చు, కానీ అది మీ లోపలి శూన్యాన్ని పూరించదు. అదింకా పెద్దది కూడా కావొచ్చు. ఇది మనందరికీ తెలుసు. అయినా దాన్ని తరచూ మరిచిపోతూనే ఉంటాం.

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

అదే అర్హతా?



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మతాన్ని కాంగ్రెస్ పార్టీ మళ్లీ మళ్లీ ఎత్తడం ఆయన ప్రధాన మంత్రిత్వానికి అదే ఒక అర్హత అనుకునేట్టుగా ఉంది. ఇది వట్టి చవకబారుతనమే కాదు, అగౌరవం కూడా.

– గజాలా వహాబ్, సంపాదకురాలు

గుండె లోతుల్లోంచి...



జీవిత పాఠాలు: ఫలానా కథ 'నా మెదడును తాకింది' అనడానికి బదులుగా, 'నా హృదయాన్ని తాకింది' అని చెప్పడానికి ఒక కారణం ఉంది. ఉత్తమ కథలు మీ గుండెలోంచి వస్తాయి, మెదడు నుంచి కాదు! హృదయం అనేది సృజనకు వనరు అని తెలుసుకోండి.

– శేఖర్ కపూర్, దర్శకుడు

యాత్రికులకు ఆహ్వానం



భారీ హిమపాతంలో చిక్కుకు పోయిన యాత్రికులను గందర్‌బల్‌లోని స్థానిక కశ్మీరీలు తమ ఇళ్లల్లోకి ఆహ్వానించారు. ఇలాంటి ఎన్నో కథలు కశ్మీర్‌లో ఉంటాయి. కానీ ద్వేషాన్ని వ్యాపింపజేయడమే పనిగా పెట్టుకున్నవాళ్లు వీటిని ప్రస్తావించరు.

– సాజిద్ యూసుఫ్ షా, న్యాయవాది

ఇన్ బాక్స్

దాతృత్వానికి మరో పేరు

రాయలసీమకు వన్నె తెచ్చిన అపర దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడలో 1822 మే 22న ఆయన జన్మించారు. ఆయన్ని చిన్నప్పుడు అందరూ ప్రేమగా 'బుడ్డోడు' అని పిలుచుకునేవారు. అందుకే ఆయన పేరు బుడ్డా వెంగళరెడ్డిగా మారిందని కొందరి అభిప్రాయం. చిన్నతనంలోనే తన దగ్గర ఉన్న చిల్లర డబ్బులనూ, తినుబండారాలనూ తోటి పిల్లలకు ఇచ్చేవారు. వయసుతో పాటు దానగుణం, ఔదార్య గుణం పెరిగాయి. ఉయ్యాల వాడలో పెద్దరికానికి వన్నె తెచ్చారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో మంచి పనులు చేశారు. చెడు దారిలో నడిచే యువకులను గుర్తించి వారికి ఉపాధి కల్పించి, వారిని మంచి దారిలో నడిపించేవారు.



బుడ్డా వెంగళ రెడ్డి

1866లో సంభవించిన 'డొక్కల కరవు' కాలంలో తన ఆస్తినంతా ధారపోసి ఎంతోమంది ప్రాణాల్ని కాపాడిన మహా దాత ఆయన. ఆ సమయంలో వీరి కీర్తి ప్రతిష్ఠలు విన్న పేద ప్రజలు బళ్ళారి, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుండి తండోపతండాలుగా ఉయ్యాలవాడ చేరి రెడ్డిగారిని ఆశ్రయించారు. వారి దీనస్థితిని అర్థం చేసుకుని ఆయన ఇంట్లో ఉన్న 6 పుట్ల ధాన్యాన్ని గంజి కాయించి వేలాది కుటుంబాల ఆకలిని తీర్చారు. పూటకు ఎనిమిది వేలకు తక్కువ కాకుండా ఈ కరవు కాలంలో బుడ్డా వెంగళరెడ్డి కరవు పీడితులైన ప్రజలకు మూడు నెలల పాటూ అన్న వస్త్రాలు ఇచ్చి కన్నతండ్రిలాగా కాపాడారు. రాయలసీమ ప్రజలు ఇప్పటికీ ఈయన దాతృత్వాన్ని గురించి చెప్పుకుంటారు. వంట మనిషి గంగన్న ఆ కాలంలో చేసిన సేవలకు మెచ్చిన వెంగళరెడ్డి అతనికొక బంగారు కడియం తొడిగి సత్కరించారు. అనంతర కాలంలో స్వగ్రామంలో పాఠశాలను నెలకొల్పి శివరామశాస్త్రి అనే పండితుని కుటుంబాన్ని పోషిస్తూ విద్యాదానం చేశారు.

ఉన్నదంతా దానం చేసిన ఈ మహానుభావుని దాతృత్వంతో పరాయి పాలకులకు సైతం ఆశ్చర్యం వేసింది. అందుకే విక్టోరియా మహారాణి ఈయన సేవలను గుర్తించి బంగారు పతకాన్ని బహుమానంగా ఇచ్చింది. ప్రభుత్వం ఈయన్ను ప్రొవిన్షియల్ జ్యూరీ సభ్యునిగానూ, మద్రాసు గవర్నరు కౌన్సిల్ గౌరవ సభ్యునిగానూ చేసి గౌరవించింది. అటువంటి మహాదాత 1900వ సంవత్సరం డిసెంబరు 31న తుది శ్వాస విడిచారు. రేనాటి సూర్యునిగా విప్లవసింహం ఉయ్యాలవాడ నరసింహా రెడ్డిని భావిస్తే... పేదలపై చల్లని కరుణ కురిపించిన బుడ్డా వెంగళరెడ్డిని రేనాటి చంద్రునిగా భావిస్తున్నారు సీమ జనం. వీరిద్దరి పేరు మీద 'రేనాటి సూర్య చంద్రుల స్మారక సమితి' స్థాపన జరగడం ముదావహం.

– ఎం. రాం ప్రదీప్, తిరువూరు
(డిసెంబర్ 31న బుడ్డా వెంగళ రెడ్డి వర్ధంతి)

ఉత్తర తెలంగాణకు మంచిరోజులెన్నడు?

అభిప్రాయం



డా॥ బి. కేశవులు

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అభివృద్ధికి పుష్కల వనరులు ఉన్నా... పేదరికమూ, దారిద్ర్యమూ తాండవిస్తూనే ఉన్నాయి. రైతన్నల ఆత్మ హత్యలు, నేతన్నల ఆకలిచావులు కొనసాగుతూనే ఉన్నాయి. యువత ఎడారి బాట పడుతుంటే... బీడీ కార్మికుల బతుకులు మసిబారుతున్నాయి. సామాజిక అణిచివేతలు సరేసరి! ఇలా ఎన్నో సమస్యలు. గతం గతః. నేడు కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. ఈసారైనా న్యాయం జరుగుతుందని ఆశతో ఈ ప్రాంతవాసులు ఉన్నారు.

రాష్ట్రంలోనే ఓ మూలకు విసిరేయబడ్డట్లున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అన్నింటా వివక్షకు గురవుతోంది. ఆదర్శ జిల్లాగా చెప్పుకుంటున్న ఆదిలాబాద్ కేవలం అక్షర క్రమంలోనే ముందుండి, అభివృద్ధిలో మాత్రం ఏళ్లుగా వెనుక బాటుకు గురవుతోంది. ఉన్నంతలో కొంత మేరకు పైపై అభివృద్ధి ఛాయలు కనిపిస్తున్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలది మరో ప్రత్యేక స్థితి. కార్పొరేటీకరణ దుష్ఫలితంగా విద్య, వైద్యం పేదలకు ఎండమావిగానే మిగులుతున్నాయి. ప్రపంచీకరణ పుణ్యమా అని అసంఘటిత, బీడీ కార్మికుల బతుకులు మరింత దుర్భర మవుతున్నాయి. మూడు జిల్లాల్లో కలిపి సుమారు 7–8 లక్షల మంది బీడీ కార్మికులున్నారు. ఆకాశాన్నంటుతున్న ధరలు, అందని కనీస వేతనాలు, వెరసి వీరి బతుకులు మరింత దుర్భర స్థితిలోకి నెట్టబడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా మొత్తం జనాభాలో 18 శాతం మంది గిరిపుత్రులున్నారు. 78 ఏళ్ల స్వతంత్ర చరిత్రలోనూ వీరివి చీకటి బతుకులే. జ్వరమొచ్చినా, జలుబు చేసినా వందల్లో జనం రాలిపోవాల్సిందే. ఈ మూడు జిల్లాల్లోనూ పుష్కల వనరులున్నా వాటి సద్వినియోగం లేక లక్షల మంది యువత ఉపాధి కోసం ఎడారి బాట పడుతున్నారు. ప్రణాళికా బద్ధంగా వినియోగించుకుంటే పక్క రాష్ట్రాలకు అప్పిచ్చేంత నీటి వనరులున్నాయి. అయినా ఖరీఫ్ ప్రారంభంలో రైతులు కారుమబ్బుల నుండి జాలువారే చినుకు కోసం ఆకాశానికేసి ఎదురు చూడాల్సిందే. గోదావరి వంటి జీవ నదులు, సిరులు పండించే సారవంతమైన నల్ల రేగడి నేలలు, విస్తారమైన అటవీ సంపద. సిరులు కురిపించే సింగరేణి బొగ్గు గనులు, విస్తారమైన ఖనిజ సంపద ఈ 3 జిల్లాల పరిధిలో ఉన్నాయి.



ఇలా ఎన్ని ఉన్నా వనరులను ఉత్తర తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేక పోతోంది.

నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతూ... అభివృద్ధికి నోచుకోని ఉత్తర తెలంగాణ జిల్లాలపై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇక్కడి దుర్భిక్ష పరిస్థితుల్ని పారదోలేందుకు 'జలయజ్ఞం' ద్వారా అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి బాటలు వేసిన మహానేత ఆయన. అయితే గడిచిన దశాబ్ద కాలంలో ఏ ఒక్క కొత్త పరిశ్రమ స్థాపించకపోగా ఉన్న పరిశ్రమలనేకం ఉత్తర తెలంగాణలో మూసివేతకు గురయ్యాయి. ఆదిలాబాద్‌లో సీసీఐ మూసివేతతో 2,500 మంది, స్పిన్నింగు మిల్లు ప్రైవేటీకరణతో 750 మంది, నిర్మల్ ప్రాంతంలో నటరాజ్ స్పిన్నింగ్ మిల్లుల మూతతో 2,000 మంది, బోధన్ షుగర్ ఫ్యాక్టరీ మూసివేతతో 2,500 మంది, కరీంనగర్‌లో ఎరువుల కర్మాగారం మూతతో 2,500 మంది ఉపాధికి దూరమయ్యారు. ఇవి మచ్చుకు మాత్రమే. ఈ పరిస్థితుల్లో యువతకు గల్ఫ్ బాట తప్పడం లేదు. ఫలితంగా వేలాది కుటుంబాల్లో గల్ఫ్ గాయం మిగులుతోంది. కానీ ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వైఎస్సార్ 'సమ వికేంద్రీకరణ' సిద్ధాంతం బదులు 'అపసవ్య కేంద్రీకరణ'పై దృష్టి పెట్టడంతో ప్రాంతాల మధ్య అసమానతలు మళ్లీ మొదలవుతున్నాయి.


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో సింగరేణి బొగ్గుగనులతో పాటు విస్తారంగా మాంగనీసు, ఇనుప ధాతువూ ఉంది. నిజామాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పసుపుతో పాటు ప్రత్యేక పంటగా ఎర్రజొన్న సాగవుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు స్థాపించాలి. ఆదిలాబాద్‌లో అటవీ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. కరీంనగర్, నిజామాబాద్‌లలో గ్రానైట్ గనులున్నాయి. కరీంనగర్, వరంగల్ జిల్లాల సరిహద్దులో భీమదేవరపల్లి మండలంలో ఇనుపరాతి గుట్టలున్నాయి. కావున ఇక్కడ ఉక్కు పరిశ్రమ స్థాపించడానికి పూనుకోవాలి. మంథని కేంద్రంగా మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. స్థానికులకే ఇక్కడ పనులు కల్పించాలి. ఈ ప్రాంతం నుండి ఎన్నుకోబడిన ప్రతి నేతా న్యాయంగా మనకు రావాల్సిన నిధుల కోసం చట్టసభల్లో గొంతు విప్పాలి.

వ్యాసకర్త నార్త్ తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఫౌండర్ – చైర్మన్ । 85010 61659

ఒకే కృష్ణుడు...

లీలాశుకుల 'కృష్ణ కర్ణామృతం'లో ఒక శ్లోకం ఉంది. శ్రీకృష్ణుడు కంసుడిని కడతేర్చేందుకు మధురా నగరానికి వెళ్ళి, నగర వీధులలో యథేచ్ఛగా విహరించి, ముందు మదపుటేనుగునూ, తరవాత చాణూర మల్లుడినీ, చివరకు మేనమామనూ సంహరించాడు. ఆ సమయంలో నగరంలో అందరి కళ్ళూ ఆ లీలా గోప కుమారుడి మీదే నిలిచి పోయాయట. కానీ ఒకే కృష్ణుడు అందరికీ ఒకే విధంగా కనిపించలేదు. చూసే వాళ్ళ దృష్టి బట్టీ, సంస్కారాల బట్టీ, స్వభావాల బట్టీ, పరిస్థితుల బట్టీ, మనఃస్థితుల బట్టీ, పలువురికి పలు విధాలుగా కనిపించి, రకరకాలైన భావోద్రేకాలు కలిగించాడట.

నగర జనులకూ, నడి వయసు తల్లులకూ ఆ గోప కుమారుడు ముక్కుపచ్చలారని, ముచ్చటైన ముగ్ధ బాలుడిగా కనిపించాడు. ప్రాయం వికసిస్తున్న జవ్వనులకు నవ మన్మథుడిలా కనిపించాడు. మల్ల రంగంలో దిగి ఒక పోటు తినిపించగానే, చాణూరమల్లుడికి శైలేంద్రం లాగా కనిపించాడు. తన ఈడు పిల్లలకు, పల్లె నుంచి వచ్చిన ఆల కాపరిగానే కనిపించాడు. మృత్యు భయంలో మునిగిపోయి ఉన్న కంసుడికి కాల యముడిగా కనిపించాడు. ఆకాశం నుండి కంస సంహారం కళ్ళారా చూస్తున్న అమరేంద్రుడికి, కృష్ణుడు విశ్వకాయుడైన విరాట్ పురుషుడిగానే కనిపించాడు. యోగి వరులకు వాళ్ళు నిత్యమూ చిత్తంలో ధ్యానించే మూర్తే, సశరీరంగా సాక్షాత్కరించినట్టు తోచింది. అందరికీ కనిపించింది ఒకే కృష్ణుడు.



నిజానికి, లోక వ్యవహారంలోనూ ఇంతే. ఒకే వ్యక్తి వ్యక్తిత్వమూ, గుణ గణాలూ, చేష్టలూ, స్వభావమూ, చివరికి రూపురేఖలు కూడా తల్లికి ఒక విధంగా, భార్యకు ఒక విధంగా, బిడ్డలకు ఒక విధంగా, మిత్రులకు ఒక విధంగా, శత్రువులకు ఒక విధంగా, ఆశ్రితులకు ఒక విధంగా, అపరిచితులకు ఒక విధంగా కనిపిస్తాయి. వస్తువులూ అంతే – దృష్టికోణం బట్టీ, చూసే వాళ్ళ స్వభావ సంస్కారాలను బట్టీ... ఒకరికి అత్యంత ఆకర్షణీయంగా కనిపించేది, మరొకరికి పరమ రోత అనిపిస్తుంది. మద్యం సీసా వ్యసనపరుడికి అమృత భాండంగా కనిపిస్తుంది. అతగాడి భార్యకు అదే సీసా కేవలం విషంగా, దుఃఖ భాజనంగా తోస్తుంది. కొందరు ఒక వ్యాపకాన్ని సర్వోత్తమంగా భావించి దాని కోసం ప్రాణమిస్తారు. మరికొందరికి తల కిందులుగా తపస్సు చేసినా, ఆ వ్యాపకంలో ఆవగింజంత ఆసక్తి కూడా కలగదు.

'అనుకోవటంలోనే అంతా ఉంది' అంటారు. అంతా లేదేమో కానీ చాలా ఉంది! లోకాన్ని మార్చలేం. మనో నిగ్రహంతో, మనం 'అనుకొనే' తీరు మార్చుకొంటే, మన సుఖదుఃఖాలు కొంతవరకూ మనమే సృష్టించుకోవచ్చు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** అమావాస్య తె.4.16 వరకు (తెల్లవారితే మంగళవారం) తదుపరి పుష్య శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** మూల రా.12.41 వరకు తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.8.00 నుండి 9.30 వరకు, తదుపరి రా.11.02 నుండి 12.42 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.15 వరకు తదుపరి ప.2.40 నుండి 3.28 వరకు, **అమృతఘడియలు:** సా.5.51 నుండి 7.32 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.32.

భద్రగిరికి ముక్కోటి శోభ



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం ముక్కోటి శోభ సంతరించుకుంది. ఈనెల 31 నుంచి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ప్రారంభం కానుండగా.. ఆలయాన్ని ఆదివారం రాత్రి విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ కాంతులతో ధగధగలాడాయి.

– భద్రాచలం



కమనీయం.. మల్లన్న కల్యాణం

కొమురవెల్లి(సిద్దిపేట): భక్తుల జయజయధ్వానాలు, మంగళ వాయిద్యాల మధ్య కొమురవెల్లి మల్లికార్జునస్వామి కేతలమ్మ, మేడలమ్మల కల్యాణం ఘనంగా జరిగింది. సిద్దిపేట జిల్లా ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కొమురవెల్లిలో స్వామివార్ల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా నుంచి వేలాది మంది వచ్చారు. సుమారు 3 గంటల పాటు కల్యాణ క్రతువు కనుల పండువగా సాగింది. స్వామివారి కల్యాణం వీరశైవ ఆగమ శాస్త్ర ప్రకారం .. కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహా స్వామి ఆధ్వర్యంలో జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో సంతాప దినాలు ప్రకటించడంతో.. ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు ఎవరూ హాజరు కాలేదు. దీంతో అర్చకులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణానికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరయ్యారు.

8 నెలలు.. 8 వేల కోట్లు


గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో తగ్గిన ప్రభుత్వ రాబడి

నవంబర్ నెలాఖరుకు రూ.1.41 లక్షల కోట్లు దాటిన ఆదాయం

గత ఏడాది ఇదే సమయానికి 1.49 లక్షల కోట్ల రాబడి

పన్నేతర ఆదాయం, ఎక్సైజ్ పద్దుల్లో ఈసారి తగ్గుదల

రాబడులపై దృష్టి కేంద్రీకరించకపోతే లోటు తప్పదంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ రాబడులు తగ్గిపోతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది నెలలు ముగిసే నాటికి (నవంబర్ 30, 2024 వరకు) అన్ని రకాల రాబడులు కలిపి రూ.1,41,178 కోట్లు వచ్చినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో రాబడుల కింద అంచనా వేసిన రూ.2.74 లక్షల కోట్లలో ఇది 51.51 శాతం కావడం గమనార్హం. కాగా గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో నవంబర్ నెల ముగిసేసరికి రూ.1,49,316.41 కోట్లు రావడం గమనార్హం. గత ఏడాది మొత్తం అంచనాల్లో ఇది 57.46 శాతం కాగా, ప్రస్తుత 8 నెలల కాలంలో రూ.8 వేల కోట్ల మేర రాబడులు తగ్గినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

భారీగా తగ్గిన పన్నేతర ఆదాయం

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ రాబడులకు సంబంధించిన కీలకమైన పద్దుల్లో తగ్గుదల కనిపిస్తోంది. ముఖ్యంగా పన్నేతర ఆదాయంలో భారీగా క్షీణత నమోదైంది. ఇసుకతో పాటు ఇతర ఖనిజాల మైనింగ్, యూజర్ చార్జీలు, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సమకూరే ఆదాయాన్ని పన్నేతర ఆదాయం కింద పరిగణిస్తారు. ఈ పద్దు కింద 2023–24లో నవంబర్ నెల ముగిసే సమయానికి రూ.19,524.69 కోట్లు సమకూరింది. అదే ప్రస్తుత సంవత్సరంలో మాత్రం కేవలం రూ. 5,217.26 కోట్లు మాత్రమే వచ్చింది. వాస్తవానికి 2024–25లో రూ.35,208 కోట్ల పన్నేతర ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ అందులో దాదాపు 15 శాతం మాత్రమే సమకూరడం గమనార్హం. మరోవైపు ఎక్సైజ్ శాఖ ద్వారా రావాల్సిన ఆదాయం గత ఏడాదితో పోలిస్తే తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో 8 నెలల్లో రూ.14,607 కోట్లు రాగా, ఈ ఏడాదిలో రూ.2 వేల కోట్లు తక్కువగా రూ.12,364 కోట్లు వచ్చింది. అయితే జీఎస్టీ పద్దు కింద గత ఏడాది కంటే రూ.3 వేల కోట్లు, అమ్మకపు పన్ను కింద రూ.1.500 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా రూపంలో రూ.3 వేల కోట్లు అధికంగా సమకూరాయి. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.200 కోట్ల మేర ఆదాయం పెరిగింది. అప్పులు కూడా గత ఏడాది కంటే స్వల్పంగా తగ్గినా బడ్జెట్ అంచనాల్లో 72 శాతం ఇప్పటికే సమకూరడం గమనార్హం.

నాలుగు నెలల్లో రాబడి వస్తుందా?

ప్రస్తుత లెక్కల ప్రకారం నవంబర్ తర్వాత మిగిలిన నాలుగు నెలల్లో బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.1.30 లక్షల కోట్లకు పైగా రాబడులు ప్రభుత్వ ఖజానాకు సమకూరాల్సి ఉంది. అయితే గత ఏడాది చివరి నాలుగు నెలల్లో రూ.70 వేల కోట్లకు పైగా మాత్రమే వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించకపోతే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి బడ్జెట్ అంచనాలకు, రాబడులకు భారీ లోటు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. చివరి నాలుగు నెలల్లో రూ.80 వేల కోట్ల మేర రాబడులు వస్తాయని ఆశించినా, కనీసం మరో రూ.20–30వేల కోట్లు ఇతర మార్గాల్లో సమకూర్చుకోకపోతే బడ్జెట్ లెక్కలు తప్పుతాయని ఆర్థికరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్ఆర్ఎస్, సాదాబైనామాల క్రమబద్ధీకరణ, జీవో 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం, భూముల అమ్మకాలు, మైనింగ్ ఆదాయం పెంపు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడం లాంటి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూనుకోవాలని వారు సూచిస్తున్నారు.

ఈ ఏడాది నవంబర్ నాటికి ఆదాయ, వ్యయ గణాంకాలు రూ.కోట్లలో

రాబడులు

ఆదాయ వనరు	సమకూరిన మొత్తం
జీఎస్టీ	33,766.85
రిజిస్ట్రేషన్లు	9,524.19
అమ్మకపు పన్ను	21,081.42
ఎక్సైజ్	12,364.06
కేంద్ర పన్నుల్లో వాటా	11,472.79
ఇతర పన్నులు	5,343.47
పన్నేతర ఆదాయం	5,217.26
గ్రాంట్ ఇన్ ఎయిడ్	4,529.27
అప్పులు	37,850.08

ఖర్చులు

వ్యయ పద్దు	ఖర్చు చేసిన మొత్తం
రెవెన్యూ ఖాతా	52,695.53
అప్పులకు వడ్డీలు	17,080.78
వేతనాలు	28,196.04
పింఛన్లు	11,172.16
సబ్సిడీలు	8,443.90
మూలధన వ్యయం	20,345.97

చాక్లెట్ల రూపంలో గంజాయి రవాణా

- ఆరుగురు ముఠా సభ్యుల అరెస్ట్

కోదాడ రూరల్: ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు చాక్లెట్ల రూపంలో గంజాయి తరలిస్తున్న ఆరుగురు ముఠా సభ్యులను సూర్యాపేట జిల్లా కోదాడ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఉదయం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్‌లో అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఆపారు. బస్సులో అనుమానాస్పదంగా కనిపించిన భువనేశ్వర్‌లోని మయూర్‌బంజ్‌కు చెందిన అనిల్‌కుమార్, రజని, బంకిమ్‌చంద్ర, మమితనాయక్, సంజిబాని దెబురాయ్, జానునాయక్‌ను కిందకు దింపి వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా, 25 ప్యాకెట్లలో 5 కేజీల బరువున్న వెయ్యి గంజాయి చాక్లెట్లు బయటపడ్డాయి. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ ఆరుగురు నిందితులు హైదరాబాద్‌లో పనిచేస్తుంటారు. ట్రావెల్స్ బస్సు ఏపీలోకి ప్రవేశించిన తర్వాత పలాసలో అక్కడి పోలీసుల తనిఖీ చేసినప్పటికీ వాటిని ఆయుర్వేదిక్ చాక్లెట్లుగా వారిని నమ్మించి బయటపడ్డారు. బస్సు తెలంగాణలోకి ప్రవేశించే మార్గంలో రామాపురం క్రాస్‌రోడ్‌లో కోదాడ ఎక్సైజ్ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

యాదగిరిగుట్ట ఘాట్ రోడ్డులో ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న కారు, బస్సు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహా స్వామి ఆలయానికి వెళ్లే మూడో ఘాట్ రోడ్డు లో ఆదివారం బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఉదయం 8 గంటల సమయంలో కొండ పైనుంచి బస్సు కిందకు వస్తుండగా.. అదే సమయంలో కొండ పైకి హైదరాబాద్‌కు చెందిన భక్తులు కారులో వెళ్తున్నారు. మూడో ఘాట్ రోడ్డులోని రెండో మూలమలుపు వద్ద కారు, బస్సు ఎదురెదు రుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులోని భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. అనంత రం ఎస్‌పీఎఫ్ పోలీసులు వచ్చి వాహనాలను అక్కడి నుంచి పంపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల బలవన్మరణం

అప్పల బాధతో ఒకరు, తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మరొకరు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో కలకలం

సిద్దిపేటకమాన్/ కొల్చారం (నర్సాపూర్): ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆదివారం ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. సిద్దిపేట పట్టణంలో అప్పుల బాధ భరించలేక ఒకరు, మెదక్ జిల్లా కొల్చారం మండలంలో తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మనస్తాపానికి గురై మరొకరు ఉరేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన బండారి బాలకృష్ణ (34).. భార్య మానస, ఇద్దరు కుమారులతో కలిసి సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీలో నివాసం ఉంటున్నారు. బాలకృష్ణ రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్ ఆర్మర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సిద్దిపేట నుంచి విధులకు వెళ్లి వస్తుంటారు. కాగా, బాలకృష్ణ ఫోనిక్స్ అనే ఓ ప్రైవేటు కంపెనీలో ఫోన్ పే, గూగుల్ పే, నెఫ్ట్ ద్వారా పలు విడతలుగా సుమారు రూ.25 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఈ క్రమంలో చాలా అప్పులు చేశారు. అయితే పెట్టుబడులపై ఆశించిన ఆదాయం రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని భార్యతో చెప్పి శనివారం రాత్రి ఎలుకల మందు కలిపిన టీని ఇద్దరు పిల్లలకు తాగించి, భార్యాభర్తలు కూడా తాగారు. ఆదివారం తెల్లవారుజామున మేలుకున్న బాలకృష్ణ లేచి చూడగా అందరూ స్పృహలోనే ఉన్నారు. ఇది గుర్తించి అతడు పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాలకృష్ణ భార్య మానస, ఇద్దరు కుమారులను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు.



బాలకృష్ణ



సాయికుమార్

బ్లాక్ మెయిల్ చేస్తున్నారని..

మరో ఘటనలో మెదక్ జిల్లా కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాటూరి సాయికుమార్ (55) బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్ భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలతో కలసి నర్సాపూర్‌లో ఉంటున్నారు. రోజూ అక్కడి నుంచే డ్యూటీకి వచ్చి వెళ్తుంటారు. శనివారం మధ్యాహ్నం కొల్చారం స్టేషన్‌కు డ్యూటీకి వచ్చారు. రాత్రి క్వార్టర్ రూమ్‌లో ఉన్నారు. ఆదివారం ఉదయం భార్య శైలజకు ఫోన్ చేసి, 'నేను చనిపోతున్నాను. నన్ను కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు' అని చెప్పి స్టేషన్ ఆవరణలోని చెట్టుకు ఉరేసుకొన్నారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు

తీవ్రంగా వేధించారు: మృతుడి భార్య శైలజ

కొంతకాలంగా నర్సాపూర్‌లోని ఓ మహిళతో సాయికుమార్ తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని ఆయన భార్య శైలజ తెలిపారు. ఇది తెలిసిన ఆ మహిళ భర్త.. వివాహేతర సంబంధం అంటగట్టడంతోపాటు కేసు పెడతానంటూ వేధించేవాడని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా అతడి అల్లుడితో కలసి చంపుతామంటూ తరచూ బెదిరించేవారని పేర్కొంది. తన భర్త మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

అన్నారం బ్యారేజీలో పరీక్షలు పునఃప్రారంభం



అన్నారం బ్యారేజీ నాలుగవ బ్లాక్ వద్ద పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణుల బృందం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి అన్నారం బ్యారేజీలో పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్ బృందం నిపుణులు ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో ప్యారలల్ సీస్మిక్ వేవ్ మెథడ్ పరీక్షలను ఆదివారం పునఃప్రారంభించారు. గతంలో రెండుసార్లు బ్యారేజీలో పరీక్షలు నిర్వహించిన సమయంలో వరదలు, వర్షాల కారణంగా ఆటంకం కలగడంతో నిలిపివేశారు. మొత్తం 21 వెంట్‌లలో 9 వెంట్‌లకు పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఆదివారం మూడోసారి బ్యారేజీ మూడు, నాలుగు బ్లాకుల్లోని వెంట్‌ల వద్ద పరీక్షలు చేపట్టారు. వీటిని రెండ్రోజుల్లో పూర్తి చేస్తారని ఇరిగేషన్ ఇంజనీర్లు తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలతో నిర్వహించిన ఈ పరీక్షల్లో సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం సభ్యులు వివేక్, ప్రశాంత్, శివాంగ్ ఉన్నారు. వారి వెంట డీఈఈ సతీశ్, రవిచంద్ర, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మందా జగన్నాథంకు కేటీఆర్ పరామర్శ



ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథంను మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పరామర్శించారు. వారం రోజుల కిందట తీవ్ర అనారోగ్యానికి గురైన మందా జగన్నాథం నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ జగన్నాథం కుమారుడు శ్రీనాథ్, కుమార్తె పల్లవితో మాట్లాడి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


క్యూలైన్ గ్రిల్స్‌లో ఇరుక్కున్న బాలుడి తల



గ్రిల్స్‌లో నుంచి బాలుడి తలను తీసేందుకు యత్నిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్యూలైన్‌లో ఆదివారం ఓ బాలుడి తల గ్రిల్స్‌లో ఇరుక్కుంది. హైదరాబాద్‌లోని బోడుప్పల్‌కు చెందిన కిష్టయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం యాదగిరిగుట్టకు వచ్చారు. ఉదయం 8.30 గంటల సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు రూ.150 వీఐపీ టికెట్ కొనుగోలు చేసి క్యూలైన్‌లోకి వెళ్లారు. బ్రేక్ దర్శనం సమయంలో వీఐపీ దర్శనాలను అధికారులు నిలిపివేశారు. ఆ సమయంలో కిష్టయ్య వెంట వచ్చిన దయాకర్ అనే బాలుడు అక్కడే ఆడుకుంటూ అతడి తలను గ్రిల్స్‌లో దూర్చడంతో అందులో ఇరుక్కుపోయింది. సుమారు 15 నిమిషాల పాటు సదరు బాలుడు తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. అక్కడే క్యూలైన్‌లో ఉన్న అయ్యప్ప మాలధారులు, భక్తులు గ్రిల్స్‌ను కొద్దిగా వెడల్పు చేసి దయాకర్ తలను గ్రిల్స్‌లో నుంచి తీశారు. అనంతరం కిష్టయ్య, బాలుడు దయాకర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు.

వచ్చేనెల తిరుమలలో విశేష పర్వదినాలు



తిరుమల: వచ్చేనెల తిరుమలలో విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. జనవరి 9న చిన్న శాత్తుమొర, 10న వైకుంఠ ఏకాదశి, స్వర్ణ రథోత్సవం, వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభం, 11న వైకుంఠ ద్వాదశి, స్వామి పుష్కరిణి తీర్థ ముక్కోటి చక్ర స్నానం, 15న ప్రణయ కలహోత్సవం, గోదా పరిణయం, 17న తిరుమళిసై ఆళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 18 శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవం, 19న పెద్ద శాత్తుమొర, వైకుంఠ ద్వార దర్శనం ముగింపు, 20న శ్రీ కూరత్తాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 23న అధ్యాయనోత్సవాలు సమాప్తం, 24న తిరుమల నంబి చెంతకు శ్రీ మలయప్పస్వామి వేంచేపు, 25న సర్వ ఏకాదశి, 26న గణతంత్ర దినోత్సవం, 27న మాస శివరాత్రి, 29న పురంధర దాస ఆరాధన మహోత్సవాలు జరగనున్నట్లు పేర్కొంది.

పోతన చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు



శ్రీసోమేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్వరరావు, పద్మావతి దంపతులు

పాలకుర్తి టౌన్: భాగవతం గ్రంథకర్త బమ్మెర పోతన చరిత్రను ప్రపంచానికి చాటి చెప్పేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు అన్నారు. పోతన జయంతి ఉత్సవాలను బమ్మెరలో ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి, వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాల్లో ఆదివారం జస్టిస్ రాజేశ్వరరావు, పద్మావతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని అర్చకులు శేషవస్త్రాలతో సన్మానించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు పోతన సమాధిని, మోట బావిని సందర్శించారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ, పాలకుర్తి పరిసరాల దేవాలయాలను అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తారని పేర్కొన్నారు. బసవ పురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడు జన్మించిన ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీగౌరి గోశాలను సందర్శించారు. ఆయన వెంట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ, అడిషనల్ జడ్జి సందీప, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ మహేందర్‌రెడ్డి, ఆలయ ఈఓ మోహన్‌బాబు, అర్చకులు డీవీఆర్ శర్మ, అనిల్‌కుమార్, నాగరాజు, పాలకుర్తి, దేవరుప్పుల ఎస్సైలు పవన్‌కుమార్, సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వీరయ్య ఆరోపించారు. ఆదివారం నల్లగొండలో జరుగుతున్న టీఎస్‌టీయూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్య వైజ్ఞానిక మహాసభలో రెండో రోజు జరిగిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు వనరులు లేవని తప్పుకుంటున్నాయన్నారు. నేటి సమాజంలో పేద ప్రజల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనాథలుగా భావిస్తున్నాయని వీరయ్య ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారులకు రూ.18 లక్షల కోట్ల అప్పులు మాఫీ చేసిందని, పేద, నిరుపేదల అప్పులు మాఫీ చేయకపోవడం అన్యాయమన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో సంఘం ఏర్పడిన పదేళ్లలో అనేక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు, రాష్ట్ర కోశాధికారి, టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎం .రాజశేఖర్‌రెడ్డి, కె.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'రామప్ప'ను సందర్శించిన యునెస్కో బృందం



ఆలయాన్ని పరిశీలిస్తున్న యునెస్కో బృందం

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని రామప్ప ఆలయాన్ని ఆదివారం యునెస్కో నార్త్ స్టాండ్ రీజియన్ టీం సభ్యులు డాక్టర్ అశ్విని శర్మ, తెలంగాణ కో–ఆర్డినేటర్ ధర్మపురి రాజగోవింద్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వేర్వేరుగా సందర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం వారికి అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థప్రసాదాలను అందజేశారు. అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, టూరిజం గైడ్స్ ఆలయ విశిష్టతను వివరించారు.

179 ప్రాణాలు బుగ్గిపాలు

దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం

సియోల్: దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. ఏకంగా 179 మంది ప్రయాణికులు నిస్సహాయంగా మంటల్లో చిక్కి మాంసపు ముద్దలుగా మారిపోయారు. ఆదివారం ఉదయం 9.03 గంటలకు థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ నుంచి వచ్చిన జెజు ఎయిర్ సంస్థకు చెందిన బోయింగ్ 737–800 విమానం ముయాన్ ఎయిర్‌పోర్టులో రన్‌వేపై దిగుతూ అదుపు తప్పింది. విమానాశ్రయ రక్షణ గోడను ఢీకొట్టి పేలిపోయింది. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విమానంలో 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా ఇద్దరు మినహా అంతా దుర్మరణం పాలయ్యారు. ఇప్పటిదాకా గుర్తించిన మృతుల్లో 85 మంది మహిళలు కాగా 84 మంది పురుషులు. మరో 10 మందిని గుర్తించాల్సి ఉంది. మహిళలో, పురుషులో కూడా గుర్తించలేనంతగా మృతదేహాలు కాలిపోయాయని సహాయక సిబ్బంది చెప్పారు. విమానం మంటల్లో చిక్కగానే సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగి ప్రయాణికులను కాపాడేందుకు ప్రయత్నించారు. ప్రాణాలతో ఉన్న ఇద్దరిని బయటకు లాగారు. వారిని విమాన సిబ్బందిగా గుర్తించారు. మిగతా ప్రయాణికులంతా ప్రమాదంలోనే కన్నుమూశారు. వారిలో అత్యధికులు దక్షిణకొరియా పౌరులే. ఇద్దరు మాత్రం థాయ్‌లాండ్ జాతీయులని తేలింది. రాజధాని సియోల్‌కు దక్షిణంగా 290 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం బారిన పడ్డ బోయింగ్ 737–800 విమానం 15 ఏళ్ల నాటిది. ల్యాండింగ్ గేర్ వైఫల్యమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలింది. దక్షిణ కొరియాలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఇదొకటి.

తెరుచుకోని ల్యాండింగ్ గేర్

ప్రమాద దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ సమయంలో విమానం ల్యాండింగ్ గేర్ మూసే ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో వేగంగా దూసుకొచ్చిన విమానం రన్‌వేపై దిగుతూనే అదుపు తప్పింది. అడ్డంగా దూసుకెళ్లి విమానం ముందుభాగం రక్షణ గోడను ఢీకొంది. అప్పటికీ వేగం పూర్తిగా తగ్గక మరికొంత ముందుకు దూసుకెళ్లింది. ఆ ఒత్తిడికి ఇంధనానికి మంటలు అంటుకుని ఉవ్వెత్తున ఎగిశాయి. చూస్తుండగానే విమానం పేలిపోయి భారీగా మంటలు, దట్టమైన పొగ వెలువడ్డాయి. విమానం పూర్తిగా ధ్వంసమైందని, కేవలం తోక భాగం మాత్రమే గుర్తించగల స్థితిలో ఉందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. 32 అగ్నిమాపక యంత్రాలు, హెలికాప్టర్ల సాయంతో 1,570 మంది అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, సైనికులు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ప్రమాదంపై పోప్ ఫ్రాన్సిస్, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, థాయ్‌లాండ్ ప్రధాని పెటాంగ్‌తర్న్ షినవత్ర తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు జెజు ఎయిర్ సంస్థ క్షమాపణ తెలిపింది.

పక్షి వల్లే ప్రమాదమా?

ల్యాండింగ్‌కు కాసేపటి ముందు పైలట్‌కు టవర్ సిబ్బంది బర్డ్ స్ట్రైక్ వార్నింగ్ ఇచ్చారని దక్షిణ కొరియా రవాణా శాఖ వెల్లడించింది. ''ప్రమాదానికి ముందు విమాన పైలట్, ఎయిర్‌పోర్టు కంట్రోల్ టవర్ మధ్య సంభాషణను విశ్లేషించాం. విమానాన్ని పక్షి ఢీకొట్టేలా ఉండటంతో మరో రన్‌వేపై దిగడానికి అనుమతిచ్చారు. అక్కడ దిగలేని పరిస్థితి ఉందంటూ పైలట్ సిగ్నల్ ఇచ్చాడు. తర్వాత క్షణాల వ్యవధిలోనే విమానం రన్‌వే చివరి భాగంలో దిగి అదుపు తప్పింది'' అని తెలియజేసింది. ప్రమాదానికి అసలు కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. బ్లాక్ బాక్స్ డేటాను సేకరించి విశ్లేషణకు పంపారు. దర్యాప్తు పూర్తవడానికి కొన్ని నెలలు పడుతుందని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన రన్‌వేను జనవరి 1వ తేదీ దాకా మూసేశారు.



అదుపు తప్పి, పొగలుగక్కుతూ రన్‌వేపై దూసుకెళ్తున్న విమానం

రక్షణ గోడను ఢీకొని పేలిపోవడంతో వ్యాపించిన మంటలు, పొగ

త్రుటిలో తప్పిన మరో మూడు ప్రమాదాలు

- కెనడాలో విమానానికి మంటలు
- నార్వేలో అదుపు తప్పిన విమానం
- నేపాల్లో హెలికాప్టర్‌ను ఢీకొన్న పక్షి

ఒట్టావా/ఓస్లో/కఠ్మాండు: దక్షిణ కొరియా ప్రమాదం జరిగిన కాసేపటికే ఆదివారం మరో రెండు భారీ విమాన ప్రమాదాలు త్రుటిలో తప్పాయి. కెనడాలో సెయింట్ జాన్స్ నుంచి వస్తున్న ఎయిర్ కెనడా 2259 విమానం హలిఫాక్స్ విమానాశ్రయంలో రన్‌వేపై దిగుతూ అదుపు తప్పింది. దాంతో విమానానికి మంటలంటుకున్నాయి! అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఒక టైర్ పూర్తిగా తెరుచుకోకపోవడంతో రన్‌వేపై దిగగానే విమానం అదుపు తప్పి 20 డిగ్రీల కోణంలో ఎడమకు వాలి అలాగే దూసుకెళ్లింది. దాంతో మంటలు అంటుకుని విమానం ఎడమ భాగం కాలిపోయింది. పెద్ద శబ్దం వినిపించింది. పైలట్ చాకచక్యంగా విమానాన్ని ఆపగలిగాడు. వెంటనే సహాయక సిబ్బంది ప్రయాణికులను హుటాహుటిన బయటకు తీసుకొచ్చారు. నార్వేలో కూడా ఓ విమానం అత్యవసరంగా ల్యాండవుతూ అదుపు తప్పింది. ఓస్లో నుంచి నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌కు బయల్దేరిన కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ బోయింగ్ 737–800 టేకాఫయిన కాసేపటికే హైడ్రాలిక్ విఫలమైంది. దాంతో ఓస్లోకు 110 కిలోమీటర్ల దూరంలోని ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేస్తుండగా అదుపు తప్పి రన్‌వేను తాకి దట్టమైన గడ్డిలోకి వెళ్లి ఆగింది. విమానంలోని 182 మందినీ వెంటనే భద్రంగా బయటకు తీసుకొచ్చారు. నేపాల్‌లో ఎవరెస్ట్ శిఖరం సమీపంలోని బేస్ లుక్లా నుంచి ఆదివారం ఐదుగురు అమెరికన్లతో బయల్దేరిన హెలికాప్టర్‌ను పక్షి ఢీకొంది. దాంతో సురక్షితంగా బనెపాలో ఎమర్జెన్సీ ల్యాండ్ చేశారు.

హెచ్‌–1బీ వీసాలకు ట్రంప్ దన్ను

మస్క్ వాదనకు కాబోయే అధ్యక్షుని మద్దతు



వాషింగ్టన్: నిపుణులైన విదేశీ కార్మికులకు అమెరికా సంస్థల్లో ఉపాధికి ఉద్దేశించిన హెచ్‌–1బీ వీసాల పరిరక్షణ కోసం యుద్ధానికైనా సిద్ధమని వ్యాఖ్యానించిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి మద్దతు లభించింది. హెచ్‌–1బీ వీసాల జారీని అమెరికాలో పలువురు వ్యతిరేకిస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. నిపుణులైన ఉద్యోగులకు అమెరికాలో పని చేసుకొనేందుకు అవకాశం కల్పించే హెచ్‌–1బీ వీసాలను వ్యతిరేకించేవారు తమ అభిప్రాయం మార్చుకోవాలని మస్క్ సూచించడం తెల్సిందే. కేవలం నైపుణ్యత మీదనే మనగలిగే స్పేస్‌ఎక్స్, టెస్లా వంటి సృజనాత్మక సంస్థలకు హెచ్‌–1బీ వీసాదారుల అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. మస్క్ చేసిన ఈ వ్యాఖ్యలను ట్రంప్ సమర్థించారు. ''హెచ్‌–1బీ వీసా ప్రక్రియను నేనెప్పుడూ ఇష్టపడతా. వాటికి మద్దతు పలుకుతా. అందుకే అవిప్పటిదాకా అమెరికా వ్యవస్థలో కొనసాగుతున్నాయి. నా వ్యాపార సంస్థల్లోనూ హెచ్‌–1బీ వీసాదారులున్నారు. హెచ్‌–1బీ వ్యవస్థపై నాకు నమ్మకముంది. ఈ విధానాన్ని ఎన్నోసార్లు వినియోగించుకున్నా. ఇది అద్భుతమైన పథకం'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనలో సమూల సంస్కరణలే లక్ష్యంగా ట్రంప్ కొత్తగా తెస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్)కు సంయుక్త సారథులు కానున్న మస్క్, వివేక్ రామస్వామి హెచ్‌–1బీకి మద్దతు తెలుపుతున్నారు. దీన్ని రిపబ్లికన్ పార్టీ సీనియర్లు తప్పుబడుతున్నారు. స్థానిక అమెరికన్లకే అధిక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న ట్రంప్ ఎన్నికల వాగ్దానానికి ఇది విరుద్ధమంటున్నారు. వాళ్ల వైఖరిని మస్క్ తప్పుబట్టారు. హెచ్‌–1బీ వీసాల కోసం ఎంతకైనా తెగిస్తానని శనివారం ప్రకటించారు.

ఐక్యతా మహా కుంభ్

- విద్వేష నిర్మూలనకు కుంభమేళాలో ప్రతిన
- 'మన్ కీ బాత్'లో ప్రజలకు మోదీ పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి నెలన్నర పాటు జరగనున్న మహా కుంభమేళాను ఐక్యత మహాకుంభ్‌గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ''అందరూ కుంభమేళాలో పాల్గొని పవిత్ర స్నానాలు ఆచరించాలి. సమాజంలో విద్వేషం, విభజనవాదాల నిర్మూలనకు సంకల్పం తీసుకోవాలి'' అని పిలుపునిచ్చారు. ఆదివారం 117వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మాట్లాడారు. ''దేశమంతా ఏకం కావాలన్న గొప్ప సందేశాన్ని కుంభమేళా ఇస్తోంది. భారీతనంలో కాకుండా భిన్నత్వంలోనే దాని ప్రత్యేకత దాగుంది. అంతటి వైవిధ్యాన్ని ప్రపంచంలో ఎక్కడా చూడబోం. అవిశ్రాంత గంగా ప్రవాహంలా సమాజమంతా ఒక్కటిగా ఉండాలి'' అన్నారు. కుంభమేళాలో 11 భారతీయ భాషల్లో ఏఐ చాట్‌బాట్ సేవలను భక్తులు ఉపయోగించుకోవాలని కోరారు.

'ఆయుష్మాన్'తో క్యాన్సర్‌కు చెక్

''మన దేశంలో 2015–2023 మధ్య మలేరియా కేసులు, మరణాలు 80 శాతం తగ్గినట్లు డబ్ల్యూహెచ్‌ఓ నివేదిక వెల్లడించింది. ఇదో గొప్ప విజయం. మన దగ్గర క్యాన్సర్ చికిత్సను సకాలంలో ప్రారంభిస్తుండడం గణనీయంగా పెరిగిందని లాన్సెట్ జర్నల్ వెల్లడించింది. ఆయుష్మాన్ భారత్ యోజన కింద 90 శాతం మంది క్యాన్సర్ బాధితులు సకాలంలో చికిత్స పొందగలుగుతున్నారు. భారత సంస్కృతి, సంప్రదాయాల పట్ల విదేశీయులు ఆకర్షితులవుతున్నారు. ఫిజిలో తమిళ టీచింగ్ ప్రోగ్రాంకు ఎంతో ఆదరణ లభిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో విశిష్టమైన ఒలింపిక్స్ జరిగాయి. పేదరికం, కరువు, వలసలకు మారుపేరైన ఒడిశాలోని కలహండిలో కూరగాయల విప్లవం సాగుతోంది'' అని మోదీ అన్నారు. వచ్చే జనవరి 26న రాజ్యాంగ 75వ వార్షికోత్సవం నిర్వహించుకుంటున్నామని గుర్తు చేశారు. ''ఇది మనందరికీ గర్వకారణం. రాజ్యాంగం వల్లే ఈ రోజు నేనీ స్థాయికి చేరుకున్నా. మన రాజ్యాంగం ప్రతి సందర్భంలోనూ కాల పరీక్షకు నిలిచింది. దారిదీపంగా, మార్గదర్శిగా ముందుకు నడుపుతోంది'' అన్నారు.

అక్కినేనితో కొత్త శిఖరాలకు తెలుగు సినిమా

సినీ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాను కొత్త శిఖరాలకు చేర్చారంటూ మోదీ ప్రశంసించారు. భారతీయ సంప్రదాయాలు, విలువలను ఆయన సినిమాలు ప్రతిబింబించాయని కొనియాడారు. ''ఈ ఏడాది ఆయనతో పాటు రాజ్ కపూర్, తపన్ సిన్హా, మహ్మద్ రఫీ వంటి సినీ ఉద్దండుల శత జయంతి వేడుకలు జరగడం హర్షణీయం. సృజనాత్మక రంగంలో మన ప్రతిభా పాటవాలను ప్రపంచానికి తెలిపేలా వచ్చే ఫిబ్రవరి 5 నుంచి 9వ తేదీ దాకా ఢిల్లీలో తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమిట్ (వేవ్స్) జరగనుంది. ప్రపంచ దేశాల నుంచి అగ్రశ్రేణి కంటెంట్ క్రియేటర్లు అందులో పాల్గొంటారు. గ్లోబల్ కంటెంట్ క్రియేషన్‌లో ఇండియాను కేంద్రస్థానంగా మార్చే దిశగా ఈ సదస్సు మనకు చాలా కీలకం'' అని తెలిపారు. ఇండియా ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో కంటెంట్ క్రియేటర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. దేశ ప్రజలందరికీ మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరోగ్యంగా, సంతోషంగా 'ఫిట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



చితాభస్మాన్ని నదిలో కలుపుతున్న కుటుంబ సభ్యులు

మన్మోహన్ చితాభస్మం నిమజ్జనం

న్యూఢిల్లీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చితాభస్మాన్ని కుటుంబసభ్యులు సిక్కు ఆచారాల ప్రకారం ఆదివారం మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలోని యమునా నదిలో కలిపారు. ఆదివారం ఉదయం నిగమ్‌బోధ్ ఘాట్‌లో చితాభస్మాన్ని కుటుంబసభ్యులు సేకరించారు. మన్మోహన్ భార్య గురుశరణ్ కౌర్, ముగ్గురు కుమార్తెలు ఉపీందర్ సింగ్, దమన్ సింగ్, అమృత్ సింగ్ తమ బంధువులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. సిక్కు మతాచారాలను అనుసరించి జనవరి ఒకటో తేదీన మన్మోహన్ అధికార నివాసం మోతీలాల్ నెహ్రూ మార్గ్‌లోని మూడో నంబర్ భవనంలో 'అఖండ్ పథ్'జరపనున్నారు. దీంతోపాటు, జనవరి 3న భోగ్, అంతిమ్ అర్దాస్, కీర్తన్ కార్యక్రమాలను పార్లమెంట్ కాంప్లెక్స్ సమీపంలోని రకాబ్ గంజ్ గురుద్వారా నిర్వహించనున్నారు. కాగా, ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నేతలెవరూ పాల్గొనకపోవడాన్ని బీజేపీ తప్పుపట్టింది. అత్యంత గౌరవనీయుడైన సింగ్ జీ పట్ల కాంగ్రెస్ తీరు విచారకరమని పేర్కొంది.

'అంతరిక్ష అనుసంధానత'ను పరీక్షించనున్న ఇస్రో

నేడు జంట శాటిలైట్ల ప్రయోగం

న్యూఢిల్లీ: అంతరిక్షంలో వ్యోమనౌకల అనుసంధానత (డాకింగ్), విడదీత (అన్‌డాకింగ్) ప్రక్రియలను విజయవంతంగా పరీక్షించేందుకు ఇస్రో రంగం సిద్ధంచేస్తోంది. ఇందుకోసం ఉపయోగించే రెండు ఉపగ్రహాలను నేడు నింగిలోకి పంపనుంది. దీనికి శ్రీహరికోటలోని ప్రయోగవేదిక సిద్ధమైంది. సోమవారం రాత్రి ఎస్‌డీఎక్స్01, ఎస్‌డీఎక్స్02 శాటిలైట్లను పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ప్రయోగించనుంది. అంతరిక్షంలో 476 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియలను జనవరి తొలివారంలో స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్(స్పేడెక్స్)ను చేపడతామని ఇస్రో అధికారులు ఆదివారం వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే ఈ సాంకేతికతను సాధించాయి. చంద్రమండలం నుంచి చంద్రశిలల సేకరణ, భారతీయ అంతరిక్ష స్టేషన్ ఏర్పాటు, చందమామపై భారత వ్యోమగామిని దింపడం వంటి కీలక ఘట్టాలకు ఈ స్పేడెక్స్ మిషన్ తొలి సోపానంగా మారనుందని ఇస్రో పేర్కొంది.

బ్యాలెట్ రావాలి: అఖిలేశ్



లక్నో: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఈవీఎం)లపై విశ్వసనీయత సడలుతున్నందున బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆదివారం డిమాండ్ చేశారు. 'జర్మనీ వంటి దేశాలు కూడా బ్యాలెట్ పేపర్లే వాడుతున్నాయి. భారత్‌లో మాత్రం అధికార పెద్దలు స్వలాభం కోసం ఈవీఎంలను వాడుతున్నారు. వాటినెవరూ నమ్మడం లేదు. ఎన్నికల్లో గెలిచే వారు సైతం తమకు వాటిపై నమ్మకం లేదంటున్నారు'' అని చెప్పారు. భారత సంతతికి చెందిన జర్మనీ ఎంపీ రాహుల్‌కుమార్ కాంబోజ్ కూడా మీడియాతో మాట్లాడారు. ''బ్యాలెట్ పేపర్లు వాడితే పోలింగ్‌లో తేడాలున్నట్లు అనుమానం వస్తే రీ కౌంటింగ్‌కు అవకాశముంటుంది. జర్మనీలో దీన్నే అనుసరిస్తున్నారు'' అని తెలిపారు.

ఓటర్ జాబితా తారుమారుకు బీజేపీ కుట్ర: కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ జాబితాను తారుమారు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ఆరోపించారు. ''ఢిల్లీలో ఒక్క అసెంబ్లీ స్థానంలోనే 11 వేల ఓట్లను తొలగించాలంటూ ఈసీకి బీజేపీ దరఖాస్తులు చేసింది. నేను పోటీ చేసే న్యూఢిల్లీ స్థానంలోనూ 12,500 పేర్లను తొలగించాలంటూ దరఖాస్తు చేసింది. మేం ఈసీ దృష్టికి తీసుకెళ్లడం వల్ల పేర్ల తొలగింపు ఆగిపోయింది'' అని వివరించారు. బీజేపీ ఆటలను సాగనివ్వబోమన్నారు.

విషాదాలు... విజయాలు



2024 రివైండ్

భారతావనికి ఈ ఏడాది మిగిల్చి వెళ్తున్న జ్ఞాపకాలెన్నో

2024లో భారతావని తీపి, చేదులెన్నింటినో చవిచూసింది. హిందువుల ఐదు శతాబ్దాల కలను సాకారం చేస్తూ అయోధ్యలో బాలరామునికి దివ్య ధామం కొలువుదీరింది. అస్తవ్యస్త అభివృద్ధి తగదని కేరళ కొండల్లో ప్రకోపం రూపంలో ప్రకృతి హెచ్చరించింది. '400 పార్' అన్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు హ్యాట్రిక్ ఇచ్చినా మెజారిటీకి కాస్త దూరంలోనే నిలబెట్టి షాకిచ్చారు. కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో శిక్షణ వైద్యురాలిపై కామాంధుడి హత్యాచారం యావత్ జాతినీ నిశ్చేష్టపరిచింది. వలస చట్టాల స్థానంలో భారతీయ చట్టాలు వచ్చాయి. చచ్చిన జంతువుల చర్మాలపై వేళ్లు కదలించే వాళ్లంటూ దూరం పెట్టిన నోళ్లు నివ్వెరబోయేలా తబలాకు విశ్వవ్యాప్త కీర్తి కిరీటం తొడిగిన స్వర తపస్వి జాకీర్ హుస్సేన్ అస్తమయంతో సంగీత ప్రపంచం మూగబోయింది. సంస్కరణల బాటలో దేశాన్ని ప్రగతి పరుగులు పెట్టించిన కర్మయోగి మన్మోహన్, పారిశ్రామిక జగజ్జేత రతన్ టాటా సహా దిగ్గజాలెందరో ఇక సెలవంటూ మనసు వీడి వెళ్లారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో జగజ్జేతగా నిలిచి టీనేజర్ గుకేశ్ దొమ్మరాజు ఆనంద డోలికల్లో ముంచెత్తాడు...

అయోధ్యలో బాల రాముడు

శతాబ్దాల కలను సాకారం చేస్తూ అయోధ్యలో భవ్య రామమందిరం రూపుదిద్దుకుంది. బాల రాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జనవరిలో అతిరథ మహారథుల సమక్షంలో కన్నులపండువగా జరిగింది. వజ్రతిలకంతో అపూర్వ ఆభరణాలతో కూడిన ఆ సుందర రూపాన్ని చూసేందుకు భక్త కోటి పోటెత్తింది. ప్రారంభోత్సవాన్ని వేలాది మంది ప్రత్యక్షంగా, కోట్లాది మంది పరోక్షంగా వీక్షించారు.



సత్తా చాటిన ఇస్రో



2024 మొదలవుతూనే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో జయభేరి మోగించింది. కృష్ణబిలాలు, ఎక్స్ కిరణాలపై శోధనకు ఎక్స్‌రే పొలారీమీటర్ శాటిలైట్‌ను జనవరి 1న తొలి ప్రయత్నంలో విజయవంతంగా ప్రయోగించింది. వారంలోపే సూర్యునిపై పరిశోధనలకు ఉద్దేశించిన ఆదిత్య ఎల్‌–1ను సైతం ఎల్‌–1 కక్ష్యలోకి చేర్చింది. ఏడాది పొడవునా ప్రయోగాలతో సత్తా చాటింది.

పరిణత తీర్పు



లోక్‌సభలో తమకు ఎదురు లేదని భావించిన కమల దళానికి ఓటర్లు చిన్న షాకిచ్చారు. మోదీ మేనియాలో హ్యాట్రిక్ ఖాయమన్న అంచనాలను నిజం చేసినా, బీజేపీని మాత్రం మెజారిటీకి కాస్త దూరంలోనే ఉంచారు. అయోధ్యకు నెలవైన లోక్‌సభ స్థానంలోనూ బీజేపీ ఓటమి చవిచూసింది. విపక్ష 'ఇండియా' కూటమి పర్వాలేదనిపించింది. రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర కలిసొచ్చి కాంగ్రెస్ కూడా కాస్త కోలుకుంది.

దివికేగిన దిగ్గజాలు

న్యాయ కోవిదుడు పాలీ ఎస్ నారిమన్, వామపక్ష దిగ్గజాలు బుద్ధదేవ్ భట్టాచార్య, సీతారాం ఏచూరి మొదలుకుని ఓం ప్రకాశ్ చౌతాలా, ఎస్ఎస్ కృష్ణ వంటి దిగ్గజ నేతలను, భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నిపుణురాలు యామినీ కృష్ణమూర్తి తదితరులనూ ఈ ఏడాదిలోనే దేశం కోల్పోయింది. పారిశ్రామిక దిగ్గజం, మానవీయ విలువలకు నిలువుటద్దం రతన్ టాటా అస్తమయం తీరని లోటు మిగిల్చింది. డిసెంబర్ అయితే పీడకలగా మిగిలింది. తబలా దిగ్గజం జాకిర్ హుస్సేన్, భారతీయ సినిమాకు మట్టి పరిమళాలద్దిన హైదరాబాదీ శిఖరం శ్యామ్ బెనగల్, రాజనీతిజ్ఞుడికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన సంస్కరణల ప్రధాని మన్మోహన్ సింగ్ ఒకరి వెంట ఒకరు సెలవంటూ వెళ్లిపోయారు.

బాండ్లకు బైబై



పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వాటి జారీని తక్షణమే నిలిపేయాలంటూ ఏకగ్రీవ తీర్పునిచ్చింది. ఎన్నికల బాండ్ల ముసుగులో గోప్యంగా విరాళాల స్వీకరణ సమాచార హక్కుకు ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. దాతల పేర్లపై గోప్యత తగదని చెప్పింది.

వయనాడ్ విలయం

కేరళలోని వయనాడ్ జిల్లాలో మారుమూల గ్రామాలపై కొండచరియలు విరిగిపడ్డ విలయంలో 231 మంది అమాయకులు సజీవ సమాధి అయ్యారు. పర్యాటకం పేరిట కొండలను ఇష్టంగా తవ్వేసిన పాపానికి వాళ్లు బలైపోయారు. దాదాపు 120 మంది జాడ ఇప్పటికీ తెలియలేదు. వేలమంది సర్వస్వం కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లాలో సత్సంగ్‌లో బోలే బాబా పాదస్పర్శ జరిగిన మట్టి కోసం భక్తులు వేలాదిగా ఎగబడ్డ ఉదంతం తొక్కిసలాటకు దారితీసి 121 మంది ప్రాణాలు కోల్పోయారు.

అరెస్టులే అరెస్టులు




ఢిల్లీలో మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను మార్చిలో ఈడీ అరెస్టు చేసింది. ఎట్టకేలకు బెయిల్ మీద బయటికొచ్చినా నమ్మినబంటు అతిశిని ఢిల్లీ సీఎం కుర్చీపై కూర్చోబెట్టారు. కర్ణాటకలో సంచలనం సృష్టించిన అత్యాచారాల కేసులో మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, హసన్ ఎంపీ ప్రజ్వల్ అరెస్టయ్యారు. కన్నడ నటుడు దర్శన్ తూగుదీప కూడా అభిమానిని కొట్టి చంపిన కేసులో కటకటాలపాలయ్యారు. సంచలనం సృష్టించిన నీట్ ప్రవేశ పరీక్షలోనూ పలు అరెస్టులు జరిగాయి.

రైతన్నల పోరుబాట

మద్దతు ధరకు చట్ట బద్ధత కోరుతూ పంజాబ్, హరియాణాలో కర్షకలోకం మరోసారి సమరశంఖం పూరించింది. శంభూ సరిహద్దు వద్ద మొదలైన రైతు ఉద్యమం మరోసారి ఉధృతంగా సాగింది. ఢిల్లీ, హరియాణా సరిహద్దుల దిగ్బంధం, పోలీసులతో రైతుల ఘర్షణ, లాఠీచార్జ్, బాష్పవాయుగోళాల ప్రయోగంతో రైతన్నలు నెల రోజులుగా రోడ్డుపై రక్తమోడుతున్నా కేంద్రం నుంచి ఇప్పటికైతే సానుకూల ప్రకటన లేదు. నానాటికీ క్షీణిస్తున్న రైతు నేత డల్లేవాల్ ఆరోగ్యం ఆందోళన కలిగిస్తోంది.

అమల్లోకి సీఏఏ



వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని మోదీ సర్కారు అమల్లోకి తెచ్చింది. 2014 డిసెంబరు 31కి ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు ధ్రువీకరణ పత్రాలు లేకున్నా పౌరసత్వం ఇచ్చేందుకు సిద్ధమైంది. వలస వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలకు పౌరసత్వం ఇచ్చే ప్రక్రియ మొదలైంది.

భారత న్యాయవ్యవస్థ



భారత న్యాయవ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచింది. బ్రిటిష్ హయాం నాటి భారత శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), సాక్ష్యాధార చట్టాలు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అమల్లోకి వచ్చాయి. సత్వర న్యాయం, జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులను అందుబాటులోకి తెచ్చాయి.

చైనా దోస్తీ

సరిహద్దు సంక్షోభాగ్నిని ఎగదోసే డ్రాగన్ దేశంతో ఎట్టకేలకు తూర్పు లద్దాఖ్‌లో బలగాల ఉపసంహరణ ఒప్పందం కుదిరింది. అక్కడ బలగాల ఉపసంహరణ, ఉమ్మడి గస్తీకి ఇరు దేశాలు సరేనన్నాయి. దాంతో గల్వాన్ లోయ ఉద్రిక్తత అనంతరం దిగజారిన ద్వైపాక్షిక సంబంధాలు కాస్త మెరుగయ్యాయి.

ఆర్‌జీ కర్ దారుణం



కోల్‌కతా ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై సివిల్ వలంటీర్ చేసిన దారుణ హత్యాచారం యావద్దేశాన్నీ కలచివేసింది. నిందితునితో అంటకాగిన కాలేజీ ప్రిన్సిపల్‌ను తొలగించకపోగా వేరే పోస్టింగ్ ఇచ్చి మమత సర్కారు జనాగ్రహానికి గురైంది. మహిళా వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత గాల్లో దీపమంటూ దేశవ్యాప్తంగా వైద్య లోకం రోడ్డెక్కడంతో సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు చర్యలపై మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించింది.

చదరంగంలో యువరాజు

18 ఏళ్ల గుకేశ్ దొమ్మరాజు చదరంగంలో భారత పతాకను సమున్నతంగా ఎగరేశాడు. ఏడేళ్ల వయసు నుంచే గళ్లపై తిరుగులేని పట్టు సాధించిన ఈ సంచలనం తాజాగా ప్రపంచ వేదికపై డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్‌ను మట్టికరిపించి ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్



రుధిర దారులు

రహదారులు రక్తమోడుతున్నాయి. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, రోడ్లను విస్తరించకపోవడం తదితర కారణాలతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. -8లో



మూడు గంటల ముచ్చట

నగర ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డారు. దైనందిన జీవితంలో ఫోన్ కూడా ఒక భాగమైపోయింది. 24 గంటలూ మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.0/18.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ట్రాఫిక్, డ్రైనేజీ సమస్యలకు సమగ్ర పరిష్కారం: ఇలంబర్తి

సాక్షి, సిటీబ్యూరో: పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ, డ్రైనేజీ నిర్వహణ వంటి సవాళ్లను అత్యాధునిక సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటుకు జీహెచ్ఎంసీ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, ఎన్ఐటీ- వరంగల్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం సహకారం తీసుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది. ప్రణాళికల స్థాయిలోనే ఆధునికమైన ప్రాక్టికల్ సస్టైనబుల్ పరిష్కారం అందించేందుకు ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు. నగరంలో పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, రవాణా సమస్యలను పరిష్కారం చూపిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. డ్రైనేజీ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ హైదరాబాద్ మొత్తం డ్రైనేజీ నెట్‌వర్క్‌పై సమగ్ర అధ్యయనాన్ని చేపడుతుందని వివరించారు. సమగ్ర అంచనాలతో వరదలను తగ్గించడానికి, డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచడానికి సాంకేతిక పరిష్కారాలను సూచించేందుకు ఈ కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ప్రసాద్ నొక్కి చెప్పారు. వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ ప్రసాద్, ప్రాజెక్టు సీఈ దేవానంద్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుక్‌ఫెయిర్‌లో సందర్శకుల కిటకిట

సు'గ్రంథ' పరిమళం!

ఆబాల గోపాలం.. ఏమి ఆ ఉత్సాహం.. ఏమిటి ఆ సంబరం. చిత్తమంతా పొత్తంపైనే. 'గ్రంథ'ర్వ లోకాన్ని సందర్శించేందుకు.. సు'గ్రంథ' పరిమళాలను అఘ్రాణించేందుకు.. పుస్తక నేస్తాన్ని ఆత్మీయంగా స్పృశించేందుకు వేలాది మంది పరుగు పరుగున తరలివచ్చారు. పుస్తకాల ఆవిష్కరణలు, సాహితీ చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలతో పది రోజుల పాటు బుక్‌ఫెయిర్ సందడిగా సాగింది. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 19న ప్రారంభమైన హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారం ముగిసింది. చివరిరోజు సెలవు కావడంతో సందర్శకుల రాక జన ప్రవాహాన్ని తలపించింది. ఈ ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. వచ్చే సంవత్సరం మళ్లీ కలుద్దామంటూ పుస్తక మహోత్సవానికి బైబై చెప్పారు.

మద్యం మత్తులో కారు నడిపి..

జూబ్లీహిల్స్‌లో యువకుడి హల్‌చల్



డివైడర్ పైకెక్కిన బెంజ్ కారు

బంజారాహిల్స్: ఓ యువకుడు మద్యం మత్తులో కారు నడిపి మితిమీరిన వేగంతో చెట్టుకు, డివైడర్‌కు ఢీకొట్టిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. వెస్ట్ మారేడ్‌పల్లి సుమన్ హౌసింగ్ కాలనీలో నివసించే తీగుళ్ల దయాసాయిరాజ్ (27) రైల్వే ఆఫీసర్స్ కాలనీలో నివసించే తన స్నేహితురాలు (27)తో కలిసి శనివారం రాత్రి ఫిలింనగర్ సమీపంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఓ విందుకు హాజరయ్యాడు. ఇద్దరూ ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటల వరకు ఆ విందులో పాల్గొని మద్యం తాగారు. దయాసాయిరాజ్ మోతాదుకు మించి మద్యం తాగి ఇంటికి వెళ్లే క్రమంలో తన స్నేహితురాలిని తీసుకుని అర్ధరాత్రి 2.30 గంటలకు ఫంక్షన్ హాల్ నుంచి బెంజ్ కారు బయలుదేరాడు. సినీ నటుడు బాలకృష్ణ ఇంటి వద్దకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను, ఆ తర్వాత చెట్టును ఢీకొని రోడ్డుకు అవతల వైపు బోల్తాపడింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. చెట్టు విరిగిపడి డివైడర్ ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వీరిద్దరినీ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఉదయం 3 గంటలకు స్టేషన్‌కు తీసుకువచ్చిన వీరిద్దరినీ డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌కు యత్నించగా వీరు సహకరించలేదు. 3 గంటల పాటు పోలీసులను దూషిస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఠాణాలో న్యూసెన్స్ చేశారు. మద్యం మత్తులో స్టేషన్‌లో ఇద్దరూ వీరంగం సృష్టించారు. ఎట్టకేలకు వీరికి శ్వాస పరీక్షలు నిర్వహించగా దయాసాయిరాజ్‌కు 94 ఎంజీ, యువతికి 73 ఎంజీ రక్తంలో ఆల్కహాలిక్ నమోదైంది. వీరిద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. హత్యాయత్నం కింద సెక్షన్ విధించి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

ఫిలింనగర్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

ముగ్గురి రిమాండ్.


ఫిలింనగర్: నూతన సంవత్సర వేడుకల వేళ ఫిలింనగర్‌లో పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్స్‌తో పాటు ఓ కొనుగోలుదారును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. షేక్‌పేటలోని ఫాల్కన్ కాలనీలో నివసించే ఎండీ అబ్దుల్ ఇర్ఫాన్ కారు డీలర్‌గా పని చేస్తున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారి షేక్ మహ్మద్ రెహమాన్ అలీ న్యూ ఇయర్ వేడుకలకు అవసరమైన వారికి డ్రగ్స్ విక్రయించేందుకు ముంబై నుంచి ఇటీవలే ఎండీఎంఏ డ్రగ్స్‌ను నగరానికి తీసుకువచ్చాడు. ఇర్ఫాన్‌తో కలిసి నాలుగు రోజుల పాటు డ్రగ్స్ విక్రయించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగానే ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్దకు రెహమాన్ అలీ చేరుకుని మరో పెడ్లర్ ఇర్ఫాన్‌ను అక్కడికి పిలిపించాడు. అవసరమైన వారికి సరుకును విక్రయించే క్రమంలో బహదూర్‌పురాకు చెందిన సయ్యద్ హజ్మతుల్లాను పిలిపించారు. కొత్త చెరువు వద్ద వీరిద్దరూ కలిసి హజ్మతుల్లాకు డ్రగ్స్ ఇచ్చే క్రమంలో అప్పటికే సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని వీరి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. రెహమాన్ అలీ ఇటీవలే డ్రగ్స్‌ను ముంబై నుంచి తీసుకు వచ్చినట్లుగా తేల్చారు. ఇర్ఫాన్‌తో కలిసి డ్రగ్స్‌ను విక్రయించాలని పథకం వేసినట్లుగా పోలీసులు గుర్తించారు. కొనుగోలు చేయడానికి వచ్చిన హజ్మతుల్లాతో పాటు వీరిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి పెద్ద ఎత్తున ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిటీ పోలీసులు ఇక

డ్రోనాచార్యులు!

సొంతంగా డ్రోన్ల సమీకరణకు కొత్వాల్ నిర్ణయం

- నిర్వహణ కోసం ప్రత్యేక విభాగం సైతం ఏర్పాటు
- ట్రాఫిక్, శాంతిభద్రతల పర్యవేక్షణకు వినియోగం



సాక్షి, సిటీబ్యూరో: టార్గెట్-2025లో భాగంగా నగర పోలీసు విభాగం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగానికి అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా డ్రోన్లు సమీకరించుకుని వాటి సహాయంతో ట్రాఫిక్, శాంతిభద్రతల్ని పర్యవేక్షించాలని కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. అద్దె డ్రోన్లతో ఇప్పటికే చేపట్టిన ప్రయోగాత్మక పరిశీలన సంతృప్తికర ఫలితాలు ఇవ్వడంతో సొంతంగా ఖరీదు చేయాలని నిర్ణయించారు. దీంతో త్వరలో తొలి దఫా గరిష్ఠంగా పదింటిని ఖరీదు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్టార్టప్ సంస్థ నుంచి వీటిని ఖరీదు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. డ్రోన్ సేవలు శాంతిభద్రతల కంటే ట్రాఫిక్ విభాగంలోనే ఎక్కువ ఉపయుక్తం కానున్నాయి.

ఆయా ప్రాంతాల్లో తిప్పలెన్నో..

సిటీలోని రోడ్లపై ట్రాఫిక్ ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఉదయం- సాయంత్రం పీక్ అవర్స్‌గా పిలిచే రద్దీ వేళల్లో భారీ రద్దీ ఉంటుంది. ఈ సమయాల్లో అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్స్ కూడా ఏర్పడుతుంటాయి. వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇవి మరింత ఎక్కువ. ఆయా ప్రాంతాల్లోని అక్రమ పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, బాటిల్ నెక్స్ కారణంగా ఈ ఇబ్బందులు మరింత పెరుగుతుంటాయి. వీటిని నిరోధించడానికి ప్రస్తుతం స్థానిక ట్రాఫిక్ పోలీసులు ద్విచక్ర వాహనాలతో పాటు తేలికపాటి వాహనాలపైనా గస్తీ నిర్వహిస్తుంటారు. ట్రాఫిక్‌కు అడ్డంకులు సృష్టించే వాటిని గుర్తించి సరి చేస్తుంటారు. దీనికోసం పెద్ద సంఖ్యలో ట్రాఫిక్ పోలీసులు, హోంగార్డులను వినియోగించాల్సి వస్తోంది. ఆపరేషన్ రోప్- 2లో డ్రోన్లు కీలకం కానున్నాయి.

టీసీసీసీతో అనుసంధానం.. వినియోగం..

నగర పోలీసు విభాగంలో డ్రోన్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఓ డ్రోన్ వింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ డ్రోన్లను బషీర్‌బాగ్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో (టీసీసీసీ) అనుసంధానిస్తారు. వీటి నిర్వహణ డ్రోన్ కెమెరాల్లో కనిపించే దృశ్యాలను ఇక్కడి సిబ్బంది అనునిత్యం పరిశీలిస్తూ ఉంటారు. వీళ్లు గమనించిన అంశాల ఆధారంగా రహదారిపై అవసరమైన ప్రాంతానికి క్షేత్ర స్థాయి సిబ్బందిని పంపిస్తారు. డ్రోన్ కెమెరా అందించిన విజువల్స్ ఆధారంగా ఇతర విభాగాలను అప్రమత్తం చేయనున్నారు. ప్రస్తుతం సిటీలో ఉన్న సీసీ కెమెరాలు సైతం ఈ సెంటర్‌తోనే అనుసంధానించి ఉన్నాయి. ఇప్పుడు డ్రోన్ కెమెరాలను అనుసంధానిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. గరిష్ఠంగా రెండు నెలల్లో నగర పోలీసు విభాగంలో డ్రోన్లు సేవలు అందించనున్నాయి.

ప్రముఖుల పర్యటనల నేపథ్యంలోనూ..

రాజధాని నగరంలో అనునిత్యం ప్రముఖుల పర్యటనలు సాగుతుంటాయి. రాష్ట్రంలో ఉన్న వీవీఐపీలతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ఏటా వందల సంఖ్యలో ముఖ్యులు వస్తుంటారు. వీరి రాకపోకల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ పోలీసులు ఆయా మార్గాల్లో మళ్లింపులు విధించడంతో పాటు గస్తీ నిర్వహించడం పరిపాటి. కీలక సభలు, సమావేశాలతో పాటు గణేష్, బోనాలు వంటి పండుగలు, ఉత్సవాల సమయంలోనూ రహదారులపై ట్రాఫిక్ పోలీసులు కదలికలు ఎక్కువగా ఉంటేనే సామాన్యులకు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఉంటాయి. ప్రస్తుతం ఈ విధులను స్థానిక ట్రాఫిక్ ఠాణాలకు చెందిన సిబ్బంది రోడ్లపై సంచరిస్తూ నిర్వర్తిస్తున్నారు. పండగులు, బహిరంగ సభలు, ఉత్సవాలు, నిరసనల సందర్భంలో ట్రాఫిక్‌తో పాటు శాంతిభద్రతల నిర్వహణ కోసమూ డ్రోన్లు వినియోగించనున్నారు.

గగనతలం నుంచి గస్తీతో సత్ఫలితాలు..

రహదారులపై పెట్రోలింగ్ చేయడంలో ట్రాఫిక్ పోలీసులకు కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. ఒక్కో బృందం ఒక సమయంలో కేవలం ఓ రహదారిపై మాత్రమే పని చేయగలుగుతోంది. దాన్ని క్లియర్ చేసిన పోలీసులు మరో చోటుకు వెళ్లేసరికి ఇక్కడ మళ్లీ అడ్డంకులు వచ్చిపడుతున్నాయి. దీనికి పరిష్కారంగా గగనతల గస్తీ నిర్వహణకు డ్రోన్లు ఖరీదు చేస్తున్నారు. రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, అనుకోకుండా తలెత్తే నిరసనల సందర్భంలోనూ వీటిని వినియోగించనున్నారు. రాష్ట్రానికి చెందిన స్టార్టప్స్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఉన్న పోలీసులు ఈ డ్రోన్లను ప్రభుత్వ గుర్తింపు పొందిన దాని నుంచి ఖరీదు చేయాలని యోచిస్తున్నారు. ఇప్పటికే గణేష్ నిమజ్జనం సహా పలు సందర్భాల్లో అద్దె డ్రోన్లను ప్రయోగాత్మకంగా వాడి చూశారు. ఇవి సత్ఫలితాలను ఇవ్వడంతో ముందుకు వెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఓల్డ్ స్టోరేజీ!

- గ్రేటర్‌లో అందుబాటు లేని కోల్డ్ స్టోరేజీలు
- డిమాండ్- సప్లయ్‌లను సరి చేయడంలో విఫలం
- రైతులు, వినియోగదారులను దగా చేస్తున్న కమీషన్ ఏజెంట్లు
- నగరంలో కూరగాయల మార్కెట్లపై 'సాక్షి' ఫోకస్

పురాతన పద్ధతుల్లోనే కూరగాయల మార్కెట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మార్కెట్‌లు ఆధునీకరణ.. కోల్డ్ స్టోరేజీ సదుపాయం లేక నీరుగారిపోతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి నగరానికి తరలిస్తున్న కూరగాయలు, ఆకుకూరలను రైతులు సంప్రదాయ పద్ధతుల్లోనే విక్రయిస్తున్నారు. ఇక్కడే దళారులు.. కమీషన్ ఏజెంట్లు ఇటు రైతులను.. అటు వినియోగదారులను దగా చేస్తున్నారు. సీజన్‌లో అధిక దిగుబడుల వచ్చే కూరగాయాలను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు లేకపోవడం శాపంగా పరిణమిస్తోంది.

ఆరుగాలం శ్రమిస్తే.. మిగిలేది కన్నీళ్లే..

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన కూరగాయలను అమ్ముకుందామని నగర మార్కెట్‌కు తీసుకవస్తే.. దళారులు కుమ్మక్కై తక్కువ ధరకే కొట్టేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం కనీసం కోల్డ్ స్టోరేజీలనైనా నిర్మిస్తే అందులో దాచుకుని ధర వచ్చిన రోజు అమ్ముకుందామంటే ఆ అవకాశం లేదు. దీంతో అటు పండించే రైతు ఇటు నగర వినియోగదారు ఇద్దరూ మోసపోతున్నారు. ఇక చేసేది లేక రైతు కన్నీళ్లను దిగమింగుకుని వచ్చిన ధరకే అమ్ముకుంటే వినియోగదారులు గత్యంతరం లేక ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో మోసపోయేది రైతు అయితే.. లాభపడేది మాత్రం దళారీయే. సరిదిద్దాల్సిన ప్రభుత్వానికి అసలు రైతుల ఉనికే గిట్టడం లేదు. ఇక గిట్టుబాటు ధర ఆశించడం అంటే అత్యాశే అవుతుంది.

కోల్డ్ స్టోరేజీల ఊసేలేదు..

గ్రేటర్ పరిధిలో సీజన్‌లో ఎక్కువ మోతాదులో కూరగాయలు, దుంపలు, ఆకుకూరలు మార్కెట్‌కు రైతులు తీసుకొస్తే ప్రభుత్వం కొనుగోలు చేసి వాటిని భద్రపర్చడానికి కోల్డ్ స్టోరేజీ లేకుండాపోయింది. దీంతో కూరగాయలు పండించే రైతుల కష్టాలు అన్నీఇన్నీ కావు. వర్షా కాలంలో విత్తనాలు నాటిన రైతు శీతాకాలంలో పండించిన పంట మార్కెట్‌కు తీసుకు వస్తాడు. అప్పటికే మార్కెట్‌లో ఎక్కువ మోతాదులో కూరగాయలు ఉంటాయి. వాటిని నిలువ చేయలేదు. ఒకటి రెండు రోజులు నిలువ చేస్తే కూరగాయలు పాడైపోతాయని తక్కువ ధర వచ్చినా రైతులు అమ్ముకుంటున్నారు.

కూరగాయల డిమాండ్ ఇలా..

- మహా నగర జనాభా సుమారు కోటిన్నర ఉండవచ్చని అంచనా. వీరు ప్రతి రోజు దాదాపు 3500 వేల టన్నుల వివిధ రకాల కూరగాయలు వినియోగిస్తున్నారు. నగరవాసులు 60 శాతం కూరగాయల అవసరాలను అన్ సీజన్‌లో రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ జిల్లాల రైతులు పండించే పంటలు తీరుస్తున్నాయి. మరో 30 శాతం అవసరాలు ఏపీలోని రాయసీమ జిల్లాలైన కర్నూలు, చిత్తూరు, అనంతపురం రైతులు పండించే పంటలతో.. మిగతా 10 శాతం కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ నుంచి వచ్చే దిగుబడులతో పూర్తవుతున్నాయి.



- ఎన్నో ఏళ్లుగా నగర ప్రజల కూరగాయల అవసరాలు ఇలాగే పూర్తి అవుతున్నాయి. సీజన్‌లో కూరగాయలు ఎక్కువ మోతాదులో మార్కెట్‌కు వస్తే ప్రభుత్వం కొనుగోలు చేసి ధర హెచ్చు తగ్గులను నియంత్రించే విధానం లేదు. దీంతో ఎక్కువ కూరగాయలు పండించిన రైతు ఏజెంట్లు నిర్ధారించిన రేట్లకు విక్రయించి నష్టపోతున్నారు. మరోవైపు ధర నిర్ధారణ అనేది ఏజెంట్ల ద్వారా జరుగుతోంది. ప్రతి మార్కెట్‌లో ఏజెంట్లు సిండికేట్‌గా మారి తమకు అనువైన ధరలను నిర్ధారిస్తున్నారు. దీంతో సీజన్‌లో రైతు లాభపడాల్సిందిపోయి నష్ట పోతున్నాడు. సీజన్‌లో ఎక్కువ మోతాదులో కూరగాయలు దిగుమతి అయితే వాటిని భద్రపర్చడానికి గ్రేటర్ పరిధిలో ఒక్క కోల్డ్‌స్టోరేజీ అందుబాటులో లేకపోవడం శోచనీయం.

జాడలేని ప్రత్యామ్నాయం..

సీజన్‌లో కూరగాయలు ఎక్కువ దిగుబడి అయితే వాటిని నిలువ చేసి అన్‌సీజన్‌లో ధరలు నిలకడగా ఉంచడానికి మార్కెటింగ్, హార్టికల్చర్ శాఖ వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. మార్కెటింగ్ శాఖ ద్వారా కూరగాయల రేట్ల నిర్ధారణ కూడా లేదు. అన్ సీజన్‌లో మార్కెటింగ్ శాఖ ద్వారా కాకుండా ఏజెంట్లు రాష్ట్రంలో నుంచి అందుబాటులో లేని కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమది చేస్తారు. వివిధ మార్కెట్‌ల్లో ఉన్న సొసైటీలు కమిషన్ ఏజెంట్లు రైతులకు సకాలంలో డబ్బులు అందజేస్తున్నారా.. లేదా ? సకాలంలో డబ్బులు ఇప్పించడం.. ఏజెంట్ల పని తీరుపై దృష్టి పెట్టాలి. వారి అక్రమాలు, మోసాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నుమాయిష్ టికెట్ ధర పెంపు

- రూ.40 నుంచి రూ.50కి పెరగనున్న ప్రవేశ రుసుము
- జనవరి 3 నుంచి ఎగ్జిబిషన్
- సుమారు 2 వేల స్టాళ్లు ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన సొసైటీ ప్రతినిధులు

అబిడ్స్: జనవరి 3 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) ప్రవేశ రుసుమును ఈసారి రూ.40 నుంచి రూ.50కి పెంచనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. 2 వేల స్టాళ్లతో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జనవరి 1న ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్‌ను ఈ ఏడాది రెండు రోజులు వాయిదా వేశామని, 3వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు వెల్లడించారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి ఆర్. సురేందర్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ప్రభా శంకర్, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, పబ్లిసిటీ కన్వీనర్లు సురేష్‌కుమార్, సురేష్‌రాజ్‌లు మాట్లాడారు. జనవరి 1న ప్రారంభం కావాల్సిన ఎగ్జిబిషన్‌ను మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల కారణంగా జనవరి 3న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో డబుల్ డెక్కర్ బస్సును మిని ట్రైన్‌తో పాటు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ నలుమూలలా 160 సీసీ కెమెరాలు, 250 మంది వలంటీర్లు, ప్రైవేటు సెక్యూరిటీతో బందోబస్తు పర్యవేక్షిస్తామన్నారు. గోల్డెన్‌జూబ్లీ బ్లాక్ ఎదురుగా భారీ ఎల్ఈడీ స్క్రీన్లను తొలిసారిగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సందర్శకులు, ఇతరులు ఎవరైనా శుభ కార్యక్రమాలు, ఇతర ప్రకటనలు ఇవ్వవచ్చన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం నుంచి రాత్రి 10.30 గంటల వరకు, శని ఆదివారాల్లో రాత్రి 11.30 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. మినీ ట్రైన్ టికెట్ రూ.30, డబుల్ డెక్కర్ టికెట్ రూ.40గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు

కమాండ్ కంట్రోల్, వైఫై టవర్..

మొదటిసారిగా పలు శాఖల అధికారుల కోసం కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎగ్జిబిషన్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం సెల్ ఫోన్ల నెట్‌వర్క్ సమస్య వస్తుండడంతో మొదటిసారిగా వైఫై టవర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నుమాయిష్‌లో సీనియర్ సిటిజన్ల కోసం వీల్ చైర్లను సమకూరుస్తున్నామన్నారు. జనవరి 7వ తేదీన లేడీస్ డే గా, జనవరి 31వ తేదీని చిల్డ్రన్స్ డేగా ప్రకటించినట్లు తెలిపారు. గత సంవత్సరం యశోధ ఆసుపత్రి సహకారంతో ఉచితంగా వైద్య సేవలు అందించామన్నారు. గత ఏడాది నుమాయిష్ నిర్వహణ ద్వారా ప్రభుత్వానికి వివిధ రకాల పన్నుల రూపంలో రూ.66 కోట్ల ఆదాయం సమకూర్చినట్లు వారు వివరించారు. ఈసారి ఎగ్జిబిషన్‌లో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎగ్జిబిషన్ ప్రతినిధులు డాక్టర్ గంగాధర్, హన్మంతరావు, అశ్వినిమార్గం, జీవీ రంగారెడ్డి, ఆదిత్య మార్గం తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం

పురం.. నిశ్శబ్దం!

- జనవరి 26తో ముగియనున్న మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు
- జీహెచ్‌ఎంసీలో విలీనం ఉండబోదని అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన
- అయినప్పటికీ అధికారిక ప్రకటన రాకపోవడంతో వీడని ఉత్కంఠ
- రాజకీయంగా నెలకొన్న స్తబ్దత

తుర్కయంజాల్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం జనవరి 26వ తేదీతో ముగియనుంది. దీంతో యథావిధిగా కొనసాగుతాయా లేక జీహెచ్‌ఎంసీలో విలీనం అవుతాయా అనేది అధికారికంగా తేలాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఔటర్ లోపలి కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయాలని భావించింది. ఈ దిశగా కసరత్తు కూడా కొనసాగించిన విషయం తెలిసిందే. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మొత్తం ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీగా మార్చనున్నామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గ్రేటర్‌ను విడగొట్టి 3, 4 కార్పొరేషన్‌లు చేయడం లేదని చెప్పడంతో కొంత స్పష్టత వచ్చిందని అంతా అనుకుంటున్నారు. అయినప్పటికీ ఇంకా అధికారికంగా ప్రకటించకపోవడంతో అందరిలో ఉత్కంఠ కొనసాగుతోంది.

3 కార్పొరేషన్‌లు, 12 మున్సిపాలిటీలు

జిల్లాలో మీర్‌పేట, బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లు, తుర్కయంజాల్, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట, జల్‌పల్లి, మణికొండ, నార్సింగి, శంషాబాద్, తుక్కుగూడ, ఆమనగల్లు ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉండగా.. ఇబ్రహీంపట్నం, శంకర్‌పల్లి, షాద్‌నగర్ బయట ఉన్నాయి. అన్ని పాలకవర్గాల పదవీకాలం వచ్చేనెల 26తో ముగియనుంది. ఇప్పటికే జిల్లాలోని పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల గడువు ముగియడంతో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఒకవేళ విలీనం లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సైతం ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోలేదు.

కొనసాగుతున్న స్తబ్దత

పదవీకాలం ముగిసే ఆరు నెలల ముందు నుంచే ఆశావహులతో రాజకీయ వాతావరణం వేడెక్కేది. కానీ గ్రేటర్‌లో విలీనం అనే వార్తలు ప్రచారం కావడం.. అధికారులు కూడా దానికి తగ్గట్లుగా గతంలో సంకేతాలు ఇవ్వడంతో పదవీ కాలం ముగుస్తున్నప్పటికీ రాజకీయ వాతావరణం స్తబ్దుగా ఉండిపోయింది. పోటీలో నిలవాలనుకునే వారిలో నిరాశ నిండిపోయింది. మరో వైపు గ్రేటర్ పదవీ కాలం గడువు 5 మే 2026 వరకు ఉండడంతో ఇప్పట్లో ఎన్నికలు ఉండవనే భావన చాలా మందిలో నెలకొంది. విలీనంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకుంటే ఈ స్తబ్దత మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది.

రుధిర దారులు!





ఓఆర్ఆర్‌పై ప్రమాదం ..

రక్తపుటేరులు పారించిన రహదారులు

- ప్రాణాలు కోల్పోయిన వందలాదిమంది
- క్షతగాత్రులుగా మిగిలినవారెందరో..
- కొత్త ఏడాదిలోనైనా రోడ్ల విస్తరణ జరిగేనా?



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రహదారులు రక్తపుటేరులు పారిస్తున్నాయి. వాహనాల రద్దీ మేరకు రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోవడం.. మద్యం తాగి మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతుండటం.. ప్రమాదకరమైన మూల మలుపులే ఇందుకు ప్రధాన కారణం. ఫలితంగా జిల్లాలో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం వెలుగు చూస్తూనే ఉంది. ఎవరో ఒకరు మృత్యువాత పడుతూనే ఉన్నారు. అయినా పాలకుల్లో చలనం మాత్రం కలగడం లేదు. ప్రమాదాలను నియంత్రించే చర్యలు చేపట్టడం లేదు. కొత్త సంవత్సరంలోనైనా రోడ్ల వ్యవస్థ మెరుగుపడుతుందో లేదో వేచి చూడాల్సిందే.

2024లో తీరని విషాదం

విజయవాడ జాతీయ రహదారి ఇటు ఎల్బీనగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం వరకు విస్తరించి ఉంది. బీజాపూర్ జాతీయ రహదారి ఇటు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు విస్తరించి ఉంది. బెంగళూరు జాతీయ రహదారి ఆరాంఘర్ నుంచి షాద్‌నగర్ మండల వరకు విస్తరించి ఉంది. శ్రీశైలం జాతీయ రహదారి చాంద్రాయణగుట్ట నుంచి ఆమనగల్లు మండల శివారు వరకు విస్తరించి ఉంది. నాగార్జునసాగర్ జాతీయ రహదారి ఎల్బీనగర్ నుంచి యాచారం మండల శివారు వరకు విస్తరించి ఉంది. హైదరాబాద్ నగరానికి మణిహారంగా గుర్తింపు పొందిన ఓఆర్ఆర్ ఇటు కోకాపేట నుంచి అటు తారామతిపేట వరకు విస్తరించింది. ఇక పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే సహా ఆర్ అండ్‌బీ, మున్సిపాలిటీ అంతర్గత రోడ్లు అనేకం ఉన్నాయి. ఆయా రహదారులు 2024లో జిల్లాలోని అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చాయి.

2025లోనైనా పనులు ప్రారంభమయ్యేనా?

ప్రమాదాలకు నిలయంగా మారిన బీజాపూర్ జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరణకు 29 ఏప్రిల్ 2022లో అప్పటి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరి శంకుస్థాపన చేశారు. టెండర్ కూడా ఖరారైంది. ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఈ రహదారిపై నిత్యం రక్తపుటేరులు పారుతూనే ఉన్నాయి. ఇటీవల ఆలూరు స్టేజీ వద్ద రోడ్డు వెంట కూరగాయలు అమ్ముకుంటున్న వారిపైకి లారీ దూసుకెళ్లిన ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కేవలం ఈ ఒక్క రోడ్డుపైనే మూడేళ్ల వ్యవధిలో 379 ప్రమాదాలు చోటు చేసుకోగా, సుమారు 400 మంది క్షతగాత్రులయ్యారు. 146 మంది ప్రాణాలు కోల్పోయారు. ఓఆర్ఆర్‌పై అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్క, తమ్ముడు మృతి చెందారు. ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. నూతన సంవత్సరంలోనైనా విస్తరణ పనులు ప్రారంభమవుతాయో వేచి చూడాలి.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	701	735	3,485
2024	624	653	3,003

ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	25	30	62
2024	18	19	58

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రమాదాలు

అంశం	2023		2024	
వాహనాలు	ప్రమాదాలు	మృతులు	ప్రమాదాలు	మృతులు
పాదచారులు	290	299	256	261
సైకిల్	10	10	10	10
మోటార్ సైకిల్	418	444	447	465
ఆటో/ట్రాలీ ఆటో	24	24	30	27
లైట్ మోటార్ వెహికిల్స్	44	57	43	53
హెవీ వెహికిల్స్	26	32	19	26
మొత్తం	812	866	805	842

క్లుప్తంగా

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్య



మహేశ్వరి (ఫైల్)

ఉప్పల్: భర్తతో గొడవపడి మనస్తాపానికి గురై భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..చిలుకానగర్ ప్రాంతంలో నివాసముండే నరేష్, మహేశ్వరి(29) దంపతులు. వీరికి కుమారుడు ఉదయ్(9) ఉన్నాడు. మహేశ్వరి సోదరుడు మహేష్ ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం మహేష్ సోదరి మహేశ్వరి ఇంటికి వచ్చి వెళ్లడంతో భార్యా భర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం నరేష్ కుమారున్ని తీసుకుని బయటకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా..మహేశ్వరి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. తలుపులు బద్దలు కొట్టి తెరిచేసరికి అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరి లింగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోవా నుంచి తెచ్చిన మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వాస్కోడిగామా రైల్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టి 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి వాస్కోడిగామా రైల్లో మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలువురు ప్రయాణికుల వద్ద ఉన్న 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని అంచనా.

ఎయిర్‌లైన్స్ సిబ్బందితో మహిళా ప్రయాణికురాలి గొడవ

శంషాబాద్: విమానంలో సిబ్బందితో గొడవకు దిగిన మహిళా ప్రయాణికురాలిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ మహిళా ప్రయాణికురాలు శనివారం అర్ధరాత్రి ఇండిగో విమానంలో ముంబయికి బయలుదేరడానికి బోర్డింగ్ పూర్తి చేసుకుని విమానంలోకివెళ్లింది. తన సీటు పురుషుల మధ్య ఉందని, మార్చాలంటూ గొడవ చేసింది. సీటు మార్చే అవకాశంలేదని ఎయిర్‌లైన్స్ సిబ్బంది సమాధానం ఇచ్చినా ఊరుకోకుండా వారిపై కేకలు వేయడంతో పాటు వాగ్వాదానికి దిగింది. దీంతో ఇండిగో సిబ్బంది ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఆ సమయంలో మహిళా ప్రయాణికురాలు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

ఆర్గనైజర్, యాజమాన్యంపై కేసు నమోదు

మొయినాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తూ ఆల్కహాల్, హుక్కా వినియోగిస్తున్న ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేశారు. పార్టీ నిర్వహిస్తున్న ఆర్గనైజర్‌తో పాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లిలోని సయీద్ ఫాంహౌస్‌లో శనివారం అర్ధరాత్రి సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ నిర్వహిస్తున్నారు. పార్టీలో ఆల్కహాల్, హుక్కా వినియోగిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీని భగ్నం చేశారు. మద్యం బాటిళ్లు, హుక్కాను స్వాధీనం చేసుకున్నారు. పార్టీ నిర్వహిస్తున్న ఆర్గనైజర్‌తోపాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్లు బంద్

- డిసెంబర్ 31న రాత్రి 10 తర్వాత వాహనాలకు అనుమతి లేదు
- డ్రగ్స్ సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: న్యూ ఇయర్ వేడుకలకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఈసారి కొత్త సంవత్సరాన్ని శాంతి భద్రతల నడుమ జరపాలని తగిన భద్రతా చర్యలు చేపడుతున్నారు. బైక్ రేసులు, అతివేగంతో దూసుకెళ్లే ప్రమాదం పొంచి ఉండటంతో నగరంలోని అన్ని ఫ్లై ఓవర్లు బంద్‌చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో డిసెంబర్ 31న రాత్రి 10 గంటల తర్వాత ద్విచక్ర వాహనాలు, వాణిజ్య వాహనాలకు ఫ్లై ఓవర్ల మీదకు అనుమతి ఉండదు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు మాత్రం తగిన ఆధారాలు చూపిస్తే పీవీఎన్ఆర్ ఫ్లై ఓవర్ మీదికి అనుమతి ఇస్తారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సూచించారు. ఔట్ డోర్ కార్యక్రమాలు జరిగే చోట డీజేలకు అనుమతి లేదన్నారు. ఎటువంటి బాణసంచా కాల్చడానికి వీల్లేదని, ఈవెంట్లలోకి పరిమితికి మించి ప్రేక్షకులను అనుమతించకూడదని ఆయన పేర్కొన్నారు. మహిళలపై ఎటువంటి వేధింపులు జరగకుండా నిరోధించడానికి షీ టీమ్ బృందాలు విధుల్లో ఉంటాయన్నారు. న్యూ ఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి తనిఖీలు చేస్తామని చెప్పారు. నిషేధిత డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

నిర్దేశిత సమయంలోపే మూసేయాలి..


- పబ్‌లు, బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయం లోపు మూసి వేయాలని, మైనర్ యువతకు మద్యం అమ్మే దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని సుధీర్ బాబు హెచ్చరించారు. వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. నగర శివార్లలోని ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు నిబంధనలకు లోబడి ఉండాలని, ఎటువంటి డ్రగ్స్ వినియోగం జరగకూడదని, మహిళలతో అసభ్యకర డాన్స్ ప్రోగ్రామ్స్ నిర్వహించకూడదని, మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రేమించిన యువతిని దూరం చేశారని హత్యకు కుట్ర

ప్రియుడితో పాటు మరో ముగ్గురి రిమాండ్

ఫిలింనగర్: తాను ప్రేమించిన యువతిని దూరం చేశారని కక్ష పెంచుకున్న ఓ యువకుడు..ఆ యువతి సోదరుడిని హత్య చేసేందుకు కుట్ర పన్నాడు. విషయం బయటపడడంతో నిందితుడితో పాటు అందుకు సహకరించిన మరో ముగ్గురిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి సమీపంలోని పారామౌంట్ కాలనీలో నివసించే యాసర్ భామస్ (21) అదే ప్రాంతంలో నివసిస్తున్న యువతిని ప్రేమించాడు. ఇద్దరూ కలిసి ఇటీవల ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వీరిని గుర్తించి ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంకోసారి మాట్లాడుకోవద్దు..కలుసుకోవద్దని హెచ్చరించారు. ఈ క్రమంలో తన నుంచి ప్రియురాలిని దూరం చేశారని కక్ష పెంచుకున్న యాసర్ ఆమె అన్నను హత్య చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తన స్నేహితుడు ముక్తార్‌తో కలిసి హత్యకు పథకం వేశాడు. ఈ విషయం ముక్తార్ మరొకరితో మాట్లాడుతుండగా వీరి స్నేహితులు జైనుస్ అబ్దీన్, అబ్దుల్ హకీంలు విన్నారు. ఈ నెల 27వ తేదీన యువతి సోదరుడిని పిలిపించి రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. నిన్ను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని, చంపకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని హెచ్చరించారు. ఈ విషయాన్ని బాధితుడు తన తండ్రి వాజిద్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో వాజిద్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు యాసర్ భామస్, స్నేహితులు ముక్తార్, జైనుస్ అబ్దీన్, అబ్దుల్ హకీంలపై బీఎన్ఎస్ సెక్షన్ 308 (5), 61 (1) (బీ) కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడులు



హుక్కా పరికరాలతో పట్టుబడ్డ యువకులు

పహాడీషరీఫ్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న హుక్కా సెంటర్‌పై బాలాపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్ రోడ్డులో యాహ్యా అనే వ్యక్తి కొన్నాళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా హుక్కా పార్లర్ కొనసాగిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి యజమాని యాహ్యాతో పాటు మేనేజర్ షోహెబ్, వినియోగదారులు సోఫియన్ బాబా (26), సయ్యద్ మన్సూర్ (20), సయ్యద్ అస్లాం(19), మహ్మద్ నూర్ (19), షేక్ అలీ(22)పై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

రూ.2 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్ కాల్చివేత

సాక్షి, సిటీబ్యూరో: నారాయణగూడ, సికింద్రాబాద్, అమీర్‌పేట్, చార్మినార్ ఎక్సైజ్ స్టేషన్లలో 59 కేసుల్లో పట్టుబడిన వివిధ రకాల డ్రగ్స్, గంజాయిని ఎక్సైజ్ పోలీసులు కాల్చివేశారు. డ్రగ్స్-గంజాయి డిస్పోజల్ అధికారి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ శాస్త్రి ఆదేశాల మేరకు ఏఈఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 240 కేజీల గంజాయి, 496 కేజీల ఎండీఎంఏ, హాష్ ఆయిల్, పాపిస్టా తదితర డ్రగ్స్‌ను దహనం చేశారు. వీటి విలువ రూ.2 కోట్లు ఉంటుందని అంచనా.

యువతి అదృశ్యం



హాజీరా ఫాతిమా(ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్ అన్వర్ హుస్సేన్ చిన్న కుమార్తె హాజీరా ఫాతిమా అలియాస్ సమ్రీన్(20) ఇంటర్ వరకు విద్యనభ్యసించి ఇంట్లోనే ఉంటుంది. ఈ నెల 27వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులతో పాటే నిద్రించిన సమ్రీన్ మరుసటి రోజు 28న నిద్రలేచి చూడగా కనిపించలేదు. ఫాజిల్ అనే యువకుడు సమ్రీన్‌ను తీసుకొని వెళ్లి ఉంటాడన్న అనుమానంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని, 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు తెలిపారు.

వెంకటేశ్వరనగర్‌లో మద్యం పట్టివేత

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వెంకటేశ్వరనగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపుపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వెంకటేశ్వరనగర్‌లో నివసించే రుక్మిణి కొంతకాలంగా బెల్టుషాపు నిర్వహిస్తూ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మద్యం విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. స్థానికంగా మద్యం షాపుల నుంచి మద్యం బాటిళ్ల కొనుగోలు చేస్తూ ఎక్కువ మొత్తానికి అర్ధరాత్రుల్లో విక్రయిస్తున్నట్లుగా తెలుసుకున్న పోలీసులు దాడులు చేసి భారీగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రుక్మిణిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజేఆర్ ట్రోఫీ విజేత సయ్యద్ సీ.సీ ఆగాపూర



గెలిచిన టీంతో విజయారెడ్డి..

పంజగుట్ట: మాజీ సీఎల్పీ నాయకుడు పి.జనార్దన్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎం.ఎస్.మక్తాలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన పీజేఆర్ మెమోరియల్ కప్ డే అండ్ నైట్ క్రికెట్ పోటీలు ముగిసాయి.ఈ పోటీల్లో జంటనగరాల నుంచి మొత్తం 65 టీంలు పాల్గొనగా విన్నర్‌గా సయ్యద్ సీ.సీ (ఆగాపూర) టీం నిలిచింది. వీరికి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి రూ.25వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందించారు. రన్నరప్‌గా ఎన్‌సీసీ (ఎమ్.ఎస్.మక్తా)నిలవగా వారికి ట్రోఫీతోపాటు రూ.10వేల నగదు బహుమతి అందించారు.

నియామకం



శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న వేముల లక్ష్మణ్

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌కు చెందిన వడ్డెర నాయకుడు పల్లపు శ్రీకాంత్ అఖిల భారత వడ్డెర భూవి సంక్షేమ సంఘం జూబ్లీహిల్స్ నియోజకవర్గం యువజన సంఘం అధ్యక్షునిగా నియామకమయ్యాడు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ ఆదివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వడ్డెర కులస్తుల సమస్యలు, హక్కుల కోసం పోరాడతానన్నారు. జాతీయ కార్యదర్శి గింజ శ్రీనివాస్, కార్మిక విభాగం జాతీయ కార్యదర్శి నాగేష్, తెలంగాణ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పార్వతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, ముదిరాజ్ మహాసభ నాయకుడు అనిల్ ముదిరాజ్‌లు శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రహమత్‌నగర్: ఎస్ఆర్ఆర్ పురం సైట్-2 హరిహర అయ్యప్పస్వామి దేవస్థానం 16 వార్షికోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా శనివారం రాత్రి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగించి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ మణికంఠుని ఆశీర్వాదం, భక్తుల సహకారంతో గత పదహారు ఏండ్లుగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కమిటీ సభ్యులు బాలకృష్ణ, విజయ్‌కుమార్, సత్యనారాయణ, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు

లిబర్టీ: బీసీలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బీసీలు అత్యంత దయనీయ జీవితాలను వెళ్లదీస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం సిద్ధించి 75ఏళ్లు దాటినా బీసీల స్థితిగతుల్లో మార్పురావడం లేదన్నారు. బీసీలకు విద్య, వైద్యం ప్రభుత్వం ఉచితం చేసి అందించాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీలు అంటే లెక్కలేదని పదేళ్లలో ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లతోపాటు బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తాగి..ఊగి..పట్టుబడి..!

వెస్ట్‌జోన్ పరిధిలో పట్టుబడ్డ 9760 మంది మందుబాబులు

- ఊచలు లెక్కించిన 318 మంది
- జూబ్లీహిల్స్ పరిధిలో అధికం
- 69 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు

డ్రంకన్ డ్రైవ్‌లో పోలీస్‌స్టేషన్ల వారీగా..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	కేసులు	పరిష్కారం	జైలు శిక్షలు	డ్రైవింగ్ లైసెన్ రద్దు
ఎస్సార్‌నగర్	3464	2883	93	6
జూబ్లీహిల్స్	2458	2283	121	16
బంజారాహిల్స్	1850	1644	8	0
పంజగుట్ట	1988	1695	96	47



డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు..(ఫైల్)



బంజారాహిల్స్: డ్రంకన్ డ్రైవ్‌లో ఈ ఏడాది పెద్ద ఎత్తున మందుబాబులు పట్టుబడగా ఇందులో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలను నడపడమే కాకుండా ఒకటి కంటే మించి రెండు మూడుసార్లు కూడా కొంతమంది పట్టుబడ్డారు. వీరిలో కొంతమంది జైలు ఊచలు లెక్కించక తప్పలేదు. గతేడాదితో పోలిస్తే 2024లో డ్రంకన్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున మందుబాబులు జైలుకు వెళ్లడం జరిగింది. ఈ నేపథ్యంలోనే డ్రైవింగ్ లైసెన్స్‌లను కూడా చాలా మందివి రద్దు చేశారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే ఎస్సార్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది మొత్తం 9760 మంది వేర్వేరు చోట్ల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించి పట్టుబడ్డారు. ఇందులో 8505 మందిని న్యాయస్థానంలో హాజరుపరిచి జరిమానాలు కూడా విధించారు. ఈ నాలుగు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి రెండు మూడుసార్లు పట్టుబడ్డ 318 మంది జైలు శిక్షకు గురయ్యారు. మరో 69 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతివారం రెండు మూడుసార్లు వేర్వేరు చోట్ల డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి వారికి జరిమానాలు కూడా విధించారు. మరికొంతమంది వాహనాలను సీజ్ చేశారు. ఇందులో 99 శాతం మందిని కోర్టులో హాజరుపర్చగా ఇంకా కొంతమందిని హాజరుపర్చాల్సి ఉంది.

గతేడాది (2023) డ్రంకన్ డ్రైవ్ కేసులు ఇలా..

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది డ్రంకన్ డ్రైవ్‌లో జైలు శిక్షలు తగ్గాయి.2023లో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలోని పంజగుట్ట ట్రాఫిక్ పరిధిలో 1715,ఎస్సార్‌నగర్ పరిధిలో 1827, జూబ్లీహిల్స్ పరిధిలో 2185, బంజారాహిల్స్ పరిధిలో 1701 కేసులు నమోదయ్యాయి. ఇందులో మొత్తం 439 మంది జైలు శిక్షకు గురయ్యారు. 56 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దయ్యాయి. గతేడాది ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 148 మంది, పంజాగుట్ట పరిధిలో 144 మంది, జూబ్లీహిల్స్ పరిధిలో 123 మంది, బంజారాహిల్స్ పరిధిలో 24 మంది జైలు ఊచలు లెక్కించారు.

జేఐసీలో న్యూ ఇయర్ వేడుకలకు భారీ ఏర్పాట్లు

జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు



కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు

బంజారాహిల్స్: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలను భారీఎత్తున అత్యంత అట్టహాసంగా నిర్వహిస్తున్నామని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు తెలిపారు. ఈ నెల 31వ తేదీ మంగళవారం రాత్రి 7 గంటల నుంచి ఈస్ట్‌లాన్స్‌లో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఫిలింఫేర్ అవార్డు విన్నర్, ప్రముఖ గాయకుడు సింహ తన పాటలతో ఈ కార్యక్రమంలో ఉర్రూతలూగించనున్నారని వెల్లడించారు. ఇండియన్ ఐడల్ హరిప్రియ, బాలీవుడ్ సింగర్ అంజద్, మాస్ సింగర్ వీణ, జీ సరిగమప సింగర్ శ్రేయ తమ పాటలతో ఆకట్టుకోనున్నారని తెలిపారు. సినీతారలు మాధురి, సుమయ్య బెంగుళూరు, ముంబాయి నుంచి వస్తున్నారని, వీరి ప్రదర్శనలు ఈ వేడుకలకు హైలెట్‌గా నిలవనున్నాయన్నారు. అలాగే నెల్లూరు నటరాజ్ టీమ్ 20 మంది బృందంతో దుమ్మురేపే నృత్యాలతో ఆకట్టుకోనున్నారని పేర్కొన్నారు. ఇంకా చాలామంది తారలు, గాయనీ గాయకులు, డ్యాన్సర్లు తమ ప్రదర్శనలు ఇవ్వనున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 2025కు స్వాగతం పలుకుతూ జూబ్లీహిల్స్ క్లబ్‌లో సభ్యులకు కొత్త అనుభూతులను ఈ కార్యక్రమాల ద్వారా అందించనున్నామన్నారు. వేడుకల కోసం క్లబ్ ఆవరణను రంగురంగుల విద్యుద్దీపాలు, ఆకట్టుకునే వేదికతో, డీజే సౌండ్‌తో రూపొందిస్తున్నామని తెలిపారు.

స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అభిమాన్ గాంధీ

పంజగుట్ట: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరికి మించి పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదన్న జీవోను రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర పోరాట కమిటీ అధ్యక్షుడు అభిమాన్ గాంధీ నాయక్ ధరావత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1995లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చట్టాన్ని తీసుకుని వచ్చాడన్నారు. చట్టాలు చేసే ఎమ్మెల్యేలు, ఎంపీలకు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రభుత్వ నియామకాల్లో లేని నిబంధన కేవలం స్థానిక సంస్థల ఎన్నికలల్లో మాత్రమే ఎందుకు పెట్టారో అర్థం కాలేదన్నారు. ఏ రాష్ట్రంలో, కేంద్రపాలిత ప్రాంతంలో కూడా ఈ నిబంధన లేదని, మనకన్నా జనాభా ఎక్కువ ఉన్న ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో కూడా లేని నిబంధన మనకు ఎందుకని ప్రశ్నించారు. చట్టం చేసిన చంద్రబాబునాయుడే ఇటీవల ఈ చట్టాన్ని రద్దు చేశారని గుర్తు చేశారు. సోమవారం ప్రత్యేక అసెంబ్లీ నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈవిషయంపై జీవో తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై మంత్రులు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో లింగారెడ్డి, పరుషురామ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు



స్వామి వారికి నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం అర్చనలు, హారతులు, తిరుప్పావై సేవాకాలం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి పూజాధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అద్దంకి శశికాంతాచార్యులు ధనుర్మాస పూజలు నిర్వహించారు. శ్రీగోదా రంగనాథ స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి.

క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: క్రైస్తవుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ బీజేఆర్‌నగర్‌లోని పేనూయేలు ప్రార్థనా మందిరంలో ఆదివారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రేమ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవులు పరమ పవిత్రంగా జరుపుకునే క్రిస్మస్ పండుగను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. అనంతరం రెవరెండ్ ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురమి సంజీవరావు, రెవరెండ్ కృపాసన్నిధి, మాలాకీ, మున్సూర్, ఇక్బాల్, షరీఫ్, జేపీ జ్ఞానేశ్వర్,సింగారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదరణ, అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఆరోపణలు'

లిబర్టీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెన్న సదానందు అన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ కనీసం ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా మాట్లాడడాన్ని ఆయన తప్పుపట్టారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గడిచిన కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజాదరణతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దూషణలు మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. అధికారం కోల్పోవడంతో అసహనంతో ఉన్న కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ తన వైఖరి మార్చుకొని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

షోడా దుకాణంలో చోరీ

వెంగళరావునగర్: షోడా దుకాణంలో చోరీ జరిగి వస్తువులు దోచుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... యూసుఫ్‌గూడకు చెందిన జి. శ్రీనివాసరావు లెమన్ షోడా వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాడు. ఈనెల 27న రాత్రి షాపునకు తాళం వేసి ఉదయం వచ్చి చూడగా గ్యాస్ సిలెండర్, స్టాండ్ మాయమైంది. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్‌కు చెందిన ఏ.ఉప్పలయ్య కూరగాయల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాడు. ఈనెల 27న రాత్రి తన వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ

వెంగళరావునగర్: సమాజంలో శాంతిభద్రతలు కాపాడటంలో పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ వర్మ తెలియజేశారు. వెంగళరావునగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమం అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఏదైనా సంఘటన జరిగిన తర్వాత బాధపడే కంటే దానిని ముందుగానే పసిగట్టి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈవ్ టీజింగ్, దొంగతనాలు, రౌడీయిజం, అల్లరిమూకల దౌర్జన్యాలు చోటు చేసుకుంటున్నాయని తెలియగానే తక్షణమే వారిని ఫొటోలు తీసి పోలీసులకు పంపితే మరు నిమిషంలో అక్కడ ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా రానున్న నూతన సంవత్సర వేడుకల్లో అర్ధరాత్రి దాటి ఎవరైనా చిందులు వేసి, ప్రజలకు ఆటంకం కలిగిస్తే కఠినంగా శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కాలనీనేతలు, కాలనీవాసులు పోలీసులకు సహకారాన్ని అందిస్తే వందశాతం శాంతిభద్రతలు పటిష్టంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తొలుత ఆయన కేలండర్ ఆవిష్కరించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు చిలకల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పిహెచ్ఎన్ ప్రసాద్, ఎస్.అర్జున్, కోశాధికారి జి.రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ డి.ధనుంజయరెడ్డి, కె.రాజశేఖర్, రాహుల్ దేవ్, ఎస్.సుబ్బారావు, ఎంబిఆర్ ప్రసాద్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి



ఆందోళన చేస్తున్న మాల సంఘాల నేతలు

ఫిలింనగర్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని మాల వెలుగు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఫిలింనగర్‌లోని కరెంటు ఆఫీసు పక్కన జ్ఞానీ జైల్ సింగ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, తులసీ రాజలింగం, దండు మన్యం, బత్తుల మధుసూదన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ఎర్రగడ్డ, మోతీలాల్‌నగర్, చికోటీ గార్డెన్స్ 11కెవీ ఫీడర్లు జయ గార్డెన్స్, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బీఎస్‌పురికాలనీ, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నటరాజ్‌నగర్, నేతాజీనగర్, పేస్ హాస్పిటల్, గురుమూర్తిలైన్, మోతీలాల్‌నగర్, నెహ్రూనగర్, ఎయిర్‌కార్గో, శ్యామలకుంట, ప్రకాశ్‌నగర్, రాహుల్‌బజాజ్, చికోటీగార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్ హ్యాంగర్స్, శ్రీరామ్‌నగర్ 11కెవీ ఫీడర్లు ఎయిర్‌పోర్ట్, కళ్యాణ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఐసీఐసీఐ బ్యాంక్‌లైన్, భగవంత్‌పుర్, గంగావిహార్‌కాలనీ, శేర్‌ఖాన్‌బస్తీ, రాజీవ్‌నగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని గమనించి సహకరించాలని కోరారు.

ఖైరతాబాద్‌లో...

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో జవహర్‌నగర్, నిమ్స్ సబ్‌స్టేషన్ల మెయింటనెన్స్ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాంధీనగర్ ఏరియా, దేవీచౌక్, మహాత్మానగర్, ఇందిరానగర్, జనప్రియా అబోడ్స్, నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎర్రమంజిల్ ఏరియా, రోడ్‌నెం-1, బాలాపురా బస్తి, ఎర్రమంజిల్ చమన్, పిటి ఏరియా, పంచాయతీరాజ్ ఏరియా, కావలి సాంబశివరావు రెసిడెన్సి, పోస్టాఫీస్ లేన్, జీవీకె మాల్, జవహర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జవహర్‌నగర్ ఏరియా, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియా, గోల్కొండ క్రాస్ రోడ్, గాంధీనగర్ పోస్టాఫీస్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని దీనిని గమనించి సహకరించాలని వారు కోరారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

పంజగుట్ట: భారతదేశానికి ఎనలేని సేవలు అందించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ సిఖ్ యూత్ అసోసియేషన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు జెరావర్ సింగ్, జస్బిర్ సింగ్, హరిజ్యోత్ సింగ్, రిషిపాల్ సింగ్‌లు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు, అనేక ప్రయోగాత్మక పథకాలు అమలు చేసిన మహానుభావుడు మన్మోహన్ సింగ్ అన్నారు. రాష్ట్ర కేబినెట్ ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. కేవలం స్కాలర్‌షిప్స్‌తోనే ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేసిన మహానుభావుని జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో పొందుపర్చాలన్నారు. అఖండ భారత గొప్ప మేధావిగా మన్మోహన్‌సింగ్‌ను గుర్తించాలని వారు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు వారు తెలిపారు.

బంగారు ఆభరణాలు మాయం

వెంగళరావునగర్: హ్యాండ్‌బ్యాగ్‌లో దాచిన బంగారం ఆభరణాలు చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొండాపూర్‌కు చెందిన జె.లక్ష్మి ఈనెల 28న తన బంగారు ఆభరణాలకు మెరుగు పెట్టించుకునేందుకు కొత్తగూడ నుంచి బస్సులో యూసుఫ్‌గూడ బస్తీకి వచ్చింది. అక్కడ తన స్నేహితురాలికి ఆభరణాలను చూపించి తర్వాత వాటిని తిరిగి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుని బస్సు ఎక్కి రహమత్‌నగర్‌లోని నవీన్ జ్యూవెల్ షాపునకు వెళ్లింది. అక్కడ హ్యాండ్‌బ్యాగ్ తెరచి చూడగా అందులో ఉండాల్సిన రూ. 2.70 లక్షలు ఖరీదు చేసే గోల్డ్ చైన్, ముత్యాలహారం కనిపించలేదు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీల చైతన్యంతోనే రాజ్యాధికారం సాధ్యం

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

పంజగుట్ట: గ్రామీణ స్థాయి నుంచి ప్రతీ గడపకు వెళ్లి బీసీలను చైతన్యం చేస్తేనే బీసీల రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ, తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆధిపత్య కులాలవారు బీసీలను రాజ్యాధికారం, డబ్బు ఈ రెండింటికీ దూరం చేసి దేశంలో భయంకరమైన కుట్రను చేశారని దాన్ని బీసీలు అంతా ఐక్యమై తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో ప్రతీ నెల చివరి ఆదివారం బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. బీసీ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు సంగెం సూర్యారావు, బుడబుక్కల సంఘం గౌరవాధ్యక్షుడు బి.విఠల్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన మధుసూదనాచారి మాట్లాడారు. దేశంలో ఉన్న అన్ని అగ్రకులాలవారు చట్టసభల్లోకి వెళితే బీసీల్లో సుమారు 4వేలకు పైగా కులాలు ఉంటే ఇప్పటి వరకు పదుల సంఖ్యలో కులాలు మాత్రమే చట్టసభల్లో అడుగు పెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 119 అసెంబ్లీ సీట్లు ఉంటే బీసీల్లో కేవలం కొన్ని కులాలు మాత్రమే ఎమ్మెల్యేలుగా అవుతున్నారన్నారు. తమిళనాడులో సీట్లు అడిగే స్థాయి నుంచి సీట్లు ఇచ్చేస్థాయికి బీసీలు ఎదగడం ఎంతో సంతోషకరమన్నారు. తాను కూడా చిన్నతనంలో అసెంబ్లీలోకి వెళ్లాలని, కలలు కనేవాడినని కానీ ఎన్‌టీఆర్‌తో అసెంబ్లీకి వెళ్లే అవకాశం, తరువాత ఎమ్మెల్యే అవ్వడం, తెలంగాణ ఏర్పడ్డాక మొదటి స్పీకర్ కావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తాను స్పీకర్‌గా ఉన్నప్పుడు కనీసం జిల్లాలు కూడా దాటని కులాల వారిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి అసెంబ్లీ తదితర ప్రాంతాలను చూపించి తన అభిమానాన్ని చాటుకున్నానని గుర్తుచేశారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్లు బీసీలకే వేసుకుని రాజ్యాధికారం దిశగా ముందుకు పోదామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ యువజన విభాగం అధ్యక్షుడు పి.సతీష్‌సాగర్, ఆకాడపు దేవేందర్, ఉమా,చంద్రశేఖర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, మాధవ్, నరేందర్, నల్లతీగల రాజు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫోటో ఫెస్టివల్
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

హద్దుల నిర్ధారణకు పడిగాపులు ..!

- భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలతో పెరుగుతున్న హద్దుల గొడవలు
- నగర శివారుల్లో పెరుగుతున్న భూసమస్యల దరఖాస్తులు
- సర్వే కోసం తప్పని ఎదురు చూపులు
- సిబ్బంది లేమి... నిర్లక్ష్యంతో నెలల తరబడి నిరీక్షణ

సాక్షి, సిటీబ్యూరో:

భూముల విస్తీర్ణంలో వ్యత్యాసం, హద్దుల గొడవలతో నగర శివారుల్లో తరచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోజురోజుకూ సరి'హద్దు' పంచాయితీలు పెరిగిపోతున్నాయి. రికార్డుల్లో ఉన్న దానికి, క్షేత్ర స్థాయిలో ఉన్న విస్తీర్ణంలో వ్యత్యాసం ఉండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో హద్దులను తేల్చాలని రైతులతో సహా ప్రజల ఫిర్యాదులు అపరిష్కృతంగా దర్శనమిస్తున్నాయి. నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాల్సి ఉండగా..సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

సమస్యలు ఇవే..

ఏళ్ల కిందటి రికార్డులను ఇప్పటికీ నిర్వహిస్తుండటం వివాదాలకు దారి తీస్తున్నాయి. 1955 కంటే ముందు క్షేత్ర స్థాయిలో సర్వే అధికారులు పర్యటించి భూములకు హద్దులు విభజించారు. కొన్ని చోట్ల సేత్వార్ ఆధారంగా భూములు విస్తీర్ణంలో వ్యత్యాసం కనిపిస్తోంది. ఉదాహరణకు ఒక సర్వే నంబరులో మోకాపై 30 ఎకరాలు ఉంటే సేత్వార్‌లో 28 ఎకరాలు నమోదు కావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. హద్దు రాళ్లు తొలగిపోవడంతో ఒకరి భూమిలో మరొకరు కబ్జాలోకి వస్తున్నారు. ఒక సర్వే నంబర్ ఒక గ్రామం, బస్తీలో ఉంటే.. మరో గ్రామంలో కూడా కనిపిస్తుండటంతో వివాదాలు తలెత్తుతున్నాయి.



సర్వే కోసం ఎదురుచూపులు

భూ సరిహద్దుల సమస్యలపై రైతులు, ప్రజలు మీసేవల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. నగర శివారు జిల్లాల్లో హద్దుల సర్వేలో జాప్యం నెలకొంటోంది. ఆధారాలు లేకపోవడం, ఇతర కారణాలతో పలు దరఖాస్తులను తిరస్కరిస్తుండగా... మరో కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. నగర శివారుల్లో 42 మండలాలుండగా 39 మంది సర్వేయర్లు విధులు నిర్వహిస్తున్నారు. నిజాం నాటి నక్షా (పటాలు)లు పాతబడిపోయి కనిపించకపోవడంతో సర్వేకు కొంత విఘాతం కలుగుతోంది. నెలల తరబడి సర్వే చేయకపోవడంతో ప్రజావాణికి ఫిర్యాదులు పెరుగుతున్నాయి.

జాప్యంతో తగాదాలు

- భూసర్వేలో నెలకొంటున్న జాప్యంతో భూవివాదాలు పెరుగుతున్నాయి. సర్వేయర్లు సకాలంలో స్పందిస్తే భూవివాదాలు తగ్గగలవని దరఖాస్తుదారులు పేర్కొంటున్నప్పటికీ సిబ్బంది కొరత కారణంగా చూపుతున్నారు. దీంతో ఇరు వర్గాలు, పలు సంస్థలు, వ్యవసాయ భూములు, ప్రైవేట్ ,ప్రభుత్వ భూయాజమానుల మధ్య భూసరిహద్దు వివాదాలు మరింత ముదురుతున్నాయన్న విమర్శలు లేకపోలేదు. గ్రామాలు, బస్తీల్లో భూవివాదాలు సకాలంలో పరిష్కారం కాక పోవటంతో... పోలీసు కేసులు, కొట్లాటల వరకు వెళ్లుతున్నారు. మరోపక్క మండల, డివిజన్ రెవెన్యూ కార్యాయాలతోసహా జిల్లా ల్యాండ్ సర్వే శాఖలో ప్రతీ రోజు భూసర్వే దరఖాస్తులు వందలాదిగా పేరుక పోవటంతో తలకు మించిన భారమవుతోంది.
- నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల్లోని మండల, డివిజన్, జిల్లా రెవెన్యూ కార్యాలయాలతోసహా ల్యాండ్ సర్వే శాఖలో చాలా కాలంగా ఖాళీగా ఉన్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు, సర్వేయర్ల పోస్టులు భర్తీకి నోచుకొనకపోవటంతో భూ సరిహద్దు వివాదాలు పెరుగుతున్నాయి. శివారు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో సత్వర సమాచారం నిమిత్తం ప్రైవేట్ లైసెన్సుడ్ సర్వేర్లతో భూసర్వే చేపట్టటం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది.

కష్టంగా పరిష్కారం...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18 మంది సర్వేయర్లు, నలుగురు డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు ఉన్నప్పటికీ భూ సరిహద్దు వివాదాలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఘట్‌కేసర్, బాలానగర్, శామీర్‌పేట, కీసర, మేడ్చల్ ,ఉప్పల్, కాప్రా,మేడిపల్లి, కూకట్‌పల్లి దుండిగల్ తదితర మండలాలతోసహా పలు మున్సిపాలిటీలు, బస్తీల్లోని భూ సరిహద్దు వివాదాలు దీనికి తార్కాణంగా పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లోని భూ సరిహద్దు వివాదాలు ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి మండలంలో భూవివాదాలకు సంబంధించిన దరఖాస్తులు 30నుంచి 40 చొప్పున జిల్లాలోని 15 మండలాల పరిధిలో 600 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రతీ నెలా జిల్లా వ్యాప్తంగా 235 నుంచి 350 పైగా దరఖాస్తులు భూసర్వే కోసం అదనంగా వస్తున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇది సెల్‌ఫోన్ కాలం.. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలి..

ఎంపీ ఈటల రాజేందర్

సనత్‌నగర్: విజయ్ ఆర్ట్స్ అకాడమీ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. గత 30 ఏళ్లుగా పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలనే సంకల్పం, వాళ్లను ముందుకు నడిపించాలనే భావనతో పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా పెయింటింగ్స్, వ్యాసరచన, వక్తృత్వ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. పాత కాలంలో టీవీలు, రేడియోలు మాత్రమే ఉండేవని, ఇప్పుడంతా సెల్‌ఫోన్ల కాలం అన్నారు. పిల్లలు ఏడిస్తే తల్లిదండ్రులు సెల్‌ఫోన్ ఇచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. ఫోన్ చేతిలో ఉంటే అమ్మానాన్నలతో మాట్లాడకుండా సెల్‌ఫోన్‌లోనే ఆడుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇవాళ జరుగుతున్న అనేక చూడకూడని, వినకూడని సంఘటనలు చూస్తున్నామన్నారు. పిల్లలు ఎలా చెడిపోతున్నారో మనం చూస్తూనే ఉన్నామన్నారు. ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అనునిత్యం అనేక సమస్యల వలయంలో చిక్కుకున్న మనుషులకు మానసిక ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చేవి కళలు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్టు తెలకపల్లి రవి, జేఎన్టీయూ మాజీ రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, పొలిటికల్ కార్టూనిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డుల ప్రదానోత్సవంలో ఎంపీ ఈటల



సౌత్ జోన్ క్రికెట్ జట్టుకు ఎంపిక

దుండిగల్: సౌత్ జోన్ ఇంటర్-యూనివర్సిటీ క్రికెట్ సెలక్షన్ ట్రయల్స్‌ను ఆదివారం దుండిగల్‌లోని అరుంధతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఎంఎస్) క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించారు. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెలెక్షన్స్‌లో వివిధ అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఏఐఎంఎస్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అభినందిస్తూ క్రీడల ప్రాధాన్యతను వివరించారు. ఈ సెలక్షన్స్‌లో ఎంపికైన అరుంధతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన మురళీకార్తీక్ (ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం), కుమార్, లక్ష్మినారాయణ (ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం) విద్యార్థులను కళాశాల ఫౌండర్ సెక్రటరీ, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సెలక్షన్‌లో కళాశాల డైరెక్టర్ మర్రి దీరెన్‌రెడ్డి, డీన్ ఉదయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఈట వెంకట్ తదితరులు పాల్గొన్నారు

ఓఆర్ఆర్ టోల్ లీజు అక్రమాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

కాచిగూడ: ఫార్ములా ఈరేస్ మాత్రమే కాదు... ఓఆర్ఆర్ టోల్ లీజు అక్రమాలపై కూడా విచారణ జరపాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ టోల్ లీజు ఐఆర్‌బి ఇన్‌ఫ్రా సంస్థకు 30 ఏళ్ళు కట్టబెట్టడంలో కూడా పెద్ద స్కాం జరిగిందని ఆరోపించారు. ఎలక్టోరోల్ బాండ్ల ద్వారా కోట్ల రూపాయల గోల్‌మాల్ చేసిన బీఆర్ఎస్ నేత, అప్పటి మంత్రి కేటీఆర్‌పై ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు జరిపి చట్టపరమైనచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ ప్రభుత్వంలో అనుమానస్పద క్విడ్ ప్రోకో లావాదేవీలు, ప్రభుత్వ కార్యాలయ దుర్వినియోగం, మౌలిక సదుపాయాల ఒప్పందాలకు సంబంధించి తీవ్రమైన ఆర్థిక అక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అధ్యక్షులు గాలిగల్ల సాయిబాబా, బీసీ పొలిటికల్ జేఏసీ నేతలు వెంకటన్న గౌడ్, మహేందర్ నాయుడు, దేవర శివ, గౌతమ్, శంకర్ గౌడ్, పూల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి కుమార్

కాచిగూడ: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోడ అనిల్, కార్యదర్శి మన్నే కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.8200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని లేని పక్షంలో విద్యార్థుల సత్తా ఎంటో ప్రభుత్వానికి చూపించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈనెల 28,29 తేదీల్లో రాష్ట్ర కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను వారు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలన్నారు. ఫిబ్రవరి 25,26 తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయి కుమార్, రాజు, రవి, గోపాల్ సింగ్ ఠాకూర్, ఆనంద్ కుమార్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో నూతన కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఎంబీఏ కాలేజీ పూర్వవిద్యార్థుల (ఒకాంబా) నూతన అసోసియేషన్‌ను ప్రకటించారు. ఆదివారం కాలేజీలో జరిగిన పూర్వవిద్యార్థుల సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో ఒకాంబా అధ్యక్షులుగా కొంపల్లి. జోత్స్న, ఉపాధ్యక్షులుగా కె.వంశీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శేఖర్, కోశాధికారిగా డా.మారం శ్రీనివాస్ ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు ప్రొ.వెంకటయ్య, ప్రొ.జహంగీర్ పేర్కొన్నారు.



అపోలోలో మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ



సాక్షి, సిటీబ్యూరో:

జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో ఓ రోగికి అతిక్లిష్టమైన..గుండెకు సంబంధించిన మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. తీవ్రమైన మిట్రల్ రెగర్జిటేషన్‌తో బాధపడుతున్న 40 ఏళ్ల రోగికి డాక్టర్ సంజీవ్ ఖుల్బే ఆధ్వర్యంలోని వైద్యుల బృందం వీఏ ఎక్మో లైఫ్ సపోర్ట్‌తో మొదటిసారిగా సంక్లిష్టమైన మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీని నిర్వహించిందని ఆస్పత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. మిట్రల్ రెగర్జిటేషన్ కారణంగా రోగి శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారగా..వెనో ఆర్టీరియల్ ఎక్మో ప్రయోగించారు.

48 గంటల తర్వాత రోగి ఎక్మోలో ఉన్నప్పుడే నాలుగు గంటల పాటు శ్రమించి ఎంవీ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించామని డాక్టర్ సంజీవ్ ఖుల్బే బృందం తెలిపింది.

ఫిబ్రవరి 3న 'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు' ప్రదర్శన



పార్శిగుట్ట చౌరస్తాలో డప్పులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్: లక్ష డప్పులు .. వెయ్యి గొంతులు పేరిట ఫిబ్రవరి 3న నిర్వహించే భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బోర్ర బిక్షపతి మాదిగ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీహాల్ నుంచి డప్పు మల్లికార్జున్ మాదిగ అధ్వర్యంలో డప్పులతో పార్సిగుట్ట చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీలలోని అన్ని కులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరచారన్నారు. కాని గత దశాబ్దాలుగా ఒక్క కులానికే పరిమితం అయ్యాయని అన్నారు. జనాభా శాతాన్ని మించి రిజర్వేషన్లను పొందడం వల్ల ఒక్క మాల సామాజిక వర్గమే అన్ని రంగాలలో లబ్ధిపొందిందన్నారు.

సొంత జిల్లాలకు పంపించాలి

ఇందిరా పార్కు వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్నా



ఇందిరాపార్కు వద్ద దీక్షలో మాట్లాడుతున్న పడకంటి అజయ్ కుమార్, తదితరులు

కవాడిగూడ: ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్ష హోదాలో తమ న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జీవో 317 డిస్‌లోకేటెడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పడకంటి అజయ్ కుమార్, ఎలగొండ రత్నమాల పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 317ను తీసుకువచ్చిన నాటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, తమ సొంత జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేస్తూ జీవో 317 డిస్‌లోకెటెడ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సత్వర న్యాయపోరాట దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, తమను సొంత జిల్లాలకు పంపాలని డిమాండ్ చేస్తూ పెత్త పెట్టున నినాదాలు చేశారు. దీక్షలో కమిటీ నేతలు జి. రాము, రాపోలు శేఖర్, డి. భగత్‌సింగ్, నరసింహా, సత్యనారాయణ, జెస్సీ రాణి, రవీంద్ర, మురళీధర్, వెంకటశ్రీనివాస్, విజయలక్ష్మి, పాటిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా ఆడిటోరియాలు



ఓయూ ఠాగూర్ ఆడిటోరియం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆడిటోరియాలు, సమావేశ మందిరాలు అలంకార ప్రాయంగా మారాయి. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఠాగూర్ ఆడిటోరియంతో పాటు దూరవిద్యా కేంద్రం, మెకాస్టార్ ఆడిటోరియం (ఐఈటీఈ), ఫ్యాకల్టీ క్లబ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఫంక్షన్ హాల్, ఈసీఈ ఆడిటోరియం, అర్బన్ స్టడీస్ కాన్ఫరెన్స్ హాల్ తదితర సమావేశ మందిరాలను విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులతో పాటు బయటి వ్యక్తులకు, సంస్థలకు అద్దెకు ఇస్తారు. అద్దె రుసుము భారీగా పెంచడంతో ఓయూలో సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అద్దె గతంలో రూ.40 నుంచి 50 వేల వరకు గల ఠాగూర్ ఆడిటోరియం అద్దెను రూ.2 లక్షలకు పెంచారు. ఫ్యాకల్టీ క్లబ్, నాన్‌టీచింగ్ హోం ఫంక్షన్ హాల్స్‌ను ప్రవేటు వ్యక్తులకు లీజ్‌కు ఇవ్వడం వలన ఇష్టం వచ్చినట్లు పెంచారని అధ్యాపకులు, ఉద్యోగులు పేర్కొన్నారు. ఇలా ప్రతి ఆడిటోరియం అద్దెలను వేల రూపాయలకు పెంచడంతో వినియోగదారులు రావడం లేదు. దీంతో ఆడిటోరియాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. కొత్త వీసీ ప్రొ.కుమార్ ఆడిటోరియాల అద్దెను తగ్గించాలని కోరుతున్నారు.

నిమ్స్‌లో రోగులు, సహాయకులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.లక్ష్మీ భాస్కర్

లక్డీకాపూల్ : నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకుల పట్ల సిబ్బంది అనుచిత వైఖరితో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం దిశగా అధికారులు చేపట్టారు. ఇటీవల చోటు చేసుకున్న లింగయ్య ఘటనతో ఆస్పత్రి పరిపాలనా విభాగం ఉలిక్కిపాటుకు గురైంది. ఈ క్రమంలో అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. లక్ష్మీ భాస్కర్ ఆదివారం భద్రతా సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆస్పత్రికి వచ్చే రోగులు, సందర్శకుల విషయంలో భద్రతా సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు పరిమితులు విధిస్తూ భద్రత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు చేశారు. భద్రతా సిబ్బందికి ప్రవర్తనా నియామవళిని విధించడంతో పాటు అవి కార్యరూపంలోకి వచ్చేందుకు కోఆర్డినేటర్లను సైతం ఏర్పాటు చేసింది. నోడల్ అధికారి, కోఆర్డినేటర్లుగా నిమ్స్ మీడియా ఇంచార్జి సత్యాగౌడ్, అసిస్టెంట్ మెడికల్ సూరింటెండెంట్ డాక్టర్ ఎం. చరణ్ రాజ్‌లు ప్రధానంగా ఆస్పత్రికి వచ్చే మీడియా ప్రతినిధులకు సహాయ సహకారాలను అందించనున్నారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరిమేటి రాకేష్, సెక్యూరిటీ అధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్

తెలంగాణ ఆటో డీలర్ అసోసియేషన్ ఏర్పాటు

కాచిగూడ: రాష్ట్రంలో ఆటో డీలర్ల సమస్యల పరిష్కారం కోసం నూతనంగా తెలంగాణ ఆటో డీలర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) చైర్మన్ కౌశల్ సమీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా షేక్ అజీమ్, ప్రధానకార్యదర్శిగా నారీ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ అజీజ్, జాయింట్ సెక్రటరీగా కమిసెట్టి యాదయ్య, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ మోయిన్, సహాయ కార్యదర్శిగా మహ్మద్ ఆయూబ్, అర్గనైజింగ్ సెక్రటరీగా మహ్మద్ ఆసీఫ్, మహ్మద్ రషీద్‌లు ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. ఈ సంఘం కెకెసికి అనుబంధంగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కెకెసి రాష్ట్ర ప్రధాకార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, ఆటో విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

3న కలెక్టరేట్‌ల ముట్టడి విజయవంతం చేయండి



వేముల రామకృష్ణను సత్కరిస్తున్న విద్యార్థి సంఘం నేతలు, తదితరులు

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనవరి 3 న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న జిల్లా కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ పిలుపునిచ్చారు. బీసీ విద్యార్థుల 33 జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశం వేముల రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం కాచిగూడలో జరిగింది. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, పగిళ్ళ సతీష్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణను విద్యార్థి నేతలు గజమాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. రాజ్యసభ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన ఆర్.కృష్ణయ్యను శాలువాతో సత్కరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన మృణాళిని త్యాగరాజన్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ప్రదర్శనలో గణేశస్తుతి, వర్ణం, పదం, తిల్లాన తదితర అంశాలను నిత్యతి, అభినయ, శక్తి, శ్రీనిధి, అదిశ, ఇందుమతి, శ్రీనీతి, నిథాలి, కమ్మి, కనిష్క తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ అస్సాం అసోసియేషన్ ఆధ్వర్యంలో బిహూ డ్యాన్స్, బిహూ సంగీతాన్ని ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

–మాదాపూర్



సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 30, డిసెంబర్, 2024



విజేతకు బహుమతి అందజేస్తున్న జేఐసీ నిర్వాహకులు

గోల్డెన్ తంబోలా..

మెగా ఈవెంట్‌లో కిలో బంగారం గెలుచుకున్న గృహిణి శ్రీదేవి

జేఐసీ వార్షికోత్సవంలో 592 మంది భాగస్వామ్యం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జేఐసీ)లో వార్షిక మెగా బంపర్ తంబోలా 2024 అత్యంత అట్టహాసంగా జరిగింది. ఈ తంబోలాలో కొరిపల్లి శ్రీదేవి అనే గృహిణి విజేతగా నిలిచి కిలో బంగారం (రూ.80 లక్షల విలువ) గెలుచుకున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని సిద్ధార్థ ఫైన్ జ్యువెలర్ స్పాన్సర్ చేసిన ఈ ప్రోగ్రాంలో మొత్తం 592 మంది పాల్గొనగా శ్రీదేవి అందరినీ వెనక్కి నెట్టేసి ఐదో రౌండ్‌లో విజేతగా నిలిచారు. సిద్ధార్థ ఫైన్ జ్యువెలరీ అధినేతలు వేమూరి కృష్ణప్రసాద్, నాగినీ ప్రసాద్, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ ప్రెసిడెంట్ కే సురేందర్‌రెడ్డి, సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు, ట్రెజరర్ కొల్లి రమేష్‌చౌదరి, ఎంటర్‌టైన్‌మెంట్ కన్వీనర్ ఎస్.వెంకటాద్రి విజేతకు బహుమతిని అందజేశారు. ఈ మెగా తంబోలాలో పావుకిలో బంగారం విజేతగా వజీర్ ఉన్నీసా, టాటా నెక్సాన్ కారును గోపాలకృష్ణ, ఎంపీ నాయుడు, టాటా టియాగో ఈవీ కారును వై భాస్కర్‌రావు, నిస్సాన్ మాగ్నెట్ కారును కే సోనియారాజు గెలుచుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇన్‌కమ్ ట్యాక్స్ మాజీ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్ఎస్‌వీ ప్రసాద్ హాజరయ్యారు.



షాక్‌కు గురయ్యా..

మెగా బంపర్ తంబోలా 2024 విజేతగా నిలవడం పట్ల ఎంతో ఆనందంగా ఉంది. మొదట నేను షాక్‌కు గురయ్యాను. ఆశ్చర్యంతో కొద్దిసేపు కిలో బంగారం గెలిచించి నేనేనా.. కాదా? అని ఆశ్చర్యపోయాను. ఇంత పెద్ద బహుమతి రావడం ఇదే మొదటిసారి. ఈ బంగారాన్ని ఎలాంటి నగలు చేయించుకోవాలో డిసైడ్ కావాలి. ఈ తంబోలాను నేనొక్కదానినే ఆడాను. చాలా హ్యాపీగా ఉంది.

– విజేత శ్రీదేవి

ప్రస్తుతం నగరంలో పార్టీ టైమ్ నడుస్తోంది. ప్రీ న్యూఇయర్ బాష్ నుంచి ఆఫ్టర్ నైట్స్ దాకా కొత్త సంవత్సరం వేడుకలు చలిగాలులు కమ్మిన నగరాన్ని సైతం హీటెక్కిస్తోంది. పార్టీస్‌కి అటెండ్ అవడం ఒకెత్తయితే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలవడం మరొకెత్తు. ఈ నేపథ్యంలో పలువురు డిజైనర్ల నుంచి సేకరించిన సూచనల సమాహారం ఇది..

– సాక్షి, సిటీబ్యూరో





ట్రెండీ వేర్.. టేక్ కేర్..

→ న్యూ ఇయర్ వేదికలకు వెళ్లేటప్పుడు.. ధరించిన దుస్తులను ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌గా ఉంటూనే.. సౌకర్యంగానూ ఉండేలా జాగ్రత్తపడాలి. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు

→ షిఫాన్, సిల్క్, సీక్రూ తరహాలో గ్లామరస్ వస్త్రధారణకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు.. వీలున్నంత వరకూ సమూహాలతోనే పార్టీలకు హాజరవడం బెటర్. అలాంటి సందర్భాల్లో ఊరికి దూరంగా ఉన్న రిసార్ట్స్, క్లబ్స్‌ను కాకుండా కాస్త దగ్గరగా ఉన్నవే ఎంచుకోండి.

→ అవుట్ డోర్ ఈవెంట్లకు హాజరయ్యే సందర్భంగా రద్దీ ఎక్కువ ఉండే అవకాశం ఉంది కాబట్టి.. అందుకు తగ్గట్టుగా డ్రెస్ ఎంచుకోవాలి.

→ డ్రెస్సింగ్ ఎంపికలో చలి వాతావరణాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. పార్టీలో పాల్గొని నృత్యాలు చేయడం, డ్రింక్స్ తీసుకోవడం జరిగితే అవే దుస్తులు అసౌకర్యంగా అనిపించవచ్చు కాబట్టి లేయర్స్‌గా దుస్తుల్ని ధరిస్తే మరింత మంచిది.



పార్టీ వేర్.. వేవ్..

వెరైటీ డ్రెస్సింగ్‌తో సిద్ధమవుతున్న సిటీ యూత్

- కొత్త సందడి వేళ కొత్తగా కనిపించేందుకు ఆసక్తి
- జోష్ ఫుల్ ఈవెంట్స్‌లో యాక్సెసరీస్‌దే హవా
- చలిలో హీటెక్కిస్తున్న న్యూ ఇయర్ ప్రిపరేషన్స్
- స్టైలిష్ లుక్‌కి అ'డ్రెస్'గా నిలిచేందుకు డిజైనర్ టిప్స్

పార్టీని బట్టి డ్రెస్సింగ్ ఎంచుకోవడం ఎప్పటి నుంచో నగరంలో కొనసాగుతున్న ట్రెండ్. అయితే ఇది కేవలం ఫ్యామిలీ గెట్ టు గెదర్ లాంటిదైతే.. ఒక రకంగా, ఉర్రూతలూగించే సందడితో ఉంటే.. మరో రకంగా ఆహార్యాన్ని తీర్చిదిద్దుకోండి అంటూ సూచిస్తున్నారు నగరంలోని ప్రముఖ డిజైనర్లు. వీరు అందిస్తున్న మరికొన్ని సూచనలు...

- డ్రెస్సింగ్‌లో స్టైల్స్ ఎలా ఉన్నా విభిన్న రకాల యాక్సెసరీస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. చంకీ బెల్ట్స్, ఫంకీ గాగుల్స్.. ఇలా నైట్ పార్టీకి మరీ ముఖ్యంగా న్యూ ఇయర్ పార్టీకి నప్పేలా ఏదైనా ట్రై చేయవచ్చు.
- మహిళలు ఈవెనింగ్ గౌన్స్‌ను ట్రై చేయవచ్చు. విభిన్న రకాల ఫ్యాన్సీ జ్యువెలరీకి చోటు ఇస్తే బాగుంటుంది.
- రకరకాల హెయిర్‌స్టైల్స్‌తో ప్రయోగాలు చేయడానికి ఇది సరైన సమయం. ముఖ్యంగా డ్రెస్సింగ్ సింపుల్‌గా సరిపెడితే.. ఇది మరింత అవసరం.

అమ్మాయిలకు..

షార్ట్ స్కర్ట్స్, షార్ట్స్, వన్ పీస్ డ్రెస్‌లు బాగా పోష్ లుక్ ఇస్తాయి. టీనేజర్‌లకు వన్‌పీస్ డ్రెస్ బాగుంటుంది. ఫ్లోరల్ ప్రింట్‌లో వన్‌పీస్ డ్రెస్‌లు పర్ఫెక్ట్ పార్టీ కాస్ట్యూమ్‌గా పేర్కొనవచ్చు. ట్యాంక్ టాప్స్, ట్యూబ్ టాప్స్ మంచి లుక్కునిస్తాయి. పొరపాటున కేప్రీస్ వేసుకుంటే ఓల్డ్‌ఫ్యాషన్ అయిపోతుంది జాగ్రత్త. వన్ పీస్ విత్ ట్యూబ్ టాప్ సరికొత్తగా న్యూ లుక్‌తో బాగుంటుంది. చలిగాలికి రక్షణగా ఉలెన్ స్కార్ఫ్స్ బెటర్. లైట్ కలర్ టీ షర్ట్‌కు డార్క్ కలర్ టీ షర్ట్‌కు లైట్‌కలర్ స్కార్ఫ్ ఎంచుకోవాలి.



యువకులకు..

షార్ట్స్ వేసుకోవచ్చు. లుంగీ స్టైల్‌లో వేసుకునే డ్రెస్ కూడా ఫంకీగా ఉండి బావుంటుంది. బ్లాక్, బ్రౌన్ టీషర్ట్‌తో క్యాజువల్ బ్లేజర్. రెడ్, పింక్ కలర్స్ ప్రస్తుతం లేటెస్ట్ ఫ్యాషన్. యువకులు ఇప్పుడు డ్రెస్సింగ్‌లో షేడ్స్ ఎంచుకునేటప్పుడు గోల్డ్ కలర్ కూడా బాగా వినియోగిస్తున్నారు. వైట్ కలర్ టీషర్ట్, రెడ్‌కలర్ జీన్స్, బ్రౌన్ కలర్ క్యాజువల్ బ్లేజర్/ఎల్లో కలర్ బ్లేజర్ కాంబినేషన్‌తో వావ్ అనిపిస్తారు.



జాగ్రత్తలు మరవొద్దు..

- తప్పనిసరై దూరంగా ఉన్న వేడుకకు వెళ్లవలసి వస్తే.. కుటుంబ సమేతంగా, వీలైతే మరికొన్ని ఫ్యామిలీస్‌తో కలిసి వెళ్లడం మంచిది.
- పార్టీ ముగిసిన తర్వాత తిరిగి వచ్చే సమయాన్ని కూడా ముందుగానే నిర్ణయించుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- కొన్ని ఈవెంట్స్ నిర్వాహకులు రాత్రి పూట బస మరుసటి రోజు బ్రంచ్ కూడా కలిపి ప్యాకేజీలు అందిస్తున్నారు. వీలైతే అటువంటిది ఎంచుకోవడం మంచిది.
- కొందరు పికప్‌తో పాటు తిరిగి వెళ్లేటప్పుడు డ్రాప్ చేసేందుకు కూడా వాహన సౌకర్యం కూడా అందిస్తున్నారు. గమనించండి.


అటు సంప్రదాయం.. ఇటు ఆధునికం..

ఓ వైపు సంప్రదాయాన్ని, మరోవైపు ఆధునిక పోకడల్ని మేళవింపుతో పార్టీలకు హాజరవుతూనే హుందాగా కనిపించాలని ఆశించే నగర మహిళలూ ఎక్కువే. పార్టీ సీజన్ పురస్కరించుకుని హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాకల్టీలు అందిస్తున్న సూచనలివే..

- కలంకారీ ప్రింటెడ్ ఫ్యాబ్రిక్‌ని ఎంచుకోవచ్చు. పొడవాటి గౌన్‌కి సిల్క్ దుపట్టా జత చేయడం వల్ల లగ్జరీ లుక్ వస్తుంది. మోడ్రన్, క్లాసిక్ లుక్‌ని మేళవించిన ఈ అవుట్ ఫిట్ నప్పుతుంది.
- ఎంబ్రాయిడరీ అనేది ఒక ఆర్ట్. సరైన పద్ధతిలో రూపొందిన ఎంబ్రాయిడరీ నెట్ లెహెంగా.. ఆకర్షణీయంగా ఒదిగిపోతుంది.
- హ్యాండ్ ఎంబ్రాయిడరీతో ప్రత్యేకంగా రూపొందిన చీర భారతీయ వస్త్ర విశిష్టతకు అద్దం పడుతుంది.
- ఫార్మల్ కుర్తా సెట్స్, పార్టీ ఎత్నిక్ వేర్ కలిసిన కో–ఆర్డ్ సెట్స్ ధరించిన వారి ఫ్యాషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తాయి. ఇవి సాయంత్రపు సందడికి, రోజువారీ యాక్టివిటీస్‌కీ అతికినట్టు సరిపోతాయి.
- సంప్రదాయ బెనారస్ చీరల నుంచి మారి స్టైలిష్ రఫెల్ శారీస్‌ను ఎత్నిక్ వేర్‌కు జత చేయవచ్చు. వీటి ఎత్నిక్ శైలి, ఫ్రిల్డ్ బోర్డర్స్.. ప్రతి మహిళనీ అందంగా స్టైలిష్‌గా చూపించగలవు.

నగర ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటుపడ్డారు. దైనందిన జీవితంలో ఫోన్ కూడా ఒక భాగమైపోయింది. దీంతో మొబైల్ ఫోన్లలో 24 గంటలూ ఇరుక్కుపోయి తమ అభిరుచులకు దూరమవుతున్నారు. ఎంతో విలువైన బంధాలను, అనుబంధాలను దూరం చేసుకుంటూ స్నేహాలను కోల్పోతున్నారు. ఇలాంటి ప్రస్తుత తరుణంలో కొంతమంది యువతీ యువకులు ఇన్‌స్టా వేదికగా 'ఆఫ్‌లైన్ క్లబ్' పేరుతో ఇటీవల ఓ గ్రూపును ఏర్పాటుచేసుకున్నారు. ఈ గ్రూపు సభ్యులు రోజులో మూడు గంటల పాటు గ్యాడ్జెట్లకు దూరంగా ఉండేలా ప్లాన్ చేసుకున్నారు. ఈ క్లబ్‌లో కేవలం యువతీ యువకులే కాకుండా పెద్ద వాళ్లు కూడా చేరి తమ పేర్లను రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం.. – బంజారాహిల్స్

మూడు గంటల ముచ్చట..



- 'ఆఫ్‌లైన్ క్లబ్'పేరుతో వినూత్న కార్యక్రమం
- వారానికి మూడు గంటల పాటు గ్యాడ్జెట్లకు దూరం
- నెలలో తప్పనిసరిగా నాలుగు కార్యక్రమాలు
- 900లకు చేరిన వివిధ రంగాల సభ్యులు
- వారానికో అంశంపై చర్చలు, విశ్లేషణలు

వారంతా యువతీ యువకులు.. వీళ్లు వారంలో ఒకరోజు మూడు గంటల పాటు మొబైల్ ఫోన్లకు స్వస్తి పలుకుతారు.. కొత్త ఆలోచనలను సహచరులతో పంచుకుంటారు.. అభిరుచులను ఒకరి నుంచి ఒకరు పంచుకుంటారు.. ఇష్టమైన కార్యక్రమాల్లో నిమగ్నమవుతారు.. పుస్తకాలు చదివి అందులో సారాంశాన్ని, లోటుపాట్లను, మంచి చెడులను విశ్లేషిస్తారు.. బుక్ రీడింగ్.. ఆథర్‌మీట్, జ్యువెలరీ మేకింగ్..ఇష్టమైన సినిమా.. ఇలా నెలలో నాలుగు సార్లు లైక్ మైండెడ్ పీపుల్స్ (ఒకే రకమైన ఆలోచనలు ఉన్నవారు) ఒక చోట చేరి ముచ్చటించుకుంటారు.. ఆపై ఆడతారు..పాడతారు.

900కు పైగా సభ్యులు..

ఈ క్లబ్‌లో సుమారు 900 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఇందులో వివిధ అభిరుచులకు, ఆలోచనలకు ఆకర్షితులై గ్రూపులుగా ఏర్పడి ప్రతినెలా ఏదో ఒక చోట నాలుగు సార్లు కలుసుకుంటుంటారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, మణికొండ ప్రాంతాల్లో ప్రతివారం ఇన్‌స్టా వేదికగా సమయం, సందర్భం తెలిపేలా పోస్టులు పెట్టుకుని కలుసుకుంటుంటారు. పాత సినిమాలపై విశ్లేషణ చేస్తారు..అలాగే ఎవరైనా కొత్తగా నవలలు రాస్తే.. ఆ నవలను చదివే వారికి ఇచ్చి చదవమని 20 రోజులు సమయం ఇస్తారు. ఆ తర్వాత మరో కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి రచయితతో ముఖాముఖి ఏర్పాటుచేయడమే కాకుండా, ఆ నవలలో తమ అభిప్రాయాలను విశ్లేషిస్తూ నిస్సంకోచంగా వెల్లడిస్తుంటారు.



నెలలో నాలుగు సార్లు..

ఈ గ్రూపులో మెల్లమెల్లగా సభ్యుల సంఖ్య పెరిగింది. ప్రతి నెలా నాలుగు సార్లు కెఫేలలో వీరు కలుసుకోవడమే కాకుండా మూడు గంటల పాటు చర్చలు, విమర్శలు, ప్రతి విమర్శలు, తమలో నైపుణ్యాన్ని వెలికితీస్తారు. తమ అభిప్రాయాలను 10 మందితో పంచుకుంటారు. విశేషమేమిటంటే ఈ మూడు గంటల పాటు మొబైల్ ఫోన్లను పక్కన పెట్టేస్తారు. ఆ సమయంలో ఎటువంటి ఫోన్ కాల్స్ కూడా అటెండ్ చేయరు.



24 ప్రోగ్రామ్స్ చేశాం..

బుక్ ఆఫ్ మంత్, సినిమాలు, పుస్తకాల ఆవిష్కరణ, రీడింగ్ కమ్యూనిటీలలో రచయితలతో ముఖాముఖి, జ్యువెలరీ మేకింగ్ ఇలా పలు రంగాలపై ఇప్పటివరకూ 24 ప్రోగ్రామ్స్ నిర్వహించాం. వీటికి ఎంతో ఆదరణ లభించింది. ఒక్కో వారం ఒక్కో ప్రోగ్రాంతో ముందుకెళ్తున్నాం. ఎక్కడ కలుసుకోవాలో ముందుగా తెలియజేస్తాం. త్వరలోనే స్పోర్ట్స్ కూడా ప్రవేశపెట్టాలని అనుకున్నాం. ఆయా రంగాల్లో అభిరుచి ఉన్నవారు మాత్రమే ఆయా కార్యక్రమాలకు హాజరవుతుంటారు. ఇలా తమకు తెలిసిన థీమ్‌ను ఎంచుకుని నటించే అవకాశాన్ని కల్పిస్తున్నాం. – బిశ్వరూప బారిక్, ఆఫ్‌లైన్ క్లబ్ వ్యవస్థాపకురాలు..



గత జులైలో ప్రారంభం..

కరోనా తర్వాత హైదరాబాద్ రీడ్స్ పేరుతో కొంతమంది యువత ఇన్‌స్టా వేదికగా కేబీఆర్ పార్కు, బొటానికల్ గార్డెన్స్‌లో ప్రతి శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ 2 గంటల పాటు ఒకచోట చేరి తమకిష్టమైన పుస్తకాలను చదివే కార్యక్రమాన్ని చేపట్టారు. కేవలం పుస్తకాలు చదవడమే కాకుండా తమకు ఇష్టమైన వ్యాపకాలను పంచుకుంటే బాగుంటుందని ఆఫ్‌లైన్ క్లబ్ వ్యవస్థాపకురాలు బిశ్వరూప బారిక్‌కు పలువురు సూచించారు. దీంతో ఆమె గత జులైలో ఇన్‌స్టా వేదికగా ఆఫ్‌లైన్ క్లబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనికి చాలామంది ఆకర్షితులయ్యారు. లైక్ మైండెడ్ పీపుల్స్ ఒక చోట చేరి తమ అభిప్రాయాలను, అభిరుచులను పంచుకోవడం ప్రారంభించారు.



సెయిలింగ్ విజేతలుగా తనుజా, దీక్షిత

- సాగర్‌లో ముగిసిన తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ ఛాంపియన్‌షిప్
- ట్రోఫీలు అందజేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్ సాగర్ వేదికగా నాలుగు రోజుల పాటు పోటాపోటీగా కొనసాగిన తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ఉద్భవ్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు అమ్మాయిలు తనుజా కామేశ్వర్, దీక్షిత కొమరవెల్లి పతకాల మోత మోగించారు. చివరి రోజు టోర్నీలో తనుజ మూడు స్వర్ణాలతో హ్యాట్రిక్ సాధించగా, దీక్షిత కొమరవెల్లి ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యంతో అత్యధికంగా నాలుగు పతకాలు కైవసం చేసుకుంది. పోటీల మూడో రోజే విజేతలు తేలిపోవడంతో ఆఖరి రోజు ఆయా స్థానాల్లో ఎలాంటి మార్పు లేకుండా టోర్నీ పూర్తయ్యింది. ట్రోఫీల ప్రధానోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ (ఐఏఎస్) విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ విజేతలను, ఆ విజేతల క్రీడా ప్రయాణానికి కృషి చేస్తున్న తల్లిదండ్రులను అభినందించారు.

సరికొత్త సైబర్ మోసాలు!



ఇది టెక్నాలజీ కాలం.. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకు ప్రతి పని సాంకేతికతతో ముడిపడి ఉంటోంది. అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ప్రపంచమే మన గుప్పిట్లో ఉన్నట్టు..ఇదంతా నాణేనికి ఒక వైపు..సాంకేతికత ఎంతగా పెరిగిందో.. దాని వల్ల ముప్పు అంతే పొంచి ఉంటోంది. ముఖ్యంగా సాంకేతికత ఆధారంగా సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. కళ్లకు కనిపించని సైబర్ నేరగాళ్లు ఎక్కడో కూర్చుని ఇక్కడి మన బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారు. రోజుకో కొత్త తరహా మోసానికి తెరతీస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. 2024 ఒక్క ఏడాదిలోనే తెలంగాణ వాసుల నుంచి సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్ము రూ.1,866.9 కోట్లు అంటేనే ఈ తరహా మోసాల బారిన పడుతున్న వారు ఎంత పెద్ద సంఖ్యలో ఉంటున్నారో అర్థమవుతుంది. ఎంత విద్యాధికులైనా.. విజ్ఞానం ఉన్నా..అత్యాశ, అమాయకత్వం, అవగాహన లోపం లాంటి వాటితో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుపోతున్నారు. మరి ఇలాంటి వారినుంచి తప్పించుకోవాలంటే ఏం చేయాలి? సైబర్ నేరగాళ్లకు మన కష్టార్జితం చిక్కకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అసలు ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్న మోసాలు ఏంటి? నేరగాళ్లు ఎలా మోసం చేస్తున్నారు? ఇలా అనేక కోణాల్లో సైబర్ మోసాలపై పలువురు సైబర్ భద్రత నిపుణులు, పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. విలువైన సూచనలు ఇస్తున్నారు. వీటిపై 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం మీ కోసం..

- సాక్షి, హైదరాబాద్

శ్రీధర్ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఉదయం 8 గంటల సమయంలో ఆయన ఫోన్‌కు వీడియో కాల్ వచ్చింది. పోలీస్ యూనిఫాంలో ఉన్న అవతలి వ్యక్తి.. మేం ముంబై పోలీస్...మీ బ్యాంకు ఖాతాల నుంచి విదేశాల్లోని సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలకు డబ్బులు వెళ్లాయి. మీపై మనీలాండరింగ్ చట్టాల కింద కేసు నమోదైంది. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం. మీరు ఇంకెవరితో ఫోన్‌లు మాట్లాడొద్దు..ఇంటినుంచి బయటికి వెళ్లొద్దు. అని బెదిరిస్తూనే చివరకు మిమ్మల్ని ఈ కేసు నుంచి బయటపడేయాలంటే, మేం చెప్పిన ఖాతాలో డబ్బులు వేయాలి..'అని చెప్పారు. ఆందోళనకు గురైన శ్రీధర్ మరో ఆలోచన లేకుండా వాళ్లు చెప్పిన బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేశారు. అయితే పదేపదే డబ్బులు అడగడంతో ఇది సైబర్ మోసగాళ్ల పనై ఉంటుందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మోసం 1 డిజిటల్ అరెస్టు



డిజిటల్ అరెస్టు అనేది లేనేలేదు

డిజిటల్ అరెస్టు... ఈ మధ్య కాలంలో ఎంతో ఎక్కువగా వింటున్న..జరుగుతున్న సైబర్ మోసం. ఫోన్ నంబర్, పూర్తి పేరు, అడ్రస్ ఇలా మీ వ్యక్తిగత సమాచారాన్ని ఏదో ఒక రూపంలో సేకరిస్తున్న సైబర్ నేరగాళ్లు..అది వాడి మోసానికి తెర తీస్తున్నారు. మన ఫోన్‌లో ముంబై పోలీస్ అనో ఇతర పోలీస్ అనో రావడం, అవతలి వ్యక్తులు పోలీస్ యూనిఫాంలోనే ఉండడం.. మన పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ పక్కాగా చెబుతుండటంతో నిజమైన పోలీసులేనేమో అని భయపడేందుకు అవకాశం ఉంటోంది. నిజానికి డిజిటల్ అరెస్టు అన్నది లేనే లేదు. వారి మాటలు నమ్మితే.. నేరగాళ్లు అసలు కథ మొదలెడతారు.

ఎలా మోసగిస్తారు..? : మనీలాండరింగ్ కేసులో మీపేరుంది.. మీ చిరునామా, ఆధార్, ఫోన్ నంబర్‌తో ఉన్న పార్శిల్‌లో డ్రగ్స్ పట్టుబడ్డాయి. మీ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లకు డబ్బులు పంపారు. మీ ఫోన్ నంబర్‌తో అనుమానితులకు ఫోన్లు వెళుతున్నాయి.. ఇలాంటివి చెబుతూ వీడియో కాల్స్ చేస్తారు.

బెదిరిపోవద్దు..



'డిజిటల్ అరెస్టు సైబర్ మోసంలో.. నేరగాళ్లు మీపై ఏదో ఒక నేరారోపణ చేసి బెదరగొడతారు. మీ ఫోన్ నంబర్, మీ ఆధార్ నంబర్, మీ అడ్రస్ ఇలాంటి వివరాలు నేరంలో ఉన్నట్టు కంగారు పెడతారు. మనీలాండరింగ్, డ్రగ్స్ కేసు, కస్టమ్స్ కేసు, పోటా యాక్ట్ (ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం యాక్టివిటీ) కింద కేసు..లేదంటే మీపైన ఒక మహిళ లైంగిక వేధింపుల కేసు పెట్టింది..ఇలాంటి వాక్యాలు ఎక్కువగా ఉపయోగిస్తారు. మీరు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు రావాలంటూ ఒత్తిడిని క్రియేట్ చేస్తారు. ఆందోళన పెంచేందుకు ప్రయత్నిస్తారు. ఇతరులెవరికీ ఫోన్ చేయొద్దంటారు. మీరు మాట్లాడటం కొనసాగించే కొద్దీ ఇదేవిధంగా కంగారు పెడుతూ మెల్లగా ఈ నేరంలోంచి బయటపడేందుకు మీకు సహాయపడతామంటారు. నేరం నుంచి తప్పించుకోవాలన్నా..మీ పేరును ఈ నేరం నుంచి తొలగించాలన్నా..మేం అడిగినంత డబ్బులు పంపాలంటూ బేరాలు మొదలు పెడతారు. మీరు భయంతో అంగీకరిస్తే బ్యాంకు ఖాతాల నంబర్లు ఇస్తారు. వీలైనంతగా మీ వద్ద డబ్బు గుంజే ప్రయత్నం చేస్తారు. వాస్తవానికి పోలీసులెవరూ ఇలా ఫోన్లలో బెదిరించరని, డిజిటల్ అరెస్టు అనేది లేనే లేదని తెలుసుకోవాలి. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి. మనకు తెలియని నంబర్ల నుంచి ఫోన్లు వస్తే సాధ్యమైనంతవరకు మాట్లాడకుండా ఉండటమే మంచిది..'అని సైబర్ భద్రత నిపుణుడు అద్వైత్ కంభం వివరించారు.

అప్రమత్తంగా ఉండండి



సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తరపున ప్రజలను కోరుతున్నాం. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని పంచుకునే ప్రతిసారీ జాగ్రత్తగా ఉండండి. అనుమానాస్పద వెబ్ లింక్‌లపై క్లిక్ చేయవద్దు. నిర్ధారించుకోకుండా డబ్బులు ఎవరికీ పంపవద్దు. మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే టీజీసీఎస్‌బీ హెల్ప్‌లైన్ 1930 లేదా cybercrime.gov.in లో రిపోర్ట్ చేయండి.

- శిఖా గోయల్, డైరెక్టర్, టీజీసీఎస్‌బీ

రోజుకో కొత్త పద్ధతిలో దోచేందుకు యత్నిస్తున్న నేరగాళ్లు

ప్రజల అత్యాశ, అమాయకత్వం ఆసరాగా బరితెగింపు

ఎక్కడో కూర్చుని ఇక్కడి బ్యాంకు ఖాతాలు గుల్ల

2024లో ఏకంగా రూ.1,866.9 కోట్ల సొమ్ము స్వాహా

పేరు, ఫోన్ నంబర్లు, చిరునామాలు గోప్యంగా ఉంచాలంటున్న నిపుణులు

ఏమాత్రం అనుమానం వచ్చినా, పొరపాటున మోసపోయినా డయల్ 1930 అంటున్న పోలీసులు

ప్రధాన మోసాలకు సంబంధించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి 2024లో వచ్చిన మొత్తం ఫిర్యాదుల వివరాలు



మోసం	ఫిర్యాదులు
ఐడెంటిటీ థెఫ్ట్	28,646
బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్	24,827
డిజిటల్ అరెస్టు, ఇంపర్సినేషన్	17,928
ఫేక్ కస్టమర్ కేర్, అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్స్	16,923
లోన్ ఫ్రాడ్స్	12,003
ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్స్	5,397

ప్రణయ్.. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్ఆర్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అతడి పీఐఐ వివరాలు థర్డ్‌పార్టీ నుంచి సేకరించే సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్ ప్రొఫైల్ నకిలీది క్రియేట్ చేసి..దాని ద్వారా ప్రణయ్ స్నేహితులు, బంధువులకు ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపారు. కొద్దిరోజుల తర్వాత ప్రణయ్ నకిలీ ఫేస్‌బుక్ ఖాతా నుంచి 'నా భార్య అనారోగ్యంతో ఉంది. అత్యవసర సర్జరీ కోసం ఆసుపత్రిలో చేర్పించాను. నా ఆన్‌లైన్ బ్యాకింగ్ పనిచేయడం లేదు. అర్జంట్‌గా నేను చెప్పిన నంబర్‌కు రూ.50 వేలు పంపించు. నేను సాయంత్రం వరకు తిరిగి ఇచ్చేస్తాను..'అంటూ ప్రణయ్ ఆఫీస్ కొలీగ్ నాగేందర్‌కు మెసేజ్ వచ్చింది. అత్యవసరంలో ఉన్నాడు కదా అని డబ్బులు పంపాడు. సాయంత్రం ప్రణయ్‌కు కాల్ చేస్తే కానీ నాగేందర్‌కు తెలియలేదు..అది ఫేక్ అని..

మోసం 2 ఐడెంటిటీ థెఫ్ట్



అంటే ఏమిటి..?

పర్సనల్ ఐడెంటిఫయబుల్ ఇన్ఫర్మేషన్ (పీఐఐ) అంటే మన ఫోన్ నంబర్, పేరు, ఫొటోగ్రాఫ్, ఈ-మెయిల్..వీటి ద్వారా జరిగే మోసాలను ఐడెంటిటీ థెఫ్ట్ మోసాలుగా చెప్పవచ్చు. మన ఫొటోలను, లేదా వీడియోలను వాడి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌తో మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు క్రియేట్ చేస్తారు. అవి నిజమైనవి కాదు అన్నది గుర్తుపట్టలేనంతగా చేస్తారు. వీటిని ఉపయోగించి సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం ద్వారా లేదంటే మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలతో మోసానికి తెరతీస్తారు.

ఎలా మోసగిస్తారు..?

మన వివరాలను వినియోగించి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ఖాతాల్లో నకిలీ ప్రొఫైల్స్ క్రియేట్ చేస్తారు.. లేదా కొద్దిపాటి మార్పులతో మన ఈ-మెయిల్‌ను పోలినట్టుగా ఈ -మెయిల్స్ క్రియేట్ చేసి.. వాటిని వినియోగించి మోసాలకు పాల్పడతారు. నిజమైన వ్యక్తులే అవసరంలో ఉండి డబ్బులు అడుగుతున్నట్టుగా నమ్మిస్తారు.

సామాన్యులు, ప్రముఖులూ బాధితులే..: ప్రసాద్ పాటిబండ్ల, సైబర్ భద్రత నిపుణుడు, ఢిల్లీ



ఐడెంటిటీ థెఫ్ట్ సైబర్ మోసానికి ప్రముఖ రాజకీయ నాయకులు, కీలక అధికారులు, జడ్జీలు, ఇతర రంగాల సెలబ్రిటీలు ఎక్కువగా గురవుతున్నారు. మరోవైపు సామాన్యులకు సైతం ఈ ఐడెంటిటీ థెఫ్ట్ ముప్పు తప్పడం లేదు. ఉదాహరణకు.. మాజీ ఎంపీ సోయం బాపూరావు పేరిట గత ఐదేళ్లుగా గుర్తు తెలియని వ్యక్తి 'ఎక్స్' ఖాతాను రన్ చేస్తున్నాడు. ఒక అభ్యంతరకరమైన పోస్టు పెట్టిన తర్వాత ఆయన అప్రమత్తం అయి చూసుకుంటే తన పేరిట 'ఎక్స్' ఖాతా ఉన్నట్టు తెలిసింది. కొందరు ప్రభుత్వ అధికారులకు వారి పై అధికారుల పేరిట డబ్బులు పంపాలని వాట్సాప్‌లో, ఫేస్‌బుక్‌లో మెసేజ్ వచ్చిన సందర్భాలున్నాయి. ప్రొఫైల్ ఫొటో అధికారిదే ఉండడంతో చాలామంది డబ్బులు పంపి మోసపోయారు. ఇలా ఒక వ్యక్తి ఫొటో, పేరు, వివరాలు వాడి మోసగించడమూ ఐడెంటిటీ థెఫ్ట్‌గా చెప్పొచ్చు.

భవిష్యత్తులో 'ఏఐ'ముప్పు..: ఇప్పుడు టార్గెటెడ్ వ్యక్తుల వీడియోలు ఏఐ టూల్స్ వాడి ఫేక్‌వి సృష్టిస్తున్నారు. ఇది భవిష్యత్తులో మరింత ముప్పుగా మారబోతోంది. వైరివర్గాన్ని దెబ్బతీసేలా వదంతులు క్రియేట్ చేసేందుకు కూడా ఈ ఐడెంటిటీ థెఫ్ట్‌ను వాడే అవకాశం ఉంది. కొద్దిపాటి మార్పులతో ఫేక్ ఈ-మెయిల్ అడ్రస్‌లు క్రియేట్ చేసి వాటి ద్వారా మోసాలు వ్యాపార రంగంలో జరుగుతున్నాయి. ఐడెంటిటీ థెఫ్ట్ బారినపడకుండా ఉండాలంటే మన వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా యాప్స్‌లో వీలైనంత తక్కువగా ఉపయోగించడం ఉత్తమం. సోషల్ మీడియా యాప్స్‌లో మన వివరాలు, ఫొటోలకు ప్రొఫైల్ లాక్స్ పెట్టుకోవాలి. అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు అంగీకరించవద్దు.

మోసం 3 స్టాక్స్‌లో పెట్టుబడులు

శ్రీనివాస్ ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగి. ఒకరోజు ఆఫీస్ నుంచి ఇంటికి వెళుతుండగా..తన వాట్సాప్‌కు ఒక మెసేజ్ వచ్చింది. అందులో స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన సమాచారం ఉంది. ఆ మెసేజ్‌లోని లింక్ ద్వారా ఆ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. అందులో స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై సభ్యుల చర్చను వారం పాటు గమనించాడు. ఆ తర్వాత శ్రీనివాస్ సైతం కొద్ది మొత్తాల్లో పెట్టుబడులు పెట్టడం మొదలు పెట్టాడు. మొదట పెద్ద మొత్తంలో డబ్బులు వస్తున్నట్టుగా యాప్‌లో చూపారు. ఇలా తన పెట్టుబడి రూ.50 లక్షలకు చేరిన తర్వాత డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నిస్తే రాకపోవడంతో మోసమని గుర్తించి సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశాడు.

ఎక్కువగా జరుగుతున్న మోసం



ఇటీవల కాలంలో అత్యంత ఎక్కువగా జరుగుతున్న సైబర్ మోసాల్లో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ ఒకటి (స్టాక్స్‌లో పెట్టుబడుల పేరిట మోసం). సోషల్ మీడియాలో ఇచ్చే ప్రకటనల్లో స్టాక్ మార్కెట్‌లో పేరున్న సంస్థల్లా నమ్మకాన్ని నెలకొల్పుతారు. తక్కువ రిస్క్‌తో అధిక రాబడులు వస్తున్నట్టుగా నకిలీ యాప్‌లో మనకు చూపుతుంటారు. పెట్టుబడి తక్కువ సమయంలోనే రెండింతలు, మూడింతలు అవుతున్నట్టుగా అంకెల్లో మార్పులు చేస్తూ నకిలీ లేదా థర్డ్‌పార్టీ యాప్‌లలోకి డబ్బును మళ్లిస్తారు. ఆ డబ్బును సైబర్ దొంగలు వాళ్ల బ్యాంకు ఖాతాల్లోకి తరలించుకుంటారు.

అత్యాశతోనే అనర్థాలు..



తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న అత్యాశతో చాలా మంది ఈ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ బారిన పడుతున్నారు. పెట్టుబడి పెట్టేముందు ఆ సంస్థ నిజమైనదేనా..? అన్నది తప్పకుండా ధ్రువీకరించుకోవాలి. అత్యధిక లాభాలంటూ వాస్తవ విరుద్ధంగా ఇచ్చే హామీలు ఉంటే తప్పకుండా అనుమానించాలి. తొందరపెట్టినా, ఆఫర్ చేజారిపోతుందని కంగారు పెట్టినా నమ్మవద్దు. అవసరమైతే మీకు తెలిసిన వారి నుంచి సలహాలు తీసుకోవాలి. అప్పటికే ఇన్వెస్ట్ చేస్తున్న వారి సూచనలు తీసుకోవాలి. ఒకవేళ మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. లేదా స్థానిక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– శ్రీబాల, డీసీపీ, సైబర్ క్రైమ్స్, సైబరాబాద్

మోసం 4 పార్ట్‌టైం ఉద్యోగాలు

హర్షిణి గృహిణి..ఇద్దరు పిల్లలు. బీటెక్ పూర్తయిన తర్వాత ఉద్యోగం చేయాలనుకున్నా కుటుంబ బాధ్యతలతో చేయలేకపోయింది. ఓ రోజు 'ఇంటివద్దే ఉంటూ పార్ట్‌టైం జాబ్‌తో నెలకు వేలల్లో సంపాదించండి..అంటూ ఫేస్‌బుక్‌లో ఒక యాడ్ చూసింది. అందులోని నంబర్లకు ఫోన్ చేసి, వారు అడిగిన వివరాలన్నీ ఇచ్చింది. ఆ తర్వాత యూట్యూబ్ వీడియోలకు లైక్‌లు కొట్టడం, షేర్ చేయడం వంటి టాస్క్‌లు ఇచ్చారు. కొద్దిరోజులపాటు డబ్బులు తన అకౌంట్లో జమ అవడంతో నమ్మకం పెరిగింది. కొద్ది రోజుల తర్వాత స్టాక్‌మార్కెట్‌లో మేం చెప్పిన యాప్స్‌లో పెట్టుబడులతో పెద్దమొత్తంలో లాభాలు వస్తాయని ఆశపెట్టారు. ఆ మాటలు నమ్మిన హర్షిణి తన సంపాదనతోపాటు కుటుంబ సభ్యులకు చెందిన డబ్బులు పెట్టుబడిగా పెట్టి దాదాపు రూ.25 లక్షల వరకు మోసపోయింది.

ఇంటర్వ్యూలు, డాక్యుమెంట్లు లేకుండా ఎలా?

ఎలాంటి ఇంటర్వ్యూలు, డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన పని లేకుండా ఇంట్లో కూర్చుని కూడా రోజుకు వేలల్లో సంపాదించుకోవచ్చంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, 'ఎక్స్' వాట్సాప్‌లలో నౌకరీ, షైన్, మాన్‌స్టర్ వంటి వెబ్‌సైట్ల పేరిట నకిలీ ప్రకటనలతో ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. నిరుద్యోగులు, గృహిణులు, తాత్కాలిక ఉద్యోగాలు ఉండి అదనపు సంపాదన కోసం ప్రయత్నించే వారిని టార్గెట్ చేస్తున్నారు. తొలుత పార్ట్‌టైం జాబ్స్‌తో మొదలుపెట్టి నెమ్మదిగా పెట్టుబడులు పెట్టేలా ఒత్తిడి చేస్తారు. తర్వాత మోసానికి తెరతీస్తారు.

నిజమా.. కాదా.. అన్నది నిర్ధారించుకోవాలి



ఇంటి దగ్గర ఉండే సంపాదించుకోవచ్చన్న ఆశతో కొందరు వీటిబారిన పడుతున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్.. ఇలా సోషల్ మీడియా వేదికల ద్వారా సైబర్ నేరగాళ్లు ఈ తరహా ప్రకటనలు ఇస్తున్నారు. మొదట రూ.10 వేలు, రూ.20 వేలు పెట్టుబడి పెట్టించి దాన్ని రెట్టింపు అయినట్టు చూపిస్తారు. ఈ లాభాలు డ్రా చేసుకునేందుకు అవకాశం ఇస్తారు. ఆ తర్వాత ఇంకా లాభాలు వస్తాయి..రూ. లక్షల్లో పెట్టండి అని ప్రోత్సహిస్తారు.. ఇలా మెల్లగా అవతలి వ్యక్తి ఎంత పెట్టుబడి పెట్టగలడో అంతా అయ్యే వరకు ఇలానే ప్రోత్సహిస్తారు. ఎప్పుడైతే అవతలి వ్యక్తి డబ్బులు విత్‌డ్రాకు ట్రై చేస్తారో అప్పుడు అసలు మోసం బయటపడుతుంది. అప్పటికే మనం పెట్టిన డబ్బులు సైబర్ నేరగాళ్లు ఇతర ఖాతాల్లోకి మళ్లించి అక్కడి నుంచి డ్రా చేసుకోవడం లేదా..క్రిప్టో కరెన్సీ రూపంలో విదేశీ ఖాతాల్లోకి మళ్లించడం చేసేస్తారు. ఈ మోసాలబారిన పడకుండా ఉండాలంటే సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే పార్ట్ టైం జాబ్స్ ప్రకటనలు నమ్మకూడదు. అవకాశం ఉంటే వ్యక్తిగతంగా వాళ్లు చెబుతున్న అడ్రస్‌కు వెళ్లి నిజంగానే ఆ ఆఫీస్ ఉందా..? లేదా...? నిర్ధారించుకున్న తర్వాతే అందులో చేరాలి.


- కవిత, డీసీపీ, సైబర్ క్రైం, హైదరాబాద్ సిటీ

మోసం 5 ఫేక్ కస్టమర్ కేర్, అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్స్

దిలీప్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. శామీర్‌పేట్‌లో ఉంటారు. ఇంట్లోని ఏసీ పనిచేయకపోవడంతో కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేయాలనుకున్నారు. వెంటనే గూగుల్‌లోకి వెళ్లి సదరు కంపెనీ పేరుతో కస్టమర్ కేర్ నంబర్ అని గూగుల్ సెర్చ్ చేశారు. దానిలో వచ్చిన నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. అవతలి వ్యక్తి 'మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం సార్..మీ ఇంటికి టెక్నీషియన్‌ను పంపుతాం. మీ ఇంటి అడ్రస్, ఇతర వివరాలు ఇవ్వండి. మీ మొబైల్‌కు ఒక మెసేజ్ వచ్చింది. అందులోని వెబ్‌లింక్ ఓపెన్ చేయండి. తర్వాత మీకు వచ్చిన ఓటీపీ చెబితే..మీ సర్వీసింగ్ రిక్వెస్ట్ కన్ఫర్మేషన్ అవుతుంది..'అని ఎంతో మర్యాదగా చెప్పింది. ఆమె చెప్పినట్టే చేశారు దిలీప్. కాసేపటికి అతడి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అవుతున్నట్టు మెసేజ్ రావడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఈ మోసం ఎలా ఉంటుంది?..: ఆన్‌లైన్‌లో ఫుడ్‌ఆర్డర్ అయినా..? క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన సమస్యలైనా..? ఇలా ఏ అవసరం అయినా వెంటనే కస్టమర్ కేర్‌కు లేదంటే ఆ సంస్థకు కాల్ చేసి ఫిర్యాదు చేయడం సహజం. సరిగ్గా ఇదే తమకు అనుకూలంగా మల్చుకుని సైబర్ మోసాలకు తెరతీస్తున్నారు.

గూగుల్ సెర్చ్‌లు వద్దు



'సైబర్ నేరగాళ్లు నిజమైన సంస్థల పేర్లతో నకిలీ వెబ్ పేజీలను క్రియేట్ చేస్తున్నారు. ఎస్ఈఓ (సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్)టెక్నిక్‌లు వాడి సైబర్ నేరగాళ్ల వెబ్ పేజీనే ముందు మనకు కనబడేలా చేస్తున్నారు. అందులోని నంబర్‌కు మనం కాల్ చేస్తే నిజంగా ఆ సంస్థ ప్రతినిధిలా మాట్లాడుతూ, మన బ్యాంకు వివరాలు తీసుకోవడంతోపాటు ఓటీపీలు సైతం చెప్పించుకుని మోసాలకు పాల్పడతారు. అందుకే, కస్టమర్ కేర్ నంబర్ల కోసం గూగుల్‌లో, యూ ట్యూబ్‌లో వెతకడం శ్రేయస్కరం కాదు. మీకు కావాల్సిన సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లోకి, యాప్‌లోకి వెళ్లి మాత్రమే నంబర్లను తీసుకోవాలి..'అని సైబర్ భద్రత నిపుణులు నల్లమోతు శ్రీధర్ వివరించారు.

మరికొన్ని రకాల సైబర్ మోసాలు..



ఇన్సూరెన్స్ ఫ్రాడ్స్.. ఆరోగ్యశ్రీ, ఫేక్ ఇన్సూరెన్స్ పేరిట

గేమింగ్ ఫ్రాడ్స్.. ఆన్‌లైన్ గేమింగ్, కలర్ కోడింగ్ ఆన్‌లైన్ రమ్మీ, స్పిన్నింగ్ వీల్ పేరిట సైబర్‌మోసం.

లాటరీ ఫ్రాడ్స్.. ఆన్‌లైన్‌లో లాటరీ వచ్చిందని, మీ పేరిట భారీ డిస్కౌంట్ ఆఫర్ అంటూ..

మ్యాట్రిమోనియల్ ఫ్రాడ్స్.. మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్లలో నకిలీ ప్రొఫైల్స్ పెట్టి మోసం..

సెల్ టవర్ ఇన్‌స్టాలేషన్ ఫ్రాడ్.. మీ ఇంటి పరిధిలో సెల్ టవర్ ఇన్‌స్టాల్ చేసేందుకు ఆఫర్ ఉందని చెబుతారు.

ఐవీఆర్ కాల్స్‌తో మోసం: మీరు అనుమానాస్పద నంబర్లకు ఫోన్లు చేశారని, మీ సిమ్‌కార్డు కొద్ది సమయంలోనే బ్లాక్ అవబోతుందని, ట్రాయ్, టెలికమ్ సర్వీస్ ప్రొవైడర్ల పేరిట ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) కాల్స్‌చేసి బెదిరించి మోసాలు..

కేవైసీ అప్‌డేషన్, క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను ఆధార్‌తో లింకేజీ చేయడం, కార్డు యాక్టివేషన్, కార్డు లిమిట్ పెంచడం, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపు, రివార్డు పాయింట్లు డబ్బుగా మార్చుకోవాలని.. ఇలాంటి అంశాలతో మోసగిస్తారు.

ఓఎల్ఎక్స్‌లో వస్తువులు అమ్ముతామని, లేదంటే కొంటామని నకిలీ అడ్రస్‌లు, ప్రూఫ్‌లతో మోసగిస్తారు.

ఫోన్ నంబర్ ఇవ్వడమే తప్పు

సాధారణంగా దొంగలు ఇంట్లోకి రాకుండా పెద్ద, పెద్ద తాళాలు వేస్తాం.. ఇంటికి నాలుగు మూలల సీసీటీవీ కెమెరాలు పెట్టుకుంటాం..అవసరమైతే కుక్కలను పెంచుకుంటాం. కానీ, కనిపించని సైబర్ దొంగల చేతికి మాత్రం 'సమాచారం'అనే తాళాలు మనమే ఇస్తున్నాం. మందుల దుకాణం, సూపర్ మార్కెట్, మాల్స్, వస్త్ర దుకాణాలు, ఫుడ్ కోర్టులు ఇలా ఎక్కడపడితే అక్కడ అవసరానికి మించి మన ఫోన్ నంబర్‌ను ఇస్తున్నాం. కొన్నిసార్లు అనివార్యంగా కూడా మన వివరాలు ఇవ్వక తప్పడం లేదు. ఇదే పెద్ద తప్పు అని గుర్తించాలంటున్నారు సైబర్ భద్రత నిపుణులు. ఇలా మనం ఇచ్చే సమాచారాన్ని కొన్ని సంస్థలు కాల్ సెంటర్లకు, థర్డ్‌పార్టీకి అమ్ముతున్నాయని మరవొద్దు. మన ఫోన్ నంబర్, పేరు తెలిస్తే మిగిలిన వివరాలు కనిపెట్టడం సైబర్ నేరగాళ్లకు పెద్ద కష్టమేమీ కాదు.. సులువుగా డబ్బులు సంపాదించాలనుకునే ప్రజల అత్యాశనే సైబర్ నేరగాళ్లు తమ ఆయుధంగా మార్చుకుంటున్నారు.

గుడ్డిగా నమ్మొద్దు

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని, మీకు ఫలానా బ్యాంకు నుంచి ఆఫర్ ఉందని, మీకు లాటరీలు వచ్చాయని..ఇలా ఏదో ఒక సాకుతో వచ్చే ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్‌లోని వెబ్ లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు.

అప్రమత్తతే ఆయుధం అన్నది మరవొద్దు. సైబర్‌మోసగాళ్లు ఇచ్చే మోసపూరిత ప్రకటనలు, మెసేజీలు, ఈ మెయిల్స్‌ను గుడ్డిగా నమ్మకుండా.. ఆలోచించి, నిర్ధారించుకోవాలి.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 30-12-2024

2025 సుస్వాగతం

సత్సంకల్పం సత్సంవత్సరం

మంచిమాట

కాలాన్ని నారాయణ స్వరూపంగా భావించి పూజించటం, ఆరాధించటం భారతీయ సంప్రదాయం. అంటే, ఆయా సమయాలలో ప్రకృతిలో వచ్చే మార్పులకి తగినట్టుగా ప్రవర్తించటం అందులో ఒక భాగం. నిత్యవ్యవహారానికి ప్రధానంగా చాంద్రమానాన్నే పాటించినా సంక్రమణాలు, విషువులు మొదలయినవి సూర్యమానానికి సంబంధించినవి. ప్రస్తుతం ప్రపంచం చాలావరకు సౌరమానాన్ని అనుసరిస్తోంది. ఇందులో సంవత్సరానికి 365 రోజులు ఉంటాయి. ఒకరకంగా లెక్క తేలిక. కాలచక్ర భ్రమణం వర్తులాకారంలో ఉంటుంది. ఎక్కడి నుండి లెక్క పెట్టటం మొదలుపెట్టామో అక్కడికి వచ్చి ఆగి మరొక ఆవృతం ప్రారంభం అవుతుంది. అందుకని ఎక్కడి నుండి అయినా లెక్కించటం మొదలు పెట్టవచ్చు.

రాజకీయమైన అనేక వత్తిడుల కారణంగా చాలా మార్పులు, సద్దుబాట్లు జరిగిన తరువాత తయారైన గ్రెగేరియన్ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటవ తేదీని కొత్త సంవత్సర ప్రారంభ దినంగా నిర్ణయించటం జరిగింది. భూగోళాన్ని ఒక కుగ్రామంగా పరిగణిస్తున్న ఈ రోజుల్లో అందరూ ఒకే కాలమానాన్ని పాటించటం సౌకర్యం. వ్యక్తిగత ఇష్టానిష్టాలని పక్కకిపెట్టి అందరూ ''కామన్ ఎరా'' అని ప్రపంచంలో ఎక్కువ దేశాలలో అమలులో ఉన్న ఈ కాలమానాన్ని అనుసరిస్తున్నారు.

చాంద్రమానాన్ని పాటించే భారతీయులు కూడా లౌకిక వ్యవహారాలకి కామన్ ఎరానే అనుసరిస్తున్నారు. విద్యాలయాలలో ప్రవేశానికి, ఉద్యోగ దరఖాస్తుకి, పాస్‌పోర్ట్, వీసా మొదలయిన వాటికి తేదీనే ఇస్తున్నాం కాని, తిథి, మాసం మొదలయిన వివరాలు ఇవ్వటం లేదు కదా! తమ వ్యక్తిగత, ఆధ్యాత్మిక వ్యవహారాలకి చాంద్రమానాన్ని పాటిస్తున్నారు. ఉదాహరణకి పుట్టిన రోజులు,పెళ్లి, గృహప్రవేశం మొదలయిన శుభ కార్యాల ముహూర్తాలు, పితృకార్యాలు మొదలైన వాటిని చాంద్రమానాన్ని అనుసరించి నిర్ణయిస్తారు.

సాధారణంగా కొత్తసంవత్సరం వస్తోంది అంటే పండుగ వాతావరణం నెలకొంటుంది. సంవత్సరంతోపాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్తసంవత్సరానికి ఆహ్వానం పలుకుతారు. విందులు, వినోదాలు, శుభాకాంక్షలు తెలుపుకోటం. ఒకటే సంబరం. రాబోయే కాలం ఆనందదాయకంగా ఉండాలనే ఆకాంక్ష. ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటంతో పాటు ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు, ఆ విధంగా గడిపే అవకాశం ఇచ్చినందుకుభగవంతుడికి కృతజ్ఞతని ఆవిష్కరించటం వీటిలోని అసలు అర్థం. సంవత్సరంలో మొదటిరోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం. కనుక వీలైనంత ఆనందంగా గడిపే ప్రయత్నం చేస్తూ ఉంటారు.

కాలం ఎవరికోసం ఆగదు. కాలచక్రంలో మరొక ఆకు ముందుకి కదిలింది. కొత్త ఆవృతం మొదలవుతోంది. అంటే మరొక సంవత్సరం కాలగర్భంలో కలిసింది. కొత్త సంవత్సరం ప్రారంభం కాబోతోంది.

కాని, అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, తీపి,చేదు అనుభవాలని నెమరు వేసుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్య సాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకిపెట్టి, అవసరమైనవాటిని చేపడతామని నిర్ణయించుకోవలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్త పని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

రెండువేల ఇరవై ఐదవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, యుద్ధవాతావరణం ఉపశమించి ప్రపంచంలో శాంతి నెలకొనాలని, చేసుకున్న తీర్మానాలు అమలు జరిపే శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాం.

– డా. ఎస్.అనంతలక్ష్మి

సన్నిధి

ఆత్మదర్శిని

ఈ క్షణం... సచ్చిదానందం

నీవు 'ఈ క్షణం'లో ఉన్నప్పుడు కాలం, ప్రదేశం అనేవే ఉండవు. అవి లేనప్పుడు దుఃఖం కూడా ఉండదు. ఈ క్షణంలో ఉన్నపుడు నీవే దైవం. అదే ఆత్మసాక్షాత్కార స్థితి. నీవే దైవమైనప్పుడు నీ గురించి ఎవరేమి అనుకున్నా నీకు చెందదు కదా! అసలు వ్యక్తి అనేదే మనస్సు కల్పితం. ఈ క్షణంలో మనస్సు–శరీరము అనేవే ఉండవు. శరీరం–మనస్సు అనేవి కాలం–ప్రదేశం అనేవాటితో కలిసే ఉంటాయి. శరీరం ప్రదేశానికి సంబంధించినదైతే, మనస్సు కాలానికి సంబంధించినది. నీవు ఈ దేశకాలాలకు అతీతమైన స్థితిలో ఉండాలి ఎల్లప్పుడూ. అంటే అతి సూక్ష్మమైన 'ఈ క్షణం'లో ఉండాలి. అంటే ఆత్మతో ఉండాలి. ఆ స్థితిలో నీవు అనంతుడివి. పుట్టుకలేదు, చావుకూడా లేదు. కేవలం ఒక శుద్ధ చైతన్యానివి. మైత్రేయ అనే వ్యక్తివి కావు.

ఈ స్థితిలో నీవు విశ్వచైతన్యంతో నేరుగా అనుసంధానమై ఉంటావు. పరమానందంలో ఉంటావు. ఈ క్షణంలో నీవు ఆత్మవు. ఈ క్షణం నుండి మళ్ళితే శరీరమే నేను, మనస్సు నేను అనే భ్రమలో ఉంటావు. అదే దుఃఖానికి మూలం. అందుకే దైవం ఆనంద స్వరూపం అంటారు. నిర్గుణం, నిరాకారం, నశ్వరం, సర్వవ్యాపితం, ఆద్యంతరహితం అంటారే, దానికి కారణం ఇదే. మరి నీవు దైవం కావాలంటే ఈ క్షణంలో కదా ఉండాలి! ఆత్మ స్థితిలో కదా ఉండాలి!



నశించిపోయే భౌతిక ప్రపంచంలో దైవాన్ని వెదికితే దానికి అతీతమైన దైవత్వాన్ని ఎలా పొందగలవు? మనస్సుకు అతీతంగా ఎదుగు. దైవత్వాన్ని చేరకుండా అడ్డుపడుతున్నది ఈ మనస్సే. నీ శక్తులన్నింటినీ నీ మూలం వైపుకు మళ్ళించు.

అసలు ఈ క్షణంలో వ్యథ అనేదే ఉండదు. ఆలోచనలతో ఉన్నప్పుడే వ్యథ ఉంటుంది. గతాన్ని తల్చుకోని, భవిష్యత్తును ఊహించుకుంటూ భయాలతోగడుపుతున్నాము. 'ఈ క్షణం' అనేది చాలా సూక్ష్మమైనది. అందులో దుఃఖానికి చోటే ఉండదు. 'ఈ క్షణమే' సత్యం. అందులో కాలమే లేదు. కాలం–ప్రదేశం లేనపుడు శరీరం–మనస్సు కూడా లేవు. అవి లేకుంటే దుఃఖమే లేదు. నేను సాక్షీ చైతన్యాన్ని అనే ఎరుక మాత్రమే ఉంటుంది. అసలు మైత్రేయ అనేవాడే లేడు. ఇది మనస్సు తాలూకు రూపం. ఈ మనస్సు, అహం అనేవి అంతమవ్వాలి. వీటి ముసుగులో మరుగున పడిపోయిన ఆత్మ ప్రకాశమవ్వాలి. సంసారాన్ని వదిలేసి పారిపోవలసిన అవసరంలేదు ప్రశాంతంగా ఉండటానికి. అది ఆధ్యాత్మికతే కాదు. నీవు మనస్సుతో కలిసిపోయి ఉన్నంతవరకు ఎక్కడికి పారిపోయినా వ్యథ నిన్ను వీడదు. వదలవలసింది మనస్సునుగానీ ప్రపంచాన్ని కాదు. 'మధ్యమ నికాయ' అని బుద్ధుడు చెప్పిన విధంగా నీ నిజతత్వమైన సాక్షీచైతన్యంతో ఉండు. మైత్రేయ ఉండకూడదు, మైత్రేయ వెనుక ఉన్న దివ్యచైతన్యం మాత్రమే ఉండాలి. నీ ఇంట్లోనే ఉంటూ, ఈ మనుషుల మధ్యనే, ఈ సమాజంలోనే ఉంటూ ఆనందంగా, దైవంగా ఉండాలి. ఎక్కడికీ పారిపోవాల్సిన అవసరం లేదు. ఆ స్థితప్రజ్ఞలో ఉన్నపుడు ఆనందమే నీ సహజగుణం.

– స్వామి మైత్రేయ,
ఆధ్యాత్మిక గురువు


ముగ్గు ముచ్చట





19 చుక్కలు, 5 వరసలు
సరిచుక్క, 5 వచ్చేవరకు

మంజరి సావిత్రి గరిమెళ్ల
శాన్ ఆంటోనియో,
టెక్సాస్, యుఎస్ఏ





17 చుక్కలు,
7 వరసలు
17 వచ్చేవరకు

ఆర్. ఇందిర
బొబ్బిలి

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34. ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

సినిమా

మిస్సింగ్

ఈ ఏడాది వెండితెరను మిస్ అయిన సీనియర్ హీరోల్లో చిరంజీవి, బాలకృష్ణ, యువ హీరోల్లో నాగచైతన్య, రానా (సోలో హీరోగా..), అఖిల్, నితిన్, మంచు విష్ణు, నందమూరి కల్యాణ్‌రామ్, నాగశౌర్య, అడివి శేష్, సాయి దుర్గా తేజ్, నవీన్ పొలిశెట్టి, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, వైష్ణవ్ తేజ్ తదితరులు ఉన్నారు.



రికార్డులు తిరగరాసిన పుష్ప చిన్న చిత్రాలకు పెద్ద విజయం

2024 రౌండప్

తెలుగు సినిమా తగ్గేదే లే అన్నట్లుగానే 2024 సాగింది. విజయాల శాతం తక్కువే అయినప్పటికీ... కొన్ని చిత్రాలు సాధించిన వసూళ్లు తెలుగు సినిమా స్థాయిని పెంచాయి. రూ. 1700 కోట్లతో 'పుష్ప: ది రూల్' బాక్సాఫీస్‌ని రూల్ చేసింది. రూ. 1000 కోట్లకు పైగా కలెక్షన్స్‌తో 'కల్కి2898 ఏడీ' సత్తా చాటింది. యువ హీరోలు తేజ సజ్జా 'హను-మాన్', కిరణ్ అబ్బరం 'క' చిత్రాలతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఇంకా నూతన తారలతో వచ్చిన సినిమాలూ ఆకట్టుకున్నాయి. ఇక 2024 రౌండప్‌లోకి వెళదాం...

తెలుగు సినిమా అసలు సిసలైన పండగ సంక్రాంతితో ఆరంభం అవుతుంది. ఈ పండగకి వచ్చే పెద్దా చిన్నా సినిమాలతో థియేటర్లు కళకళలాడిపోతాయి. అలా 2024లో సంక్రాంతికి వచ్చిన సినిమాలతో థియేటర్లు పండగ చేసుకున్నాయి. సినీ లవర్స్ కూడా ఫుల్ ఖుష్ అయ్యారు. ఈ ఏడాది సంక్రాంతి పండక్కి మహేశ్‌బాబు 'గుంటూరు కారం', తేజ సజ్జా 'హను-మాన్', వెంకటేశ్ 'సైంధవ్', నాగార్జున 'నా సామిరంగ' వరుసగా విడుదల అయ్యాయి. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన 'గుంటూరు కారం' బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇదే రోజున ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన మైథలాజికల్ ఫిల్మ్ 'హను–మాన్' భారీ విజయాన్ని అందుకుంది. సంక్రాంతికి వచ్చిన సీనియర్ హీరోలతో పాటు యువ హీరో తేజ విజయం అందుకోవడం విశేషం. ఇక వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో విడుదలైన 'సైంధవ్' ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. సంక్రాంతి పండగలో చివరిగా వచ్చిన నాగార్జున మాస్ కమర్షియల్ 'నా సామి రంగ' చిత్రం ప్రేక్షకులను అలరించింది. ఈ సినిమాతో కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఇంకా జనవరి నెలలో విడుదలైన ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా నటించిన తొలి సినిమా 'సర్కారు నౌకరి', హన్సిక '105 మినిట్స్' నిరాశపరిచాయి. జనవరిలో దాదాపు ఇరవై సినిమాలు వచ్చినా ఆకట్టుకున్నవి తక్కువే.

ఇక ఫిబ్రవరిలో ఇరవై సినిమాలకు పైగా వచ్చాయి. కులవివక్ష నేపథ్యంలో సుహాస్ హీరోగా నూతన దర్శకుడు దుష్యంత్ కటికనేని తెరకెక్కించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'కి కొద్దిపాటి ప్రేక్షకాదరణ దక్కింది. ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీవితంలోని కొన్ని ముఖ్య సంఘటనల ఆధారంగా రూపొందిన 'యాత్ర 2' ప్రేక్షకులను అలరించింది. ఈ చిత్రంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలో జీవా నటించారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి జీవితంలోని ముఖ్య సంఘటనల ఆధారంగా మహి వి. రాఘవ్ దర్శకత్వంలో రూపొందిన 'యాత్ర' సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' రూపొందింది. సీక్వెల్ కూడా మహి దర్శకత్వంలోనే రూపొందింది. ఈ నెలలో రవితేజ 'ఈగిల్' సినిమా ఓ మోస్తరు హిట్ అందుకుంది. ఈ మాస్ ఫిల్మ్‌కి కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. ఇంకా సందీప్ కిషన్ హారర్ ఫిల్మ్ 'ఊరి పేరు భైరవ కోన' ఫర్వాలేదనిపించుకుంది. ఈ చిత్రానికి వీఐ దర్శకుడు. అలాగే ప్రియమణి 'భామాకలాపం 2' ఫర్వాలేదనిపించుకుంది.

ఇక మార్చిలో ముప్పైకి పైగా సినిమాలు వస్తే, అలరించినవి మాత్రం ఐదారు సినిమాలే. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ చేసిన 'ఆపరేషన్ వాలెంటైన్'కి ఆశించిన ఫలితం దక్కలేదు. శివ కందుకూరి మిస్టరీ థ్రిల్లర్ డ్రామా 'భూతద్దం భాస్కర్ నారాయణ', అఘోరాగా విశ్వక్ సేన్ నటించిన 'గామి, అనన్య నాగళ్ల హారర్ మూవీ 'తంత్ర', హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ 'రజాకార్' చిత్రాలు ఆడియన్స్‌ను అలరించే ప్రయత్నం చేశాయి. అయితే సిద్ధు జొన్నలగడ్డ-అనుపమా పరమేశ్వరన్‌ల 'డీజే టిల్లు స్క్వేర్', శ్రీ విష్ణు హీరోగా చేసిన 'ఓం భీమ్ బుష్' చిత్రాలు హిట్స్‌గా నిలిచాయి. మల్లిక్ రామ్ దర్శకత్వంలో 'డీజే టిల్లు స్క్వేర్' రూపొందగా, 'ఓం భీమ్ బుష్'కి హర్ష కొనుగొంటి దర్శకుడు. ఇదే నెల ఆరంభంలో వచ్చిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ 'వ్యూహం' చర్చనీయాంశమైంది. ఏప్రిల్‌లో థియేటర్స్‌లోకి వచ్చిన చిత్రాలు ఇరవైలోపే. పరశురామ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటించిన 'ఫ్యామిలీ స్టార్' ఓ మోస్తరుగా అలరించింది. ఇదే నెలలో నూతన దర్శకుడు శివ తుర్లపాటి దర్శకత్వంలో వచ్చిన అంజలి 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' నవ్వించింది. ఇక మే నెలలో వచ్చిన ఇరవై చిత్రాల్లో కార్తికేయ 'భజే వాయు వేగం', ఆనంద్ దేవరకొండ 'గం గం గణేశా', మోహన్ భగత్ 'ఆరంభం' ఆడియన్స్ దృష్టిని తమ వైపు తిప్పుకోగలిగాయి. 'భజే వాయు వేగం'తో దర్శకుడిగా ప్రశాంత్ రెడ్డి పరిచయం కాగా, 'ఆరంభం'తో అజయ్ నాగ్ డైరెక్టర్‌గా పరిచయం అయ్యారు. సత్యదేవ్ 'కృష్ణమ్మ'తో వీవీ గోపాల కృష్ణ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఇంకా 'అల్లరి' నరేశ్ 'ఆ... ఒక్కటి అడక్కు..!', విశ్వక్ సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలకు ఊహించిన ఫలితాలు రాలేదు. జూన్‌లో దాదాపు పాతిక సినిమాలు రాగా, అందరి దృష్టి 'కల్కి 2898 ఏడీ' సినిమా పైనే నిలిచింది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ఇదే నెలలో వచ్చిన సుధీర్‌బాబు 'హరోంహర', శర్వానంద్ 'మనమే' వంటివి అంచనాలను అందుకోలేకపోయాయి. అజయ్ ఘోష్ 'మ్యూజిక్ షాప్ మూర్తి' మెప్పించింది. జూలైలో మీడియమ్ చిత్రాలు ఓ పది విడుదలయ్యాయి. వీటిలో నవదీప్ 'లవ్‌మౌళి', ప్రియదర్శి–నభా నటేశ్‌ల 'డార్లింగ్', రక్షిత్ శెట్టి 'ఆపరేషన్ రావణ్', రాజ్ తరుణ్ 'పురుషోత్తముడు' వంటి సినిమాలు ఉన్నాయి. కానీ ఏ చిత్రం కూడా హిట్ కాలేకపోయింది. ఆగస్టు నెలలో దాదాపు ముప్పై సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఆగస్టు నెలాఖర్లో వచ్చిన నాని 'సరిపోదా శనివారం' సూపర్ హిట్‌గా నిలవగా, అల్లు శిరీష్ 'బడ్డీ', రామ్ 'డబుల్ ఇస్మార్ట్', రవితేజ 'మిస్టర్ బచ్చన్' చిత్రాలు నిరాశ పరిచాయి. అయితే చిన్న చిత్రాలుగా రిలీజైన దర్శకుడు అంజి మణిపుత్ర–హీరో నార్నే నితిన్ 'ఆయ్', యదు వంశీ దర్శకుడిగా పరిచయమై, నూతన నటీనటులు చేసిన 'కమిటీ కుర్రోళ్ళు' హిట్‌గా నిలిచాయి. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో రావు రమేశ్ లీడ్ రోల్‌లో నటించిన 'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్రం మెప్పించింది. ఎన్టీఆర్ 'దేవర' మేనియాతో సెప్టెంబరులో పెద్దగా సినిమాలేవీ ప్రేక్షకుల ముందుకు రాలేదు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర పార్టు 1' ప్రపంచవ్యాప్తంగా రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లుగా యూనిట్ పేర్కొంది. ఇదే నెలలో వచ్చిన నివేదా థామస్ '35: చిన్న కథ కాదు', శ్రీ సింహా–హాస్య నటుడు సత్య–ఫరియా అబ్దుల్లా చేసిన 'మత్తు వదలరా 2' చిత్రాలు అలరించాయి. ఈ ఏడాదికి అక్టోబరు కలిసొచ్చిందనే చెప్పుకోవాలి. ముందుగా శ్రీవిష్ణు 'స్వాగ్' సినిమా రిలీజైంది. శ్రీవిష్ణు నటనకు మాత్రం మంచి మార్కులు పడ్డాయి. ఇక దసరాకి వచ్చిన సుధీర్‌బాబు 'మా నాన్న సూపర్ హీరో', గోపీచంద్ 'విశ్వం', సుహాస్ 'జనక అయితే గనక' చిత్రాలకు ఓ మోస్తరు ప్రేక్షకాదరణ దక్కింది. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా వచ్చిన 'విశ్వం' దసరా హిట్ సినిమాల్లో ముందు నిలిచింది. దసరా తర్వాత ప్రేక్షకుల ముందుకొచ్చిన రూరల్ డ్రామా 'పొట్టేల్' ప్రేక్షకుల అటెన్షన్‌ను గ్రాబ్ చేయగలిగింది. అక్టోబరులో దీపావళి సందర్భంగా విడుదలైన దుల్కర్ సల్మాన్ 'లక్కీ భాస్కర్', కిరణ్ అబ్బవరం 'క' చిత్రాలు మంచి వసూళ్లు సాధించాయి. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన 'లక్కీ భాస్కర్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలాగే దర్శక ద్వయం సుజిత్–సందీప్ పరిచయం అయిన 'క' సూపర్ హిట్ అయింది. నవంబరులో భారీ సినిమాలేవీ రిలీజ్ కాలేదు. విడుదలైన వాటిలో కొత్త దర్శకుడు రవితేజ ముళ్లపూడితో విశ్వక్ సేన్ హీరోగా చేసిన 'మెకానిక్ రాకీ', సత్యదేవ్–ధనంజయల 'జీబ్రా', కొత్త దర్శకుడు విక్రమ్ రెడ్డి తీసిన 'రోటీ కపడా రొమాన్స్' చిత్రాలు అలరించాయి. వరుణ్ తేజ్ 'మట్కా', నిఖిల్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' నిరుత్సాహపరచాయి. ఇక డిసెంబరు తొలి వారంలోనే హీరో అల్లు అర్జున్–దర్శకుడు సుకుమార్‌ల 'పుష్ప: ది రూల్' సినిమా విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ. 1700 కోట్లకు పైగా కలెక్షన్స్ వచ్చినట్లుగా యూనిట్ ప్రకటించింది. హిందీలో 'పుష్ప 2'కు రూ. 700 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ రావడం విశేషం. ఈ విధంగా ఇప్పటికే 'పుష్ప 2' పలు రికార్డులను తిరగ రాసింది. ఈ సినిమా ఇంకా థియేటర్స్‌లో ప్రదర్శితమవుతోంది. నెలాఖరులో అల్లరి నరేశ్ 'బచ్చల మల్లి', 'వెన్నెల' కిశోర్–అనన్య నాగళ్ల నటించిన 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్', ధర్మ 'డ్రింకర్ సాయి' వంటి చిత్రాలు వచ్చాయి.

విజయాల శాతం తక్కువ, అపజయాల శాతం ఎక్కువ అన్నట్లుగా 2024 సాగింది. స్ట్రయిట్, డబ్బింగ్ చిత్రాలతో కలిపి దాదాపు 250 చిత్రాలు రిలీజ్ అయ్యాయి. అయితే పెద్దా... చిన్నా... అనువాద చిత్రాలు సాధించిన విజయాలు పది శాతం లోపే. 2025లో సక్సెస్ రేట్ పెరగాలని కోరుకుందాం.

ఈ ఏడాది తెలుగు తెరపై అనువాద చిత్రాలకు మంచి ఆదరణ దక్కింది. తమిళ చిత్రాలు రజనీకాంత్ 'వేట్టయాన్: ది హంటర్', విజయ్ సేతుపతి 'మహారాజా', శివ కార్తికేయన్ 'అమరన్' కార్తీ–అరవింద్ స్వామిల 'సత్యం–సుందరం', విక్రమ్ 'తంగలాన్', ధనుష్ 'రాయన్', విజయ్ 'ది గోట్: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్', తమన్నా–సుందర్ .సి 'బాకు' (అరణ్మనై 4) చిత్రాలకు తెలుగులో ఆదరణ దక్కింది. ఈ ఏడాది తెలుగులో మలయాళ చిత్రాల హవా కూడా కనిపించింది. 'మంజుమ్మెల్ బాయ్స్', మమ్ముట్టీ 'భ్రమయుగం', నస్లెన్ 'ప్రేమలు', పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఆడు జీవితం', టొవినో థామస్ 'ఏఆర్ఎమ్' చిత్రాలు తెలుగు ప్రేక్షకులను అలరించాయి. కన్నడ చిత్రాలు ఉపేంద్ర 'యూఐ', కిచ్చా సుదీప్ 'మ్యాక్స్'లకు అలరించాయి.



















సాక్షి స్పోర్ట్స్
సోమవారం
30-12-2024

వరల్డ్ ర్యాపిడ్ మహిళల చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన కోనేరు హంపికి అభినందనలు. ఆమె అపార ప్రతిభ, పట్టుదల లక్షలాది మందిలో స్ఫూర్తి నింపుంది. తాజా టైటిల్‌తో రెండోసారి ర్యాపిడ్ చాంపియన్‌షిప్ గెలిచిన ఏకైక భారతీయురాలిగా నిలవడం హంపి ఘనతను మరింత చరిత్రాత్మకంగా మార్చింది.
-భారత ప్రధాని నరేంద్ర మోదీ


చివరి రౌండ్‌లో ఇండోనేసియా ప్లేయర్ ఖరిస్మాపై విజయానంతరం హంపి

పడగొట్టి... పట్టు వదిలేసి!

తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాకు 105 పరుగుల ఆధిక్యం... ఆ తర్వాత భారత పదునైన పేస్ బౌలింగ్ ముందు రెండో ఇన్నింగ్స్‌లో జట్టు బ్యాటింగ్ తడబడింది... 11 పరుగుల వ్యవధిలో భారత్ 4 వికెట్లు తీయడంతో స్కోరు 91/6కు చేరింది... ఇక్కడే టీమిండియా కాస్త పట్టు విడిచింది... దాంతో స్కోరు 173/9 వరకు వెళ్లింది... ఇక్కడా ఆట ముగిస్తే రోహిత్ బృందం పని సులువయ్యేది... కానీ చివరి వికెట్‌కు కంగారూలు మళ్లీ పోరాడారు... దాంతో ఆస్ట్రేలియా స్కోరు 228/9కు... ఆధిక్యం కాస్తా 333కు చేరిపోయింది... మ్యాచ్ చివరి రోజు ఆసీస్ ఇదే స్కోరు వద్ద డిక్లేర్ చేసినా దాదాపు అసాధ్యమైన లక్ష్యం ఇది... నాలుగేళ్ల క్రితం బ్రిస్బేన్‌లో చెలరేగిన తరహాలో భారత్ దూకుడుగా ఆడి విజయం వైపు వెళుతుందా... లేక తలవంచుతుందా... లేక పోరాడి టెస్టును 'డ్రా'గా ముగిస్తుందా అనేది చివరి రోజు ఆటలో ఆసక్తికరం. ఆదివారం ఆటలో బుమ్రా, సిరాజ్‌లు భారత్‌కు విజయావకాశాలు సృష్టించగా... లబుషేన్, కమిన్స్, లయన్ ఆసీస్‌కు ఆపద్బాంధవులుగా నిలిచారు.


బుమ్రా

భారత్ ముందు భారీ సవాల్

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 228/9
- ఓవరాల్ ఆధిక్యం 333 పరుగులు
- నాలుగో టెస్టుకు నేడు చివరి రోజు

మెల్‌బోర్న్: అనూహ్య మలుపులతో సాగుతున్న 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' నాలుగో టెస్టు మ్యాచ్ చివరి ఘట్టానికి చేరింది. మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. లబుషేన్ (139 బంతుల్లో 70; 3 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా... కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (90 బంతుల్లో 41; 4 ఫోర్లు), నాథన్ లయన్ (54 బంతుల్లో 41 బ్యాటింగ్; 5 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా 4, సిరాజ్ 3 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం క్రీజ్‌లో లయన్‌తో పాటు స్కాట్ బోలండ్ (10 బ్యాటింగ్) ఉన్నాడు. వీరిద్దరు ఇప్పటికే చివరి వికెట్‌కు ఏకంగా 18.2 ఓవర్లు ఆడి అభేద్యంగా 55 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 358/9తో తమ తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ మరో 21 బంతులు ఆడి 11 పరుగులు చేసి 369 పరుగుల వద్ద ఆలౌటైంది. ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి (189 బంతుల్లో 114; 11 ఫోర్లు, 1 సిక్స్) భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాఫ్‌లో క్యాచ్ ఇచ్చి చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో 105 పరుగుల ఆధిక్యం కలుపుకొని ఆసీస్ ప్రస్తుతం 333 పరుగులు ముందంజలో ఉంది.

కీలక భాగస్వామ్యాలు...

ఆసీస్ ఓపెనర్లు కొన్‌స్టాస్ (18 బంతుల్లో 8; 1 ఫోర్), ఖ్వాజా (65 బంతుల్లో 21; 2 ఫోర్లు) చాలా జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ను ఆరంభించారు. అయితే తొలి ఇన్నింగ్స్‌లో తనపై దూకుడు ప్రదర్శించిన కొన్‌స్టాస్‌ను ఈసారి అద్భుత బంతితో పడగొట్టి బుమ్రా సంబరాలు చేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో పేలవ బౌలింగ్‌తో 122 పరుగులిచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయిన సిరాజ్ ఇప్పుడు మెరుగైన ప్రదర్శనతో ఆసీస్ పని పట్టాడు. ఖ్వాజాను పదునైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేసి జోరు ప్రదర్శించిన సిరాజ్... లంచ్ విరామం తర్వాత స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 13; 1 ఫోర్)ను కూడా పెవిలియన్ పంపించాడు. ఆదివారం తన 31వ పుట్టిన రోజు జరుపుకున్న ట్రావిస్ హెడ్‌కు కలిసి రాలేదు. బుమ్రా పన్నిన ఉచ్చులో పడిన హెడ్ (2 బంతుల్లో 1) స్క్వేర్‌లెగ్‌లో సునాయాస క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అదే ఓవర్లో మిచెల్ మార్ష్ (4 బంతుల్లో 0)ను కూడా అవుట్ చేసిన బుమ్రా, తర్వాతి ఓవర్లో మరో చక్కటి బంతికి అలెక్స్ కేరీ (7 బంతుల్లో 2) పని పట్టాడు. దాంతో ఆస్ట్రేలియా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఇలాంటి స్థితిలో లబుషేన్, కమిన్స్ కలిసి జట్టును ఆదుకున్నారు. 19.1 ఓవర్ల పాటు వీరిద్దరు భారత బౌలర్లను నిలువరించగలిగారు. లబుషేన్ తనదైన శైలిలో పట్టుదల కనబరుస్తూ 105 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, తొలి ఇన్నింగ్స్‌లాగే కమిన్స్ మళ్లీ బ్యాటింగ్‌లో ప్రభావం చూపించాడు. ఎట్టకేలకు మూడో సెషన్‌లో లబుషేన్‌ను అవుట్ చేసి సిరాజ్ 57 పరుగుల ఏడో వికెట్ భాగస్వామ్యానికి తెర దించాడు. స్టార్క్ (13 బంతుల్లో 5) రనౌట్ కాగా, కమిన్స్ వికెట్ జడేజా ఖాతాలో చేరింది. ఈ దశలో ఆసీస్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతోసేపు పట్టదనిపించింది. కానీ లయన్, బోలండ్ టీమిండియాకు ఆ అవకాశం ఇవ్వలేదు. అప్పటికే బాగా అలసిపోయిన భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోవడంతో చివరి వికెట్ దక్కకుండానే రోజు ముగిసింది.


లబుషేన్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474; భారత్ తొలి ఇన్నింగ్స్: 369; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: కొన్‌స్టాస్ (బి) బుమ్రా 8; ఖ్వాజా (బి) సిరాజ్ 21; లబుషేన్ (ఎల్బీ) (బి) సిరాజ్ 70; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 13; హెడ్ (సి) నితీశ్ (బి) బుమ్రా 1; మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 0; కేరీ (బి) బుమ్రా 2; కమిన్స్ (సి) రోహిత్ (బి) జడేజా 41; స్టార్క్ (రనౌట్) 5; లయన్ (బ్యాటింగ్) 41; బోలండ్ (బ్యాటింగ్) 10; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం** (82 ఓవర్లలో 9 వికెట్లకు) 228. **వికెట్ల పతనం:** 1-20, 2-43, 3-80, 4-85, 5-85, 6-91, 7-148, 8-156, 9-173. **బౌలింగ్:** బుమ్రా 24-7-56-4, ఆకాశ్‌దీప్ 17-4-53-0, సిరాజ్ 22-4-66-3, జడేజా 14-2-33-1, నితీశ్ రెడ్డి 1-0-4-0, సుందర్ 4-0-7-0.

బుమ్రా 'ద గ్రేట్'

200 వికెట్ల మైలురాయిని అందుకున్న భారత పేసర్

భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను కెరీర్ ఆరంభంలో టి20, వన్డే స్పెషలిస్ట్ బౌలర్‌గానే చూశారు. ఈ రెండు ఫార్మాట్‌లలో అంతర్జాతీయ క్రికెట్ బరిలోకి దిగిన రెండేళ్ల తర్వాత గానీ అతను తొలి టెస్టు ఆడలేదు. కానీ ఇప్పుడు టెస్టుల్లో బుమ్రా 'ఆల్‌టైమ్ గ్రేట్' బౌలర్లలో ఒకడిగా ఎదిగాడు. అతని పదునైన బంతులకు ప్రత్యర్థి బ్యాటర్ల వద్ద సమాధానమే ఉండటంలేదు. తన భిన్నమైన బౌలింగ్ శైలి అదనపు ప్రయోజనం కల్పిస్తుండగా... అసాధారణ బౌలింగ్ ప్రదర్శనలు అతని ఖాతాలో చేరాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా... జట్టు ఏదైనా బుమ్రాను ఎదుర్కొనేందుకు బ్యాటర్లు భయపడాల్సిన పరిస్థితి. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్లు బుమ్రా స్పెల్‌ను దాటితే చాలనుకుంటున్నారు. తాజా సిరీస్‌లో ఇది మరింత బాగా కనిపించింది. ఇప్పటికే అతను కేవలం 13.24 సగటుతో 29 వికెట్లు పడగొట్టాడు. ఆదివారం ట్రావిస్ హెడ్‌ను అవుట్ చేసి 200 వికెట్ల మైలురాయిని అందుకున్న బుమ్రా ఎందరితో సాధ్యం కాని అరుదైన ఘనతలను తన ఖాతాలో వేసుకున్నాడు.

- 200 వికెట్లు తీసిన 85 మంది బౌలర్లలో 20కంటే తక్కువ సగటుతో ఈ మైలురాయిని చేరిన ఏకైక బౌలర్ బుమ్రానే. అతను కేవలం 19.56 సగటుతో ఈ వికెట్లు తీశాడు. బుమ్రా తన 44వ టెస్టులో ఈ ఘనత సాధించాడు.
- అతి తక్కువ బంతుల్లో 200 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో బుమ్రా (8484) నాలుగో స్థానంలో ఉన్నాడు. వకార్ యూనిస్ (7725), స్టెయిన్ (7848), రబడ (8154) అతనికంటే తక్కువ బంతులు వేశారు.
- బుమ్రా తీసిన 202 వికెట్లలో 142 వికెట్లు దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలలో రావడం విదేశీ గడ్డపై అతని విలువ ఏమిటో అర్థమవుతుంది.
- భారత్ గెలిచిన 20 టెస్టుల్లో బుమ్రా భాగంగా ఉండగా... ఈ టెస్టుల్లో 110 వికెట్లతో అతని బౌలింగ్ సగటు కేవలం 14.4 కావడం అతని ప్రభావాన్ని చూపిస్తోంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

హంపి అ'ద్వితీయం'

రెండోసారి ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్

ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చెస్ ప్లేయర్‌గా రికార్డు	చివరిదైన 11వ రౌండ్‌లో నల్లపావులతో ఆడి నెగ్గిన భారత నంబర్‌వన్	110 మంది పాల్గొన్న టోర్నీలో 8.5 పాయింట్లతో అగ్రస్థానం	60 వేల డాలర్ల ప్రైజ్‌మనీ సొంతం	రేపటి నుంచి ప్రపంచ బ్లిట్జ్ టోర్నీలో బరిలోకి

గెలవాలన్న సంకల్పం... సరైన సన్నద్ధత ఉంటే... వయసు అనేది ఒక అంకె మాత్రమేనని... గొప్ప విజయాలు వాటంతట అవే వస్తాయని... రెండున్నర దశాబ్దాలుగా అంతర్జాతీయ మహిళల చెస్‌లో భారత ముఖచిత్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆణిముత్యం కోనేరు హంపి మరోసారి నిరూపించింది. సెకన్ల వ్యవధిలో చకచకా ఎత్తులు వేయాల్సిన ర్యాపిడ్ ఫార్మాట్‌లో 37 ఏళ్ల హంపి రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. 2019లో తొలిసారి జగజ్జేతగా నిలిచిన హంపి గత ఏడాది టైబ్రేక్‌లో త్రుటిలో ప్రపంచ టైటిల్‌ను కోల్పోయింది. ఈసారి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా... ఒకదశలో టైటిల్ నెగ్గే అవకాశాలు కనిపించకపోయినా... తన అనుభవాన్నంతా రంగరించి... రౌండ్ రౌండ్‌కూ ముందుకు దూసుకొచ్చి చివరి రౌండ్‌లో నల్ల పావులతో ఆడుతూ ప్రత్యర్థిని ఓడించి దర్జాగా విశ్వ కిరీటాన్ని సొంతం చేసుకుంది. 110 మంది క్రీడాకారిణుల మధ్య స్విస్ ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత హంపి 8.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ (2003, 2017) తర్వాత ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను రెండుసార్లు గెలిచిన తొలి భారతీయ ప్లేయర్‌గా... జు వెన్‌జున్ (చైనా) తర్వాత రెండుసార్లు ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా నిలిచిన రెండో మహిళా క్రీడాకారిణిగా హంపి గుర్తింపు పొందింది.

న్యూయార్క్: ఈ ఏడాది విశ్వ చదరంగ వేదికపై మరోసారి భారత పతాకం రెపరెపలాడింది. ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత నంబర్‌వన్ కోనేరు హంపి విజేతగా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ముగిసిన ర్యాపిడ్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 37 ఏళ్ల హంపి టైటిల్‌ను సొంతం చేసుకుంది. 110 మంది క్రీడాకారిణుల మధ్య స్విస్ ఫార్మాట్‌లో 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను దక్కించుకుంది. విజేతగా నిలిచిన హంపికి 60 వేల డాలర్ల (రూ. 51 లక్షల 23 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. 10వ రౌండ్ ముగిశాక హంపితోపాటు మరో ఆరుగురు క్రీడాకారిణులు జు వెన్‌జున్ (చైనా), కాటరీనా లాగ్నో (రష్యా), టాన్ జోంగి (చైనా), ఇరినె ఖరిస్మా సుకందర్ (ఇండోనేసియా), ద్రోణవల్లి హారిక (భారత్), అఫ్రూజా ఖమ్‌దమోవా (ఉజ్బెకిస్తాన్) 7.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచి టైటిల్ రేసులో నిలిచారు. అయితే చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 67 ఎత్తుల్లో ఖరిస్మా సుకందర్‌పై గెలుపొందడం... జు వెన్‌జున్, కాటరీనా లాగ్నో, హారిక, టాన్ జోంగి, అఫ్రూజా తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో హంపికి టైటిల్ ఖరారైంది. 8 పాయింట్లతో జు వెన్‌జున్, కాటరీనా లాగ్నో, టాన్ జోంగి, హారిక, అఫ్రూజా, అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్) ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ఈ ఆరుగురి ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. జు వెన్‌జున్‌కు రెండో స్థానం, కాటరీనాకు మూడో స్థానం లభించాయి. టాన్ జోంగి నాలుగో స్థానంలో, హారిక ఐదో స్థానంలో, కొస్టెనిక్ ఆరో స్థానంలో, అఫ్రూజా ఏడో స్థానంలో నిలిచారు.

ఓటమితో మొదలు... గెలుపుతో ముగింపు

ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హంపి 10వ సీడ్‌గా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో అమీనా కైర్‌బెకోవా (కజకిస్తాన్) చేతిలో హంపి ఓడిపోయింది. ఆ తర్వాత రెండో రౌండ్‌లో జేనాబ్ (అజర్‌బైజాన్)పై, మూడో రౌండ్‌లో సలోమి మెలియా (జార్జియా)పై గెలిచి... అల్మీరా (ఫ్రాన్స్)తో నాలుగో రౌండ్ గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. తొలి రోజు నాలుగు రౌండ్లు ముగిశాక హంపి 2.5 పాయింట్లతో 38వ స్థానంలో ఉంది. రెండో రోజు హంపి అద్భుతంగా ఆడింది. ఆడిన నాలుగు రౌండ్లలోనూ గెలిచింది. జెన్నిఫర్ యు (అమెరికా)పై, వంతిక అగర్వాల్ (భారత్)పై, తుర్ముంక్ ముంఖ్‌జుల్ (మంగోలియా)పై, నినో బత్సియాష్‌విలి (జార్జియా)పై హంపి విజయం సాధించింది. ఎనిమిది రౌండ్లు ముగిశాక హంపి 6.5 పాయింట్లతో జు వెన్‌జున్, హారికలతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానానికి చేరుకుంది. చివరిరోజు జు వెన్‌జున్, కాటరీనాలతో జరిగిన గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హంపి చివరి గేమ్‌లో ఖరిస్మాపై గెలిచి టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది. సోమవారం నుంచి ఈ టోర్నీలో మహిళల విభాగంలో భారత్ నుంచి ఎనిమిది మంది పోటీపడ్డారు. 7 పాయింట్లతో దివ్య దేశ్‌ముఖ్ 21వ ర్యాంక్‌లో, 6.5 పాయింట్లతో పద్మిని రౌత్ 26వ ర్యాంక్‌లో, 5.5 పాయింట్లతో వైశాలి 52వ ర్యాంక్‌లో, 5 పాయింట్లతో వంతిక అగర్వాల్ 67వ ర్యాంక్‌లో, 5 పాయింట్లతో నూతక్కి ప్రియాంక 71వ ర్యాంక్‌లో, 5 పాయింట్లతో సాహితి వర్షిణి 77వ ర్యాంక్‌లో నిలిచారు. ఓవరాల్‌గా ఈ ఏడాది భారత చెస్ కొత్త శిఖరాలను అందుకుంది. ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా... గత నెలలో పురుషుల క్లాసికల్ ఫార్మాట్‌లో దొమ్మరాజు గుకేశ్ ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు.

4 ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ చరిత్రలో హంపి సాధించిన పతకాలు. 2012లో కాంస్య పతకం నెగ్గిన హంపి... 2019లో స్వర్ణం, 2023లో రజతం, 2024లో స్వర్ణం గెలిచింది.

అర్జున్‌కు ఐదో స్థానం



ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఓపెన్ విభాగంలో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. రెండో రోజు గేమ్‌లు ముగిశాక టైటిల్ రేసులో నిలిచిన భారత నంబర్‌వన్ ఇరిగేశి అర్జున్ ఆఖరి రోజు తడబడ్డాడు. పదో గేమ్‌లో అలెగ్జాండర్ గ్రిష్‌చుక్ (రష్యా) చేతిలో అర్జున్ ఓడిపోవడం అతని టైటిల్ అవకాశాలను దెబ్బ తీసింది. నిర్ణీత 13 రౌండ్ల తర్వాత అర్జున్ 9 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచాడు. రష్యాకు చెందిన 18 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ వొలోడార్ ముర్జిన్ 10 పాయింట్లతో చాంపియన్‌గా అవతరించాడు. రష్యాకే చెందిన గ్రిష్‌చుక్, నిపోమ్‌నిషి 9.5 పాయింట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి క్లీన్‌స్వీప్ చేశారు.

ఈ విజయం ఎంతో ప్రత్యేకం

'సాక్షి'తో హంపి

ప్రపంచ టైటిల్స్ సాధించడం కోనేరు హంపికి కొత్తేమీ కాదు. 26 ఏళ్ల క్రితం తొలిసారి ప్రపంచ అండర్–10 విభాగంలో విశ్వవిజేతగా అవతరించిన హంపి ఆ తర్వాత 1998లో అండర్–12 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2000లో అండర్–14 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2001లో జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జగజ్జేతగా నిలిచింది. ఆ తర్వాత ఆసియా చాంపియన్‌షిప్, గ్రాండ్‌ప్రి టోర్నీ టైటిల్స్ సాధించిన హంపి 2019లో ర్యాపిడ్ ఫార్మాట్‌లో తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. ఐదేళ్ల క్రితం సాధించిన తొలి ప్రపంచ ర్యాపిడ్ టైటిల్‌తో పోలిస్తే ఈసారి విజయం ఎంతో ప్రత్యేకమని న్యూయార్క్ నుంచి 'సాక్షి'తో మాట్లాడుతూ వివరించింది. హంపి అభిప్రాయాలు ఆమె మాటల్లోనే...



- ఈ ఏడాది వ్యక్తిగతంగా అనుకున్న స్థాయిలో విజయాలు అందుకోలేదు. అందుకే ఏమాత్రం అంచనాలు లేకుండా ప్రపంచ ర్యాపిడ్ టోర్నీలో బరిలోకి దిగాను. తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూశాను. అయినప్పటికీ ఆశ వదులుకోలేదు. రెండో గేమ్ నుంచి గెలుపు బాట పట్టి చివరకు టైటిల్ సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ మెగా ఈవెంట్ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోలేదు. ఎప్పటిలాగే నాన్న గైడెన్స్ ఇచ్చారు. చెస్‌కు సంబంధించి చాలా గేమ్స్ ప్రాక్టీస్ చేశాను.
- 2017లో బిడ్డకు జన్మనిచ్చాక కొన్నాళ్లపాటు ఆటకు దూరంగా ఉన్నా. ఇప్పుడు నేను టోర్నీలు ఆడేందుకు బయట వెళ్లినపుడు పాప నా తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. నా విజయాల వెనుక భర్త దాసరి అన్వేష్, తల్లిదండ్రులు లత, అశోక్ పాత్ర, సహకారం ఎంతో ఉంది. ఈ ప్రపంచ టైటిల్ వారికే అంకితం ఇస్తున్నాను.
- చివరి గేమ్ ఒకదశలో 'డ్రా' అవుతుందని భావించా. టైబ్రేక్‌కు సిద్ధంగా ఉన్నా. అయితే నా ప్రత్యర్థి చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకొని విజయాన్ని దక్కించుకున్నా. గత ఏడాది ప్రపంచ ర్యాపిడ్ టోర్నీలో నిలకడగా రాణించాను. అయితే టైబ్రేక్‌లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచినందుకు చాలా నిరాశ చెందాను. ఈసారి గెలిచినందుకు ఆనందంగా ఉన్నా. నేటి నుంచి మొదలయ్యే ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లోనూ మళ్లీ పతకం సాధించేందుకు కృషి చేస్తా. 2022లో ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచాను.

'మీ కొడుకును చూసి దేశం గర్విస్తోంది'

నితీశ్ తండ్రితో సునీల్ గావస్కర్

మెల్‌బోర్న్: అద్భుత సెంచరీతో అందరి అభిమానాలను చూరగొన్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డిపై దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ మరోసారి ప్రశంసలు కురిపించాడు. తనను కలిసిన నితీశ్ తల్లిదండ్రులతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా గావస్కర్‌కు నితీశ్ తండ్రి ముత్యాల రెడ్డి పాదాభివందనం చేశాడు. 'మీరు దేశానికి ఒక మేలిమి వజ్రాన్ని అందించారు. అతని ప్రయాణంలో మీరు చేసిన త్యాగాల గురించి విన్నప్పుడు నాకు కన్నీళ్లు వచ్చాయి. మీ అబ్బాయిని చూసి దేశం గర్వపడుతోంది' అని గావస్కర్ అన్నాడు. మరోవైపు నితీశ్ సెంచరీ చేయడంలో సహకరించిన సిరాజ్‌కు కూడా అతని తండ్రి కృతజ్ఞతలు తెలిపాడు. 'నితీశ్ 99 వద్ద ఉండగా సిరాజ్ బ్యాటింగ్‌కు వచ్చాడు. అతను ఎలా ఆడతాడో అని ఉత్కంఠకు లోనయ్యా. అయితే ఆ బంతులు సమర్థంగా ఆడి సెంచరీకి సహకరించిన డీఎస్పీ సిరాజ్‌కు కూడా థ్యాంక్స్' అని ముత్యాల రెడ్డి అన్నాడు.



'విమర్శకులకు ఇదే నా సమాధానం'

- టెస్టు క్రికెట్‌లోనూ రాణించగలనని నిరూపించా
- నితీశ్ కుమార్ రెడ్డి వ్యాఖ్య



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో నితీశ్ కుమార్ రెడ్డికి చోటు దక్కడం చాలా మందికి ఆశ్చర్యానికి గురి చేసింది. టి20 ఆటగాడు టెస్టుల్లో రాణించగలడా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు ఎంసీజీలో తన అద్భుత సెంచరీతో ఈ ఆంధ్ర ఆటగాడు అందరి అనుమానాలను పటాపంచలు చేశాడు. ఈ ప్రదర్శనతో తన సత్తా ఏమిటో చూపించాడు. 'నా ఆట గురించి చాలా మందికి సందేహాలు ఉన్నాయనే విషయం నాకూ తెలుసు. ఐపీఎల్‌లో రాణించిన ఆటగాడు ఇక్కడ సరిపోతాడా అని అన్నారు. వారి మాటలను తప్పని నిరూపించాలనుకున్నా. ఇప్పుడు అదే చేసి చూపించా. భారత జట్టు కోసం వంద శాతం శ్రమించేందుకు నేను సిద్ధం' అని ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో నితీశ్ వ్యాఖ్యానించాడు. సెంచరీ సాధించిన క్షణాలు అపూర్వమని నితీశ్ గుర్తు చేసుకున్నాడు. కోహ్లి అభినందనలు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అతను అన్నాడు. 'అది చాలా గొప్ప క్షణం. కోహ్లి ఆటను చూస్తూ, అభిమానిస్తూ పెరిగిన నేను ఇప్పుడు అతనితో కలిసి ఆడాను. పెర్త్‌లో కోహ్లి సెంచరీ చేసినప్పుడు మరో ఎండ్‌లో నేనున్నాను. నా ప్రదర్శనను కోహ్లి ఎంతో అభినందించి ప్రోత్సహించాడు. చాలా బాగా ఆడావని చెప్పాడు. ఇలాంటి సమయం గురించే నేను కలలుగన్నాను. నా సెంచరీ పూర్తి చేసుకునేందుకు సహకరించిన సిరాజ్‌కు కృతజ్ఞతలు. నిజానికి నా శతకంకంటే సిరాజ్ చివరి బంతిని డిఫెన్స్ ఆడినప్పుడే మైదానం దద్దరిల్లింది' అని నితీశ్ గుర్తు చేసుకున్నాడు. గత కొన్నేళ్లుగా తన బ్యాటింగ్‌ను మెరుగుపర్చుకునేందుకు ఎంతో కష్టపడ్డానని, ఇప్పుడు బౌలింగ్‌లో కూడా పదును పెంచాల్సి ఉందని నితీశ్ చెప్పాడు.

హంపికి వైఎస్ జగన్ అభినందనలు


వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో కోనేరు హంపి (ఫైల్)

సాక్షి, అమరావతి: భారత గ్రాండ్ మాస్టర్, తెలుగు తేజం కోనేరు హంపి 'ఫిడే' మహిళల వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌గా నిలిచిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ అపూర్వ విజయంతో ఆమె స్వస్థలంతో పాటు రాష్ట్ర, దేశమంతటికీ గర్వకారణంగా నిలిచిందని ప్రశంసిస్తూ ఆదివారం 'ఎక్స్' వేదికగా తన ఖాతాలో పోస్టు చేశారు. 'ప్రతిష్టాత్మకమైన 2024 ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో అద్భుత విజయం సాధించడం అందరికీ గర్వకారణం. ఆమె విజయం యువ ప్రతిభావంతులకు, ముఖ్యంగా బాలికలకు స్ఫూర్తిదాయకం. హంపి నిరంతర కృషి, నిబద్ధతతో ప్రపంచ అత్యుత్తమ చెస్ క్రీడాకారిణిగా నిలిచింది. భవిష్యత్తులో ఆమె మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అంటూ వైఎస్ జగన్ పోస్టు చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	227	78,699
నిఫ్టీ ▲	63	23,813

విదేశీ సూచీలు

నాస్‌డాక్	19,718	▽	302
డోజోన్స్	42,977	▽	302
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,150	△	13
డాక్స్	19,984	△	136
షాంఘై	3,400	△	2
నికాయ్	40,281	△	713

ఫారెక్స్ రేట్లు

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.99	87.10
£	బ్రిటన్ పౌండ్	105.36	109.63
€	యూరో	87.24	91.09
¥	జపాన్ యెన్(100)	43.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	51.04	55.16
S$	సింగపూర్ డాలర్	60.93	65.00
SAR	సౌదీ రియాల్	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	22.43	24.15
¥	చైనా యువాన్	10.97	12.56

కొత్త ఏడాదికి సన్నద్ధమా?

- సరైన ఆచరణతోనే ఆర్థిక స్వేచ్ఛ
- ఇందుకు పక్కా ప్రణాళిక అవసరం
- సంపాదనలో పెట్టుబడికి వాటా ఇవ్వాలి
- రుణ బంధాలకు గుడ్‌బై చెప్పాలి
- ఆర్థిక శ్రేయస్సే సంకల్పం కావాలి



కేలండర్‌లో నంబర్ మారిపోతోంది. కొత్త సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నామంటే ఏదో తెలియని హుషారు. కొత్త ఏడాదిలో కలలు సాకారం కావాలని, మరిన్ని విజయాలు వరించాలని, గొప్ప అవకాశాలను అందుకోవాలని, వృత్తి/వ్యాపారం/ఉద్యోగంలో రాణించాలని ఇలా.. ఎన్నెన్నో ఆకాంక్షలు. ఈ జాబితాలో ఆర్థిక లక్ష్యాలకూ చోటు ఉండాల్సిందే. అయితే ఆర్థిక నిర్ణయాలకు ఫలితాలు వెంటనే కనిపించవు. కొన్నేళ్ల ప్రయాణం తర్వాతే విజయాలు సాకారం అవుతాయి. పెట్టుబడి వృద్ధి అన్నది ఒక్క ఏడాదితో అయ్యేది కాదు. ఇది సుదీర్ఘ ప్రయాణం. ఈ దిశగా ఆచరణ పక్కాగా ఉండాలి. కారు, సొంతిల్లు, పిల్లల విద్య, రిటైర్మెంట్.. తదితర కీలక లక్ష్యాలను సరైన ప్రణాళికతోనే చేరుకోగలరు. ప్రస్తుత ఏడాది ఆర్థిక నిర్ణయాలు, పెట్టుబడులు, రుణాలను ఒక్కసారి సమీక్షించుకోవాల్సిన తరుణం కూడా ఇదే. ఆర్థిక సన్నద్ధతను పరీక్షించుకోవాల్సిన సందర్భం కూడా ఇదే.

- సాక్షి, బిజినెస్‌డెస్క్

అత్యవసర నిధి



కుటుంబానికి అత్యవసర నిధి తప్పనిసరి. కారణం ఏదైనా ఉన్నట్టుండి ఆదాయం ఆగిపోతే.. కుటుంబ అవసరాలు, పెట్టుబడుల లక్ష్యాలు నిలిచిపోకూడదు. ముఖ్యమైన అవసరాలు, పెట్టుబడులకు ప్రతి నెలా ఎంత మొత్తం వెచ్చిస్తున్నారో చూసుకుని.. కనీసం ఆరు నెలల నుంచి 12 నెలలకు సరిపడే మొత్తాన్ని అత్యవసర నిధి కింద ఏర్పాటు చేసుకోవాలి. ఈ మొత్తాన్ని లిక్విడ్ ఫండ్స్‌లో లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవాలి. అవసరమైనప్పుడు వేగంగా వెనక్కి తీసుకోవచ్చు.



బడ్జెట్ రూపకల్పన

రూపాయి ఆదా చేయడం తిరిగి సంపాదించడంతో సమానం. అందుకే డబ్బు విషయంలో లెక్క పక్కాగా ఉండాలి. ఇందుకు వీలు కల్పించేదే ఆర్థిక ప్రణాళిక. ఈ దిశగా మొదట చేయాల్సింది కుటుంబానికి బడ్జెట్ ఏర్పాటు చేసుకోవడం. కానీ, అందరికీ ఆర్థిక అంశాలపై అవగాహన ఉండదు. అటువంటప్పుడు సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ లేదా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ తదితర నిపుణుల సాయంతో బడ్జెట్ రూపొందించుకోవాలి. ముందుగా మీ ఆర్థిక స్థితిపై అవగాహన అవసరం. వివిధ మార్గాల్లో వస్తున్న మొత్తం ఆదాయం, వ్యయాలు, అవసరాలు, కోరికలు, జీవితంలో ముఖ్యమైన లక్ష్యాలు, వాటిని నెరవేర్చుకునేందుకు సమకూర్చుకోవాల్సిన వనరులు తదితర సమాచారం ఆధారంగా నిపుణులు మీకంటూ ప్రత్యేకమైన ఆర్థిక ప్రణాళికను సూచిస్తారు. ఆర్థిక స్వేచ్ఛకు స్పష్టమైన మార్గసూచీ మీకు లభిస్తుంది.



50/30/20 సూత్రం

ఆర్థిక క్రమశిక్షణతో మెలిగేవారికి 50/30/20 సూత్రం ఆచరణీయం. ఒక ఆర్థిక సంవత్సరంలో పన్నుల చెల్లింపులు పోను మిగులు ఆదాయంలో 50 శాతాన్ని అవసరాలకు వెచ్చించుకోవాలి. రోజువారీ జీవన వ్యయాలు (గ్రోసరీ, ఇంటి అద్దె, ఫోన్, గ్యాస్, వాహన ఇంధన వ్యయాలు, పిల్లల స్కూల్/కాలేజీ ఫీజులు/ఔషధాలు, చికిత్సల ఖర్చులు), ఇన్సూరెన్స్ ప్రీమియం ఇవన్నీ అవసరాల కిందకే వస్తాయి. 30 శాతాన్ని కోరికలకు కేటాయించుకోవచ్చు. జీవనానికి కచ్చితంగా అవసరం లేనివి ఈ విభాగంలోకి వస్తాయి. రెస్టారెంట్లలో విందులు, విహార యాత్రలు, ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువులు, లగ్జరీ ఉత్పత్తులు, వినోదం ఈ విభాగం కిందకు వస్తాయి. మిగిలిన 20 శాతాన్ని పెట్టుబడులకు కేటాయించుకోవాలి. ఈ పెట్టుబడులు జీవితంలో ముఖ్యమైన లక్ష్యాలను నెరవేర్చే విధంగా ఉండాలి. ఇల్లు కొనుగోలు, పిల్లల ఉన్నత విద్య, పిల్లల వివాహాలు, ప్రశాంతమైన విశ్రాంత జీవనం వీటన్నింటికీ మద్దతుగా నిలవాలి. అవసరమైతే ముఖ్యమైన జీవన లక్ష్యాల కోసం 30–40 శాతం మేర పెట్టుబడులకు కేటాయించుకుని, కోరికలకు 20–10 శాతం బడ్జెట్‌తో సరిపెట్టుకున్నా తప్పులేదు. రోజువారీ ముఖ్యమైన జీవన అవసరాలు మొదటి ప్రాధాన్యంగా, ముఖ్యమైన జీవిత లక్ష్యాలు రెండో ప్రాధాన్యంగా పెట్టుబడుల ప్రణాళిక సాగిపోవాలి.

పన్ను ప్రయోజనాలు

పెట్టుబడులకు పన్ను ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. దీనివల్ల రాబడి పెంచుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులపై సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల ఆదాయంపై పన్ను లేకుండా చూసుకోవాలంటే అందుకు ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ అనుకూలం. రిటైర్మెంట్ ఫండ్‌కు వీలైన పీపీఎఫ్, ఎన్‌పీఎస్ సాధనాల్లో చేసే పెట్టుబడులకూ పన్ను ప్రయోజనాలున్నాయి. అందుకే పెట్టుబడులను పన్ను ప్రయోజనాలతో సమన్వయం చేసుకోవాలి. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై పన్ను ప్రయోజనాలను సైతం వినియోగించుకోవాలి. అంతేకాదు, పన్నుల్లోనూ ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. వీటికి అనుగుణంగా నిర్ణయాల్లో సవరణలు కూడా అవసరం కావొచ్చు.



స్పష్టమైన ఆచరణ

ముఖ్యమైన లక్ష్యాలకు అవసరమైన మొత్తాన్ని సమకూర్చుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ లక్ష్యాలకు ఎంత మొత్తం అవసరం అన్నది నిపుణుల సాయంతో తేల్చుకోవాలి. ఈ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు మెరుగైన పెట్టుబడి సాధనాలను గుర్తించాలి. 10 ఏళ్లు అంతకుమించిన సాధనాలకు ఈక్విటీలు మెరుగైనవి. కానీ, వీటిల్లో స్వల్పకాలానికి (మూడేళ్లలోపు) రిస్క్ ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలంలో ఈ రిస్క్ ప్రభావం తగ్గిపోయి రాబడులు అధికంగా ఉంటాయి.



ఐదేళ్ల కంటే తక్కువ కాల లక్ష్యాలకు డెట్ సాధనాలు అనుకూలం. ఐదు- ఏడేళ్ల కాల లక్ష్యాలకు డెట్, ఈక్విటీ కలయికగా పెట్టుబడులు ఉండాలి. మొత్తం పెట్టుబడుల్లో 5–10 శాతం బంగారానికీ కేటాయించుకోవాలి. లక్ష్యాలకు కావాల్సిన రాబడుల కోసం ఏ ఏ సాధనాలను ఎంపిక చేసుకోవాలన్నది నిపుణులను అడిగి తెలుసుకోవాలి. సరైన అస్సెట్ అలోకేషన్ (వివిధ సాధనాల మధ్య వర్గీకరణ) వ్యూహం అమలు చేయాలి. ఈక్విటీ పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ఎంపిక చేసుకోవాలి. ప్రతి నెలా నిర్ణయించిన మేర ఆటోమేటిగ్గా వాటిల్లోకి వెళ్లేలా చూసుకోవాలి. ఆదాయం వచ్చిన వెంటనే ముందు చేయాల్సింది పెట్టుబడి. ఆ తర్వాతే మిగిలిన అవసరాల సంగతి చూడాలి. రిటైర్మెంట్ కోసం ఎన్‌పీఎస్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. మరీ ముఖ్యంగా సంపాదన మొదలు పెట్టిన మొదటి నెల నుంచే పెట్టుబడులు కూడా ప్రారంభం కావాలి. ఎందుకంటే పెట్టుబడి సంపదగా మారడంలో కాంపౌండింగ్ (రాబడిపై రాబడి) కీలకం అవుతుంది. ఈ కాంపౌండింగ్‌కు ఎక్కువ కాలం కావాలి. ఎంత ఎక్కువ వ్యవధి ఉంటే అంత అధికంగా సంపద సమకూర్చుకోవచ్చు.

బీమా రక్షణ

అత్యవసర నిధితోపాటే బీమా రక్షణ కూడా చాలా ముఖ్యమైనది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తికి జరగరానికి జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా కష్టాల్లోకి వెళ్లకుండా జీవిత బీమా రక్షణ (టర్మ్ లైఫ్) కల్పిస్తుంది. రోడ్డు ప్రమాదం లేదా అనారోగ్యం కారణంగా ఆస్పత్రి పాలైతే ఆరోగ్య బీమా అండగా నిలుస్తుంది. ఈ రెండింటిలో ఏది లేకపోయినా, ఆర్థిక కష్టాలను ఆహ్వానించినట్టే అవుతుంది. అంతేకాదు బడ్జెట్ ప్రణాళికలు తల్లకిందులవుతాయి. తన కుటుంబ జీవనం, కీలక లక్ష్యాలకు సంబంధించి పెట్టుబడులకు ఒక ఏడాదిలో ఎంత వ్యయం అవుతుందో.. అంతకు 20 రెట్ల మొత్తం టర్మ్ లైఫ్ అష్యూరెన్స్ తీసుకోవాలి. యాక్సిడెంటల్ డెత్, డిస్‌మెంబర్‌మెంట్ (వైకల్యం) రైడర్ జోడించుకోవాలి. ఒక కుటుంబానికి కనీసం రూ.5–10 లక్షల బేసిక్ ఇండెమ్నిటీ హెల్త్ పాలసీతో పాటు, రూ.50 లక్షలకు (రూ.5–10 డిడక్టబుల్) సూపర్ టాపప్ ప్లాన్, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్ కూడా ఉండాలి.



రుణపడొద్దు..

ఒక్కసారి బడ్జెట్ రూపొందించుకున్న తర్వాత దాని పరిధిలోనే లక్ష్మణ రేఖ దాటకుండా నడుచుకోవాలి. భవిష్యత్ అవసరాల కోసం నేటి కోరికలను నియంత్రించుకోవడం ఆర్థిక శాస్త్ర పరంగా ఎంత మాత్రం తప్పుకాదు. ఖర్చులు ఆర్జనను మించరాదు. మరీ ముఖ్యంగా ఆర్జనలో 70 శాతం దాటిపోకుండా చూసుకుంటేనే, ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లకుండా చూసుకోవడం సాధ్యపడుతుంది. ఇందులో భాగంగా బై నౌ పే లేటర్, క్రెడిట్ కార్డు రుణాలకు దూరంగా ఉండాలి. రేపటి వనరులను కూడా నేడే ఖర్చు పెట్టేందుకు వీలు కల్పించే సాధనాలు ఇవి. వీటికి అలవాటుపడితే బయటకురావడం అంత సులభం కాదు. ఆర్థిక స్వేచ్ఛకు అతిపెద్ద అవరోధం రుణమే. గృహ రుణం, విద్యా రుణం మినహా మరే ఇతర రుణం జోలికి పోవకపోవడమే మంచిది. తప్పనిసరి అయి ఏదైనా రుణాన్ని ఆశ్రయించినట్టయితే.. పెట్టుబడి కంటే ముందే ఈ రుణాన్ని తీర్చివేసేందుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. తద్వారా క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉండేలా కాపాడుకోవచ్చు. దీనివల్ల భవిష్యత్‌లో విద్యా, గృహ రుణాలు సులభంగా, తక్కువ రేటుకు పొందొచ్చు. పెట్టుబడులను రుణాల కోసం త్యాగం చేయాల్సి వస్తే.. అప్పుడు భవిష్యత్ లక్ష్యాల్లోనూ రాజీపడాల్సి వస్తుంది. అందుకే వచ్చిన ఆదాయం పరిధిలోనే జీవించడం నేర్చుకోవాలి. ఒకవేళ రుణఊబిలోకి దిగి, బయటకు వచ్చే మార్గం తోచకపోతే ఆలస్యం చేయకుండా నిపుణుల సాయం తీసుకోవాలి. అవసరమైతే ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. ఇలా చేయడం వల్ల రుణాల నుంచి బయటపడడంతోపాటు, దీర్ఘకాల లక్ష్యాలకు కావాల్సిన పెట్టుబడిని సమకూర్చుకోవచ్చు.



నామినీ/వీలునామా

ఇక పెట్టుబడులకు నామినేషన్ ఇవ్వడం మర్చిపోవద్దు. బ్యాంక్ ఖాతా, లైఫ్ ఇన్సూరెన్స్,, మ్యూచువల్ ఫండ్స్, డీమ్యాట్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇలా ప్రతి పెట్టుబడికి నామినీని నమోదు చేయాలి. అనుకోనిది జరిగితే, ఆయా పెట్టుబడులు తమ వారికి సులభంగా బదిలీ అయ్యేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఇక కుటుంబానికి ఆధారమైన వ్యక్తి వీలునామా రాయడం మంచి చర్య అవుతుంది. నామినేషన్ అన్నది కేవలం క్లెయిమ్ అర్హత కల్పిస్తుంది. కానీ, వీలునామా అన్నది చట్టపరమైన హక్కులకు మార్గాన్ని సులభం చేస్తుంది. వారసుల మధ్య వివాదాలను నివారిస్తుంది. తమ ఆకాంక్షలకు అనుగుణంగా ఆస్తుల బదిలీకి చట్టబద్ధమైన డాక్యుమెంట్‌గా సాయపడుతుంది.



ముగ్గురిలో ఇద్దరు రుణగ్రస్తులే



- ✓ మన దేశంలో రుణ భారం లేని వారు 38 శాతమేనట. అంటే ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఆర్థిక సంస్థలకు రుణపడి ఉన్నట్టు తెలుస్తోంది.
- ✓ మరీ ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వారిలోనూ 31 శాతం మంది ఈఎంఐ చెల్లింపులతో సతమతం అవుతున్నారు.
- ✓ 40 శాతం మందికి అత్యవసర నిధి లేదు
- ✓ 27 శాతం మందికి మెరుగైన పన్నుల ప్రణాళిక లేదు.
- ✓ దేశంలో 74 శాతం మందికి సరిపడా బీమా కవరేజీ లేదు. వీరిలో కొందరికి అసలు బీమా రక్షణే లేదు.
- ✓ ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్న వారిలోనూ 54 శాతం మందికి కాంపౌండింగ్ గురించి తెలియకపోవడం విడ్డూరం

(ఫైనాన్షియల్ ఫిట్‌నెస్ ప్లాట్‌ఫామ్ 'ఫిన్నోవేట్' ఈ ఏడాది నిర్వహించిన సర్వేలో తెలిసిన ఆసక్తికర అంశాలు ఇవి)

సమీక్ష

తమ బడ్జెట్‌ను, బడ్జెట్‌లో భాగంగా వివిధ ప్రణాళికలు, పెట్టుబడులను కనీసం ఏడాదికి ఒకసారైనా సమీక్షించుకోవాలి. నూతన సంవత్సరం లేదా ఆర్థిక సంవత్సరం ఆరంభం ఇందుకు సుముహూర్తం అవుతుంది.

✔ విడిగా ఒక లక్ష్యానికి ఎంత కాలంలో, ఎంత మొత్తం సమకూర్చుకోవాలన్నది బడ్జెట్‌లో రాసుకుంటారు. అందుకు అనుకూలించే మ్యూచువల్ ఫండ్స్ ఎంపిక చేసుకుంటారు. మరి సదరు మ్యూచువల్ ఫండ్స్ పనితీరు మీ రాబడులు ఆకాంక్షలకు అనుగుణంగానే పనితీరు చూపిస్తున్నాయా? లేదా? పనితీరు బాగోలేకపోతే ఆ ఒక్క పథకంలోనే అలా ఉందా లేక ఆ విభాగంలోని మిగిలిన పథకాల పనితీరు కూడా అదే మాదిరిగా ఉందా? అన్నది పరిశీలించుకోవాలి. విభాగం మొత్తం పనితీరు అదే మాదిరిగా ఉంటే ఆందోళన అక్కర్లేదు. మరికొంత వ్యవధి ఇచ్చి చూడొచ్చు. పథకంలో లోపం ఉంటే, అందుకు కారణాలను గుర్తించాలి. అవి సమగ్రంగా లేకపోతే మరో పథకంలోకి మారిపోవడాన్ని పరిశీలించొచ్చు.

✔ ఈక్విటీ, డెట్ సాధనాల్లో ఏదో ఒక విభాగంలోని పెట్టుబడుల విలువ గణనీయంగా వృద్ధి చెందితే, రీబ్యాలన్స్ (తిరిగి సమతుల్యత) చేసుకోవాలి. ఒక విభాగం పెట్టుబడుల విలువ అధికంగా వృద్ధి చెందినప్పుడు.. అధిక విలువ ఉన్న చోట నిర్ణీత శాతం మేర పెట్టుబడులు విక్రయించి, తక్కువ విలువ వద్ద నున్న విభాగంలోకి మార్చుకోవాలి. దీన్నే అస్సెట్ అలోకేషన్‌గా చెబుతారు. దీని ద్వారా రిస్క్‌ను అధిగమించొచ్చు.



✔ టర్మ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్‌లోనూ మార్పులు అవసరం పడొచ్చు. ఉదాహరణకు గృహ రుణం తీసుకున్నారని అనుకోండి.. ఆ మేరకు టర్మ్ కవరేజీని పెంచుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. ఇతర ఏ రుణం తీసుకున్నా సరే ఆ మేరకు కవరేజీ పెంచుకోవాలి. వివాహం, పిల్లలతోపాటు బాధ్యతలూ పెరుగుతుంటాయి. ఏటా ఆదాయం కూడా వృద్ధి చెందుతుంది. వాటికి అనుగుణంగా తమ బీమా కవరేజీని సమీక్షించుకోవాలి. ఆరోగ్య బీమా కవరేజీ ప్రస్తుత కుటుంబ అవసరకాలకు సరిపడా ఉందా? అని సమీక్షించుకోవాలి. లేదంటే అదనపు కవరేజీతో తక్కువ వ్యయానికే సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవచ్చు.

✔ రుణ భారంలో ఉంటే కొత్త ఏడాదిలో దాన్నుంచి బయటపడే మార్గాన్ని గుర్తించాలి.

✔ అత్యవసర నిధిలోనూ మార్పులు అవసరమే. జీవన వ్యయాలు పెరుగుతూ ఉంటాయి. కనుక 2–5 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న అత్యవసర నిధి ఇప్పటి అవసరాలకు సరిపోకపోవచ్చు. ప్రస్తుత ఖర్చులను కనీసం ఏడాది పాటు అయినా అత్యవసర నిధి గట్టెక్కించగలదా? అన్నది సమీక్షించుకోవాలి. లేదంటే అదనంగా సమకూర్చుకోవాలి. రెండేళ్ల అవసరాలకు సరిపడా ఏర్పాటు చేసుకుంటే మరింత నిశ్చింతగా ఉండొచ్చు.

✔ నామినేషన్లు, వీలునామాలో మార్పులు అవసరం అనుకుంటే ఆ మేరకు మార్పులు చేసుకోవాలి. అవసరమైతే ఏడాదిలో ఒక్కసారి అయినా ఆర్థిక నిపుణులను సంప్రదించి సమగ్రమైన సమీక్ష చేయించుకోవాలి.

విదేశీ అంశాలే కీలకం

ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై విశ్లేషకులు • ఎఫ్‌ఐఐల తీరు, రూపాయి మారకం ప్రభావం • డిసెంబర్ ఆటో విక్రయాలకు ప్రాధాన్యం



ముంబై: కొత్త కేలండర్ ఏడాది(2025) ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో నెలకొనే ట్రెండ్‌పై ఇన్వెస్టర్ల నుంచి అత్యధిక ఆసక్తి వ్యక్తంకానుంది. దీనికితోడు సెకండరీ మార్కెట్‌ను మించుతూ ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. ఇండోఫామ్ ఎక్విప్‌మెంట్, అన్య పాలీటెక్ అండ్ ఫెర్టిలైజర్స్(ఎస్ఎంఈ) రెండు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానుండగా.. ఇటీవలే ఐపీవోలు పూర్తి చేసుకున్న నాలుగు కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నాయి. ఈ జాబితాలో వెంటివ్ హాస్పిటాలిటీ, సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్, కరారో ఇండియా, యూనిమెక్ ఏరోస్పేస్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్(మంగళవారం) ఉన్నాయి. దేశీయంగా విదేశీ ఇన్వెస్టర్ల తీరు, ఆర్థిక గణాంకాలు, గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లలో నెలకొనే పరిస్థితులు వంటి అంశాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు స్టాక్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఆటో గణాంకాలు

కొత్త ఏడాదిలో డిసెంబర్ నెలకు వివిధ వాహన విక్రయ గణాంకాలు వెలువడనున్నాయి. ప్యాసింజర్ కార్ల విభాగంలో మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్, టాటా మోటార్స్, ఎంఅండ్ఎం తదితర కంపెనీల అమ్మకాలకు ప్రాధాన్యత ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇదేవిధంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, వాణిజ్య వాహన విక్రయాలపై సైతం ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు తెలియజేశాయి. వార్షిక ప్రాతిపదికన నవంబర్‌లో ట్రాక్టర్ విక్రయాలు అత్యధికంగా 30 శాతం జంప్‌చేస్తే, ద్విచక్ర వాహనాలు 16 శాతం ఎగశాయి. అయితే కార్ల అమ్మకాలు 14 శాతం, వాణిజ్య వాహనాలు 6 శాతం చొప్పున క్షీణించడం గమనించదగ్గ అంశం. ఇక డిసెంబర్ నెలకు టెలికం వినియోగదారులు, డేటా వినియోగం, ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) తదితర వివరాలు వెల్లడికానున్నాయి.

ఎఫ్‌పీఐల అమ్మకాలు

ఉన్నట్టుండి డిసెంబర్ తొలి వారంలో కొనుగోళ్ల యూటర్న్ తీసుకున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నెలాఖరులో తిరిగి అమ్మకాల బాట పట్టారు. శుక్రవారం(27)తో ముగిసిన గత 9 సెషన్లలో రూ. 22,151 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ఇదే సమయంలో దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(డీఐఐలు) రూ. 23,036 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! డిసెంబర్ నెలలో తొలుత కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన విదేశీ ఇన్వెస్టర్లు తదుపరి అమ్మకాలకు దిగడంతో ఇప్పటివరకూ నికరంగా రూ. 10,444 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్లయ్యింది. కాగా.. నవంబర్‌లో రూ. 45,974 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. అక్టోబర్‌లో కొత్త రికార్డ్ నెలకొల్పుతూ రూ. 1.14 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి మళ్లించిన విషయం విదితమే. అయితే మరోపక్క డీఐఐలు నవంబర్‌లో రూ. 44,484 కోట్లు, అక్టోబర్‌లో రూ. 21,593 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. దీంతో ఎఫ్‌పీఐల పెట్టుబడులు లేదా అమ్మకాలు కీలకం కానున్నాయి.

ఇతర అంశాలు

కొద్ది రోజులుగా ప్రపంచ ప్రధాన కరెన్సీలతో బలపడుతున్న డాలర్ కారణంగా రూపాయి బలహీనపడుతూ వస్తోంది. గత వారం చివర్లో ఉన్నట్టుండి పతన బాట పట్టింది. డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ చరిత్రలోనే కనిష్టంగా రూ. 85.80ను తాకింది. దీంతో ముడిచమురు, బంగారం దిగుమతుల భారం పెరగనుంది. కాగా.. ఎఫ్‌పీఐల అమ్మకాలు, రూపాయి బలహీనతలు ఇన్వెస్టర్లలో ఆందోళనలకు కారణంకానున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా, రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

గత వారం భారీ ఆటుపోట్ల మధ్య మార్కెట్లు బలపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 657 పాయింట్లు(0.85 శాతం) లాభపడి 78,699 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 226 పాయింట్లు(0.95 శాతం) ఎగసి 23,813 వద్ద స్థిరపడింది.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ రూరల్ ఆపర్చూనిటీస్ ఫండ్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ తాజాగా రూరల్ ఆపర్చూనిటీస్ ఫండ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇది జనవరి 9న ప్రారంభమై 23న ముగుస్తుంది. ఇది గ్రామీణ ప్రాంతాల సంబంధిత స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీము. దేశ జీడీపీలో గ్రామీణ ప్రాంతాల వాటా గణనీయంగా ఉంటోంది. ప్రభుత్వం కూడా గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఎకానమీని మెరుగుపర్చడంపై ప్రధానంగా దృష్టి పెడుతోంది. కాబట్టి ఈ థీమ్ అనేది వృద్ధి అవకాశాలను అందించవచ్చు. ఈ ఫండ్, వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్లవ్యాప్తంగా లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రూరల్ థీమ్ ఆధారిత సెక్టార్లకు కేటాయింపులను అటూ, ఇటూ మార్చుకునే వెసులుబాటును ఇది కల్పిస్తుంది. ఆర్థిక వృద్ధికి దోహదపడే విభాగం అయినందున ఇందులో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఇన్వెస్టర్లకు దేశ గ్రామీణ వృద్ధి గాథలో పాలుపంచుకునే అవకాశం లభించగలదని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఈడీ శంకరన్ నరేన్ తెలిపారు. దీనికి నిఫ్టీ రూరల్ ఇండెక్స్ ప్రామాణిక సూచీగా ఉంటుంది. 6 నెలల ఫ్రీ-ఫ్లోట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సగటు ఆధారంగా అతి పెద్ద 75 స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తారు. శంకరన్ నరేన్, ప్రియాంక ఖండేల్వాల్ ఈ స్కీమును నిర్వహిస్తారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
2024 పట్టిందల్లా బంగారమే

ప్రజాశ్రేయస్సుకే న్యాయస్థానాలు

- ప్రజల భాషలోనే తీర్పులిస్తే కక్షిదారులకు అర్థమవుతాయి
- ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి. చిత్రంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ నగేశ్ భీమపాక

విజయవాడ కల్చరల్/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ప్రజల శ్రేయస్సు కోసమే న్యాయస్థానాలు ఉన్నాయని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి అన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. తెలుగులో న్యాయపాలన సదస్సు అంశంగా జరిగిన కార్యక్రమానికి జస్టిస్ శేషసాయి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ప్రజల భాషలోనే తీర్పులు ఇచ్చినప్పుడు కక్షిదారులకు అర్థమయ్యే అవకాశం ఉంటుందని.. జిల్లా కోర్టు స్థాయిలో కూడా తెలుగులో తీర్పులిచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ మన్మథరావు మాట్లాడుతూ.. పాలనా వ్యవస్థ తెలుగులోనే సాగాలని, న్యాయపరమైన అంశాలు సైతం తెలుగులోనే ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ.. న్యాయ సంబంధిత పుస్తకాలు ఆంగ్లంలోనే ఉంటాయని, వాటిని తెలుగులోకి అనువదించాల్సిన అవసరముందని సూచించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. 99 శాతం మందికి కోర్టుల్లో ఏం జరుగుతుందో తెలీడంలేదని, వాద ప్రతివాదనలు తెలుగులోనే సాగాలని అభిప్రాయపడ్డారు. తెలుగులో చట్టాలు తీసుకురావాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహనరావు కూడా సూచించారు. మరోవైపు.. సాహితీ ప్రతినిధుల సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యనిర్వాహక గౌరవాధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. సాహితీ సంస్థలు విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తూ సాంస్కృతిక, కళావైభవానికి కృషిచేయాలని కోరారు.



విశాఖ వేదికగా ఆకట్టుకున్న బ్రహ్మాంజలి

విశాఖ బీచ్‌రోడ్డులోని ఎం.జి.ఎం పార్క్ వేదికగా బ్రహ్మాంజలి-మహా బృంద నృత్యం ఆదివారం ఘనంగా జరిగింది. ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్ - 2024లో భాగంగా మూడో రోజు ఈ కార్యక్రమం నిర్వహించారు. 1500 మందికిపైగా కూచిపూడి నృత్యకళాకారులు ఏక కాలంలో ఒకే వేదికపై ఈ బ్రహ్మాంజలి నిర్వహించారు. కూచిపూడి గురువులకు నివాళిగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఫెస్టివల్ డైరెక్టర్ బత్తిన విక్రం గౌడ్ తెలిపారు. - ఏయూక్యాంపస్ (విశాఖ)

నేరం వెనుక నిజం 2024

కుటుంబ కలహాలతోనే అత్యధిక హత్యలు

రేప్ కేసుల్లో నిందితులు పరిచయస్తులే..

నేర గణాంకాల విశ్లేషణ




సాక్షి, హైదరాబాద్: సమాజంలో జరిగే ప్రతి నేరం వెనుక ఓ కారణం కచ్చితంగా ఉంటుంది. వార్షిక విలేకరుల సమావేశం సందర్భంగా ఆదివారం డీజీపీ డాక్టర్ జితేందర్ నేరాల సంబంధిత గణాంకాలను విడుదల చేశారు. 2024కు (నవంబర్ వరకు) సంబంధించి రాష్ట్రంలో నమోదైన నేరాలను పరిశీలిస్తే..వీటిల్లో అనేక ఆసక్తికరమైన కోణాలు కూడా ఉన్నాయి.

చోరీలకు సెల్‌ఫోన్ల లింకు



ప్రతి వ్యక్తి చేతిలోకి అందుబాటులోకి వచ్చిన సెల్‌ఫోన్ ప్రభావం కేవలం సైబర్ నేరాల పైనే కాదు. చోరీ, దోపిడీ, బందిపోటు దొంగతనం (డెకాయిటీ) కేసుల పైనా ఉంటోంది. ఈ ఏడాది 58 డెకాయిటీ కేసులు నమోదు కాగా.. వీటిలో 5 సెల్‌ఫోన్లు లాక్కుపోవడానికి సంబంధించివే. 703 దోపిడీ కేసుల్లో 67, 19480 చోరీ కేసుల్లో 1960 ఫోన్లతో ముడిపడి ఉన్నవే కారణం కావడం గమనార్హం.

కుటుంబీకులే కత్తికడుతున్నారు...



బాడీలీ అఫెన్స్‌గా పిలిచే హత్య కేసులకు పోలీసులు చాలా ప్రాధాన్యం ఇస్తారు. వీటి దర్యాప్తు కోసం అవసరమైతే ప్రత్యేక బృందాలనూ రంగంలోకి దింపుతారు. సాధారణంగా ఓ వ్యక్తి/వ్యక్తులు మరొకరిని చంపడానికి ఆర్థిక లావాదేవీలే కారణమని భావిస్తాం. అయితే ఈ ఏడాది రాష్ట్రంలో నమోదైన 856 హత్య కేసుల్లో అత్యధికంగా 229 (26.75 శాతం) కేసులు కుటుంబ కలహాల వల్లే జరిగాయి. అక్రమ సంబంధాల కారణంగా 102, భూ వివాదాలతో 82, చిరు వివాదాల వల్ల మరో 82 హత్యలు జరిగితే.. ఆర్థిక కారణాల వల్ల 53 హత్యలు జరిగాయి. మరో 259 మాత్రం రకరకాలైన ఇతర కారణాల వల్ల జరిగాయి.

పిల్లలు తప్పిపోయినా కిడ్నాపే...

డబ్బు కోసం లేదా ఇతరత్రా లబ్ధి కోసం వ్యక్తుల్లో, ముఠానో ఎవరినైనా ఎత్తుకుపోయి నిర్బంధిస్తే కిడ్నాప్‌గా పరిగణిస్తారు. అయితే ఈ ఏడాది తెలంగాణలో 1,525 అపహరణ కేసులు నమోదయ్యాయి. ఇంతమంది కిడ్నాప్‌కు గురయ్యారని అనుకుంటున్నారా? కానే కాదు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మైనర్ల మిస్సింగ్ కేసుల్ని కూడా కిడ్నాప్‌గా నమోదు చేయడం తప్పనిసరి. దర్యాప్తుల్లో నిర్లక్ష్యాన్ని నిరోధించడానికి న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది. కాగా ఈ ఏడాది నమోదైన కిడ్నాపుల్లో మిస్సింగ్ సంబంధిత కేసులే 1,251 (82.03 శాతం) ఉన్నాయి. మిగిలినవి ప్రేమ వ్యవహారాలు, కుటుంబ కలహాలు, చిరు వివాదాల నేపథ్యంలో జరిగినవి ఉన్నాయి.



పరిచయస్తులే చెరబట్టారు!



మహిళలపై జరుగుతున్న నేరాల్లో అత్యాచారాన్ని తీవ్రంగా పరిగణిస్తారు. రాష్ట్రంలో ఈ ఏడాది నమోదైన అత్యాచారం కేసుల్లో పరిచయస్తులే నిందితులుగా ఉన్న ఉదంతాలు ఎక్కువగా ఉండటం గమనార్హం. మొత్తం 2,945 కేసులు నమోదు కాగా...వీటిలో 2,922 (99.21 శాతం) పరిచయస్తుల వల్ల జరిగినవే కావడం ఆందోళన కలిగించే అంశం. కేవలం 23 కేసుల్లో మాత్రమే బాధితులకు పరిచయం లేని వాళ్లు నిందితులుగా ఉన్నారు. మైనర్‌ను ప్రేమ పేరుతో మోసం చేయడం, పెళ్లి చేసుకోవడం తరహాకు చెందినవీ మొదటి కేటగిరీలోనే ఉంటున్నాయి. రేప్ కేసు బాధితుల్లో 15 ఏళ్ల లోపు వాళ్లు 87 మంది, 15–18 ఏళ్ల మధ్య వయస్కులు 1,970 మంది, మేజర్లు 888 మంది ఉన్నారు.



మహిళలపై నేరాల కేసులు ఇలా...

	2023	2024
వరకట్న హత్యలు	33	22
వరకట్న చావులు	132	126
ఆత్మహత్యకు ప్రేరేపించడం	363	379
వరకట్న వేధింపులు	9458	8973
మహిళల హత్యలు	213	241
ఆత్మాభిమానానికి భంగం	5464	5940


మోసాల్లో సైబర్ నేరాలదే అగ్రస్థానం



ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 33,618 చీటింగ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 24,643 (73.3 శాతం) సైబర్ నేరాలే కావడం గమనార్హం. చిన్న చిన్న మొత్తాలతో కూడిన సైబర్ నేరాలు ఫిర్యాదు దశలోనే ఆగిపోతున్నాయి. పెద్ద మొత్తాలు కోల్పోయిన వారిలోనూ దాదాపు సగం మంది పరువు, ప్రతిష్ఠ కోసం, సమాజానికి భయపడి ఫిర్యాదుల వరకు వెళ్లట్లేదు. ఇవి కూడా రికార్డుల్లోకి ఎక్కితే మోసం కేసుల సంఖ్య లక్షల్లోనే ఉండే అవకాశం ఉంది.

ప్రమాదాలు, మరణాలు పైపైకే..

రాష్ట్ర వ్యాప్తంగా 2023లో (నవంబర్ వరకు) 20,702 రోడ్డు ప్రమాదాలు జరగ్గా... 6,541 మంది చనిపోయారు. ఈ ఏడాది నవంబర్ వరకు మొత్తం 23,491 రోడ్డు ప్రమాదాల్లో 6,640 మంది మరణించారు. మృతులు నమోదు కాని రోడ్డు ప్రమాదాలు సైతం పెరిగాయి. 2023లో వీటి సంఖ్య 14,161 కాగా.. ఈ ఏడాది ఈ సంఖ్య 16,851కి చేరింది. 2023లో అన్ని రకాల నేరాలూ కలిపి 1,38,312 నమోదు కాగా, 2024లో 1,69,477 నమోదయ్యాయి.




నేరాల వారీగా గణాంకాలు ఇలా..

	2023	2024
సొత్తు కోసం హత్యలు	59	83
ఇతర హత్యలు	789	856
బందిపోటు దొంగతనాలు	42	58
దోపిడీలు	495	703
ఇళ్లల్లో చోరీలు	4803	5724
అత్యాచారాలు	2284	2945
కిడ్నాప్‌లు	1362	1525
దాడులు	19551	22031
డ్రగ్స్ కేసులు	1360	1950

2024లో టెక్ సంబంధిత కంపెనీల్లో లేఆఫ్‌లు ఇలా..

ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది 529 టెక్నాలజీ కంపెనీలు 1,49,870 మంది ఉద్యోగులను తొలగిస్తూ లేఆఫ్‌లు ప్రకటించాయి. ఈ మేరకు ఆ వివరాలను లేఆఫ్స్.ఎఫ్‌వైఐ అనే సంస్థ విశ్లేషించింది.



మాకు రోడ్డు కావాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ చిన్నారులు, వారి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్, వట్టినాగులపల్లిని కలిపే మిస్సింగ్ లింక్ రోడ్డు నంబర్ 152ను వెంటనే పూర్తి చేయాలని ఆదివారం ఇంద్రప్రస్థ, శాంతియా, హాల్‌మార్క్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు చెందిన చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్లకార్డులతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మార్గంలో ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. రోజూ పాఠశాలలకు వెళ్లాలంటే భయమేస్తోందన్నారు. రోడ్డు అంశాన్ని గతంలో అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. రాకపోకల కోసం ఎన్నికల ముందు స్థానిక ప్రజాప్రతినిధులు మరో రోడ్డుకు శంకుస్థాపన చేసినా పూర్తి కాలేదని విమర్శించారు.



కల్లుపై కోతుల 'కళ్లు' పడకుండా

ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల కోతుల బెడద అధికమైంది. గీత కార్మికులు కల్లు కోసం ఈతచెట్లకు కట్టిన కుండలను పగులగొట్టి తాగేస్తున్నాయి. వాటి నుంచి కల్లును కాపాడుకునేందుకు గౌడన్నలు.. ఇలా కుండలకు బదులు ప్లాస్టిక్ బిందెలు కట్టడం ఆకర్షిస్తోంది. -సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్



బంధాల గుట్టల్లో ఆదిమానవుల గుహలు

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలం బంధాల గుట్టల్లో ఆదిమానవుల గుహలను గుర్తించినట్లు సమ్మక్క-సారలమ్మ ఆర్కియాలజీ, ఇండిజినస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పరిశోధన బృందం అసోసియేట్ డైరెక్టర్ కొర్నిబెల్లి గణేశ్, ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యురేటర్ కుర్సం రవి తెలిపారు. రెండు రోజుల నుంచి చేస్తున్న పరిశోధనలో వెలుగులోకి వచ్చిన విషయాలను వారు ఆదివారం వెల్లడించారు. ఆదిమానవుల గుహలను పురావస్తు శాస్త్రంలో సమాధులుగా పేర్కొంటున్నా.. ఆదివాసీల చరిత్ర మాత్రం పూర్వ ఆదివాసీలు నిర్మించుకున్న గుహలుగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. సూక్ష్మ పద్ధతిలో వీటి వివరాలు సేకరించామని, ఇంకా లోతుగా పరిశీలిస్తే ప్రాచీన యుగం మానవుడి జీవన విధానం తెలుస్తుందని చెప్పారు. క్రీస్తు పూర్వం కొండ గుహలలో నివాసం ఉండి దట్టమైన అటవీ ప్రాంతం ఆసరాగా చేసుకుని వేటతో జీవనం సాగించారన్నారు. కాలానుగుణంగా కొండ గుహలు వీడి మైదానంలో జీవించాలనే ఆలోచనతో బండరాయితో ఏర్పాటు చేసుకున్న నిర్మాణాలే ఈ నివాసాలని వారు అభిప్రాయపడ్డారు. తూర్పునకు ముఖ ద్వారం, ఇంటి బయట ఈశాన్యం మూలన నీటి గోలెం కూడా ఉందన్నారు. ప్రస్తుతం దామెరవాయి కామారం ప్రాంతాల్లో ఈ గుహలు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం 3 కి.మీ. మేర విస్తరించి 3 రకాల గుహలు 10 మీటర్ల పొడవు 6 మీటర్ల వెడల్పులో ఉన్న పెద్ద గుహలను గుర్తించామని వెల్లడించారు.

ఆదిమానవుల గుహల వద్ద పరిశోధన బృందం



బావిలోకి దూసుకెళ్లిన బొలేరో వాహనం

ప్రాణాలతో బయటపడిన నలుగురు కుటుంబ సభ్యులు



మునుగోడు: బొలేరో వాహనం అదుపు తప్పి బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు ప్రాణాలతో బయటపడ్డారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రం శివారులో ఈ ఘటన జరిగింది. కట్టంగూర్ మండలం దుగ్గినెల్లికి చెందిన జాడిగల రాజు.. అతడి భార్య పుష్పలత, ఇద్దరు పిల్లలతో కలసి తన అత్తగారి ఊరైన కనగల్ మండలం పానుగోడు గ్రామానికి తన బొలేరో వాహనంలో ఆదివారం ఉదయం వెళ్లారు. తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా మునుగోడు మండల కేంద్రం శివారులోని బండి వడ్డెరగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద బొలేరో అదుపుతప్పి రోడ్డు పక్కన బావిలోకి దూసుకెళ్లింది. నలుగురూ కేకలు వేయడంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఆగి పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహకారంతో నలుగురిని బావిలో నుంచి బయటకు తీశారు. నలుగురికి స్వల్ప గాయాలు కావడంతో 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అదుపులోనే శాంతిభద్రతలు

డీజీపీ డాక్టర్ జితేందర్

- అన్ని రకాల నేరాలు కలిపి 9.87% పెరుగుదల.. డ్రగ్‌ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా పోలీస్ శాఖ చర్యలు
- తెలంగాణ పోలీస్ వార్షిక నివేదిక-2024 విడుదల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులోనే ఉన్నాయని, ఒకటి రెండు ఘటనలు మినహా ఈ ఏడాది ప్రశాంతంగా ముగిసినట్టు డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2023లో 2,13,121 కేసులు నమోదు కాగా, 2024లో ఇప్పటి వరకు 2,34,158 కేసులు (9.87 శాతం పెరుగుదల) నమోదైనట్టు వెల్లడించారు. డ్రగ్‌ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సైబర్ నేరాల కట్టడిలోనూ రాష్ట్ర పోలీసులు ముందంజలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఆదివారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి తెలంగాణ పోలీస్ వార్షిక నివేదిక 2024ను ఆయన విడుదల చేశారు. డిజిటల్ స్పేస్‌లో చిన్నారుల భద్రత ఎలా అన్న అంశంపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన పుస్తకాన్ని కూడా డీజీపీ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా డ్రగ్‌ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా పోలీస్ శాఖ కృషి చేస్తోందని, టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఈ ఏడాది 1,942 డ్రగ్స్ కేసులు నమోదు చేయడంతో పాటు 4,682 మందిని అరెస్టు చేసిందని చెప్పారు. రూ.142.95 కోట్ల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

సైబర్ నేరాల పెరుగుదల

సైబర్ నేరాలకు సంబంధించి 2023లో 17,571 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 25,184 కేసులు నమోదైనట్టు డీజీపీ వెల్లడించారు. సైబర్ క్రైం కేసుల్లో రూ.180 కోట్లను తిరిగి బాధితులకు అప్పగించామన్నారు. ఈ ఏడాది జరిగిన నాలుగు ఎదురుకాల్పుల ఘటనల్లో మొత్తం 14 మంది నక్సల్స్ మరణించినట్లు తెలిపారు. మరో 85 మంది మావోయిస్టుల అరెస్టు, 41 మంది మావోయిస్టుల సరెండర్ జరిగినట్టు వివరించారు. డయల్ 100 ఎమర్జెన్సీ నంబర్‌కు మొత్తం 16,92,173 ఫోన్‌కాల్స్ వచ్చినట్టు తెలిపారు. డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు.

అల్లు అర్జున్ కేసు గురించి మాట్లాడలేను

సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట ఘటనకు సంబంధించి హీరో అల్లు అర్జున్‌పై నమోదైన కేసుపై ఈ దశలో తానేమీ వ్యాఖ్యానించలేనని డీజీపీ అన్నారు. కేసు దర్యాప్తులో ఉండడంతోపాటు, ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున తాను ఏమీ మాట్లాడనని చెప్పారు. లగచర్లలో కలెక్టర్‌పై దాడి దురదృష్టకరమైన ఘటనగా పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. పోలీసుల ఆత్మహత్యలకు అనేక కారణాలు ఉంటున్నాయని, కేవలం పని ఒత్తిడే అని చెప్పలేమని డీజీపీ అన్నారు. ఆర్థిక, వ్యక్తిగత ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో, కొన్ని కేసుల్లో పని ఒత్తిడి వలన కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. సీఐడీ డీజీ శిఖా గోయల్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, అదనపు డీజీలు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, విక్రమ్‌సింగ్ మాన్, ఐజీలు ఎం.రమేశ్, సుమతి, సుధీర్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

సైసై.. జోడెడ్లా బండి

రంగంపేట: తూర్పు గోదావరి జిల్లాలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. రంగంపేట మండలం వడిశలేరులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్లబండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 63 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. సీనియర్స్ 1,600 మీటర్ల పరుగులో కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శ్రుతి చౌదరి ఎడ్ల జత ప్రథమ స్థానం సాధించి బుల్లెట్ బైక్ కైవసం చేసుకుంది.



పులి తిరుగుతోంది.. జాగ్రత్త

- వరంగల్ జిల్లాలో పులి సంచారంపై అధికారుల సూచన
- పెద్దపులి పాదముద్రలు గుర్తించిన అటవీ అధికారులు
- నర్సంపేట ఏజెన్సీ పల్లెల్లో ప్రజల ఆందోళన



డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తున్న అటవీ సిబ్బంది

నర్సంపేట: వరంగల్ జిల్లాలో పులి సంచారం వార్త ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో పెద్దపులి పాదముద్రలను గుర్తించిన అధికారులు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా వ్యవసాయ పనులకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉమ్మడి వరంగల్‌లోకి ప్రవేశించిన పెద్దపులి నల్లబెల్లి, ఖానాపురం, నర్సంపేట ఏజెన్సీ పల్లెల్లో తిరుగుతున్నట్లు ఆనవాళ్లు గుర్తించారు. మూడు రోజుల క్రితం నల్లబెల్లి మండలం రుద్రగూడెం సమీప అడవిలో పులి తిరిగింది. స్థానికుల సమాచారంతో అటవీ అధికారులు పులి పాద ముద్రలు పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో చాటింపు చేశారు. తర్వాత ఖానాపురం మండలంలో కూడా పులి సంచరించినట్లు సమాచారం రాగా అధికారులు స్థానికులకు జాగ్రత్తలు చెప్పారు. ఆదివారం నర్సంపేట మండల పరిధిలోకి పెద్దపులి వచ్చినట్లు తెలియడంతో ఇక్కడి పల్లెల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా పశువులు, గొర్రెలు, మేకలను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లే కాపరులు కొద్ది రోజులు మైదాన ప్రాంతాల్లోనే మేపుకోవాలని నర్సంపేట ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి సూచించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, గుంపులుగా వెళ్లి పనులు త్వరగా ముగించుకొని సాయంత్రం కాక ముందే ఇళ్లకు చేరుకోవాలని చెప్పారు.

డ్రోన్ కెమెరాలతో..

మూడు రోజులుగా నల్లబెల్లి మండలంలో సంచరిస్తున్న పెద్ద పులి రుద్రగూడెం, కొండాయిపల్లి శివారులోని పలుగు ఏనే (కొండ ప్రాంతం) నుంచి అటవీ బాట పట్టింది. పులి పాదముద్రల ఆధారంగా అది మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. రుద్రగూడెం, కొండాయిల్‌పల్లి గ్రామస్తుల అభ్యర్థన మేరకు నర్సంపేట ఎఫ్ఆర్‌ఓ రవికిరణ్ పర్యవేక్షణలో అటవీ సిబ్బంది.. డ్రోన్ కెమెరా సహాయంతో పలుగు ఏనే ప్రాంతాన్ని చిత్రీకరించి పరిశీలించారు. ఇక్కడే పులి సేద తీరినట్లు ఎఫ్ఆర్‌ఓ తెలిపారు. కాగా, పెద్దపులి అటవీ ప్రాంతానికి తరలివెళ్లినట్లు స్పష్టం కావడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం । 30 । 12 । 2024

భాగ్యనగరం నుంచి అంతర్జాతీయ నగరాలకు విమాన సర్వీసులు విస్తరిస్తున్నాయి. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం.. కేవలం ట్రాన్సిట్ ఎయిర్‌పోర్ట్‌గానే కాకుండా పశ్చిమాసియా దేశాలకు ప్రధాన హబ్‌గా మారింది. తెలుగు రాష్ట్రాల ప్రయాణికులు హైదరాబాద్ నుంచి గణనీయంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో హైదరాబాద్ కేంద్రంగా పలు ఎయిర్‌లైన్స్ తమ విమాన సర్వీసులను విస్తరిస్తున్నాయి. ఏటా సుమారు 4 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలకు అనుగుణమైన సామర్థ్యంతో.. ఎయిర్‌పోర్ట్ సేవలను విస్తరిస్తున్న నేపథ్యంలో.. హైదరాబాద్ దేశంలోనే ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఒకటిగా మారింది. దీంతో ప్రస్తుతం పలు అంతర్జాతీయ నగరాలకు విమానాలను నడుపుతున్న విమానయాన సంస్థలు.. మరిన్ని కొత్త నగరాలకు తమ సేవలను కొనసాగించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. కోవిడ్ అనంతరం అంతర్జాతీయ పర్యటనలు సైతం భారీగా పెరిగాయి. తెలుగు రాష్ట్రాల పర్యాటకులు నచ్చిన దేశాలు, పర్యాటక ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో పర్యాటకుల డిమాండ్, అభిరుచి ఉన్న ప్రాంతాలకు సర్వీసులు అందుబాటులోకి వస్తున్నాయి. సింగపూర్, థాయ్‌లాండ్, మాల్దీవులు, శ్రీలంక, దుబాయ్ వంటి దేశాలతో పాటు పర్యాటకులు సందర్శించే జాబితాలో కొత్తగా మరిన్ని దేశాలు వచ్చి చేరాయి. అమ్‌స్టర్‌డ్యామ్, ఇథియోపియా, వియత్నాం, డాలస్, షికాగో తదితరాలకు హైదరాబాద్ నుంచి త్వరలో డైరెక్ట్ ఫ్లైట్ కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది.

-సాక్షి, హైదరాబాద్



హైదరాబాద్ నుంచి ఎక్కడెక్కడి కంటే..

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి దుబాయ్, మస్కట్, బహ్రెయిన్, దోహా, షార్జా, జెడ్డా, అబుదాబి, రియాద్, సింగపూర్, బ్యాంకాక్, మలేసియా, బ్రిటన్, జర్మనీ, శ్రీలంక, మాల్దీవులు, ఒమన్, ఖతార్, సౌదీ తదితరాలకు నేరుగా విమానాలు నడుస్తున్నాయి. గతంలో షికాగోకు విమాన సర్వీసులను నడిపారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయాయి. త్వరలో షికాగోతోపాటు డాలస్, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాలకు కూడా హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రోజూ సుమారు 55000 మంది దేశీయ, మరో 15000 మందికి పైగా అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్క నవంబర్ నెలలోనే 40,179 మంది హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి విదేశీయానం చేశారు. 2467 అంతర్జాతీయ సర్వీసులు నడిచాయి.

త్వరలో హైదరాబాద్ - డాలస్ విమానం

హైదరాబాద్ నుంచి పెరిగిన ఇంటర్నేషనల్ కనెక్టివిటీ | ప్రస్తుతం 20 నగరాలకు సదుపాయం | త్వరలో మరిన్ని నగరాలకు విస్తరణ | కొత్తగా వియత్నాం, అజర్‌బైజాన్, ఇథియోపియాకు విమానాలు

ఆసియా దేశాల్లో యూరప్ అనుభూతి

ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తదితర యూరప్ దేశాల పర్యటన ఖరీదుగా మారింది. నలుగురు కుటుంబసభ్యులు కలిసి వారం రోజుల పాటు పర్యటించాలంటే కనీసం రూ.8 లక్షల పైనే ఖర్చవుతుంది. కానీ చాలా తక్కువ బడ్జెట్‌లో యూరప్ దేశాల్లో పర్యటించిన అనుభూతిని కలిగించేవిధంగా కొన్ని దేశాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జార్జియా, అజర్‌బైజన్, ఉజ్బెకిస్తాన్, ఆర్మేనియా తదితర దేశాలు.. తక్కువ బడ్జెట్‌లో సందర్శించేందుకు అనువుగా ఉన్నాయి. దీంతో ఈ దేశాలను ఎక్కువమంది ఎంపిక చేసుకుంటున్నట్లు పర్యాటక సంస్థలు పేర్కొంటున్నాయి. 'స్విట్జర్లాండ్‌లోని మంచుకొండల్లో విహరించాలని కోరుకొనేవాళ్లు ఇప్పుడు కజకిస్తాన్‌లోని షింబులాక్ మౌంటెయిన్స్‌ను ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారు. స్విట్జర్లాండ్ పర్యటనకు కనీసం రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందనుకంటే.. కేవలం రూ.2 లక్షల్లోనే కజికిస్తాన్ పర్యటనను పూర్తి చేయవచ్చు. ఇలా బడ్జెట్ ఫ్రెండ్లీ టూర్స్‌కు ప్రాధాన్యం పెరిగింది'.. అని వాల్మీకి ట్రావెల్ అండ్ టూరిజమ్ సొల్యూషన్స్ ఎండీ హరికిషన్ వాల్మీకి తెలిపారు. మరోవైపు ఉచిత వీసా సదుపాయం కలిగిన దేశాల్లో కూడా ఎక్కువమంది పర్యటిస్తున్నారు. మలేసియా, థాయ్‌లాండ్ వంటి దేశాలు ఆ సదుపాయాన్ని అందజేస్తున్నాయి. త్వరలో రష్యా సైతం ఉచిత వీసా సదుపాయాన్ని ప్రవేశపెట్టనుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగానికి ప్రాధాన్యం పెరిగింది. దీంతో ట్రావెల్స్ ఏజెన్సీలు, పర్యాటక సంస్థలు ఎప్పటికప్పుడు కొత్త ప్యాకేజీలతో ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో పలు ఎయిర్‌లైన్స్ కూడా ఈ డిమాండ్ మేరకు సర్వీసులను విస్తరిస్తున్నాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థలు తమ సర్వీసులను పెంచుతున్నాయి.



ఆఫ్రికా దేశాలకు కనెక్టివిటీ..

కేఎల్‌ఎం ఎయిర్‌లైన్స్.. నెదర్లాండ్స్, ఇథియోపియా ఎయిర్‌లైన్స్ ఇథియోపియా తదితర దేశాలకు త్వరలో విమాన సర్వీసులను ప్రవేశపెట్టనుంది. ఇథియోపియాకు విమానసర్వీసులు అందుబాటులోకి రావడం వల్ల హైదరాబాద్ నుంచి ఆఫ్రికా దేశాలకు కనెక్టివిటీ ఏర్పడనుంది. వియట్ జెట్ ఎయిర్‌లైన్స్ హైదరాబాద్ నుంచి వియత్నాంకు విమానాలు నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. టర్కీకి కూడా డైరెక్ట్ కనెక్టివిటీ ఏర్పాటు కానుంది. అమ్‌స్టర్‌డామ్, డల్లాస్ నగరాలకు కూడా 2025లోనే సర్వీసులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం 20 అంతర్జాతీయ నగరాలకు నేరుగా విమానాలు నడుస్తుండగా, 2025లో మరో 10 నగరాలకు కనెక్టివిటీ ఏర్పాటు కానుంది.

చి'వరి'కి పొరుగు కూలీలే దిక్కు

- వరినాట్లకు ఇతర రాష్ట్రాల కూలీలు
- బిహార్, కోల్‌కతా, మహారాష్ట్ర నుంచి రాక
- స్థానికంగా కూలీలు దొరక్క రైతుల పాట్లు
- స్థానిక కూలీలతో ఎక్కువ వ్యయం
- వలస కూలీలతో ఖర్చు తక్కువ.. సమయం ఆదా
- వేగంగా నాట్లు వేస్తున్న పొరుగు కూలీలు

సాక్షి, పెద్దపల్లి: యాసంగి సాగు పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. పల్లెల్లో కూలీల కొరత అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో రైతులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లి వలస కూలీలను తీసుకొస్తున్నారు. స్థానిక కూలీలకు రెట్టింపు కూలి చెల్లిస్తేనే వ్యవసాయ పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం పెరిగిన డిమాండ్ మేరకు స్థానిక మహిళలకు రూ.500 నుంచి రూ.600, పురుషులకు రూ.1,000 వరకు కూలి చెల్లిస్తున్నారు. గతంతో పోల్చితే రెట్టింపు కూలి చెల్లించాల్సి రావడంతో అన్నదాతలపై పెట్టుబడి పెరుగుతోంది. పొలాలు దూరంగా ఉండడంతో.. ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడం, అదనంగా అల్పాహారం, టీ సమకూర్చడం రైతులపై ఆర్థిక భారానికి కారణమవుతోంది. మరికొన్నిచోట్ల పురుషులకు ఇతర ఖర్చుల కింద రూ.100 చెల్లిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఎకరాలో వరి నాట్లు వేసేందుకు రూ.4,000 - రూ.4,500 వరకు ఖర్చు ఉండేది. ప్రస్తుతం రూ.6 వేలకు పైగా అవుతోంది. అదికూడా కేవలం కూలీలకు చెల్లించాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. స్థానిక మహిళలకు రూ.5,500 చొప్పున.. ఎకరాలో వరి నాట్లు వేసేందుకు గంపగుత్తకు ఇస్తున్నా.. అదనంగా నారు పంచేందుకు రూ.1,000తో పురుషులను ఏర్పాటు చేయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. అదే వలస కూలీలకు.. వరి నాట్ల బాధ్యత గంపగుత్తకు ఇస్తే.. ఎకరాకు రూ.5,500తోనే మొత్తం పనులు చూసుకుంటున్నారు. దీంతో అదనపు భారం తగ్గడంతోపాటు, తక్కువ సమయంలోనే నాట్లు పూర్తవుతున్నాయి. ఫలితంగా రైతులు పక్కరాష్ట్రాల కూలీల వైపే మొగ్గు చూపుతున్నారు.



గుండ్లపల్లిలో వరి నాట్లు వేస్తున్న కోల్‌కతా కూలీలు



గుండ్లపల్లిలో వరినారును తీస్తున్న కోల్‌కతా కూలీలు

యంత్రాలు, వలస కూలీలే ఆధారం..

కూలీల కొరతతో రైతులు వరినాట్లు వేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు అన్నదాతలు కొన్నేళ్లుగా వలస కూలీలు, యంత్రాలపై ఆధారపడుతున్నారు. యంత్రాల కొరతతోపాటు కొన్ని నేలల్లో నాట్లు వేసే పరిస్థితి లేక.. మనుషులతో నాట్లు వేయిస్తే అధిక దిగుబడి వస్తుందని రైతులు వలస కూలీల కోసం ఎదురు చూస్తున్నారు. కోల్‌కతా, మహారాష్ట్రకు చెందిన గడ్చిరోలి, చంద్రాపూర్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు వరి నాట్లు వేసేందుకు జిల్లాకు వలస వస్తున్నారు. కొంతమంది స్థానికులు ఆయా ప్రాంతాలకు చెందిన వలస కార్మికులను గ్రామాలకు తీసుకొచ్చి ఆశ్రయం కల్పిస్తున్నారు. వారితో ఎకరాకు ఒక ధరను ఒప్పందం చేసుకొని.. రైతుల నుంచి ఎక్కువ మొత్తం వసూలు చేసుకుని వరి నాట్లు వేయిస్తున్నారు.

వలస కూలీలకు డిమాండ్

జిల్లాలో ఈ యాసంగిలో 2,04,433 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తుండగా, 1,91,351 ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా సిద్ధం చేశారు. వలస కూలీల గ్రూపులుగా వచ్చి తక్కువ సమయంలోనే ఎక్కువ పని చేస్తుండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.5,000 నుంచి రూ.5,500 వసూలు చేస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉన్న గ్రామాల్లో రూ.6 వేల వరకు తీసుకుంటున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క తేదీ ఇస్తూ బుక్ చేసుకొని వరి నాట్లు వేస్తున్నారు. వీరి రాకతో కూలీల కొరత తీరుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోజూ రూ.2 వేలు వస్తాయి



పొద్దున్నుంచి సాయంత్రం వరకు నాలుగు ఎకరాల్లో వరి నాట్లు వేస్తాం. నాకు రోజూ రూ.2 వేల కూలి గిట్టుబాటవుతుంది. ప్రతీ సీజన్‌లో రెండునెలలు ఇక్కడే మాకు పనులు దొరకుతాయి. రైతులు బాగా చూసుకుంటున్నారు.

- బబుల్, కూలీ, కోల్‌కత్తా

పది రోజులైంది వచ్చి..



నేను కోల్‌కత్తా నుంచి వచ్చి పదిరోజులైంది. తెల్లారగానే పంట పొలాల్లోకి వెళ్తాం. రాత్రి వరకూ నాట్లు వేస్తాం. అందరం కలసికట్టుగానే ఉంటాం. ఇక్కడి వారికంటే మంచిగా నాట్లు వేస్తాం. మా రాష్ట్రంలో పనులు లేవు.

-మంగళ్, కూలీ, కోల్‌కత్తా

మంది కూలీలను తీసుకొస్తా..



యాసంగి, వానాకాలంలో వరినాట్ల కోసం ఏటా పశ్చిమబెంగాల్, కోల్‌కత్తా నుంచి సుమారు 560 మందికి కూలీలను తీసుకొస్తా. రైతులకు ఎదురవుతున్న కూలీల కొరతను అధిగమించేందుకు ఎనిమిదేళ్లుగా ఏటా ఇలాగే చేస్తున్నా.

- కసిరెడ్డి మల్లారెడ్డి, ఏజెంట్, గుండ్లపల్లి



యాదగిరి గుట్టకు భక్తుల తాకిడి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు అధికంగా వచ్చారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి 3 గంటల సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. ఇక శ్రీస్వామి వారిని 40వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి 56,23,335 నిత్యాదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



జనవరి 3 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)కి చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

ఆధ్యాత్మిక పల్లె.. కొలనుపాక

యాదగిరిగుట్ట: స్వయంభూ సోమేశ్వరుడు కొలువైన క్షేత్రం. వీరశైవ పంచాచార్యులలో ఒకరైన రేవణ సిద్ధేశ్వరుని జన్మభూమి. శ్వేతాంబర జైనుల ఆధ్యాత్మిక కేంద్రం. దైవారాధనకు అందరూ అర్హులేనని చాటిన సమతా సందేశం. వీరశైవాన్ని దశదిశలా వ్యాప్తి చేసిన దక్షిణ కాశీ. అష్టాదశ కులాల వీరశైవ మఠాల ఆధ్యాత్మిక నగరి. రాష్ట్రకూట, చాళుక్య, కందూరు చోళ, కాకతీయుల పాలనా కేంద్రం. గత వైభవ ఘన కీర్తి పతాక.. కొలనుపాక. ఇది శతాబ్దాల కిందట ఓ సుందర నగరం. ఇప్పుడు అచ్చమైన పల్లెటూరు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి 6 కి.మీ. దూరంలో ఉంది. వెయ్యేళ్లకు పూర్వమే ఓ వెలుగు వెలిగిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయ రంగస్థలి. జైన వైభవానికి, వీరశైవ విజృంభణకు నిలువెత్తు సాక్ష్యం. కానీ శైవ, బౌద్ధ, జైన, వైష్ణవాల ఘర్షణలో తన అస్థిత్వాన్ని కోల్పోయింది. నాటి కులమఠాల ఆనవాళ్లు కొలనుపాక సామాజిక జీవితాన్ని మనకు కథలుగా చెబుతాయి.

జైనుల ఆధ్యాత్మిక కేంద్రం.. సోమేశ్వరుడు కొలువైన క్షేత్రం


- దక్షిణ కాశీగా వీరశైవ మఠాల ఆధ్యాత్మిక నగరిగా గుర్తింపు
- రాష్ట్రకూట, చాళుక్య, కందూరు చోళ, కాకతీయుల పాలనా కేంద్రం
- శైవ, బౌద్ధ, జైన, వైష్ణవాల ఘర్షణలో అస్థిత్వాన్ని కోల్పోయిన తీరు
- నేడు అచ్చమైన పల్లెటూరుగా మారిన వైనం

పంచముఖాలు.. ఐదు పీఠాలు

రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు, కందూరు చోళుల ఉప రాజధానిగా తెలుగు నేలపై అర్ధభాగాన్ని శాసించినా కొలనుపాక ఏనాడూ చరిత్ర కెక్కలేదని పలువురు అంటున్నారు. విధ్వంసకారులు చారిత్రక కట్టడాలను ధ్వంసం చేసినట్లే.. చరిత్రకారుల నిర్లక్ష్యం సాంస్కృతిక వికాసానికి గొడ్డలి పెట్టుగా పరిణమించింది. వీరశైవ మత వ్యాప్తి కోసం శివుని పంచముఖాల నుంచి రేవణసిద్ధ (బాళెహొన్నూరు పీఠం), మరులసిద్ధ (ఉజ్జయిని పీఠం), ఏకోరామ (కేదారనాథ్ పీఠం), మల్లికార్జున పండితారాధ్య (శ్రీశైల పీఠం), విశ్వారాధ్య (కాశీ పీఠం) ఉద్భవించినట్టు శైవాగమాలు పేర్కొంటున్నాయి. స్వయంభువులుగా భావించే ఈ శివాచార్యులను 'వీరశైవ పంచాచార్యులు'గా కీర్తిస్తారు. పంచాచార్యులలో ప్రథముడైన రేవణసిద్ధ (రేణుకాచార్యులు) కొలనుపాకలో స్వయంభూ సోమేశ్వర లింగం నుంచి ఉద్భవించినట్టు స్వయంభువాగమం చెబుతోంది. శైవాగమాలలోని వీరాగమ, సుప్రభేదాగమాలు రేణుకాచార్యులను ప్రస్తావించాయి.

శైవం.. జైనం బహుళ ఆదరణ

కొలనుపాకలో శైవం, జైనం బహుళ ఆదరణ పొందాయి. వేల సంవత్సరాలు ఈ రెండు మతాలు సహజీవనం చేశాయి. కొలనుపాకలో క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి సోమనాథ ఆలయం అభివృద్ధి చెందింది. ఒకప్పుడు ఇక్కడ జైనం ఎక్కువ. కొలనుపాకలో వెయ్యేళ్లకు పూర్వమే శ్వేతాంబర శాఖకు చెందిన ఆలయాన్ని నిర్మించారు. జైన ప్రాబల్యం ఉన్నా.. సోమేశ్వరుడు నిర్విఘ్నంగా పూజలందుకున్నాడు. చాళుక్యుల తర్వాత కాకతీయులు అధికారంలోకి వచ్చారు. కాకతీయులు తొలినాళ్లలో జైనాన్ని ఆదరించారు. చివరి కాకతీయులు మాత్రం శైవాన్ని ప్రోత్సహించారు. కొలనుపాకలో అప్పటికే వైష్ణవం కూడా ఉంది. పారమార జగద్దేవుడు నిర్మించిన వీరనారాయణ ఆలయం సుప్రసిద్ధం. తర్వాత వచ్చిన పాలకులు ఈ ఆలయాన్ని పట్టించుకోలేదు. కన్నడ దేశపు కాలచూరిని ఏలుతున్న బిజ్జలుని మంత్రి బసవన్న వీరశైవ వ్యాప్తికి కృషి చేశాడు. రేణుకాచార్యులు కొలనుపాకలో వీరశైవాన్ని అభివృద్ధి చేశాడు. వీరశైవం తెలుగు నేలపై రాజాదరణ పొందింది. కాకతీయుల ప్రోద్బలంతో ఉచ్చస్థితికి చేరింది. శైవాలయాలు, శైవ పీఠాలు, శైవమఠాల నిర్మాణాలకు కాకతీయులు సహకరించారు. కొలనుపాకలోని కోటిలింగాల గుడి, ప్రతాపరుద్ర ఆలయం కాకతీయులు కట్టినవే.






సోమేశ్వర ఆలయంలో శివ లింగం



కొలనుపాకలో ఉన్న పురాతన కట్టడం మండపం



కొలనుపాకలో పురాతన కోమట్ల మఠం

వీరశైవ విజృంభణ

కాకతీయ గణపతి దేవుడి కాలానికి తెలుగు నేలపై శైవం ఆధిపత్యంలోకి వచ్చింది. రాణీరుద్రమదేవి పాలనా కాలానికి వీరశైవం విజృంభించింది. శివుడు తప్ప ఎవరూ ఉండకూడదనే వాదన మొదలైంది. 11వ శతాబ్దం చివరి సంవత్సరాల్లో శైవ, జైన మతాలు ఘర్షణ పడ్డాయి. కొలనుపాకలోని జైన ఆలయాలను, బసదులను వీరశైవులు ధ్వంసం చేశారు. జైన, వైష్ణవాలయాలను శివాలయాలుగా మార్చారు. కొన్ని ఆలయాల పేర్లు శాసనాలకే పరిమితం అయ్యాయి. వీరశైవం ప్రబలిన తర్వాత ఆరాధ్య శైవం, వైష్ణవం వెనుకబడిపోయాయి. కాకతీయుల నిరాదరణ, వీరశైవుల విజృంభణతో కొలనుపాకలో జైనం క్షీణదశకు చేరుకుంది. రేవణ సిద్ధేశ్వరుల ప్రభావంతో కొలనుపాకలో అన్ని కులాల వారు వీరశైవంలో చేరారు. ప్రతి కులం ఒక మఠాన్ని ఏర్పాటు చేసుకుంది. అష్టాదశ కులాల వారికి కొలనుపాకలో మఠాలున్నాయి. ప్రస్తుతం ఆ కుల మఠాల సంఖ్య 18 కంటే ఎక్కువే.

శివుడొక్కడే..

కొలనుపాకలోని మఠాల నిర్మాణ శైలి భిన్నంగా ఉంటుంది. వీటన్నింటిలో శివలింగం, నంది విగ్రహం మాత్రమే ఉంటాయి. మరో విగ్రహానికి కానీ, ఇంకో దేవుడికి కానీ ఇక్కడ స్థానం లేదు. ఈ మఠాల నిర్వహణ, పూజా విధానాల్లో ఎంతో సారూప్యం కనిపిస్తుంది. ప్రతి కుల మఠానికి ఒక గురువు, కులపెద్ద బాధ్యులుగా ఉంటాడు. మఠ గురువు, మఠ పెద్ద, సభ్యులైన వీరశైవులు ఇష్టలింగాన్ని ధరిస్తారు. నిత్యం మఠంలోని శివలింగాన్ని కడిగి, పత్రి, పుష్పాలతో పూజ చేసి, నైవేద్యం పెడతారు. ఆ తర్వాతే భోజనం చేస్తారు. మఠాలన్నిటికీ జంగమ దేవరలే గురువులు. 'గురువు'అంటే విద్యా బోధన చేసేవాడని అర్థం. మత బోధన మఠం ప్రధాన బాధ్యత. వీరశైవం వైపుగా ఆకర్షితులైన నిమ్న కులాల వారికి వీరశైవ తత్త్వాన్ని, మోక్ష మార్గాన్ని బోధించేందుకు ఆ కులానికే చెందినవారికి ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. కొలనుపాకలోని కులమఠాలన్నీ రంభాపురి పీఠాన్ని అనుసరిస్తాయి. కుల మఠాలకు ఉన్నట్లుగా పెద్ద మఠానికి ప్రత్యేకమైన కట్టడం ఏమీ లేదు. పెద్ద మఠం గురువుని కులమఠాలన్నీ అనుసరిస్తాయి.

కులానికో పురాణం..

కొలనుపాకలోని అన్ని కులాలకూ ప్రత్యేకమైన పురాణాలున్నాయి. మఠ గురువుల దగ్గర ఆ ప్రాచీన ప్రతులు ఉంటాయి. వీటిని పండుగ రోజుల్లో మాత్రమే పఠిస్తారు. తమ కులం ఎలా పుట్టింది? ఎలా అభివృద్ధి చెందింది? తమదైన కుల పురాణాల్లో ప్రస్తావించారు. ఎవరికి వారు తమ కులం గొప్పదనే భావనతో ఈ గ్రంథాన్ని రాసుకున్నారు. మిగతా కులాలకు తమ కులమే మూలమనే ప్రతిపాదనా ఉంది. ఇలా ఎవరి కుల సాహిత్యం వారిదే. కాలక్రమంలో కొన్ని కుల చరిత్రలు అంతరించిపోయాయి.

మఠానికో శివుడు

అందరికీ శివుడే ఆరాధ్య దైవం. ఆ దేవుడిని కూడా తమ కులంవాడిని చేసుకోవడం మఠాల ప్రత్యేకత. కులమఠాల వాళ్లు ఎవరికి వారు.. తమ కులానికి అనుగుణంగా శివుడికి నామకరణం చేశారు. సురా భాండాన్ని తీసే గౌడవారు శివుడిని 'సురాభాండేశ్వరుడు'అని పిలుచుకున్నారు. కోమట్లు 'నగరేశ్వర స్వామి'అని కొలుస్తున్నారు. మేదర మఠంలోని శివుడిని 'కేతేశ్వర స్వామి'గా వ్యవహరిస్తారు. అదే ఆదిదేవుడు మేరు మఠంలో 'శంకర దాసమయ్య'అయ్యాడు.

7 వేల గ్రామాలకు రాజధాని

కొలనుపాక ఒకప్పుడు 7 వేల గ్రామాలకు రాజధాని. ఆ గ్రామ ప్రజలకు వీరశైవ తత్త్వాన్ని బోధించి, మోక్షమార్గాన్ని అనుసరించేలా చేయడం కుల గురువుల బాధ్యత. ఆచార్యుల బతుకుదెరువు, కులమఠంలోని సన్యాసుల పోషణ, శివ పూజల నిర్వహణ కోసం 7 వేల గ్రామాలవారు ధనం, ధాన్యం ఇచ్చేవారు. కాబట్టే, కులమఠాల్లో ధూపదీప నైవేద్యాలకు లోటు రాలేదు. శివారాధన, వీరశైవ బోధన నిరాటంకంగా కొనసాగింది. కాకతీయుల పతనం తర్వాత ఓ వర్గం అధికారంలోకి వచ్చారు. దీంతో వీరశైవులకు కష్టాలొచ్చాయి. కొలనుపాక కుల మఠాలకు ఇచ్చే దానాలపై ఓ వర్గం పన్ను విధించినట్టు తమ తాతలు చెప్పేవారని పలువురు చెబుతున్నారు.

దక్షిణ కాశీ

కొలనుపాక దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. కొలనుపాక సమీపంలో 'కాశీ బుగ్గ'అనే నడబావి ఉంది. దానికి పక్కనే చిన్న శివాలయం కూడా ఉంది. శివ భక్తులు కాశీ బుగ్గలోని నీటిని అపర గంగగా భావిస్తారు. ఈ గుడిలోని శివుడిని అపర (కాశీ) విశ్వేశ్వరుడిగా కొలుస్తారు. కాశీ బుగ్గను దర్శించుకుంటే వారణాసిని దర్శించుకున్నట్లేనని శైవుల భావన. ఒకప్పుడు కుల మఠాల్లో జరిగే శివపార్వతుల కల్యాణ వేడుకను చూసేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన శివభక్తులు తమతమ కుల మఠాల్లో జాగారం చేసేవారు. తమ కుటుంబీకులు చనిపోతే దశదిన కర్మ తర్వాత కొలనుపాకకు వచ్చి కులమఠంలో నిద్ర చేసేవారు. తెల్లవారు కాశీ బుగ్గలో అస్థికలు కలిపిపోయేవారు.

క్లుప్తంగా...

ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ అధ్యక్షుడు ఆర్.వెంకటయ్య అధ్యక్షతన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం బొమ్మూరులో ఆదివారం కార్యవర్గ సమావేశం జరిగింది. వెంకటయ్య, విశ్రాంత డీఈ ప్రసాదరెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. పూర్వపు 13 జిల్లాల నుంచి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షునిగా సాగి వెంకట సూర్యనారాయణరాజు (తూర్పు గోదావరి), ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎల్ సోమయాజులు (విజయవాడ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.నాగప్రసాద్ (నెల్లూరు), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్.కృష్ణ (విజయవాడ), ఫైనాన్స్ సెక్రటరీగా ఆర్వీ భానుప్రసాద్ (అనంతపురం) ఎన్నికయ్యారు. వీరితో పాటు ఐదుగురు వైస్ ప్రెసిడెంట్లను, ఐదుగురు జాయింట్ సెక్రటరీలను కూడా ఎన్నుకున్నారు.

ఎస్‌బీఐ అధికారుల సతీమణులు సాయం



తిరుపతి అర్బన్: ఎస్‌బీఐ బ్యాంక్ అధికారుల నేతృత్వంలో సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు పలు విరాళాలు అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఆదివారం ఎస్‌బీఐ ఉన్నతాధికారుల సతీమణులు ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ అమరావతి సర్కిల్ పేరుతో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర బాలమందిర్ స్కూల్ పిల్లల యూనిఫామ్‌కు రూ.16.64 లక్షలు అందించారు. దీంతో స్కూల్ యాజమాన్యం ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం లేఖా మీనన్‌తో పాటు చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి సతీమణి, సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్ సతీమణి, జీఎం సంజయ్‌కుమార్ సతీమణి పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం వద్దనడం దుర్మార్గం'

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం వద్దని కోరడం దుర్మార్గమని, ఇది అగ్రవర్ణాలు, ఆధిపత్య వర్గాల కుట్ర అని బహుజన టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డి.రామశేషయ్య ఆదివారం విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సర్కార్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలు కోసం విడుదల చేసిన జీవో 85ను రద్దు చేయాలని ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొన్న న్యాయకోవిదులు, రాజకీయ నాయకులు కోరడం అన్యాయమన్నారు. మాతృభాషను తెలుగు బతికించుకోవడం కోసం ఆంగ్లమాధ్యమంతోపాటు తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టాలని కోరడంలో తప్పులేదన్నారు. అయితే కవులుగా చెప్పుకుని అభ్యుదయ భావాలు, మానవత్వం ఉన్న రచయితల పేరుతో జరిపే సభలో పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు మేలు జరిగే ఇంగ్లిష మీడియాన్ని రద్దు చేయాలని కోరడం వారి విజ్ఞతకే వదిలివేయాలన్నారు. మరోవైపు సదస్సుల్లో పాల్గొన్న రచయితల పిల్లలు పిల్లలు ఏ మీడియాలో చదువుతున్నారో వారి మనసుకు సమాధానం చెప్పుకోవాలన్నారు.

గంజాయి, హస్క్ స్వాధీనం

చిలమత్తూరు: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కంబాలపల్లి క్రాస్ సమీపంలో గల రాజస్థానీ ధాబాలో 410 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, 8.9 కిలోల ఓపియం పాపీ హస్క్ (గసగసాల పొట్టు)ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధాబాలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. 11 ప్యాకెట్ల గంజాయితో పాటు 8.9 కిలోల పాపీ హస్క్ పట్టుబడింది. దీంతో ధాబా నిర్వాహకులు మంగల్‌రామ్, ఇంద్రజిత్, ధన్‌రామ్‌లను అదుపులోకి తీసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు.

ఎట్టకేలకు మద్యం పట్టివేతపై కేసు నమోదు


రణస్థలం: శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం కొత్తకుంకాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లంకలపల్లి శ్రీనువాసరావు ఇంట్లో శనివారం భారీగా మద్యం పట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే కేసు నమోదు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయమై 'టీడీపీ కార్యకర్త ఇంట్లో భారీగా మద్యం పట్టివేత'' అనే శీర్షికన సాక్షిలో ఆదివారం కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు లంకలపల్లి శ్రీనువాసరావు భార్య లంకలపల్లి భవానీ వద్ద 35 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ఎక్సైజ్ అధికారులకు వివరాలు సమర్పించారు. ఈ మేరకు అక్రమ మద్యం కలిగినందుకు లంకలపల్లి భవానీపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అనురాధదేవి తెలిపారు.

నేను.. నా స్టేటస్!

వాట్సాప్ స్టేటస్‌లో మనోభావాలు వ్యక్తీకరణ

- అక్కడే సూక్తులు, పరోక్షంగా విమర్శనాస్త్రాలు
- అధిక శాతం భక్తి సంబంధిత విషయాలు పోస్టు
- వ్యాపార ప్రకటనలకు అదే మార్గం
- వ్యక్తిగత ప్రతిభ చాటి చెప్పేందుకు సైతం
- స్టేటస్‌ను విస్తృతంగా వాడుతున్న ప్రజలు

మాట.. పాట.. ఆట..
ఆనందం.. ఆశ్చర్యం.. విషాదం వార్తలు.. విశేషాలు.. వింతలు శుభాకాంక్షలు.. విమర్శలు.. సూచనలు విద్య, ఉద్యోగం.. వ్యాపారం.. పుట్టుక.. పెళ్లి.. చావు.. ఆధ్యాత్మికం..విహారం.. ఆరోగ్యం.. ఇలా.. అన్నీ ఒకే వేదికపై అందరితో స్మార్ట్‌గా పంచుకుంటున్నారు. 'నా స్టేటస్.. నా ఇష్టం'.. అంటూరోజూ అందరినీ పలకరిస్తూ సాగిపోతున్నారు.



కర్నూలు(హాస్పిటల్): సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి సోషల్ మీడియా ఇప్పుడొక వేదికగా మారింది. అందులో ఇటీవల కాలంలో వాట్సాప్ యాప్‌లోని ఫీచర్ అయిన 'స్టేటస్'ను ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటుపడ్డ ఈ తరుణంలో 'స్టేటస్'లో పోస్టు పెట్టడమనేది ఒక స్టేటస్‌లా భావిస్తున్న వారూ ఉన్నారు. ఫేస్‌బుక్, యూ ట్యూబ్, ఎక్స్ తదితర మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా వాట్సాప్ స్టేటస్ వేదికగా వాడుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జనాభా దాదాపు 50 లక్షల వరకు ఉంటుంది. అందులో పిల్లలు మినహాయిస్తే 40 లక్షల వరకు యుక్త వయస్సు నుంచి వృద్ధుల వరకు ఉంటారు. వీరిలో కనీసం 50 శాతం మందికి అంటే 20 లక్షల మందికి స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపుగా స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ ఉపయోగిస్తున్నారు. వాట్సాప్‌ను ఉపయోగించే వారందరూ స్టేటస్‌లో వారికి నచ్చిన అంశాలను పోస్టు చేస్తూ ఉండటం లేదా చూస్తూ ఉండటం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు వాట్సాప్ యాప్‌ను ఉపయోగించే వారిలో 10 నుంచి 20 శాతం మాత్రమే స్టేటస్ ఫీచర్‌ను ఉపయోగించేవారు. ఇప్పుడు 80 శాతం మంది ఈ ఫీచర్‌ను చూస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు రోజులో నాలుగైదుసార్లైనా స్టేటస్ చూడంది నిద్రపోవడం లేదని సమాచారం. వారు పెట్టిన పోస్టును ఎవరు? ఎంత మంది చూశారు? ఎవ్వరైనా ప్రతి స్పందించారా? అని ఆతృతగా వెతికేవారూ ఉన్నారు. ఇలా వారు పెట్టిన పోస్టుకు ఎవరూ స్పందించకపోతే తీవ్ర అసంతృప్తికి గురయ్యే వారూ ఉన్నారు. ఈ క్రమంలో అందుకు అనుగుణమైన సందేశాన్ని కోట్ చేస్తూ పోస్టు చేస్తున్నారు. మొత్తంగా వాట్సాప్ స్టేటస్‌లో వారు పోస్టు చేసే దాన్ని బట్టి వారు ఎలాంటి వారు, వారి మనస్తత్వమేమిటో ఇట్టే చెప్పేయవచ్చని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

వ్యక్తిగత ప్రతిభ చాటడానికి...!

చాలా మంది తమ వ్యక్తిగత ప్రతిభ చాటడానికి స్టేటస్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఎందులోనైనా వారు ప్రతిభ సాధించి ఉంటే అప్పటికప్పుడు స్టేటస్‌లో పోస్టు చేస్తున్నారు. లేదా వారి కుటుంబసభ్యుల్లో ఎవరు ప్రతిభ సాధించినా పోస్టు చేస్తున్నారు. ఈ పోస్టును చూసిన వారు తప్పక అభినందనలతో ముంచెత్తుతున్నారు. దీనివల్ల మానసికానందం పొందుతున్నారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలు, వ్యాపారాభివృద్ధి, విద్య, ఉద్యోగాల్లో ప్రతిభ చాటడం, క్రీడల్లో సత్తా చాటడం వంటి అంశాలను స్టేటస్‌లో పోస్టు చేసి వాటిని చూసిన వారి నుంచి ప్రశంసలు పొందుతున్నారు.

దేవుళ్లు.. దేవతలు..

వాట్సాప్ స్టేటస్‌తో చాలా ఉపయోగాలు ఉన్నప్పటికీ 50 శాతం మంది ఏ రోజుకు ఆ రోజు సంబంధిత దేవుళ్ల ఫొటోలు, పాటల వీడియోలు పోస్టు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిని చూసిన అదే రకమైన వారు ప్రతిస్పందిస్తూ లైక్‌లు, కామెంట్‌లు పెడుతున్నారు. మరికొందరు ప్రతిస్పందిస్తూ సంజ్ఞలు తెలిపే చిత్రాలను పోస్టు చేస్తున్నారు. హిందువులు ఆయా రోజు ప్రత్యేకతను బట్టి దేవుళ్ల గురించి పోస్టు పెడుతున్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు అయితే రోజుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ వారి మత సంబంధ కోట్స్ పోస్టు చేస్తున్నారు.

బిజినెస్‌కు వేదికగా..

వ్యాపారాభివృద్ధికి సోషల్ మీడియా కూడా ప్రచార వేదికగా మారింది. అందులో అందరూ ఎక్కువగా చూసే వాట్సాప్ స్టేటస్‌ను చాలా మంది వ్యాపారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నారు. వ్యాపారం గురించి బ్రోచర్లు ముద్రించి స్టేటస్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఆయా వస్తువుల వివరాలు, వాటిలోని ఫీచర్లు, ధర గురించి అందులోనే పోస్టు చేస్తుండటంతో చూసిన చాలా మంది వెంటనే సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి వస్తువును కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది అన్ని రకాల వ్యాపారులు వారి వ్యాపార వస్తువులను వాట్సాప్ స్టేటస్‌లో పోస్టు చేస్తూ వ్యాపారాభివృద్ధి చేసుకుంటున్నారు.

మనోభావాలు వ్యక్తం చేస్తూ..

కొందరు వారి మనోభావాలను తెలియజేసే విషయాలు ఎంపిక చేసుకుని స్టేటస్‌లో పోస్టు చేస్తూ ఆనందిస్తున్నారు. ఇవి వారికి నచ్చిన వారికి మంచిగా, నచ్చని వారికి చెడుగా స్ఫురించవచ్చు. ఆ కోట్స్‌ను పోస్టు చేసిన వ్యక్తిని బట్టి ఎవరు ఎలా రిసీవ్ చేసుకుంటే అలా కనిపిస్తాయి. ఒక విధంగా పోస్టు చేసిన వ్యక్తి మనోభావాలు ఇలా స్టేటస్ రూపంలో ప్రతి స్పందిస్తాయనడంలో సందేహం లేదు. చాలా మంది వారికి జరిగిన మంచి, చెడును ఇతరులకు చెప్పేందుకు స్టేటస్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను పోస్టు చేస్తున్నారు.

ఇట్లు.. మేము బాగున్నాం..

ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో బంధువులు, స్నేహితులకు కనీసం ఫోన్లు చేసి యోగక్షేమాలు తెలుసుకునే సమయం ఉండటం లేదు. ఏదైనా కార్యక్రమంలో కలిసినప్పుడు హాయ్.. బాయ్ అన్నట్లుగా ఉంటుంది. కనీసం పిల్లలు, కుటుంబ పరిస్థితుల గుర్తించి అడిగేవారు.. చెప్పేవారు లేరు. ఈ క్రమంలో వాట్సాప్ స్టేటస్‌ను ప్రతి ఒక్కరూ చక్కగా ఉపయోగించుకుంటున్నారు. స్టేటస్ ఒక లేఖలా మారిపోయింది. ఉదాహరణకు ఏదైనా విహార, శుభకార్యాలు, తీర్థయాత్రకు వెళ్లారంటే అందుకు సంబంధించిన ఏ రోజుకు ఆ రోజు ఫొటోలు సమయంతో సహా కుటుంబసభ్యులంతా ఉండే ఫొటోలు పోస్టు చేసి ఆనందిస్తున్నారు. ఆ పోస్టులను చూసిన వారు ఫలానా వారు ఫలానా ఊరికి యాత్రకు వెళ్లినట్లు ఉన్నారని వెంటనే గ్రహిస్తారు. మరికొందరు వారికి ఏదైనా చెడు జరిగిందంటే ఉదాహరణకు రోడ్డు ప్రమాదమో లేదా ఇతర ప్రమాదాలు, ఆరోగ్యం బాగాలేకపోయినా వారి స్థితిని తెలియజేస్తే ఇతరుల సానుభూతిని పొందేందుకు పోస్టు చేస్తూ ఉంటారు. ఆ పోస్టు చూసిన వారు అయ్యో వారికి ఆరోగ్యం బాగాలేదా అని తెలుసుకుని స్వయంగా వెళ్లడమో లేదా ఫోన్ చేసి పరామర్శించడమో చేస్తున్నారు.

ఏది పడితే అది పోస్టు చేయకూడదు



నేను పెట్టే పోస్టులను నా గ్రూపులో ఉన్న 60 నుంచి 70 శాతం మంది చూస్తున్నారు. ఇటీవల వరల్డ్ డయాబెటిస్ గురించి పోస్టు పెట్టాను. నాకు ఫోన్ చేసి షుగర్ గురించి వారికున్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. అలాగే గంటలకు పైగా సైక్లింగ్ చేసిన తర్వాత కలిగిన అనుభవం గురించి పోస్టు చేశాను. సైక్లింగ్ వల్ల లాభాల గురించి ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. చూస్తున్నారు కదా అని ఏది పడితే అది పోస్టు చేయకూడదు. అవగాహనతో చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుని పోస్టు చేయాలి.

– డాక్టర్ ఎం. శ్రీకాంత్‌రెడ్డి, దయాబెటాలజిస్టు, కర్నూలు

ప్రజల్లో అవగాహన పెంచడానికే..



ఇటీవల కాలంలో యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ లాంటి సోషల్ మీడియాల్లో కొందరు వ్యక్తులు వారికి అర్హత లేకపోయినా ఆరోగ్యం గురించి పలు రకాల పోస్టులు పెట్టి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇలాంటి వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు గాను ఒక డాక్టర్‌గా బాధ్యత తీసుకుని నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు 'స్టేటస్'లో పోస్టులు పెడుతున్నాను. నేను నూతన విధానాల్లో చేసిన సర్జరీలు, విదేశాల్లో ఉన్న ఆధునిక వైద్య విధానాలు, మన దేశాల్లో రావాల్సిన ఆవశ్యకత, వివిధ రకాల జబ్బుల గురించి వివరిస్తూ పోస్టులు పెడుతున్నాను.

– డాక్టర్ వసీం హసన్ రాజా, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

వ్యాపార ప్రచారానికి ఉపయోగపడుతోంది



నేను వ్యాపారవేత్తను. వాట్సాప్ స్టేటస్‌లోనూ పోస్టులు పెడుతున్నాను. దీనికి మంచి స్పందన వస్తోంది. నేను చేస్తున్న స్కూళ్లు, కాలేజీలు, కోచింగ్ సెంటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల గురించి పోస్టులు పెట్టాను. ఇటీవల రియల్ ఎస్టేట్ పోస్టులు స్టేటస్‌లో చూసి కొందరు క్లయింట్‌లు మావద్దకు వచ్చి కొనుగోలు చేశారు.

– పి. గోవర్ధన్‌రెడ్డి, వ్యాపారి, కర్నూలు

పేదోడి రైళ్లకు సెలవు!

- పల్లె రైళ్లకు 'కుంభమేళా'బ్రేక్‌లు
- పెదవి విరుస్తున్న పేద ప్రయాణికులు
- రెండు నెలలపాటు ప్రయాణానికి గ్రహణం
- ప్రత్యామ్నాయం చూపని రైల్వేబోర్డు
- నోరు మెదపలేని స్థితిలో కూటమి ఎంపీలు



తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్

రాజంపేట: తిరుపతి-గుంతకల్ మధ్య ఉన్న రెండు వేర్వేరు మార్గాల్లో పేదోడి రైళ్లకు బ్రేక్ వేశారు. ఏకంగా రెండునెలలపాటు పల్లె రైళ్లకు రాబోయే కుంభమేళా–2025 నేపథ్యంలో సెలవు ఇచ్చేశారు. పేదవాడి కోసం ఉన్నదే ఒకరైలు, దానిని కూడా రద్దు చేశారు.దీంతో పేద ప్రయాణిక వర్గాల్లో రైల్వేబోర్డు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. దేశంలో ఎక్కడా రైళ్లు లేన్నట్లుగా సీమలో ప్రతి గ్రామీణ రైల్వేస్టేషన్‌లో ఆగుతూ, పరుగులుతీసే పల్లెరైళ్లను కుంభమేళా–2025కు దారిమళ్లించడం ఇప్పుడు సీమలో వివాదాస్పదంగా మారుతోంది. దీంతో తిరుపతి-గుంతకల్ మధ్య వేర్వేరు రెండు రైలుమార్గాల్లో నడిచే పల్లె రైలును రద్దు చేస్తూ దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ సీవోఎం కె.మనికుమార్ పేరిట ఉత్తర్వులు జారీ అయిన సంగతి తెలిసిందే. అడిగే నాథుడు లేన్నట్లుగా రైల్వే ఉన్నతాధికారులు గుంతకల్ డివిజన్ పరిధిలో తీసుకుంటున్న నిర్ణయాలు పరోక్షంగా కేంద్రప్రభుత్వంపై పేదవర్గాల్లో అసంతృప్తిని పెంపొందిస్తోంది.

తిరుపతి-గుంతకల్(కడపమీదుగా)మార్గంలో..

తిరుపతి-గుంతకల్(కడపమీదుగా)మార్గంలో తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే (07657/07658) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేశారు. తక్కువ ధరతో గమ్య చేరడానికి పేదవర్గాలకు ఈరైలు అనుకూలంగా ఉంది. తిరుపతి నుంచి బయలుదేరుతుంది. ప్రతి గ్రామీణస్టేషన్‌లో ఆగుతుంది. దీనిని రద్దు చేయడంతో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గుంతకల్-తిరుపతి(ధర్మవరంలైన్)మార్గంలో..

గుంతకల్-తిరుపతి (ధర్మవరంలైన్) మార్గంలో 07589/07590 నంబరుగల తిరుపతి నుంచి కదిరి దేవరపల్లెకు నడిచే పల్లెరైలును కూడా రద్దు చేశారు. ఈ రైలు అనంతపురం, బెంగళూరుతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉండేది. డివిజన్ కేంద్రం గుంతకల్‌కు పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి ప్యాసింజర్ రైలు నడిచేది. ఈ రైలు కూడా ఆ మార్గంలో ఉన్న పీలేరు, మదనపల్లె, కదిరి తదితర ప్రాంతాలకు చెందిన పల్లె వాసులకు అనుకూలంగా ఉండేది. ఇప్పుడు ఆ రైలు రద్దు కావడంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లే దిక్కయ్యాయి

రెండునెలలపాటు ప్రయాణానికి గ్రహణం

కుంభమేళా–2025 కోసం రెండునెలల పాటు తిరుపతి నుంచి కడప మీదుగా, అటు ధర్మవరం మార్గంలో నడిచే ఆరు రైళ్లను రద్దు చేశారు. అన్నమయ్య, వైఎస్సార్, సత్యసాయి, అనంతపురం జిల్లాల మీదుగా ఉండే రైలుమార్గంలో నడిచే ప్యాసింజర్ రైళ్లపై ఆధారపడి ప్రయాణించే వేలాది మంది పేదలకు పల్లెరైళ్లను దూరం చేశారు.

ప్రత్యామ్నాయం చూపని రైల్వేబోర్డు

ఏకంగా రెండు రైలుమార్గాల్లో ఆరు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసే గ్రామీణులు ఇబ్బందులను రైల్వే బోర్డు పరిగణనలోకి తీసుకోలేదన్న అపవాదును మూటకట్టుకుంది. రైల్వేబోర్డు కుంభమేళాకు రేక్స్ కేటాయించాలని కోరితే, దక్షిణమధ్య రైల్వే అధికారులు రాయలసీమలో పేదలకు అందుబాటులో ఉండే రైళ్లను కేటాయించడంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఇతర రైల్వేజోన్‌స్‌తోపాటు మరికొన్ని డివిజన్లలో రేక్ పొజిషన్ పుష్కలంగా ఉన్నప్పటికి 'సీమ'పల్లెరైళ్లను కేటాయించారు. ఈ ప్రాంతానికి చెందిన కూటమి ఎంపీలు నోరుమెదిపే పరిస్థితిలో లేరని పేదప్రయాణికులు ఎద్దేవా చేస్తున్నారు.

మార్చి 1 వరకు పల్లె రైళ్లకు సెలవు

రైల్వేబోర్డు ఆదేశాలతో దక్షిణమధ్య రైల్వే వారు తిరుపతి–కదిరిదేవరపల్లె ప్యాసింజర్ రైలు, గుంతకల్–తిరుపతి ప్యాసింజర్‌రైలు, తిరుపతి–హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్ రైలును వచ్చేయేడాది మార్చి01 వరకు రద్దు చేశారు. ఆదివారం నుంచి ఈరైళ్లు రెండు మార్గాల్లో కూడా నడవవు.

సామాన్యుడు అంటే చిన్నచూపు



పేదోడి రైళ్లను రద్దు చేస్తే అడిగేవారు లేరన్న ధీమాలో కేంద్రప్రభుత్వం ఉంది. ఎక్స్‌ప్రెస్‌రైళ్లలో జనరల్‌బోగీలు వేయడంలో రైల్వే వివక్షను ప్రదర్శిస్తోంది. ప్యాసింజర్‌రైళ్లు రద్దు చేస్తే ప్రత్యామ్నాయంగా రైళ్లను నడపాలి. సామాన్యుడు అంటేనే కేంద్రానికి చిన్నచూపు.

– టీఎల్ వెంకటేశ్, సీపీఐ నేత, పీలేరు

పేదలను ఇబ్బందులు పెట్టారు...



తక్కువ ధరతో పల్లెవాసులకు అనుకూలంగా ఉన్న ఇంటర్‌సిటీ రైలును రద్దు చేయడం అన్యాయం. తిరుపతి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ వరకు పేదవర్గాలు తక్కువ వ్యయంతో వెళ్లేవారు. ఉన్న ప్యాసింజర్ రైళ్ల రద్దు చేశారు. ప్రత్యామ్నాయంగా ప్యాసింజర్‌రైలును నడపాలన్న ఆలోచన కేంద్రానికి లేదు. పేదలంటే మోదీ సర్కారుకు చిన్నచూపు.

–పులివేల రమణయ్య, నాగిరెడ్డిపల్లె, నందలూరు

పురుగు మందు తాగి కౌలురైతు ఆత్మహత్య



మలికిపురం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రు గ్రామంలో కౌలు రైతు తాడి రాంబాబు (53) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ నెల 27న రాంబాబు ఆత్మహత్యాయత్నం చేయగా.. చికిత్స పొందుతూ 28న మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన అన్నారు. స్థానికంగా సుమారు ఐదెకరాలను రాంబాబు సాగు చేసి అప్పులు పాలై ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన సరిహద్దు రైతు తాడి నరసింహారావు చెప్పారు.

నూనె యంత్రంలో పడి తెగిన బాలుడి చెయ్యి



బి.కొత్తకోట : ఓ బాలుడి చెయ్యి నూనె యంత్రంలో పడి తెగిపోయింది. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన నూరుల్లా, షాహినా దంపతుల కుమారుడు మహ్మద్ అయాన్ రెండో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులతో కలిసి బెంగళూరురోడ్డులోని నూనెగింజల ఫ్యాక్టరీకి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటుండగా నూనె తీసే యంత్రంలో చెయ్యి పడింది. దీంతో అయాన్ చెయి యంత్రంలో ఇరుక్కుని బెల్టు చుట్టూ తిరుగుతూ నలిగిపోయి మోచేయి వరకు తెగిపోయింది. అయాన్ భుజం, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో అయాన్‌ను సీహెచ్‌సీకి తరలించారు.

మతోన్మాద శక్తుల ఆట కట్టించాలి

సీపీఎం రాష్ట్ర నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు మధు



తిరుపతి కల్చరల్: తిరుపతిలో కొన్నాళ్లుగా సాగుతోన్న మతోన్మాద శక్తుల ఆగడాలను అరికట్టాలని సీపీఎం రాష్ట్ర నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు పి.మధు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో దళిత, ఆదివాసీలపై మతోన్మాద శక్తుల దాడులను ఖండిస్తూ రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ..దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ఆగడాలు మితిమీరిపోతున్నాయని, బీజేపీ అనుయాయ శక్తులుగా ఉన్న వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ వంటి మతోన్మాద శక్తులు తిరుపతి కేంద్రంగా చేసుకొని దేశంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి కారణమవుతున్నాయని గుర్తు చేశారు. మతోన్మాద శక్తుల ఆగడాలు పెరగడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్న తీరు కూడా ఓ కారణమన్నారు. ఈ మతోన్మాద శక్తులను నియంత్రించకపోతే ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి అరిష్టమని తెలిపారు. టీటీడీలో గత ప్రభుత్వ పాలనలో జరిగిన పొరబాట్లపై బీజేపీ అదే పనిగా మాట్లాడుతోందని, నాటి టీటీడీ బోర్డులో బీజేపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు 8 మందికిపైగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. నాటి పాపాలలో బీజేపీ ఉందని, దొంగే దొంగ దొంగ అన్నట్లుగా బీజేపీ నేతలు టీటీడీలోలని ప్రతి నిర్ణయంలో తమ భాగస్వామ్యం ఉండి నేడు అడ్డుగోలుగా మాట్లాడుతున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బలహీనుల కోసం జరిగే పోరాటాల్లో సీపీఐ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు

అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా తులసి విష్ణుప్రసాద్



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలలు అత్యధిక ఉత్తీర్ణత, అధిక గ్రేడ్లు సాధిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య సంఘం (అపుస్మా) రాష్ట్ర అధ్యక్షుడు కె.తులసి విష్ణుప్రసాద్ తెలిపారు. వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీలో ఆదివారం అపుస్మా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అపుస్మా రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన తులసి విష్ణుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లోనే అధిక ఉత్తీర్ణత నమోదవుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా చట్టానికి అనుగుణంగా రానున్న కాలంలో విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు వస్తాయని తెలిపారు. అపుస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శ్రీనివాసరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా పి.వి.రమణారెడ్డి, అసోసియేట్ ఉపాధ్యక్షుడిగా జేఎస్పీ బాలాజీ, సీనియర్ ఉపాధ్యక్షునిగా ఎం.వి.సుబ్బారెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎం.కృష్ణతోపాటు 16 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఇది ఆజాద్ పార్క్

యోధుడికి సెల్యూట్







ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) పేరు వినగానే త్రివేణి సంగమం గుర్తుకు వస్తుంది. ఆ తర్వాత ఇందిరా గాంధీ పుట్టిన ఇల్లు ఆనందభవన్ గుర్తు వస్తుంది. గూగుల్‌లో వెతికితే అలహాబాద్‌లో చూడాల్సిన ప్రదేశాల్లో ఆజాద్ పార్క్ కనిపిస్తుంది. టూర్ ప్లాన్‌లో పార్కులెందుకు, టైమ్ వేస్ట్ అని కొట్టిపారేస్తుంటాం. కానీ ఆజాద్ పార్కును చూసి తీరాలి. నగరం మధ్యలో 133 ఎకరాల విశాలమైన పార్కు, పచ్చదనం పరిఢవిల్లుతుంటుంది. వాహనాల రణగొణ ధ్వనులు వినిపంచనంత ప్రశాంత వాతావరణం అలరించి తీరుతుంది. టికెట్ తీసుకుని లోపలికి వెళ్లగానే కళ్లు చంద్రశేఖర్ ఆజాద్ మెమోరియల్ కోసం వెతుకుతాయి. ఆజాద్ పూర్తి పేరు చంద్రశేఖర్ సీతారామ్ తివారీ, ఆజాద్ అనేది ఆయన బిరుదు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేశాడు. ఆయన ప్రాణత్యాగం చేసిన ప్రదేశమే ఈ పార్కు.

చదువరుల పార్కు

ఆజాద్ పార్క్ బ్రిటిష్ హయాంలో ఏర్పాటైంది. అప్పుడు దాని పేరు ఆల్ఫ్రెడ్ పార్క్. జాతీయోద్యమవాదులు ఈ పార్కులో తలదాచుకుని ఉద్యమవ్యూహాలు రచించేవారు. అలా చంద్రశేఖర్ ఈ పార్కులో ఉన్న సమయంలో ఆ సమాచారం తెలుసుకున బ్రిటిష్ పోలిస్ అధికారి, తన బృందంతో మోహరించాడు. ఆజాద్ తన తుపాకీతో ముగ్గురు పోలీసులను చంపేశాడు. ఆ కాల్పుల్లో ఆజాద్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. పోలిసుల చేతిలో చిక్కకుండా తన తుపాకీతో కణత మీద కాల్చుకుని ప్రాణత్యాగం చేశాడు ఆజాద్. ఈ ఘటన జరిగిన ప్రదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆజాద్ విగ్రహాన్ని స్థాపించి ఆజాద్ మెమోరియల్‌గా తీర్చిదిద్దారు. ఆ పార్కుకు ఆజాద్ పేరు పెట్టారు. విగ్రహం దగ్గర నిలబడి ఆజాద్‌కి సెల్యూట్ చేసి మౌనంగా నివాళి అర్పించి బరువెక్కిన గుండెతో ముందుకు సాగిపోతారు పర్యాటకులు.

పార్కులో లైబ్రరీ!

ఆజాద్ పార్కులో ఆజాద్ మెమోరియల్‌తోపాటు విక్టోరియా మెమోరియల్ కూడా ఉంది. అయితే అందులో ఇప్పుడు విక్టోరియా స్టాచ్యూ లేదు. ప్రయాగ్‌రాజ్ సంగీత్ సమితి, మదన్ మోహన్ మాలవ్యా స్టేడియం, అలహాబాద్ మ్యూజియం ఉన్నాయి. అలహాబాద్ పబ్లిక్ లైబ్రరీ



బిల్డింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లు బ్రిటిష్ కాలం నాటి యూరోపియన్ స్టైల్ నిర్మాణాలు. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎనిమిది గంటల మధ్యలో 5వేల మందికి పైగా సందర్శిస్తారని అంచనా. టికెట్ ఐదు రూపాయలు మాత్రమే. ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రవేశం ఉచితం. ఇక్కడకు నగరవాసులు రెగ్యులర్‌గా వస్తుంటారు. మంత్లీ టికెట్ వంద రూపాయలు. ఏడాదికి పాస్ తీసుకుంటే వెయ్యి రూపాయలు. పార్కులోపల ఒక ప్రత్యేకమైన ప్రపంచం. రెగ్యులర్‌గా వాకింగ్‌కి వచ్చే మహిళలు, రిటైర్ అయిన వాళ్లు ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించుకుంటూ నడక వేగం తగ్గకుండా ముందుకు వెళ్తుంటారు. కోచ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ప్రాక్టీస్ చేస్తుంటారు. లైబ్రరీలో సివిల్స్‌కి ప్రిపేరయ్యే వాళ్లు కనిపిస్తారు. ఆవరణలో ఒక్కొక్కరు ఒక్కో చోట దుప్పటి పరుచుకుని పుస్తకాలు పక్కన పెట్టుకుని చదువుకుంటూ ఉంటారు. వారి ఏకాగ్రత స్థాయి ఎంతలా ఉంటుందంటే పర్యాటకులు వారి పక్కనే నడిచి వెళ్తున్నా సరే... పుస్తకంలో నుంచి తలతిప్పి చూడరు. వారి చదువుకు భంగం కలిగించకూడదనే పర్యాటకులే ఒకరికొకరు సైగ చేసుకుంటూ శబ్దం చేయకుండా దూరంగా వెళ్లిపోతుంటారు. ఈ పార్కులోకి ఎంట్రీ ఫీజు ఐదు రూపాయలే కానీ పార్కు గేటు దగ్గర కొబ్బరిబోండా డెబ్బై రూపాయలు. లైట్ అండ్ సౌండ్ షో సాయంత్రం ఏడు గంటలకు మొదలవుతుంది. 45 నిమిషాలపాటు సాగే ఈ షోలో మోతీలాల్ నెహ్రూ ఇల్లు ఆనందభవన్, అందులో సాగిన స్వాతంత్య ఉద్యమ రచన వివరాలు, ఆజాద్ పార్కులో సాగిన ఉద్యమ ఘట్టాలతో షో నడుస్తుంది. ఆజాద్ మరణంతో ముగిసే



ఈ షో మరోసారి మనసును బరువెక్కిస్తుంది. ఈ రోజు మనం పీలుస్తున్న స్వేచ్ఛావాయువుల వెనుక ఎన్ని ప్రాణత్యాగాలో? లైట్ అండ్ సౌండ్ పూర్తయి పార్కులో నుంచి బయటపడేటప్పటికి ఎనిమిది గంటలవుతుంది.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



జిమ్ కార్బెట్
నేషనల్ పార్క్

పులి కోసం ఏనుగు అంబారీ



జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ యూత్‌ఫుల్ టూరిస్ట్ ప్లేస్. పర్యటన ఆద్యంతం క్షణక్షణం అప్రమత్తంగా ఉండాలి. చర్మచక్షువులకంటే బైనాక్యులర్ లెన్స్‌నే నమ్ముకోవాల్సిన ప్లేస్ ఇది. ఐదువందలకు పైగా పక్షుల జాతులు, నేలమీద పాకే జంతువులు, నాలుగు కాళ్ల జంతువులు... చెట్ల మాటున దోబూచులాడుతూ తిరుగుతుంటాయి. హిమాలయాల తొలిమెట్టు లాంటి ప్రదేశం. ఇక్కడ కనిపించే జంతువులను వెంటనే పోల్చుకోలేం. పరీక్షగా గమనించేలోపు మాయమై పోతుంటాయి. అప్పుడప్పుడూ బెంగాల్ రాయల్ టైగర్ కూడా గంభీరంగా నడకలో రాజసం ఒలకబోస్తూ దర్శనమిస్తుంది. పులి ఎప్పుడు కనిపిస్తుందోననే ఆతృతలో ఉంటారు పర్యాటకులు. పులి కోసం ఎదురుచూపులో పడి కళ్ల ముందు కనిపించే రంగురంగు పక్షుల రెక్కల సౌందర్యాన్ని ఆస్వాదించడం మర్చిపోతుంటారు. ఏనుగులు గుంపులుగా తిరుగుతుంటాయి.

ఏనుగమ్మ ఏనుగు

నేషనల్ పార్కులోకి ఎలిఫెంట్ సఫారీ, జీప్సీ సఫారీ సర్వీసులుంటాయి. ఉదయం పూట సఫారీ ఆరు గంటల నుంచి పదకొండు గంటల వరకు ఉంటుంది. మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర వరకు ఉంటుంది. ఏనుగు అంబారీ ఎక్కి అడవి మధ్యలో పులి కోసం అన్వేషించడంలో థ్రిల్‌ని ఎంజాయ్ చేయవచ్చు. అడవి మధ్యలో పారే నది, ఆ నదిలో నీటి కోసం వచ్చే జంతువులను చూస్తూ సాగే సఫారీ ఆద్యంతం ఉల్లాసభరితమే. ఈ పార్కులో వన్యప్రాణుల మధ్య విహరించాలంటే నవంబర్ నుంచి జూన్ వరకు సౌకర్యం. ఉత్తరాఖండ్ రాష్ట్రం అంతా దాదాపు పర్వత సానువుల మధ్యనే విస్తరించింది. దట్టమైన అడవులు, వన్యప్రాణులు, పక్షులతో ప్రకృతి సోయగాల నిలయంగా ఉంటుంది. ఈ నేషనల్‌పార్క్ విజిట్‌కి పదేళ్ల లోపు పిల్లలను తీసుకెళ్లకపోవడమే మంచిది.

సృజన

స్క్రాప్‌తో శిల్పం



స్క్రాప్ మెటల్‌తో కళాఖండాన్ని రూపొందిస్తున్న బిస్వాల్

సృజనాత్మకత, నైపుణ్యాలకు పతినిధిగా కటక్‌కు చెందిన సంజీబ్ బిస్వాల్ జాతీయస్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. 27 కిలోల స్క్రాప్ మెటల్‌ను ఉపయోగించి అద్భుతమైన 4 అడుగుల శిల్పాన్ని రూపొందించాడు. స్క్రూలు, ఇతర వ్యర్థ లోహ పదార్థాలను ఉపయోగించి తయారు చేసిన ఈ విశిష్ట కళాఖండం పూర్తి దశకు చేరుకుంది. బిస్వాల్ తన క్రాఫ్ట్ గురించి వివరిస్తూ 'నేను సాధారణ పదార్థాల నుండి అసాధారణమైనదాన్ని సృష్టించాలనుకుంటున్నాను. ఇందుకు ఎన్ని గంటల సమయం పడుతుందో కూడా చెప్పలేను. నేను రూపొందించే శిల్పాలు ఆకర్షణీయంగా ఉండటంతో చాలా మంది దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రీసైకిల్ చేసిన పదార్థాల సామర్థ్యానికి బిస్వాల్ కళాత్మక ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్ట్ స్థిరత్వం, కళలను ప్రోత్సహించడంలో సృజనాత్మకత ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది' అని వివరిస్తాడు సంజీబ్.

ఆర్ట్

ఆ చిత్రాలు జ్ఞాపకాల చీరలు



సైలెంట్ రిట్రీట్



టైమ్ ట్రావెలర్స్

చిత్రకారులు కుంచెలతో చిత్రాలు గీస్తారు. సుచిత్రా మట్టాయ్ మాత్రం పాతకాలపు చీరలను ఉపయోగిస్తూ అందమైన చిత్రాలను రూపొందిస్తుంది. వాషింగ్టన్‌లోని నేషనల్ మ్యూజియం ఆఫ్ ఉమెన్ ఇన్ ద ఆర్ట్స్‌లో పాతకాలపు చీరల నుండి అల్లిన ప్రకృతి దృశ్యం 'త్రూ ది ఫారెస్ట్, అక్రాస్ ది సీ, బ్యాక్ హోమ్ ఎగైన్'... వంటి చిత్రాలను ప్రదర్శించింది. ఎరుపు, గులాబీ, నారింజ, గోధుమ రంగులు.. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించేలా రూపొందించింది.

ఇండో-కరేబియన్ సంతతికి చెందిన ఆర్టిస్ట్ సుచిత్రకు తమ చీరలను పంపేందుకు చాలా మంది ఇష్టపడుతుంటారు. వారిలో విదేశాలలో నివసిస్తున్న ఇండియన్స్ కూడా ఉన్నారు. ఆమె తల్లి, సెకండ్‌హ్యాండ్ షాపుల నుండి చీరలను సేకరించి, లాస్ ఏంజిల్స్‌లో నివసిస్తున్న తన కుతురుకి పంపిస్తుంది. వాటిలో తమ స్నేహితులు, బంధువుల నుంచి సేకరించినవి కూడా ఉంటాయి. సుచిత్ర అభిమానులు కొందరు విలువైన, సున్నితమైన దారాలతో నేచిన వారి స్వంత వస్త్రాలను కూడా పంపుతారు. 'సైలెంట్ రిట్రీట్' (2023) కోసం సుచిత్ర తన చీరలలో ఒకదానిని - క్లిష్టమైన నమూనాలతో, మిరుమిట్లు గొలిపే ఎంబ్రాయిడరీ టేప్‌స్ట్రీలో చేర్చింది.

ఎంబ్రాయిడరీతో జత కలిపి



చిత్రకారిణి
సుచిత్రా మట్టాయ్

51 ఏళ్ల సుచిత్రా మట్టాయ్ ఈ డిజైన్స్ రూపకల్పన గురించి మరింతగా వివరిస్తూ - 'మా అమ్మ సుభద్ర మట్టాయ్ పూర్వీకులు ఒప్పంద కార్మికులుగా ఉత్తరప్రదేశ్‌ను విడిచిపెట్టి, దక్షిణ అమెరికా ఉత్తర తీరంలో ఉన్న గయానాలో చెరకు తోటలలో పనిచేసేవారు. ఆ కుటుంబ కథలను పెయింటింగ్‌లో వచ్చేలా ఫ్యాబ్రిక్ పీసెస్‌ను కలిపి డిజైన్ చేశాను. 'సైలెంట్ రిట్రీట్'తో పాటు ఇతర చిత్రాలలో టేప్‌స్ట్రీలలోని బొమ్మలలో రంగు వేయడానికి ఎంబ్రాయిడరీ ఫ్లాస్‌ను ఉపయోగించాను. పాస్టోరల్ యూరోపియన్ దృశ్యాలను పరిచయం చేసే ఈ ప్రక్రియను 'బ్రౌన్ రీక్రియేట్'గా చూపాను' అని తెలియజేస్తుంది.

అలంకారిక అంశాలు

జనవరి 12 వరకు ప్రదర్శించే ఈ కళారూపాలలో చరిత్రాకాంశాలను కూడా పరిచయం చేస్తుంది. దొరికిన వస్త్రాలు సుచిత్ర చిత్రాలకు పునాదిగా పనిచేస్తాయి. తరచుగా అవి భారీ-ఉత్పత్తి కిట్లు లేదా ఇతర వాణిజ్య నమూనాల ఆధారంగా సూది, దారాలతో అలంకారిక అంశాలను చేతితో జోడిస్తుంది. 'టైమ్ ట్రావెలర్స్'లో పూసల అంచు, బంగారు తాడు వంటి కొన్ని అలంకార అంశాలను జోడించింది. మట్టై చిత్రకారిణిగా శిక్షణ పొందింది. అమ్మ, అమ్మమ్మల కథలను అర్థమయ్యే విధంగా తెలియజేయడానికి వస్త్రాల వైపు మొగ్గు చూపింది. యునైటెడ్ స్టేట్స్‌లో సుచిత్ర మొట్టమొదటి సోలో మ్యూజియం ప్రదర్శనలలో 'మిత్ ఫ్రమ్ మేటర్' ఒకటి.


సంస్కృతి

చైనా రుచికరమైన 'టీ'



యునెస్కో ప్రపంచ సాంస్కృతిక వారసత్వ జాబితాలోకి చైనా సాంప్రదాయ టీ తయారీ చేరింది. చైనాలో టీ అనేది ప్రజల రోజువారీ జీవితంలో అల్లుకుపోయిన పానీయం, టీ తో అక్కడి ప్రజలకు లోతైన సాంస్కృతిక, సామాజిక, చారిత్రక ప్రాముఖ్యతను కలిగి ఉంది.

బీజింగ్ టీ మ్యూజియంలో ఉత్తర- దక్షిణ రాజవంశాల (క్రీ.పూ. 386- క్రీ.పూ. 589) నాటి 100కి పైగా టీ-సంబంధిత కళాఖండాల సేకరణ ఉంది. ఇక్కడి కాలిగ్రఫీ, పెయింటింగ్‌లు, సాంస్కృతిక అవశేషాలు, పురాతన టీ సెట్‌లు, టీల నమూనాలు ఉన్నాయి, ఇవి చైనా గొప్ప టీ సంస్కృతి, సమగ్ర, క్రమబద్ధమైన సేకరణను అందిస్తాయి.



టీ సంస్కృతిని ప్రోత్సహించడానికి, అంతర్జాతీయ టీ సంస్కృతికి కేంద్రంగా ఈ మ్యూజియం సంవత్సరాలుగా టీ-సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇది దేశవ్యాప్తంగా విద్యార్థులకు సాంప్రదాయ సాంస్కృతిక విద్యా కార్యక్రమాలను, చైనాలో ఉన్న విదేశీ దౌత్యవేత్తలకు టీ సంస్కృతి అనుభవాలను అందిస్తుంది.. 'టీ తయారీ కోసం చైనీస్ ప్రజలు సృష్టించిన అనేక మార్గాలు, వస్తువులను చూసి విదేశీ రాయబారులు ఆశ్చర్యపోతారు. తూర్పు తీసుకువచ్చిన టీ ఆకుతో ఇక్కడి ప్రజలు రకాల రకాల టీ లను ఎలా సృష్టిస్తారో తెలియజేస్తుంది.

వారసత్వ జాబితాలో..

టీ సంస్కృతికి పుట్టినిల్లుగా చైనీస్ టీ చరిత్రను క్రీ.పూ హాన్ రాజవంశాల నుండి గుర్తించవచ్చు, చైనాలో సాంప్రదాయ టీ ప్రాసెసింగ్ పద్ధతులు, అనుబంధ సామాజిక పద్ధతులు 2022లో యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చబడ్డాయి. చైనీయుల దైనందిన జీవితంలో టీ సర్వవ్యాప్తి చెందుతుంది, ఎందుకంటే కుటుంబాలు, కార్యాలయాలు, టీ హౌస్‌లు, రెస్టారెంట్లు, దేవాలయాలలో వేడి వేడి తేనీటిని అందిస్తారు. వివాహాలు, సమూహాలుగా జరిగే వేడుకలలో కూడా ముఖ్యమైన భాగం అని యునెస్కో తెలిపింది. వాస్తవానికి 'తు' అని పిలిచే టీ, పురాతన చైనీస్ ఔషధ పుస్తకాలలో విరుగుడుగా ఉపయోగించబడటానికి కనుక్కున్నట్టు రాయబడి ఉంది.

ముఖ్యమైన టీ సంగతులు...

- టీ తాగే ధోరణి ప్రారంభమైనప్పుడు టాంగ్ రాజవంశం (క్రీ.పూ.618- క్రీ.పూ.907) నుండి టీ ని విశ్వవ్యాప్తంగా 'చా' అని పిలిచారు.
- 1987లో పురావస్తు శాస్త్రవేత్తలు ఆలయంలోని భూగర్భ ప్యాలెస్ నుండి తొలి, అత్యున్నత స్థాయి టాంగ్ ఇంపీరియల్ టీ సెట్‌ను కనుగొన్నారు. 8వ శతాబ్దంలో టాంగ్ పండితుడు లు యు రచించిన క్లాసిక్ ఆఫ్ టీ, టీ- సంబంధిత అభ్యాసాల గురించి క్రమపద్ధతిలో వివరించిన మొదటి గ్రంథం.
- సాంగ్ రాజవంశం (960-1279)లో ప్రజలలో ప్రజాదరణ పొందింది: మ్యూజియంలోని కుడ్య చిత్రం టీ పోటీలో పాల్గొనడానికి ప్రజలు తమ సొంత టీ, టీ సెట్‌లను తీసుకువచ్చిన దృశ్యాన్ని ప్రదర్శిస్తుంది.
- మ్యూజియంలో అతి ముఖ్యమైనది 'గోల్డెన్ మెలోన్ ట్రిబ్యూట్ టీ', దీనిని 'రెన్ టౌ చా' (తల ఆకారపు టీ) అని కూడా పిలుస్తారు. ఇది ఒక శతాబ్దానికి పైగా భద్రపరచబడిన అరుదైన, వయస్సు గల ప్యూర్ టీ. దీని ఆకారం గుమ్మడికాయ, బంగారు రంగును పోలి ఉంటుంది కాబట్టి దీనికి గోల్డెన్ మెలోన్ టీ అని పేరు పెట్టారు.
- ఆకుపచ్చ, పసుపు, ముదురు, తెలుపు, బ్లాక్ .. టీలతో పాటు యువ తరం కొత్త మార్గాలతో సంప్రదాయాన్ని స్వీకరించింది. వారు స్థానిక టీ ఆకులను బేస్‌గా ఉపయోగిస్తారు. టీని తాజా పాలు, బెర్రీ, పీచెస్ వంటి పండ్లతో కలిపి కొత్త టీ డ్రింక్స్‌ను తయారు చేస్తారు.





నాయకుడిగా మీరు మీ బృందం కోసం పని చేయాలి...
వారు మీ కోసం పని చేయాలనుకోకూడదు..
- గ్యారీ వాయ్నర్‌చుక్, వేనర్మీడియా సీఈఓ

సాక్షి ప్లస్
సోమవారం । 30-12-2024

రివైండ్ 2024

పట్టిందల్లా బంగారమే!

మురిపించిన బంగారం.. రోలర్ కోస్టర్ రైడ్‌ను తలపించిన స్టాక్ మార్కెట్లు. డాలర్ విలువతో బక్కచిక్కిన రూపాయి.. 2024లో ఇన్వెస్టర్ల అంచనాలకు అందని విధంగా వీటి ప్రయాణం సాగిపోయింది. రష్యా-ఉక్రెయిన్; ఇజ్రాయెల్-హమాస్-పాలస్తీనా-ఇరాన్ మధ్య ఘర్షణలు ; కొండెక్కిన ద్రవ్యోల్బణం, యూఎస్ ఫెడ్ రేట్ల కోతలు, దోనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో టారిఫ్‌ల భయాలు.. ఇలాంటి ఎన్నో పరిణామాలు, అనిశ్చితులు బంగారానికి డిమాండ్ పెంచాయి. దీంతో ఈ ఏడాది ఈక్విటీ, డెట్‌కు మించి బంగారం సూపర్ ర్యాలీ చేసింది. డాలర్ బలోపేతం, అమెరికా డెట్‌లో మెరుగైన రాబడులతో విదేశీ ఇన్వెస్టర్లు భారత క్యాపిటల్ మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకే ప్రాధాన్యం చూపించారు. ఇది రూపాయి విలువపై ప్రభావం చూపించింది. ఈ ఏడాది 3 శాతం వరకు క్షీణించింది. స్థానిక రిటైల్ ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్స్ కొనుగోళ్లు ఒకింత ఈక్విటీ మార్కెట్లను ఆదుకున్నాయి. దీంతో ఈ ఏడాది మొత్తం మీద ఈక్విటీలు నికర రాబడులను అందించాయి. బంగారం తర్వాత ఇన్వెస్టర్లు వెండికి ప్రాధాన్యం ఇచ్చారు. పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహనాల నుంచి పెరిగిన డిమాండ్‌తో వెండి కూడా ర్యాలీ చేసింది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

పసిడి మెరుపులు



ఈ ఏడాది ఇన్వెస్టర్లు ఊహించినదానికి మించి బంగారం రాబడులు పంచింది. వెండి కూడా మెరిసింది. ఈ ఏడాది ఆరంభంలో బంగారం ధర 10 గ్రాములకు రూ.63,000 స్థాయిలో ఉండగా, రూ.78,000–79000కు వృద్ధి చెందింది. రూపాయి మారకంలో 24 శాతం ర్యాలీ చేసింది. డాలర్ మారకంలో అయితే 29 శాతం పెరిగింది. ఇక వెండి కిలో ధర రూ.78,600 స్థాయి నుంచి 16 శాతానికి పైగా పెరిగి రూ.91,000కు చేరుకుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళుతుందన్న భయాలు, అంతకంతకూ పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఘర్షణలు ఈ ఏడాది పసిడికి బలాన్నిచ్చాయి. బంగారం అంతర్జాతీయంగా చూస్తే అక్టోబర్‌లో నమోదైన 2,670 డాలర్ల (ఔన్స్‌కు) నుంచి 4 శాతం నష్టపోయింది. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ పెరుగుదల, డాలర్ ర్యాలీ, ద్రవ్యోల్బణం ఆందోళనలు కొంత శాంతించడం పసిడి చల్లబడడానికి కారణాలుగా వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) తన తాజా నివేదికలో ప్రస్తావించింది. అయినప్పటికి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారానికి డిమాండ్ కొనసాగడం, ఆర్‌బీఐ సహా ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంక్‌లు పసిడి నిల్వలను పెంచుకుంటూ పోవడం ధరలకు మద్దతునిచ్చాయి. పండుగల సీజన్‌లో తప్పించి ఈ ఏడాది బంగారం ఆభరణాల కొనుగోళ్లు సాధారణంగానే ఉన్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టాలకు చేరడంతో కొనుగోలుదారులు వేచి చూసే ధోరణిని అనుసరించారు. కానీ, పెట్టుబడి కోసం భౌతిక బంగారం కొనుగోళ్లు మాత్రం వృద్ధి చెందాయి. ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల్లో సురక్షిత సాధనంగా బంగారానికి ఉన్న గుర్తింపు సానుకూల సెంటిమెంట్‌కు దారితీసినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు), సిల్వర్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (సిల్వర్ ఈటీఎఫ్‌లు) ఈ ఏడాది 20 శాతం వరకు నికర రాబడిని అందించాయి. బంగారం ఈటీఎఫ్‌లు సగటున 20 శాతం పెరగ్గా, సిల్వర్ ఈటీఎఫ్‌ల ధర 19.66 శాతంగా పెరిగింది. ఈ రెండు విభాగాల్లోనూ మొత్తం 31 ఫండ్స్ అందుబాటులో ఉన్నాయి. 2023లో గోల్డ్ ఈటీఎఫ్‌లు 13 శాతం రాబడిని, సిల్వర్ ఈటీఎఫ్‌లు సగటున 4 శాతం రాబడిని అందించాయి. భారత గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం భౌతిక బంగారం గడిచిన నాలుగేళ్లలో రెట్టింపై 2024 అక్టోబర్ చివరికి 54.5 టన్నులకు చేరినట్టు డబ్ల్యూజీసీ తెలిపింది. ఈ ఏడాది అక్టోబర్ నాటికే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు గతేడాదితో పోల్చితే రెట్టింపై రూ.7367 కోట్లకు చేరాయి. 2023లో 2,919 కోట్లను గోల్డ్ ఈటీఎఫ్‌లు ఆకర్షించాయి.

ఆర్‌బీఐ కొనుగోళ్లు..



ఈ ఏడాది బంగారం ధరల ర్యాలీకి సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు సైతం ప్రేరణగా నిలిచాయి. ఈ ఏడాది నవంబర్ వరకు 11 నెలల్లో ఆర్‌బీఐ 72.6 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. దీంతో ఆర్‌బీఐ వద్ద పసిడి నిల్వలు 9 శాతం పెరిగి 876 టన్నులకు చేరాయి. 2023లో 16 టన్నులు, 2022లో 33 టన్నుల చొప్పున ఆర్‌బీఐ బంగారం నిల్వలు పెంచుకున్నట్టు డబ్ల్యూజీసీ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది మొదటి 11 నెలల్లో భారత్ దిగుమతి చేసుకున్న బంగారం 800 టన్నులను మించి ఉంటుందని అంచనా వేసింది. 2023 ఏడాది మొత్తం దిగుమతులు 689 టన్నులుగా ఉన్నట్టు.. విలువ పరంగా చూస్తే దిగుమతులు 48 శాతం పెరిగినట్టు (ధరల పెరుగుదలతో) డబ్ల్యూజీసీ తెలిపింది.

సావరీన్ గోల్డ్ బాండ్లు కనుమరుగు!



బంగారంపై పెట్టుబడులను ఎలక్ట్రానిక్ రూపంలోకి మళ్లించే ఉద్దేశ్యంతో 2015లో మోదీ సర్కారు సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఏటా నాలుగు విడతలుగా వీటిని జారీ చేయడం ద్వారా నిధులు సమకరిస్తూ వచ్చింది. ఇన్వెస్టర్లకు ఇవి మెరుగైన రాబడులు ఇచ్చాయి. ''2024లో కేవలం ఒక్క విడతే ఎస్‌జీబీని ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ జారీ చేసింది. 2023లో నాలుగు ఇష్యూలు చేపట్టింది. 2.5 శాతం వడ్డీ హామీకితోడు పన్ను మినహాయింపు ప్రయోజనాలతో బంగారంపై పెట్టుబడులకు ప్రాధాన్య సాధనంగా ఇది మారిపోయింది. దీంతో డిమాండ్-సరఫరా మధ్య తీవ్ర అంతరానికి దారితీసింది. ఫలితంగా ఇన్వెస్టర్ల ఆసక్తి గోల్డ్ ఈటీఎఫ్‌ల వైపు మళ్లింది'' అని ఫిన్‌ఎడ్జ్ కో ఫౌండర్ మయాంక్ భట్నాగర్ తెలిపారు. పసిడి బలమైన ర్యాలీ, దీనికితోడు వడ్డీ చెల్లింపులు భారంగా మారడంతో ఎస్‌బీజీలను కేంద్రం నిలిపివేసినట్టు తెలుస్తోంది.

- గోల్డ్ ఈ ఏడాది ఆల్‌టైమ్ గరిష్టం: 82,000 (అక్టోబర్ 30న హైదరాబాద్)
- వెండి ఈ ఏడాది ఆల్‌టైమ్ గరిష్టం: రూ.1,01,900 (అక్టోబర్ 30)
- ఆర్‌బీఐ బంగారం కొనుగోళ్లు: 73 టన్నులు (నవంబర్ నాటికి)
- బంగారం దిగుమతులు: 800 టన్నులు (నవంబర్ నాటికి)
- గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు: 7,367 కోట్లు (అక్టోబర్ నాటికి)



స్టాక్ మార్కెట్లు రికార్డులే రికార్డులు

అంతర్జాతీయంగా ఎన్నో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, (ఎఫ్ఐఐలు), విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారీ అమ్మకాలు చేపట్టినప్పటికీ భారత ఈక్విటీ మార్కెట్లు ఈ ఏడాది రికార్డుల మీద రికార్డులు సృష్టించాయి. దీనికి దేశీ పెట్టుబడులే అండగా నిలిచాయని చెప్పుకోవాలి. ఏడాది చివర్లో స్టాక్స్ మరోసారి దిద్దుబాటులోకి వెళ్లినప్పటికీ.. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 9 శాతం (6,459 పాయింట్లు), ఎన్ఎస్ఈ నిఫ్టీ 9.58 శాతం (2,082 పాయింట్లు) మేర లాభాలను (డిసెంబర్ 27 నాటికి) ఇచ్చాయి. ''దేశీ, అంతర్జాతీయ పరిణామాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అసాధారణ అమ్మకాలకు దిగడంతో గత రెండు నెలల్లో ఈక్విటీ మార్కెట్ ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి నుంచి దిద్దుబాటుకు గురైంది. 2020 కరోనా విపత్తు తర్వాత ఇది మూడో గరిష్ట దిద్దుబాటు'' అని మోతీలాల్ ఓస్వాల్ వెల్త్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది.

రెండు అంతర్జాతీయ భౌగోళిక పరిణామాలను ఈక్విటీ మార్కెట్లు ఈ ఏడాది ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా ఇజ్రాయెల్-ఇరాన్ నేరుగా దాడులకు దిగాయి. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందా? అన్న ఆందోళన ఇన్వెస్టర్లను కలవరపాటుకు గురి చేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా సమసిపోలేదు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో కార్పొరేట్ ఫలితాలు బలంగా ఉండడం, దేశీ పెట్టుబడుల ప్రవాహం, జీడీపీ పటిష్ట వృద్ధితో.. బీఎస్ఈ సెన్సెక్స్ 85,978 పాయింట్ల ఆల్‌టైమ్ గరిష్ట రికార్డును సెప్టెంబర్ 27న నమోదు చేసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ అదే రోజున 26,277 గరిష్టాన్ని తాకింది. ఈ స్థాయిల నుంచి చూస్తే సెన్సెక్స్ డిసెంబర్ 27 నాటికి 8.46 శాతం, నిఫ్టీ 9.37 శాతం చొప్పున నష్టపోయాయి. డిసెంబర్ 27 చివరికి సెన్సెక్స్ ముగింపు 78,699 కాగా, నిఫ్టీ ముగింపు 23,813 పాయింట్లు.

- నిఫ్టీ ఆల్‌టైమ్ రికార్డు: 26,277 (సెప్టెంబర్ 27)
- ఈ ఏడాది నికర రాబడి: 2,082 పాయింట్లు (9.58%)
- సెన్సెక్స్ ఆల్ టైమ్ రికార్డు: 85,978 (సెప్టెంబర్ 27)
- ఈ ఏడాది నికర రాబడి: 6,459 పాయింట్లు (9%)
- విదేశీ ఇన్వెస్టర్ల నికర ఈక్విటీ పెట్టుబడులు: రూ.1,655 కోట్లు (ప్రైమరీ, సెకండరీ)
- విదేశీ ఇన్వెస్టర్ల నికర డెట్ పెట్టుబడులు: రూ.1,12,409 కోట్లు

''2024 బుల్స్, బేర్స్ మధ్య నువ్వా-నేనా అన్నట్టుగా యుద్ధం నడిచింది అంతర్జాతీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ పరిణామాలు మార్కెట్లపై ప్రభావం చూపించాయి. ఈ ఒత్తిళ్లను తట్టుకుని మరీ భారత మార్కెట్లు చక్కని రాబడులు ఇచ్చాయి. దీంతో మన మార్కెట్ల విలువ ప్రపంచంలోనే అత్యంత ఖరీదుగా మారింది. దీనికితోడు అధిక లిక్విడిటీ (నిధుల ప్రవాహం) మార్కెట్ల వ్యాల్యూయేషన్‌ను గరిష్టాలకు చేర్చింది. దీంతో ఫండమెంటల్స్ కూడా పక్కకుపోయాయి. ఇదే అంతిమంగా మార్కెట్లో కరెక్షన్‌ను ఆహ్వానించినట్టయింది'' అని మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ అనలిస్ట్ ప్రశాంత్ తాప్సే వివరించారు. జీడీపీ వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ట స్థాయి అయిన 5.4 శాతానికి సెప్టెంబర్ త్రైమాసికంలో క్షీణించడం, ఇదే త్రైమాసికానికి సంబంధించి బలహీన కార్పొరేట్ ఫలితాలు, ఖరీదైన వ్యాల్యూయేషన్ల వద్ద విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడం చివరికి మార్కెట్లో దిద్దుబాటుకు దారితీశాయి. ద్రవ్యోల్బణం 6 శాతం దాటిపోవడంతో వ్యవస్థలో లిక్విడిటీ మరింత కట్టడి దిశగా ఆర్‌బీఐ తీసుకున్న చర్యలు కూడా వినియోగం క్షీణించి, వృద్ధిపై ప్రభావం చూపించాయి. ఈ ఏడాదిలో అధిక భాగం ద్రవ్యోల్బణం 5 శాతానికి పైనే చలించింది. వరుసగా 9వ ఏట భారత ఈక్విటీలు ఇన్వెస్టర్లకు లాభాలను పంచగా, స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ అయితే మరింత రాబడులతో మురిపించాయి.

ఎఫ్ఐఐలు నికర పెట్టుబడిదారులే



అక్టోబర్, నవంబర్ నెలల్లోనే విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.1.4 లక్షల కోట్ల అమ్మకాలకు పాల్పడడం గమనార్హం. ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల వాటా 16 శాతానికి దిగొచ్చింది. 12 ఏళ్ల కనిష్ట స్థాయి ఇది. రిటైల్, దేశీ ఇనిస్టిట్యూషన్లు, హెచ్ఎన్ఐల వాటా 32 శాతానికి చేరింది. ఈ ఏడాది డిసెంబర్ 27 నాటికి ఎఫ్ఐఐలు నికరంగా రూ.1,19,277 కోట్ల మేర స్టాక్ ఎక్స్చేంజీల ద్వారా (సెకండరీ మార్కెట్) అమ్మకాలు నిర్వహించారు. అదే సమయంలో ప్రైమరీ మార్కెట్ ద్వారా (ఐపీవోలు) వీరు రూ.1,20,932 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్టు ఎన్ఎస్‌డీఎల్ డేటా స్పష్టం చేస్తోంది. అంటే ఈక్విటీల్లో ఎఫ్ఐఐలు నికరంగా రూ.1,655 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్టు తెలుస్తోంది. ''ఈ ప్రకారం ఎఫ్ఐఐలు ఈ ఏడాది ఇంత వరకు నికర పెట్టుబడిదారులుగానే ఉన్నారు. ఎక్స్చేంజీల ద్వారా అమ్మకాలన్నవి అధిక వ్యాల్యూయేషన్ల వల్లే. అదే సమయంలో సహేతుక విలువలు ఉండడంతో ప్రైమరీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసినట్టు తెలుస్తోంది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డీకే విజయ్‌కుమార్ తెలిపారు. డెట్ మార్కెట్లో ఎఫ్ఐఐలు ఈ ఏడాది మొత్తం మీద రూ.1,12,409 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్టు ఎన్ఎస్‌డీఎల్ డేటా ఆధారంగా తెలుస్తోంది.

పాతాళానికి రూపాయి



ఈ ఏడాది రూపాయికి అచ్చి రాలేదు. డాలర్‌తో 3 శాతం మేర తన విలువను కోల్పోయింది. అయినప్పటికీ వర్ధమాన దేశాల కరెన్సీలతో పోలిస్తే రూపాయే కాస్త మెరుగ్గా ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ అస్థిరతలు కనిపించింది రూపాయిలోనే కావడం విశేషం. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం కరెన్సీ మార్కెట్లో అస్థిరతలను పెంచింది. నిజానికి ఇతర కరెన్సీలతో పోల్చితే రూపాయి పతనం డాలర్‌లోనే తక్కువగా కనిపించింది. అంతేకాదు యూరో, జపాన్ యెన్‌లతో పోల్చితే రూపాయి బలపడింది. 2024 జనవరి 1న రూపాయి డాలర్ మారకంలో 83.19 వద్ద ఉంటే, డిసెంబర్ 27 నాటికి 85.59కి బలహీనపడింది. విలువ పరంగా రూ.2 కోల్పోయింది. ముఖ్యంగా కీలకమైన 84 స్థాయి దిగువకు అక్టోబర్ 10న రూపాయి పడిపోయింది. డిసెంబర్ 19న 85 స్థాయినీ కోల్పోయి.. డిసెంబర్ 27న ఫారెక్స్ మార్కెట్లో 85.80 జీవిత కాల కనిష్ట స్థాయిని నమోదు చేసింది. చివరికి అదే రోజున 85.59 వద్ద స్థిరపడింది. యెన్‌తో రూపాయి ఈ ఏడాది 8.7 శాతం బలపడింది. జనవరి 1న 100 యెన్‌ల రూపాయి మారకం రేటు 58.99గా ఉంటే, డిసెంబర్ 27 నాటికి 54.26కు చేరింది. అంటే 100 యెన్‌లకు ఆరంభంలో 59 రూపాయిలు రాగా, ఏడాది ముగింపు నాటికి 54 రూపాయలకు యెన్ విలువ తగ్గిపోయింది. యూరోతో పోల్చి చూసినప్పుడు రూపాయి విలువ 5 శాతం పెరిగి డిసెంబర్ 27 నాటికి 89.11కు చేరింది. ఈ ఏడాది ఆగస్ట్ 27న అయితే 93.75 కనిష్ట స్థాయిని తాకింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లడంతో రూపాయి విలువ అధికంగా క్షీణించినట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. అమెరికా స్థూల ఆర్థిక పరిస్థితులు క్రమంగా మెరుగుపడడం, వీటి ఆధారంగా రేట్ల కోత విషయంలో నిదానంగా వెళ్లాలని యూఎస్ ఫెడ్ నిర్ణయించడం డాలర్ బలపడడానికి కారణాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. చైనా సహా చాలా దేశాలపై టారిఫ్‌ల మోత మోగిస్తానంటూ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఇన్వెస్టర్లు, ట్రేడర్లు డాలర్ కొనుగోళ్లకు మొగ్గు చూపించేలా చేసినట్టు చెబుతున్నారు.

కొనుగోళ్లు, విలీనాల జోరు

ఈ కేలండర్ ఏడాది(2024)లో మీడియా, సిమెంట్, ఎయిర్‌లైన్స్ తదితర రంగాలలో భారీ కొనుగోళ్లు, విలీనాలు జరిగాయి. ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్-డిస్నీ ఇండియా డీల్‌తోపాటు.. ఎయిర్ ఇండియా, విస్తారా విలీనం, అదార్ పూనావాలా- ధర్మ ప్రొడక్షన్స్ డీల్, భారత్ సీరమ్స్‌ను సొంతం చేసుకున్న మ్యాన్‌కైండ్ ఫార్మా, అంబుజా సిమెంట్స్ చేతికి పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ తదితరాలు చేరాయి. వివరాలు ఇలా..

భారీ మీడియా సంస్థగా

డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన మీడియా సంస్థలు, గ్లోబల్ దిగ్గజం వాల్ట్ డిస్నీకి చెందిన దేశీ విభాగంతో రూ. 70,000 కోట్ల విలువైన విలీనానికి తెరతీశాయి. తద్వారా గ్లోబల్ మీడియా సంస్థ ఆవిర్భావానికి ఊపిరిపోశాయి. వెరసి 2024 నవంబర్ 14కల్లా భాగస్వామ్య కంపెనీ(జేవీ)ని ఏర్పాటు చేశాయి. దీనిలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 16.34 శాతం, వయాకామ్18కు 46.82 శాతం, డిస్నీకి 36.84 శాతం చొప్పున వాటాలు లభించాయి.

టాటా గ్రూప్ ఎయిర్‌లైన్స్

2022లో ప్రభుత్వం నుంచి ఎయిర్ ఇండియాను చేజిక్కించుకున్న టాటా గ్రూప్ దిగ్గజం విస్తారాను విలీనం చేసుకుంది. 2024 అక్టోబర్‌లో ఏఐఎక్స్ కనెక్ట్‌తో చౌక టికెట్ ధరల ఇండియా ఎక్స్‌ప్రెస్‌ను విలీనం చేసిన తదుపరి విస్తారాతో ఎయిర్ ఇండియాను మరింత విస్తరించింది. వెరసి ప్రస్తుతం ఎయిర్ ఇండియా 5,600 వీక్లీ విమానాలతో 90కుపైగా ప్రాంతాలను కలుపుతూ సర్వీసులు అందిస్తోంది. విలీనంలో భాగంగా కొత్త సంస్థలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ 25.1 శాతం వాటాను పొందింది.

వ్యాక్సిన్ల సంస్థ మీడియావైపు

వ్యాక్సిన్ల తయారీ దిగ్గజం సీరమ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో అదార్ పూనావాలా బాలీవుడ్ డైరెక్టర్ కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్ అండ్ ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై దృష్టి పెట్టారు. వెరసి పూనావాలా 50 శాతం వాటా దక్కించుకోగా.. కరణ్ జోహార్ వాటా 50 శాతంగా కొనసాగుతోంది. కరణ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ఫార్మా చేతికి వ్యాక్సిన్లు

హెల్త్‌కేర్ రంగ లిస్టెడ్ కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా వ్యాక్సిన్ల తయారీ దిగ్గజం భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్‌తో డీల్ కుదుర్చుకుంది. భారత్ సీరమ్స్‌ను రూ. 13,768 కోట్లకు కొనుగోలు చేసింది. తద్వారా మహిళా ఆరోగ్య పరిరక్షణ, ఫెర్టిలిటీ ఔషధాలలోనూ కార్యకలాపాలు విస్తరించేందుకు మ్యాన్‌కైండ్ ఫార్మాకు తోడ్పాటునిచ్చింది.

సిమెంటింగ్ డీల్

డైవర్సిఫైడ్ గ్రూప్ అదానీ సంస్థకు చెందిన అంబుజా సిమెంట్స్ విస్తరణపై కన్నేసింది. దీనిలో భాగంగా పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్‌ను రూ. 10,422 కోట్లకు సొంతం చేసుకుంది. తద్వారా 2024 ఆగస్ట్ 16కల్లా పెన్నా సిమెంట్‌ను పూర్తి అనుబంధ కంపెనీగా మార్చుకుంది. మరోవైపు ఓరియంట్ సిమెంట్‌లో దాదాపు 47 శాతం వాటాను 45.1 కోట్ల డాలర్ల(రూ. 3,800 కోట్లు)కు కొనుగోలు చేసే బాటలో సాగుతోంది.

విస్తరణలో భాగంగా

దక్షిణాది మార్కెట్లో విస్తరించే ప్రణాళికల్లో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్‌పై గురి పెట్టింది. తొలుత 23 శాతం వాటాను సొంతం చేసుకున్న అల్ట్రాటెక్ తదుపరి ప్రమోటర్ల నుంచి మరో 32.72 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు దాదాపు రూ. 4,000 కోట్లవరకూ వెచ్చించింది. దీంతో ఇండియా సిమెంట్స్‌లో వాటాను 55 శాతానికి చేర్చుకుంది. ఈ బాటలో తాజాగా ఓరియంట్ సిమెంట్‌లో 8.69 శాతం వాటాను రూ. 851 కోట్లకు చేజిక్కించుకుంది.



లాభాల ఆఫర్లు

- 2024లో సరికొత్త రికార్డ్
- మొత్తం 91 ఇష్యూలు
- రూ. 1.6 లక్షల కోట్ల సమీకరణ

సరిగ్గా మూడేళ్ల తదుపరి మళ్లీ ప్రైమరీ మార్కెట్లు కదం తొక్కాయి. భారీ లాభాలతో కళకళలాడాయి. ఈ క్యాలండర్ ఏడాది (2024)లో మొత్తం 91 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టాయి. రూ. 1.6 లక్షల కోట్లకుపైగా సమీకరించాయి. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. వీటిలో అధిక శాతం ఇష్యూలకు ఇన్వెస్టర్లు రికార్డ్‌స్థాయిలో క్యూకట్టారు. ఫలితంగా లిస్టింగ్ రోజు 64 కంపెనీలు లాభాలతో నిలవగా.. 17 మాత్రం నష్టాలతో ముగిశాయి. వెరసి 2021లో 63 కంపెనీలు సమకూర్చుకున్న రూ. 1.2 లక్షల కోట్ల రికార్డ్ మరుగున పడింది. ఇందుకు ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి, కంపెనీల ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు, నగదు లభ్యత, భారీస్థాయిలో పెరిగిన రిటైల్ ఇన్వెస్టర్లు, వారి పెట్టుబడులు, సులభతర లావాదేవీల నిర్వహణకు వీలు తదితర అంశాలు తోడ్పాటునిచ్చాయి. దీంతో అధిక శాతం కంపెనీలు లాభాలతో లిస్టయ్యి ఇన్వెస్టర్ల ఆసక్తిని మరింత పెంచాయి. వెరసి కొత్త ఏడాది (2025)లోనూ మరిన్ని కొత్త రికార్డులకు వీలున్నట్లు మార్కెట్‌నిపుణులు భావిస్తున్నారు. మరోపక్క ఎస్ఎంఈ విభాగం సైతం రికార్డ్ నెలకొల్పడం గమనార్హం! ప్రైమ్‌డేటా గణాంకాల ప్రకారం ఈ ఏడాది 238 ఎస్ఎంఈలు రూ. 8,700 కోట్లు సమకూర్చుకున్నాయి. 2023లో లిస్టింగ్ ద్వారా ఎస్ఎంఈలు అందుకున్న రూ. 4,686 కోట్లతో పోలిస్తే రెట్టింపైంది!

భారీ ఇష్యూల తీరిలా... 2024లో కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా రూ. 27,870 కోట్ల సమీకరణ ద్వారా భారీ ఐపీవోగా రికార్డులకెక్కింది. ఇదేవిధంగా ఫుడ్ అగ్రిగేటర్ యాప్ స్విగ్గీ రూ. 11,327 కోట్లు, ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ. 10,000 కోట్లు, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ. 6,560 కోట్లు, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ. 6,145 కోట్లు అందుకున్నాయి. కేఆర్ఎన్ హీట్ ఎక్స్చేంజర్ ఐపీవోకు 200 రెట్లు అధిక బిడ్స్ లభించాయి. ఇక వన్ మొబిక్విక్, యూనికామర్స్ ఈసొల్యూషన్స్, డిఫ్యూజన్ ఇంజినీర్స్, బీఎల్ఎస్ ఈసర్వీసెస్, ఎక్సికామ్ టెలి ఇష్యూలకు 100 రెట్లుపైగా స్పందన నమోదైంది. విభోర్ స్టీల్, బీఎల్ఎస్, బజాజ్ హౌసింగ్, కేఆర్ఎన్ లిస్టింగ్ రోజు 100 శాతం లాభపడ్డాయి.



మరింత స్పీడ్: డిసెంబర్ చివరి వారంలో స్పీడ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్లాస్టిక్ కవర్ల ప్యాకేజింగ్ మెషినరీ తయారీ కంపెనీ మమతా మెషినరీ లిస్టింగ్‌లో ఇష్యూ ధర రూ.243తో పోలిస్తే 147% ప్రీమియంతో రూ.600 వద్ద నమోదైంది. రూ.630 వద్ద ముగిసింది. ఈ బాటలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ డీఎంఏ క్యాపిటల్ అడ్వైజర్స్ ఇష్యూ ధర రూ.283తో పోలిస్తే 39% అధికంగా రూ.393 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 61% ఎగసి రూ.457 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 47% లాభంతో రూ.415 వద్ద స్థిరపడింది. విద్యుత్ ప్రసారం, పంపిణీల ఈపీసీ కంపెనీ ట్రాన్స్‌రైల్ లైటింగ్ షేరు ఇష్యూ ధరరూ.432తో పోలిస్తే 35% ప్రీమియంతో రూ.585 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 40% ఎగసి రూ.604 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 28% లాభంతో రూ.553 వద్ద ముగిసింది. విభిన్న యార్న్ తయారీ సనాతన్ టెక్స్‌టైల్స్ ఇష్యూ ధర రూ.321తో పోలిస్తే 31% అధికంగా రూ.419 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 31% పెరిగి రూ.423 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆఖరికి 21% లాభంతో రూ.389 వద్ద స్థిరపడింది. వాటర్ ప్రాజెక్టుల కంపెనీ కంకార్డ్ ఎన్విరో ఇష్యూ ధర రూ.701తో పోలిస్తే 19% అధికంగా రూ.832 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 23% ఎగసి రూ.860 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 18% లాభంతో రూ.828 వద్ద స్థిరపడింది. సోమవారం(30న) వెంటివ్ హాస్పిటాలిటీ, సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్, కారారో ఇండియా లిస్టకానుండగా.. 31న యూనిమెక్ ఏరోస్పేస్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్ నమోదుకానుంది.

విన్నర్... స్టీలర్స్

తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ నెగ్గిన హరియాణా స్టీలర్స్

ఫైనల్లో 32–23తో పట్నా పైరేట్స్‌పై గెలుపు ● రాణించిన శివమ్, రెజా



పుణే: పోయిన ఏడాది ఫైనల్‌దాకా వచ్చి 3 పాయింట్ల తేడాతో (25–28) పుణేరి పల్టన్ చేతిలో ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ పోగొట్టుకున్న హరియాణా స్టీలర్స్ జట్టు ఈ ఏడాది ఒడిసి పట్టుకుంది. కూతలో రెయిడర్లు శివమ్ పతారే, వినయ్, ప్రత్యర్థుల్ని అడ్డుకోవడంలో డిఫెండర్లు రాహుల్, జైదీప్, ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజాలు పడిన శ్రమకు హరియాణా ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ విజేతగా నిలిచింది. శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో హరియాణా 32–23 స్కోరుతో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌ను కంగుతినిపించింది. రెయిడర్ శివమ్ అద్భుతంగా ఆడాడు. 12 సార్లు కూతకెళ్లిన అతను 9 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మరో రైడర్ వినయ్ (6), ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (7) అదరగొట్టారు. డిఫెండర్లలో రాహుల్ 3, జైదీప్ 2 పాయింట్లు చేశారు. పట్నా జట్టు తరఫున అదేపనిగా పాయింట్లు సాధించేవారు కరువయ్యారు. ఆల్‌రౌండర్ గుర్‌దీప్ (6), రెయిడర్ (5) మెరుగ్గా ఆడారంతే. మిగతా వాళ్లలో అయాన్ 3, దీపక్, అంకిత్ చెరో 2 పాయింట్లు చేశారు. నిజానికి ఆరంభంలో హరియాణాకు దీటుగా బదులిచ్చిన పట్నా... తదనంతరం పట్టు సడలించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి హరియాణా 15–12తో మూడు పాయింట్లతో స్వల్పంగా పైచేయి సాధించింది. కానీ ద్వితీయార్ధంలో మాత్రం స్టీలర్స్ ఆటగాళ్లు స్కోరు వేగం పెంచారు. దీంతో హరియాణా ఓవైపు పాయింట్లతో దూసుకెళుతుండగా, నిలకడగా పాయింట్లు చేయడంలో పట్నా వెనుకబడిపోయింది. రెండో అర్ధభాగమే ఫైనల్ మ్యాచ్‌ను ఏకపక్షం చేసింది. ద్వితీయార్ధంలో స్టీలర్స్ ఆటగాళ్లు 17 పాయింట్లు సాధిస్తే... పైరేట్స్ 11 పాయింట్లే చేయగలిగింది. 2017లో ఐదో సీజన్‌తో లీగ్‌లోకి ప్రవేశించిన స్టీలర్స్ గతేడాది టైటిల్ కోసం కడదాకా పోరాడి చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకున్న హరియాణా స్టీలర్స్ ఏడాది తిరిగేసరికి ఈ సారి ఎలాంటి పొరపాటు చేయకుండా టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. చాంపియన్ టీమ్ హరియాణకు ట్రోఫీతో పాటు రూ. 3 కోట్ల ప్రైజ్‌మనీ లభించగా, నాలుగోసారి టైటిల్ గెలుద్దామని ఆశపడి రన్నరప్‌తో సరిపెట్టుకున్న పట్నా పైరేట్స్‌కు రూ. 1.80 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది. పీకేఎల్‌లో పట్నాకు మంచి రికార్డు ఉంది. తాజా సీజన్ సహా ఐదుసార్లు ఫైనల్ చేరిన పైరేట్స్ 2016, 2017 సీజన్లలో 'హ్యాట్రిక్' టైటిల్స్ సాధించింది. 2016లోనే మూడు, నాలుగో సీజన్లు జరుగగా ఈ రెండు సార్లు పట్నానే విజేతగా నిలిచింది. మరుసటి ఏడాది ఐదో సీజన్‌లోనూ పైరేట్సే గెలిచింది. 2021లో ఫైనల్ చేరిన పైరేట్స్... దబంగ్ ఢిల్లీ చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది.



ఉత్కంఠరేపినా... దక్షిణాఫ్రికాదే గెలుపు

పాకిస్తాన్‌తో తొలి టెస్టు... దక్షిణాఫ్రికా లక్ష్యం 148... ముందురోజు స్కోరు 27/3... ఇంకా విజయానికి 121 పరుగుల దూరం. 96/4 దాకా సాఫీగా సాగిన పయనం. అదే స్కోరుపై ఐదో వికెట్ 96/5... తర్వాతి రెండు ఓవర్లలో 99/6, 99/7, 99/8... అంతే! ఒక్కసారిగా మ్యాచ్ పాకిస్తాన్ వైపు మొగ్గింది. మిగిలిన 2 వికెట్లు టెయిలెండర్లే. చేయాల్సిందేమో 49 పరుగులు. ఈ దశలో దక్షిణాఫ్రికా గెలవడం కష్టం. కానీ గెలవడమే కాదు... ఏకంగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో తొలిసారి ఫైనల్‌కు చేరింది సఫారీ జట్టు!

తొలిసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు సఫారీ జట్టు
- పాకిస్తాన్‌పై 2 వికెట్లతో విజయం
- ఒడ్డున పడేసిన రబడ పోరాటం
- జనవరి 3 నుంచి రెండో టెస్టు

సెంచూరియన్: టి20ల మెరుపులతో... ప్రపంచ వ్యాప్త లీగ్‌లతో... అసలైన క్రికెట్ క్రీడ సిసలైన సవాళ్లను ఎదుర్కొంటుంది. కొందరు ఆటగాళ్లయితే 4 ఓవర్లు (టి20), 10 ఓవర్లు (వన్డే)కు బాగా అలవాటుపడి పరిమిత ఓవర్ల క్రికెట్‌కు జైకొట్టి సంప్రదాయ టెస్టులకు మంగళం పాడుతున్నారు. అంపశయ్యపై ఉన్న ఐదు రోజుల ఆట ఎప్పటికీ తన ఉక్కులాంటి ఉనికి కోల్పోదని... ఎన్నేళ్లయినా అజరామరంగా కొనసాగుతూనే ఉంటుందని తరచూ టెస్టు మ్యాచ్‌లు నిరూపిస్తున్నాయి. వన్డే, టి20లకు ఏమాత్రం తీసిపోని ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఇప్పుడు కూడా సఫారీ గడ్డపై జరిగిన 'బాక్సింగ్ డే' టెస్టు... క్రికెట్ శోభను పెంచి, కొత్త ప్రభను జోడించింది.

పాకిస్తాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత తొలి టెస్టులో ఆతిథ్య దక్షిణాఫ్రికా 2 వికెట్ల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. పదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన స్పెషలిస్టు సీమ్ బౌలర్ కగిసో రబడ (26 బంతుల్లో 31 నాటౌట్; 5 ఫోర్లు) చేసిన మూడు పదుల స్కోరే అయినా కష్టకాలంతో అతని పోరాటం జట్టును ఒడ్డున పడేసింది. డబ్ల్యూటీసీలో తొలిసారి ఫైనల్‌కు చేర్చింది. 148 పరుగుల సులువైన లక్ష్యం ఛేదించేందుకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 27/3తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా చాలా వరకు లక్ష్యంవైపు సాగిపోయింది. క్రితం రోజు బ్యాటర్లలో మార్క్‌రమ్ (63 బంతుల్లో 37; 6 ఫోర్లు), జట్టు స్కోరు 62 వద్ద అవుటైనా... కెప్టెన్ బవుమా (78 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్), బెడింగ్‌హామ్ (14; 2 ఫోర్లు)తో కలిసి దక్షిణాఫ్రికా స్కోరును వందకు చేరువగా తెచ్చాడు. కానీ 30వ ఓవర్ వేసిన అబ్బాస్... 96 పరుగుల వద్ద బవుమాను అవుట్ చేయడంతో నాటకీయత మొదలైంది. మరుసటి ఓవర్లో కైల్ వెరిన్ (2) నసీమ్ షా బౌల్డ్ చేశాడు. తర్వాతి ఓవర్లో అబ్బాస్ ఈసారి బెడింగ్‌హామ్, బాష్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చడంతో సఫారీ 11 బంతుల వ్యవధిలోనే 4 వికెట్లను కోల్పోయింది. 99/8 వద్ద ఎక్కడలేని ఉత్కంఠ మొదలైంది. ఆతిథ్య జట్టు పరాజయానికి సిద్ధమైనట్లు కనిపించింది. పాక్ శిబిరం అంబరాన్నంటే సంబరాల్లో మునిగింది. ఈ దశలో మార్కో యాన్సెన్ (16 నాటౌట్; 3 ఫోర్లు)కు జతయిన రబడ ఓ స్పెషలిస్టు బ్యాటర్ అవతరామెత్తాడు. అబేధ్యమైన తొమ్మిదో వికెట్‌కు 51 పరుగులు జోడించడంతో దక్షిణాఫ్రికా ఊహించని విధంగా మ్యాచ్ గెలిచింది. రెండు ఇన్నింగ్స్‌లో మెరుగ్గా ఆడిన మార్క్‌రమ్ (89; 37)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో సఫారీ 1–0తో ఆధిక్యంలో ఉండగా, జనవరి 3 నుంచి కేప్‌టౌన్‌లో ఆఖరి టెస్టు జరుగుతుంది.

ఒకటి ఓకే... మరొకటి మనకా? ఆసీస్‌కా?

వచ్చే జూన్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగుతుంది. దక్షిణాఫ్రికా ఫైనల్ చేరింది. భారత్ తమ సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు వరకు చక్కగా డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో టీమిండియా ఉంది. కానీ కివీస్ వైట్‌వాష్‌తో అంతామారింది. ఇప్పుడు 55.88 డబ్ల్యూటీసీ పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న రోహిత్‌సేనకు మిగిలింది ప్రస్తుతం జరుగుతున్న 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'నే! నేడు నాలుగో టెస్టు ముగిశాక, ఆఖరి సిడ్నీటెస్టు మాత్రమే బాకీ వుంది అంతే! కానీ ఈ సిరీస్ తర్వాత కూడా రెండో స్థానంలో ఉన్న ఆసీస్ (58.89 పాయింట్లు)కు శ్రీలంక పర్యటనలో టెస్టు సిరీస్ ఉంది. ఈ నేపథ్యంలో మనకంటే కూడా ఆస్ట్రేలియాకే కాస్త అనుకూలతలున్నాయి. మన అదృష్టం బాగుండి లోయర్ ఆర్డర్‌లో నితీశ్ కుమార్ రెడ్డి ఆడుతున్నట్లు టాపార్డర్‌లో రోహిత్, కోహ్లిలు ఫామ్‌లోకి వచ్చి ఈ 'బాక్సింగ్ డే' టెస్టు, సిడ్నీ టెస్టు నెగ్గితే మళ్లీ మనం అనూహ్యంగా రేసులో పడొచ్చు.


ఎందుకీ ద్వంద్వ ప్రమాణాలు?

టెన్నిస్ సమాఖ్యపై మండిపడ్డ జొకోవిచ్



బ్రిస్బేన్: టాప్ స్టార్ల డోపింగ్ మరకలపై గోప్యతను పాటించి టెన్నిస్ సమాజానికి నిజాన్ని దాచడంపై సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. డోపీలుగా తేలిన యానిక్ సినెర్, స్వియాటెక్‌ల ఉదంతంపై అంతర్జాతీయ టెన్నిస్ ఇంటిగ్రిటీ (ఐటీఐఏ) వ్యవహరించిన తీరును 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత దుయ్యబట్టాడు. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీతో కొత్త సీజన్‌ను ప్రారంభించేందుకు వచ్చిన అతను ఐటీఐఏ అవలంభిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు సిగ్గుచేటన్నాడు. 2009 తర్వాత బ్రిస్బేన్ ఈవెంట్ ఆడేందుకు వచ్చిన జొకోవిచ్ మీడియాతో మాట్లాడుతూ 'నేను సినెర్ ఉద్దేశ పూర్వకంగా నిషిద్ధ ఉత్ప్రేరకాలు తీసుకున్నాడా లేదంటే ప్రమేయం లేకుండా తీసుకున్నాడా అనే విషయంపై చర్చించడం లేదు. ఎందుకంటే గతంలో డోపీగా తేలితే సస్పెన్షన్‌కు గురైన ఎంతో మంది ప్లేయర్లు ఉన్నారు. కొందరు దిగువ ర్యాంకు ప్లేయర్లు తమ డోపింగ్ కేసు–నిషేధం పరిష్కారమవ్వాలని ఏడాదిగా చూస్తున్నారు. కానీ వీళ్ల (సినెర్, స్వియాటెక్) విషయాన్నేమో ప్రపంచానికి తెలీకుండా గోప్యత పాటించడం, తూతూ మంత్రపు నిషేధం చర్యలతో సరిపెట్టడం, మొత్తం టెన్నిస్ సమాజానికి కళ్లకు గంతలు కట్టడం చూస్తుంటే టెన్నిస్ ఇంటిగ్రిటీ వ్యవహారశైలీ నన్ను తీవ్రంగా నిరాశపరిచింది. ఇది ఆటకున్న ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ఉంది. ఒక సమాఖ్య అందరు ఆటగాళ్లను సమానంగా చూడదా? ఒక్కొక్కరికి ఒక్కో నిబంధనలు ఉంటాయా? ఇదేం వివక్షో నాకైతే అర్థం కావడం లేదు' అని సమాఖ్య తీరుపై విమర్శలతో విరుచుకుపడ్డాడు. అనంతరం కొత్తసీజన్‌పై తాజాగా దృష్టి సారించినట్లు చెప్పాడు. ఈ ఏడాది ఆరంభంలో మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న జొకోవిచ్ వింబుల్డన్‌లో ఫైనల్ చేరాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈ సెర్బియన్ సూపర్‌స్టార్‌కు చక్కని రికార్డు ఉంది. ఇక్కడ అతను 10 టైటిల్స్ సాధించాడు.

'టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' రేసులో అర్ష్‌దీప్





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్ నిలిచాడు. ఈ ఏడాది వెస్టిండీస్‌లో జరిగిన టి20 ప్రపంచకప్‌ను గెలిపించడంలో బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ కూడా కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా సఫారీ జట్టుతో జరిగిన అమీతుమీ పోరులో కీలకమైన డెత్ ఓవర్లలో సీనియర్ బుమ్రాకు దీటుగా ఏమాత్రం తీసిపోని బౌలింగ్ ప్రదర్శనతో అర్ష్‌దీప్ ప్రత్యర్థి బ్యాటర్లను నిరోధించాడు. అతను వేసిన 19వ ఓవరైతే భారత్ విజయావకాశాల్ని పెంచింది. దక్షిణాఫ్రికా 'కప్' గెలిచేందుకు 12 బంతుల్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా... అర్ష్‌దీప్ ఆ ఓవర్లో కేవలం 4 పరుగులే ఇవ్వడం... ఆఖరి ఓవర్ వేసిన హార్దిక్‌పై ఒత్తిడి లేకుండా చేసింది. అంతకుముందు ఫైనల్లో ఓపెనింగ్ హిట్టర్లు మార్క్‌రమ్, డికాక్‌లకు చెక్‌పెట్టిన అర్ష్‌దీప్ ఓవరాల్‌గా ఆ మెగా ఈవెంట్‌లో 17 వికెట్లు పడగొట్టాడు. అలాగే ఈ క్యాలెండర్ ఇయర్‌లో నిలకడగా వికెట్లు తీసిన బౌలర్‌గానూ 25 ఏళ్ల లెఫ్టార్మ్ సీమర్ నిలిచాడు. పొట్టి ఫార్మాట్‌లో ఈ ఏడాది 18 మ్యాచ్‌లాడిన అతను 13.5 సగటుతో 36 వికెట్లు తీశాడు. ఓ క్యాలెండర్ ఇయర్‌లో భారత్ తరఫున ఇది రెండో అత్యధిక వికెట్ల ప్రదర్శన. గతంలో 2022లో భువనేశ్వర్ 37 వికెట్లు తీశాడు. ఇప్పుడు ఐసీసీ షార్ట్‌లిస్ట్ చేసిన 'టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుల నామినీల్లో అర్ష్‌దీప్‌తో పాటు బాబర్ ఆజమ్ (పాక్), సికందర్ రజా (జింబాబ్వే), ట్రవిస్ హెడ్ (ఆస్ట్రేలియా) ఉన్నారు. తుది విజేతల్ని జనవరి ఆఖరి వారంలో అట్టహాసంగా నిర్వహించే వేదికలో ఐసీసీ అవార్డులను ప్రదానం చేస్తారు.

వన్డేల్లో స్మృతి మంధాన

మహిళల టి20 ప్లేయర్ అవార్డు రేసులో ఏ ఒక్క భారత క్రికెటర్ లేకపోయినా... స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వన్డేల్లో నామినేట్ అయ్యింది. 'ఐసీసీ వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ నిలిచింది. ఈ క్యాలెండర్ ఇయర్‌లో ఆమె 12 ఇన్నింగ్స్‌ల్లో 61.91 సగటుతో 743 పరుగులు చేసింది. 96.99 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు రాబట్టిన 28 ఏళ్ల స్మృతి జూన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లోనే 343 పరుగులు చేయడం విశేషం. ఈ ఏడాది ఆమె నాలుగు శతకాలు బాదింది. ఆమెతో పాటు అవార్డు కోసం నామినేట్ అయిన వారిలో లారా వోల్‌వార్ట్ (దక్షిణాఫ్రికా), చమరి ఆటపట్టు (శ్రీలంక), అనాబెల్ సదర్లాండ్ (ఆస్ట్రేలియా) ఉన్నారు.


బెంగాల్ ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న నయీముద్దీన్

ఎదురులేని బెంగాల్, కేరళ

సంతోష్ ట్రోఫీ టైటిల్ పోరుకు అర్హత ● రేపు తుది సమరం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో బెంగాల్, కేరళ జట్లు ఫైనల్లోకి ప్రవేశించాయి. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం జరిగిన సెమీఫైనల్ సమరాల్లో ఈ రెండు జట్లూ విజయాలు సాధించి తుది పోరుకు అర్హత సాధించాయి. తొలి సెమీస్‌లో బెంగాల్ 4–2 గోల్స్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్‌పై... కేరళ 5–1 తేడాతో మణిపూర్‌పై గెలుపొందాయి. ఇరు జట్ల మధ్య మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. సంతోష్ ట్రోఫీని 32 సార్లు గెలుచుకున్న బెంగాల్...7 సార్లు విజేత సర్వీసెస్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధ భాగంలోనే 3–0తో ఆ జట్టు ముందంజ వేసింది. రెండో అర్ధ భాగంలో సర్వీసెస్ కోలుకొని కాస్త పైచేయి సాధించినా అప్పటికే ఆలస్యమైపోయింది. బెంగాల్ తరఫున మనోతాస్ మాజీ (16వ నిమిషం), రోబీ హన్స్‌దా (45+2 వ నిమిషం, 90+6వ నిమిషం), నరోహరి శ్రేష్ఠ (45+4వ నిమిషం) గోల్స్ సాధించారు. సర్వీసెస్ ఆటగాళ్లలో బికాశ్ థాపా (53వ నిమిషం)లో ఏకైక గోల్ సాధించగా... బెంగాల్ డిఫెండర్ జువేల్ అహ్మద్ (74వ నిమిషం) చేసిన సెల్ఫ్ గోల్‌తో సర్వీసెస్ ఖాతాలో మరో గోల్ చేరింది. బెంగాల్ ఫైనల్ చేరడం ఇది 47వ సారి కావడం విశేషం.

రెండో సెమీస్‌లో కేరళ గోల్స్ వర్షంతో మణిపూర్‌ను చిత్తు చేసి 16వసారి ఫైనల్లోకి అడుగు పెట్టింది. 3 గోల్స్‌తో ముహమ్మద్ రోషల్ కీలక పాత్ర పోషించాడు. కేరళ ఇప్పటి వరకు 7 సార్లు ఈ టోర్నీలో చాంపియన్‌గా నిలిచింది. సెమీస్ పోరులో కేరళ తరఫున నసీబ్ రహమాన్ (22వ నిమిషం), ముహమ్మద్ అజ్సల్ (45+1వ నిమిషం), రోషల్ (73వ నిమిషం, 88వ నిమిషం, 90+5వ నిమిషం) గోల్స్ కొట్టారు. మణిపూర్ తరఫున 30వ నిమిషంలో షున్‌జన్‌తన్ ఏకైక గోల్ కొట్టాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ దిగ్గజ ఫుట్‌బాలర్ సయ్యద్ నయీముద్దీన్ రెండు జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు.


కేరళ ఆటగాళ్ల సంబరం



'మార్మిక' నగరి

ఇదేదో మాంత్రికుడి నివాసంలా ఉందనుకుంటున్నారా? ముంబై మహానగరంపై ఆదివారం దట్టమైన మేఘాలు కమ్ముకున్న వేళ తీసిన డ్రోన్ షాట్



ఫెళఫెళ పిడుగు

ఇజ్రాయెల్‌లోని హదెరాలో ఒరొట్ రబిన్ విద్యుత్ ప్లాంట్‌పై ఆదివారం పిడుగు పడింది. ఒక ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ దాన్నిలా కెమెరాలో బంధించాడు.



'హిమ' నగరి

ఇది ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉత్తరకాశీ జిల్లాలోని హర్సిల్ గ్రామం. ఆదివారం మంచు దుప్పటి కప్పుకుని ఇలా కనువిందు చేసింది. (ఇన్‌సెట్) శ్రీనగర్‌లో మంచు ఇంట్లో (ఇగ్లూ) చిన్నారుల సరదా

వరుస విమాన ప్రమాదాలు

వైమానిక భద్రతపైనే అనుమానాలు

గాలిలో ప్రాణాలు

దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం నేపథ్యంలో వైమానిక భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. గత ఐదారేళ్లుగా అత్యంత ఘోరమైన ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది...

టేకాఫ్ అయిన కాసేపటికే...

గత ఐదేళ్లలో అత్యంత విషాదకరమైన, చర్చనీయమైన విమాన ప్రమాదం లయన్ ఎయిర్ ఫ్లైట్ 610. 2018 అక్టోబర్ 29న ఇండోనేసియాలోని జకార్తా నుంచి పాంగ్‌కల్ పినాంగ్‌కు బయలుదేరిన బోయింగ్ 737 మ్యాక్స్ 8 విమానం టేకాఫ్ అయిన కాసేపటికే జావా సముద్రంలో కూలిపోయింది. 189 మంది ప్రయాణికులతో పాటు సిబ్బంది చనిపోయారు. విమానంలోని ఆగ్మెంటేషన్ సిస్టమ్ (ఎంసీఏఎస్)లో లోపమే ప్రమాదానికి కారణమని తేలింది. బోయింగ్ విమానాల రూపకల్పన, ఏవియేషన్ రెగ్యులేటర్లు, ముఖ్యంగా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) పర్యవేక్షణలో తీవ్ర లోపాలను ఈ దుర్ఘటన ఎత్తి చూపింది.

ఐదు నెలలకే మరోటి...

లయన్ ఎయిర్ ప్రమాదం జరిగిన ఐదు నెలలకే మరో బోయింగ్ 737 మ్యాక్స్ కూలిపోయింది. 2019 మార్చి 10న ఇథియోపియా ఎయిర్‌లైన్స్ విమానం 302 అడిస్ అబాబా నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 157 మంది చనిపోయారు. దీనికీ ఎంసీఏఎస్ వ్యవస్థే కారణమని తెలిసింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా విమానయాన అధికారులు మాక్స్‌ను నిలిపివేశారు. బోయింగ్ చట్టపరమైన, ఆర్థికపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంది.

సముద్రంలో కూలిన విమానం...

2021 జనవరి 9న ఇండోనేషియాలోని జకార్తాలో విమాన ప్రమాదం జరిగింది. సోకర్నో–హట్టాలో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పొంటియానాక్‌కు బయలుదేరిన బోయింగ్ 737–500 విమానం సముద్రంలో కూలిపోయింది. టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే సముద్రంలో కూలిపోవడంతో అందులో ఉన్న 62 మంది చనిపోయారు. ఇండోనేషియాలో ఇటీవలి కాలంలో జరిగిన అత్యంత ఘోరమైన విమాన ప్రమాదం ఇది. యాంత్రిక వైఫల్యం, మానవ తప్పిదం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. విమానంలోని ఆటో థ్రోటిల్ సిస్టమ్‌లో లోపం వల్ల విమానం ఇంజన్లు అసమతుల్యం కావడంతో అదుపు తప్పి కూలిపోయింది. పైలట్ పరిస్థితికి తగిన విధంగా స్పందించడంతో విఫలమయ్యారని తేలింది. ఈ ప్రమాదం పాత విమానాల నిర్వహణలో అప్రమత్తతను, విమానాల అప్‌గ్రేడేషన్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పింది. యాంత్రిక వైఫల్యాలు తలెత్తినప్పుడు ప్రతిస్పందించడానికి విమానయాన సిబ్బంది అందరికీ శిక్షణ ఇవ్వాలని ఉద్ఘాటించింది.



ఇళ్లపైనే కూలిన విమానం..

2020 మే 22న పాకిస్తాన్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) ఫ్లైట్ 8303, ఎయిర్‌బస్ ఎ 320 కరాచీలోని ఇళ్లపై కూలిపోయింది. లాహోర్ నుంచి బయలుదేరిన ఈ విమానంలో 99 మంది ప్రయాణికులు, 8 మంది సిబ్బంది ఉన్నారు. ఈ ప్రమాదంలో 41 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. ల్యాండింగ్ సమయంలో పైలట్ తప్పిదం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ల్యాండింగ్ గేర్‌లో తలెత్తిన సమస్యల కారణంగా విమానం రన్ వేపైకి దూసుకెళ్లడంతో ఇంజన్లు ధ్వంసమయ్యాయి. చివరకు అదుపు తప్పిన విమానం నివాస ప్రాంతంలోకి దూసుకెళ్లింది. పైలట్లు ప్రామాణిక అత్యవసర విధానాలను పాటించలేదని విమానం బ్లాక్ బాక్స్ వెల్లడించింది. ఈ ప్రమాదం పైలట్ల శిక్షణ, నియంత్రణ పర్యవేక్షణలో లోతైన లోపాలను బహిర్గతం చేసింది. పాకిస్తాన్ సివిల్ ఏవియేషన్ అథారిటీలో శిక్షణ నాణ్యతపై విచారణకు దారితీసింది,

రన్‌వే నుంచి జారి లోయలో పడి...

గత ఐదేళ్లలో భారత్‌లో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం 1344ది. దుబాయ్ నుంచి వచ్చిన ఈ విమానం 2020 ఆగస్టు 7న కేరళలోని కోజికోడ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ అవుతుండగా కూలిపోయింది. ప్రయాణికులు, సిబ్బంది మొత్తం 165 మంది ఉండగా.. 21 మంది మరణించారు. భారీ వర్షాల కారణంగా రన్‌వే తడిసిపోయి ఉంది. ఇక్కడ రన్‌వే పొడవు కూడా తక్కువగా ఉండటంతో ల్యాండ్ అయిన విమానం జారి లోయలో పడిపోయింది. వాతావరణ పరిస్థితులు, మానవ తప్పిదం, రన్ వే మౌలిక సదుపాయాల సరిగా లేకపోవడం వల్ల జరిగిందని దర్యాప్తులో తేలింది. ఈ ప్రమాదం తరువాత దేశంలోని విమానాశ్రయాల మౌలిక సదుపాయాలను సమీక్షించారు.

రన్‌వే నుంచి జారి..

నేపాల్‌లోని ఖాట్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పొఖారాకు బయల్దేరిన విమానం టేకాఫ్ సమయంలో కుప్పకూలింది. శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో సిబ్బందితో సహా 19 మంది ఉన్నారు. 18 మంది మృతి చెందగా, పైలట్ కెప్టెన్ ఎంఆర్ షాక్యా తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. రన్‌వే దక్షిణం వైపు నుంచి విమానం టేకాఫ్ అవుతుండగా, రెక్కల కొన భూమిని తాకడంతో ఒక్కసారిగా పల్టీలు కొట్టింది. దీంతో వెంటనే విమానంలో మంటలు చెలరేగాయి.

మంచు కారణంగా...

ఈ సంవత్సరం బ్రెజిల్ విమానయాన సంస్థకు చెందిన వోపాస్ 2283, ఏటీఆర్ 72 ట్విన్ ఇంజన్ టర్బోప్రాప్ ఆగస్టు 9న కూలిపోయింది. 58 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో సావోపాలో అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరిన విమానం.. సావోపావో సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్నవారంతా మరణించారు. విమాన ప్రమాదానికి మంచు కారణమని తేలింది.

పండుగ రోజున ప్రమాదం..

ఇటీవలే.. క్రిస్మస్ పర్వదినాన అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి ప్రమాదం జరిగింది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి వెళ్తుండగా కాస్పియన్ సముద్ర సమీపంలో కూలిపోయింది. విమానంలో 62 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది ఉండగా 38 మంది మరణించారు. ఉక్రెయిన్ వరుస డ్రోన్ దాడులను తిప్పికొడుతున్న రష్యా వైమానిక రక్షణ దళాలు విమానాన్ని కూల్చివేశాయని రష్యా అంగీకరించింది. దాడి చేసినందుకు అధ్యక్షుడు పుతిన్ క్షమాపణ చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

వీడని మిస్టరీ..

చైనాలో జరిగిన అత్యంత విషాద ఘటనల్లో ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ఎంయూ 5735 కుప్పకూలడం ఒకటి. చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ 737–800.. 2022 మార్చి 21న దక్షిణ చైనాలోని పర్వతాల్లో కూలిపోయింది. ప్రయాణికులు, సిబ్బంది సహా విమానంలో ఉన్న 132 మంది మరణించారు. విమానం ఎత్తునుంచి కిందికి దించే సమయంలో ఈ ప్రమాదం జరిగిందని తాత్కాలిక దర్యాప్తులో తేల్చారు. విమానం వేగంగా, ఉద్దేశపూర్వకంగా ల్యాండ్ చేసినట్లు బ్లాక్ బాక్స్ డేటా వెల్లడించింది. ఈ ప్రమాదం యాంత్రిక వైఫల్యమా, మానవ తప్పిదమా అనే విషయంపై అనేక ఊహాగానాలు వచ్చాయి. ఈ విపత్తుకు అసలు కారణం మాత్రం మిస్టరీగా మిగిలిపోయింది.

ఈ ఏడాది.. పిల్లల పాలిట

పెనుశాపమే!

2024లో నిరాశ్రయులుగా లక్షలాది బాలలు

యునిసెఫ్ నివేదికలో ఆందోళనకర అంశాలు

పిల్లల పాలిట చరిత్రలో ఎన్నడూ లేనంతటి దారుణ సంవత్సరంగా నిలిచింది 2024. యుద్ధాలు, ఘర్షణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా బాలలు భారీ సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. ఏకంగా 47.3 కోట్ల మంది బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆరుగురిలో ఒకరి కంటే ఎక్కువ మంది కల్లోల ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఒకప్పుడు పేదరికం, కరువు, వంటివాటితో అల్లాడే పిల్లలు ఇప్పుడు ఘర్షణల్లో సమిధలవుతున్నారు. చదువు మాట అటుంచి వారికి పోషకాహారమే గగనమైపోయింది! గాజా, సూడాన్, ఉక్రెయిన్ సహా ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలతో బాలలు విపరీతంగా సతమతమవుతున్నట్టు ఐరాస బాలల సంస్థ యునిసెఫ్ తాజాగా పేర్కొంది. గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 15 నెలల్లో కనీసం 17,492 మంది బాలలు మరణించినట్లు తెలిపింది...!

మునుపెన్నడూ లేనంతంగా ఎక్కువ మంది పిల్లలు సంఘర్షణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. బలవంతంగా నిరాశ్రయులవుతున్నారు. ఘర్షణలో మరణిస్తున్న, గాయపడుతున్న పిల్లల సంఖ్య పెరిగింది. పాఠశాలలపై బాంబుల వర్షం కురుస్తోంది. ఇళ్లు ధ్వంసమయ్యాయి. కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. భద్రత మాట పక్కకు పెడితే.. ప్రాథమిక అవసరాలు తీర్చుకునే అవకాశమూ ఉండటం లేదు. వాళ్లు ఆడుకోవడం, నేర్చుకోవడం ఎప్పుడో మరిచారు. ఈ యుద్ధాలు పిల్లల హక్కులను హరిస్తున్నాయి. ఇక, ప్రాణాలను కాపాడే వ్యాక్సిన్లు, పోషకాహారం విలాసంగా మారాయి. ''ప్రపంచంలో అనియంత్రిత యుద్ధాలకు ఒక తరం పిల్లలు బలవుతున్నారు. యుద్ధ ప్రాంతాల్లోని పిల్లలు మనుగడ కోసం పోరాటమే చేస్తున్నారు. దానికి తమ బాల్యాన్ని పణంగా పెడుతున్నారు. సర్వహక్కులు కోల్పోతున్నారు. ఇది దారుణం'' అని యునిసెఫ్ డైరెక్ట్ కేథరిన్ రస్సెల్ వాపోయారు.



గాజాలో ఆదివారం చలికి బలైన 20 రోజుల చిన్నారితో తండ్రి

గణాంకాలు చెబుతున్న విషాదాలు..

యునిసెఫ్ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో పిల్లలు 30 శాతం ఉన్నారు. వారిలో 47.3 కోట్ల మంది యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ప్రతి ఆరుగురిలో ఒకరు సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్నారని అంతర్జాతీయ ఏజెన్సీ తెలిపింది. 1990లలో సుమారు 10 శాతం మంది బాలలు సంఘర్షణ ప్రాంతాల్లో ఉండగా ఇప్పుడది ఏకంగా రెట్టింపుకు, అంటే 19 శాతానికి పెరిగింది. ఈ యుద్ధాల కారణంగా 2023 చివరి నాటికి 4.7 కోట్ల మంది పిల్లలు నిర్వాసితులయ్యారు. 2024లో హైతీ, లెబనాన్, మయన్మార్, పాలస్తీనా, సూడాన్ నుంచి అత్యధికంగా శరణార్థులుగా వెళ్లారు. ప్రపంచ శరణార్థుల జనాభాలో సుమారు 40 శాతం బాలలే. ఆయా దేశాల్లో నిర్వాసితులయినవారిలో బాలలు 49 శాతమున్నారు. 2023 నుంచి ఇప్పటిదాకా 22,557 మంది పిల్లలపై రికార్డు స్థాయిలో 32,990కు పైగా తీవ్రమైన హక్కుల ఉల్లంఘనలు జరిగాయి. ముఖ్యంగా బాలికల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సంఘర్షణ ప్రాంతాల్లో అత్యాచారాలు, లైంగిక హింస పెచ్చరిల్లాయి.

ప్రమాదకర స్థాయిలో

యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో విద్యకు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘర్షణ ప్రభావిత దేశాలలో 52 మిలియన్లకు పైగా పిల్లలు పాఠశాలకు దూరంగా ఉన్నారు. విద్యా మౌలిక సదుపాయాల విధ్వంసం, పాఠశాలల సమీపంలో అభద్రతా భావం వల్ల ఈ ప్రాంతాల్లో పరిస్థితులు మరింత దిగజారాయి. ఈ పిల్లల్లో పోషకాహార లోపం కూడా ప్రమాదకర స్థాయికి పెరిగింది. యుద్ధం పిల్లల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. యుద్ధాలు జరుగుతున్న దేశాల్లోని పిల్లల్లో 40శాతం మంది టీకాలు అందడం లేదు. వారి మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. హింస, విధ్వంసం, కుటుంబ సభ్యులను కోల్పోవడం వల్ల పిల్లల్లో నిరాశ పెరిగింది. పిల్లల్లో ఆగ్రహావేశాలు పెరిగాయి. విచారం, భయం వంటి వాటితో బాధపడుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



గాజాలో చలి బారిన పడి ఐసీయూలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ఓ చిన్నారి

రష్యా కాల్పుల వల్లే

విమాన ప్రమాదం

అజెర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్

బాకూ: ఈనెల 25న కజకిస్తాన్‌లోని అక్తావ్‌లో తమ ప్రయాణికుల విమానం ప్రమాదం వెనుక రష్యా ఆర్మీ అనుకోకుండా జరిపిన కాల్పులే కారణమని అజెర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్ పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'మా విమానాన్ని రష్యాయే కూల్చివేసిందని పూర్తి స్పష్టతతో చెబుతున్నాం. ఉద్దేశపూర్వకంగానే జరిగిందని మేం అనడం లేదు కానీ, ఇది జరిగింది' అని ఆయన పేర్కొన్నారు. రష్యాలోని కొన్ని వర్గాలు ప్రమాద కారణాలపై తప్పుడు కథనాలను వ్యాప్తి చేసి నిజాలను మరుగు పరిచేందుకు జరుగుతున్న ప్రయత్నాలు తనకు ఆశ్చర్యం, ఆవేదన కలిగిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రమాదం జరిగిన తర్వాత మూడు రోజుల వరకు రష్యా నుంచి ఎటువంటి స్పందన వెలువడకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై మూడు డిమాండ్లు చేశామన్నారు. అందులో ఒకటి, రష్యా క్షమాపణ చెప్పడం, రెండోది తప్పును ఒప్పుకోవడం, మూడోది బాధ్యులను శిక్షించడంతోపాటు తమ దేశానికి, గాయపడిన ప్రయాణికులు, సిబ్బందికి పరిహారం అందజేయడం ఉన్నాయని వివరించారు. మొదటిది పుతిన్ క్షమాపణ చెప్పడంతో నెరవేరిందన్నారు.

కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు తీవ్ర గాయాలు

కొచ్చి(కేరళ): జవహర్‌లాల్ నెహ్రూ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం ఓ కార్యక్రమానికి వెళ్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమా థామస్ తీవ్ర గాయాలపాలయ్యారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వహించిన కార్యక్రమానికి వెళ్లిన ఎమ్మెల్యే ఉమ ప్రమాదవశాత్తు గ్యాలరీపై నుంచి పడిపోయారు. తీవ్ర రక్తస్రావం కావడంతోపాటు తలకు, వెన్నెముకకు బలమైన గాయాలయ్యాయి. ఎమ్మెల్యే ఉమను వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని, ఆమెను వెంటిలేటర్‌పై ఉంచామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఐస్‌క్రీమ్ బిర్యానీ...!



మీరు సరిగ్గానే చదివారు. ఐస్ క్రీమ్ బిర్యానీనే. బిర్యానీ అంటేనే మసాలా. ఇక ఐస్‌క్రీమ్.. తీపి. ఈ రెండింటికీ అభిమానులు ఎంతో మంది. అలాంటిది ఆ రెండు డిషెస్‌ను కలిపితే.. రుచెలా ఉంటుంది? రుచి సంగతి తెలియదు కానీ.. ఈ బిర్యానీని ముంబైకి చెందిన మహిళా కంటెంట్ క్రియేటర్ హీనా కౌసర్ తయారు చేశారు. వీడియోను ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేశారు. ఫొటోలో ఉన్న విధంగానే... హండీలో బిర్యానీ... మధ్యలో స్ట్రాబెర్రీ ఐస్‌క్రీ స్కూప్. రెండు హండీలను పట్టుకుని ఆమె వీడియోలో కనిపిస్తున్నారు. సాధారణంగా మసాలాలతో బంగారు వర్ణంలో ఘుమఘుమలాడే బిర్యానీ.. ఐస్‌క్రీమ్ రంగును పులుముకుని గులాబీ రంగులో మెరిసిపోతోంది. ఆ వీడియో ఇప్పుడు వైరలవుతోంది. ఆహార ప్రియులను విస్మయానికి గురిచేస్తోంది. హీనా సృజనాత్మకత ప్రత్యేకమైనదే అయినప్పటికీ, ఈ ప్రయోగం చాలా మంది ఆహార ప్రియులను అయోమయానికి గురిచేసింది. కంటెంట్ క్రియేటర్ హీనా బేకింగ్ అకాడమీని కూడా నడుపుతున్నారు. తన అకాడమీలో ఏడు రోజుల బేకింగ్ కోర్సు పూర్తయిన సందర్భంగా జరిగిన వేడుకల్లో భాగంగా ఈ ఫ్యూజన్ డిష్‌ను తయారు చేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

'సెవెన్ సమ్మిట్స్' అధిరోహించిన పిన్న వయస్కురాలిగా...

భారత సంచలనం కామ్యా రికార్డు



ముంబై: ఏడు ఖండాల్లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించిన అతి పిన్న వయస్కురాలిగా భారతీయ యువతి చరిత్రకెక్కారు. ముంబైలోని లోని ఇండియన్ నేవీ చిల్డ్రన్ స్కూల్‌కు చెందిన 17 ఏళ్ల కామ్యా కార్తికేయన్ ఈ ఘనత సాధించారు. డిసెంబర్ 24న అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్‌ను అధిరోహించడంతో ఆమె ఈ అరుదైన మైలురాయిని సాధించారు. తండ్రి, భారత నౌకాదళ కమాండర్ ఎస్.కార్తికేయన్‌తో కామ్య 16,050 అడుగుల అంటార్కిటిక్ శిఖరాన్ని అధిరోహించారు. 13 ఏళ్ల వయసులో పర్వతారోహణ మొదలుపెట్టిన ఆమె... ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతం, ఐరోపాలోని మౌంట్ ఎల్‌బ్రస్, ఆస్ట్రేలియాలోని మౌంట్ కోసియస్కో, దక్షిణ అమెరికాలోని మౌంట్ అకోన్కాగువా, ఉత్తర అమెరికాలోని మౌంట్ డెనాలి, ఆసియాలోని ఎవరెస్ట్ పర్వతం, చివరగా అంటార్కిటికాలోని మౌంట్ విన్సన్ పర్వతాలను అధిరోహించారు. కామ్యాను, తండ్రి కార్తికేయన్‌ను భారత నావికాదళం అభినందించింది. ఆమె విజయం భారతీయ యువత స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొంది. ఇది దేశానికి, దేశ నౌకాదళానికి గర్వకారణమని పేర్కొంది.

బుల్లెట్ రైలు @ 450 కిలోమీటర్లు

నమూనాను ఆవిష్కరించిన చైనా



బీజింగ్: ప్రపంచంలోనే అత్యంత వేగంతో దూసుకెళ్లే హై–స్పీడ్ బుల్లెట్ రైలు నమూనాను చైనా ఆదివారం ఆవిష్కరించింది. ప్రయోగ సమయంలో ఇది గంటకు 450 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించిందని చైనా ప్రభుత్వ రైల్వే గ్రూప్ అయిన 'చైనా రైల్వే'పేర్కొంది. కొత్త రైలుకు సీఆర్450 అని నామకరణం చేసింది. ''కొత్త రైలుతో ప్రయాణసమయం బాగా తగ్గుతుంది. పట్టణాల మధ్య ప్రజల అనుసంధానత పెరుగుతుంది. తక్కువ శబ్దం, తక్కువ ఇంధన వినియోగం, ఎక్కువ వేగం దీని ప్రత్యేకతలు. ప్రస్తుతం గంటకు 350 కిలోమీటర్ల వేగంతో వెళ్తున్న సీఆర్400 రైలు కంటే కొత్తది శక్తివంతమైంది''అని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం చైనాలో ప్రధాన నగరాలను కలుపుతూ 47,000 కిలోమీటర్లమేర హై–స్పీడ్ రైల్వే పట్టాల వ్యవస్థ ఉంది. హై–స్పీడ్ రైళ్ల నిర్వహణ ఆర్థికంగా పెద్ద గుదిబండ అయినప్పటికీ రైల్వే రూట్ల వెంట పారిశ్రామికాభివృద్ధికి ఇది దోహదపడుతుందని చైనా భావిస్తోంది. బీజింగ్–షాంఘై హైస్పీడ్ రూట్‌లో నడిచే హై–స్పీడ్ రైళ్లు మాత్రమే లాభసాటిగా ఉన్నాయి. మిగతా రూట్లలో హై–స్పీడ్ రైళ్లకు జనాల్లో పెద్దగా ఆదరణ లేదు. చైనా హై–స్పీడ్ సాంకేతికతపై విదేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి.

'శారీరక సంబంధం' లైంగిక దాడి కాదు

నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తూ ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: పోక్సో కేసులో జీవిత ఖైదు పడిన ఓ వ్యక్తిని ఢిల్లీ హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. బాధితురాలు 'శారీరక సంబంధం'అని చెప్పినంత మాత్రాన లైంగిక దాడి చేసినట్లు కాదని పేర్కొంది. 2017లో ఓ మహిళ... తన 14 ఏళ్ల కుమార్తెను కిడ్నాప్ చేశారని ఓ వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. నిందితుడితో పాటు బాలిక ఫరీదాబాద్‌లో దొరికారు. తామిద్దరికీ శారీరక సంబంధం ఏర్పడిందని బాధితురాలు వెల్లడించింది. అయితే మైనర్ కావడంతో ఆ వ్యక్తిమీద పోక్సో చట్టం కింద జీవిత ఖైదు విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై నిందితుడు ఢిల్లీ హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ అమిత్ శర్మలతో కూడిన ధర్మాసనం విచారణకు అనుమతించింది. విచారించిన ధర్మాసనం బాధితురాలు స్వచ్ఛందంగా నిందితుడితో వెళ్లినప్పుడు లైంగిక దాడి జరిగిందని ట్రయల్ కోర్టు ఎలా నిర్ధారించిందో స్పష్టంగా తెలియదని వ్యాఖ్యానించింది.

సీయూఈటీలో కీలక మార్పులివే!

» పరీక్ష విధానం మొదలు మార్కుల వరకు పలు మార్పులు
» సబ్జెక్టుల సంఖ్య తగ్గింపు, ఛాయిస్ విధానం తొలగింపు
» సీయూఈటీ-2025 నుంచి అమల్లోకి నూతన మార్పులు
» ఏ సబ్జెక్ట్‌లోనైనా పరీక్షకు దరఖాస్తు అవకాశం

కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్.. సంక్షిప్తంగా సీయూఈటీ! జాతీయ స్థాయిలో.. సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర వర్సిటీల్లో..అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న పరీక్ష. సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందాలంటే.. సీయూఈటీ-యూజీ లేదా పీజీ పరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి! సీయూఈటీ ప్రవేశ పరీక్షలో యూజీసీ తాజాగా పలు కీలక మార్పులు ప్రకటించింది! ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-యూజీ, పీజీ పరీక్షల్లో నూతన మార్పులు, పరీక్ష విధానం, విద్యార్థులకు ప్రయోజనాలు తదితర వివరాలు..

రెండేళ్ల క్రితం వరకు.. సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశం కోసం ఆయా యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో బ్యాచిలర్, పీజీ స్థాయిలో ప్రవేశాలకు విద్యార్థులకు ఎన్నో వ్యయ ప్రయాసలు ఎదురయ్యేవి. వీటి నుంచి విద్యార్థులకు ఉపశమనం కల్పించేందుకు యూజీసీ సీయూఈటీ-యూజీ, పీజీని ప్రవేశ పెట్టింది. అప్పటి నుంచి ఈ పరీక్షకు భారీగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఈ పరీక్ష విధానంపై ఇటీవల నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించిన యూజీసీ.. 2025 నుంచి సీయూఈటీలో కీలక మార్పులు చేయాలని ప్రతిపాదించింది.

పూర్తిగా సీబీటీ విధానం

సీయూఈటీ-యూజీ, పీజీ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో జరపాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు కొన్ని పేపర్లను సీబీటీ విధానంలో, మరికొన్ని పేపర్లను పెన్-పేపర్ పద్ధతిలో నిర్వహించారు. 2025 నుంచి మాత్రం ఈ హైబ్రీడ్ విధానానికి స్వస్తి పలికి.. పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గానే నిర్వహిస్తారు.

సబ్జెక్టుల సంఖ్య కుదింపు

సీయూఈటీ-యూజీ, పీజీ మార్పుల్లో మరో ముఖ్యమైన మార్పు.. సబ్జెక్టుల సంఖ్యను తగ్గించడం. ప్రస్తుతం 63 సబ్జెక్టులలో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. తాజా మార్పుల్లో భాగంగా ఇక నుంచి 37 సబ్జెక్టులలోనే పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇలా తగ్గించిన సబ్జెక్ట్ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధించి జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకోనున్నారు.

అయిదు సబ్జెక్ట్‌లకే అవకాశం

సీయూఈటీ-యూజీ పరీక్షలో అభ్యర్థులు ఎంచుకునే సబ్జెక్టుల సంఖ్య ఆరు నుంచి అయిదుకు తగ్గించారు. అంతేకాకుండా.. విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చదివిన గ్రూప్‌తో సంబంధం లేకుండా.. సీయూఈటీ-యూజీలో ఏ సబ్జెక్ట్‌నైనా ఎంచుకునే అవకాశం కల్పిస్తారు. దీనివల్ల భవిష్యత్తులో ఫ్లెక్సిబుల్ లెర్నింగ్, మల్టీ డిసిప్లినరీ కోర్సుల్లో చేరే అవకాశం విద్యార్థులకు లభించనుంది.

ఒకటే పరీక్ష వ్యవధి

సీయూఈటీ మార్పుల్లో మరో అంశం.. అన్ని సబ్జెక్ట్‌లకు పరీక్ష సమయం ఒకే విధంగా ఉండాలని ప్రతిపాదించడం. ఇప్పటి వరకు ఆయా సబ్జెక్ట్‌లను బట్టి 45 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకూ పరీక్ష వ్యవధి ఉండేది. కానీ.. ఇకపై ఏ సబ్జెక్ట్ అయినా 60 నిమిషాలు పరీక్ష వ్యవధి లభించనుంది.

ఛాయిస్ విధానం తొలగింపు

సీయూఈటీ మార్పుల్లో విద్యార్థులకు ప్రతికూలమైనదిగా భావిస్తున్న మార్పు.. ఛాయిస్ విధానాన్ని తొలగించడం. ఇప్పటి వరకు లాంగ్వేజ్ సబ్జెక్ట్ విభాగాలు, డొమైన్ సబ్జెక్ట్ విభాగంలో 50 ప్రశ్నలకు గాను 40 ప్రశ్నలు, జనరల్ టెస్ట్‌లో 60 ప్రశ్నలకుగాను 50 ప్రశ్నలకు సమాధానం ఇస్తే సరిపోయేది. అయితే ఇక నుంచి ఈ ఛాయిస్ విధానాన్ని తొలగించాలని నిర్ణయించారు.

లాంగ్వేజ్ పేపర్ల కుదింపు

సీయూఈటీ-యూజీ కొత్త విధానంలో లాంగ్వేజ్ సంబంధిత పేపర్ల సంఖ్యను తగ్గించనున్నారు. ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాళం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ భాషల్లో లాంగ్వేజ్ ఆధారిత పేపర్లను యథాతథంగా నిర్వహిస్తారు. మిగతా 13 లాంగ్వేజ్ పేపర్లను మాత్రం తొలగించారు. ఈ లాంగ్వేజ్‌లకు సంబంధించిన బ్యాచిలర్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. గతంలో ఉన్న జనరల్ టెస్ట్ విభాగాన్ని కొత్తగా జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ విభాగంగా నిర్వహిస్తారు.

సీయూఈటీ-పీజీ మార్పులు

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే సీయూఈటీ-పీజీ పరీక్షను కూడా పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహించనున్నారు. అన్ని సబ్జెక్ట్‌లకు 90 నిమిషాలు చొప్పున సమయం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా అన్ని ప్రశ్నలకు సమాధానాలు తప్పనిసరి చేయడంతోపాటు నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంటుంది. జనరల్ పేపర్‌లో స్కిల్ బేస్డ్ ప్రశ్నలు ఉంటాయి. సీయూఈటీ-పీజీలో ప్రతి పేపర్/సబ్జెక్ట్‌లో 75 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున 300 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్షకు కేటాయించే సమయం గంటన్నర.



వేర్వేరు ప్రవేశ విధానాలు

అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో యూజీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశానికి సీయూఈటీ -యూజీని నిర్వహిస్తున్నప్పటికీ.. మలి దశలో మాత్రం ఆయా వర్సిటీలు స్వీయ ప్రవేశ విధానాన్ని అనుసరిస్తాయి. సీయూఈటీ-యూజీ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత సెంట్రల్ యూనివర్సిటీలు అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి.

56 సెంట్రల్ యూనివర్సిటీలు

కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ, పీజీ స్కోర్ ఆధారంగా దేశంలోని 56 సెంట్రల్ యూనివర్సిటీల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం; తెలంగాణలో.. ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లలో సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

సన్నద్ధతకు మార్గాలు

సీయూఈటీ-యూజీ, పీజీలో మార్పులు ప్రతిపాదించి.. వాటిపై అభిప్రాయాలను తెలపాలని యూజీసీ పేర్కొంది. దీంతో ఈ ప్రతిపాదిత మార్పులు ఖాయం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే.. సీయూఈటీలో కొత్త మార్పులకు అనుగుణంగా సన్నద్ధత కొనసాగించడం మేలు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి. డొమైన్ సంబంధిత సబ్జెక్టుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయాలి. లాంగ్వేజ్ సబ్జెక్టుల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసెజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. అదే విధంగా.. రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీపై పట్టు సాధించాలి.

జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్

ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. అదే విధంగా కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థ గణిత అంశాలు, కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై పట్టు సాధించాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ దేవదాయ శాఖలో 70 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ శాఖలో ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈఈ, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)-35, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)-05, టెక్నికల్ అసిస్టెంట్(సివిల్)-30.
» **అర్హత:** టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు ఎల్‌సీఈ డిప్లొమా, ఏఈఈ పోస్టులకు బీఈ, బీటెక్(సివిల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణులై ఉండాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హిందూ మతస్థులు మాత్రమే అర్హులు.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు ఏఈఈ పోస్టుకు రూ.35,000, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.25,000తో పాటు అదనపు అలవెన్సు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.01.2025.
» **వెబ్‌సైట్:** https://escihyd.org

జమ్మూకశ్మీర్ బ్యాంక్‌లో 278 అప్రెంటిస్‌లు

జమ్మూకశ్మీర్ బ్యాంక్‌లో దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.


» **మొత్తం ఖాళీల సంఖ్య:** 278.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణుల వ్వాలి. అభ్యర్థి సంబంధిత ప్రాంతంలోని స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
» **వయసు:** 01.01.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **శిక్షణ వ్యవధి:** ఒక సంవత్సరం.
» **స్టైపెండ్:** నెలకు రూ.10,500.
» **దరఖాస్తు ఫీజు:** అన్‌రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులకు రూ.700. రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులకు రూ.500.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.12.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.01.2025
» **వెబ్‌సైట్:** https://www.jkbank.com

నాబార్డ్ ముంబైలో 10 పోస్టులు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **పోస్టుల వివరాలు:** ఈటీఎల్ డెవలపర్-01, డేటా సైంటిస్ట్-02, సీనియర్ బిజినెస్ అనలిస్ట్-01, బిజినెస్ అనలిస్ట్-01, యూఐ/యూఎక్స్ డెవలపర్-01, స్పెషలిస్ట్-డేటా మేనేజ్‌మెంట్-01, ప్రాజెక్ట్ మేనేజర్-అప్లికేషన్ మేనేజ్‌మెంట్-01, సీనియర్ అనలిస్ట్-నెట్‌వర్క్/ఎస్‌డీడబ్ల్యూఏఎన్ ఆపరేషన్స్-01, సీనియర్ అనలిస్ట్-సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్,ఎంటెక్/ఎంసీఏ,ఎంఏ,పీజీ ఉత్తీర్ణతతో పాట ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** ఏడాదికి ఈటీఎల్ డెవలపర్, యూఐ/యూఎక్స్ డెవలపర్ పోస్టులకు రూ.12 నుంచి 18 లక్షలు, డేటా సైంటిస్ట్‌కు రూ.18 నుంచి రూ.24 లక్షలు, సీనియర్ బిజినెస్ అనలిస్ట్, స్పెషలిస్ట్-డేటా మేనేజ్‌మెంట్‌కు రూ.12 నుంచి 15 లక్షలు, బిజినెస్ అనలిస్ట్‌కు రూ.6-9 లక్షలు, ప్రాజెక్ట్ మేనేజర్‌కు రూ.36 లక్షలు, సీనియర్ అనలిస్ట్‌కు రూ.30 లక్షలు.
» **వయసు:** ఈటీఎల్ డెవలపర్, డేటా సైంటిస్ట్, సీనియర్ బిజినెస్ అనలిస్ట్‌కు 25 నుంచి 40 ఏళ్లు, బిజినెస్ అనలిస్ట్, యూఐ/యూఎక్స్ డెవలపర్‌కు 24 నుంచి 35 ఏళ్లు, స్పెషలిస్ట్‌కు 25 నుంచి 40 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 నుంచి 55 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు ఫీజు:** ఇతరులకు రూ.850. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఇంటిమేషన్ చార్జెస్ రూ.150.
» **ఎంపిక విధానం:** సర్టిఫికేట్‌ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.12.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.01.2025.
» **వెబ్‌సైట్:** https://www.nabard.org

మూడో వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?



భాగస్వామ్యం

- భాగస్వామ్యం: ఒక వ్యాపారాన్ని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉమ్మడిగా చేస్తే వారిని 'భాగస్వాములు' అని, ఆ వ్యాపారాన్ని 'భాగస్వామ్యం' అంటారు.
- భాగస్వాములందరి పెట్టుబడులు ఒకే కాలం వరకు ఉంటే, పెట్టుబడుల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.
- వేర్వేరు పెట్టుబడులు వేర్వేరు కాలాల్లో ఉంటే పెట్టుబడి, వాటి కాలాల పరిమితి లబ్ధాల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.

1. A, B అనే ఇద్దరు భాగస్వాములు వరుసగా రూ. 4,000, రూ. 6,000 పెట్టుబడులతో వ్యాపారం చేశారు. వారు సంవత్సరం వ్యాపారం చేయగా రూ.1500 లాభం వస్తే A, Bలకు వచ్చే లాభాల తేడా?
1) రూ.100 2) రూ.200
3) రూ.300 4) రూ.600

జ. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన కాలాలు సమానం అయితే లాభాల నిష్పత్తి = పెట్టుబడుల నిష్పత్తి
= 4,000 : 6,000 = 2:3
మొత్తం లాభం = 2+3 → 1500
⇒ 5 → 1500
$1 \rightarrow \frac{1500}{5} = 300$
A, B లకు వచ్చే లాభాల తేడా
= 3−2 = 1 → రూ.300

2. P, Q లు సమాన పెట్టుబడులతో వ్యాపారాన్ని ప్రారంభించారు. 9 నెలల తర్వాత Q వ్యాపారం నుంచి విరమించుకున్నాడు. ఏడాది చివర వచ్చిన లాభం రూ. 8540. అందులో Q వాటా?
1) రూ.1220 2) రూ.2440
3) రూ.4880 4) రూ.3660

జ. వ్యాపారంలో సమాన పెట్టుబడులు ఉంటే లాభాల నిష్పత్తి = కాలాల నిష్పత్తి
= 12 నెలలు : 9 నెలలు
= 4 : 3
వచ్చిన మొత్తం లాభం = 4+3 → రూ.8540
(సమస్య నుంచి)
7→ రూ.8540
$1 \rightarrow \frac{8540}{7} = Rs.1220$
Q వాటా = 3→ 3 × 1220 = రూ.3660

3. రూ.9000 పెట్టుబడితో A వ్యాపారం ప్రారంభించాడు. 5 నెలల తర్వాత రూ. 8000 పెట్టుబడితో B చేరాడు. ఏడాది చివర వారి లాభం రూ. 4100 అయితే A వాటా?
1) రూ. 2700 2) రూ. 1400
3) రూ. 4100 4) రూ. 1300

జ. వేర్వేరు పెట్టుబడులు, వేర్వేరు కాలాల్లో ఉండే లాభాల నిష్పత్తి =
పెట్టుబడి × కాలాల నిష్పత్తి
A, B ల లాభాల నిష్పత్తి =
9000 × 12 నెలలు : 8000 × 7 నెలలు
= 108:56 = 27:14
మొత్తం లాభం = 27+ 14 → 4100
41 → 4100
$1 \rightarrow \frac{4100}{41} = 100$
Aకు వచ్చే లాభం
27 → 27 × 100 = రూ. 2700

4. రూ. 8,000, రూ.4,000, రూ. 8,000 వరుస పెట్టుబడులతో రాజు, రమణ, రవిలు వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రాజు వ్యాపారం వదిలేశాడు. 8 నెలల తర్వాత రూ. 4005లాభం వచ్చింది.దానిలో రమణ వాటా?
1) రూ. 890 2) రూ.1335
3) రూ. 1602 4) రూ. 1780

జ. లాభాల నిష్పత్తి
= పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
=(8000×6):(4000×8):(8000×8)
= 48:32:64 = 3:2:4
∴ రాజు, రమణ, రవిల లాభాల నిష్పత్తి
మొత్తం లాభం = 3+2+4 → రూ. 4005
9 → రూ. 4005
$1 \rightarrow \frac{4005}{9}$
రమణ వాటా $2 \rightarrow 2 \times \frac{4005}{9} = 890$

5. రాముడు వ్యాపారం ప్రారంభించిన కొద్ది మాసాలకు రహీమ్‌ను వ్యాపారంలో చేర్చు కున్నాడు. అప్పుడు వారి పెట్టుబడుల నిష్పత్తి 4:5. ఏడాది చివరన లాభంలో రాముడు, రహీంల వాటాలు వరుసగా రూ. 3300, రూ.2750 అయితే రహీం వ్యాపారంలో ఎప్పుడు చేరాడు?
1) 8 నెలల తర్వాత 2) 6 నెలల తర్వాత
3) 4 నెలల తర్వాత 4) 3 నెలల తర్వాత

జ. రాముడు పెట్టుబడి పెట్టిన కాలం 12 నెలలు రహీం పెట్టుబడి పెట్టిన కాలం x నెలలు అనుకోండి.
పెట్టుబడుల నిష్పత్తి = 4: 5
లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
3300 : 2750 = 4 × 12 : 5× x
$5x = \frac{2750 \times 4 \times 12}{3300} = 40$
$x = 40/5 = 8$
∴ రహీం పెట్టుబడి పెట్టిన కాలం = 8 నెలలు అంటే 4 నెలల తర్వాత (12−8=4) రహీం వ్యాపారంలో చేరాడు.

6. A, B, Cలు కలిసి వ్యాపారంలో రూ. 50,000 మూలధనం సమకూర్చుకున్నారు. B కంటే A రూ. 4,000 ఎక్కువ, C కంటే B రూ. 5,000 ఎక్కువ పెట్టుబడి పెట్టారు. మొత్తం లాభం రూ. 35,000 అయితే A వాటా ఎంత?
1) రూ. 8,400 2) రూ. 11,900
3) రూ. 13,600 4) రూ. 14,700

జ. C పెట్టుబడి = x అనుకోండి
B పెట్టుబడి = x + 5000,
A పెట్టుబడి = (x + 5000) + 4000
A, B, C ల మొత్తం పెట్టుబడి
= x + (x + 5000) +
[(x + 5000) + 4000] = రూ. 50,000
(సమస్య నుంచి)
⇒ 3x+ 14,000= రూ. 50,000
⇒ x = రూ.12,000
A, B, Cల పెట్టుబడులు
= (12,000 + 5000) + 4000,
12,000 + 5000, 12,000
A, B, Cల పెట్టుబడుల నిష్పత్తి
= 21,000 : 17,000 : 12,000
= 21 : 17 : 12
మొత్తం లాభం = 21 + 17 + 12
→ 35,000
50→35,000
$1 \rightarrow \frac{35000}{50} = 700$
A వాటా 21 → 21 × 700
= రూ. 14,700

7. భాగస్వామ్య వ్యాపారంలో A, Cల పెట్టుబడి 2:1గా, A,B ల పెట్టుబడి 3:2గా ఉంది. సంవత్సరాంతాన మొత్తం లాభం రూ.3,900 అయితే A, C వాటాల తేడా ఎంత?
1) రూ.600 2) రూ.900
3) రూ.1200 4) రూ.1500

జ. A : C = 2:1, A : B = 3 : 2
$\frac{A}{B} = \frac{3}{2} = \frac{3 \times 2}{2 \times 2} = \frac{6}{4}$
$\frac{A}{B} = \frac{3}{2} = \frac{3 \times 2}{2 \times 2} = \frac{6}{4}$
A : B : C = 6 : 4 : 3(లేదా)
C : A = 1:2
A : B = 3:2
C : A : B = 1×3 : 2 ×3 : 2×2
= 3 : 6 : 4
మొత్తం లాభం
= 6 + 4 + 3 → 3,900
(సమస్య నుంచి)
13 → 3,900
$1 \rightarrow \frac{3900}{13} = 300$
A, C ల వాటాల తేడా = 6 − 3 = 3
→ 3 × 300 = రూ.900

8. డేవిడ్, గోపి పెట్టుబడుల మొత్తం రూ.40,400. ఏడాది చివర వచ్చిన మొత్తం లాభం రూ.10,000. పెట్టుబడుల నిష్పత్తిలో కాకుండా సమానంగా పంచుకుంటే డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. గోపి పెట్టుబడి?
1) రూ. 20,402 2) రూ. 19,998
3) రూ. 31,428 4) రూ. 26,868

జ. మొత్తం లాభం = రూ.10,000
సమానంగా పంచుకుంటే డేవిడ్, గోపిల లాభాలు రూ. 5,000 : రూ. 5,000
డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. కాబట్టి లాభాలను పంచాల్సిన విధానం
రూ.5050:రూ. 4950
లాభాల నిష్పత్తి = 5050 : 4950
= 101: 99
పెట్టుబడుల నిష్పత్తి = లాభాల నిష్పత్తి
= 101 : 99
పెట్టుబడుల మొత్తం
= 101+99 → రూ. 40,400
(సమస్య నుంచి)
200 → 40,400
$1 \rightarrow \frac{40400}{200} = 202$
గోపి పెట్టుబడి
99 → 99 × 202 = రూ.19,998

9. అరుణ్, వరుణ్‌ల పెట్టుబడుల మొత్తం రూ. 65,000. సంవత్సర ఆదాయం రూ. 20,000. అందులో రూ.7,000 ఖర్చులకు పోనూ మిగిలింది పెట్టుబడుల నిష్పత్తిలో పంచుకోగా అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1,000 అధికంగా వచ్చింది. అయితే వరుణ్ పెట్టుబడి?
1) రూ. 30,000 2) రూ. 35,000
3) రూ. 25,000 4) రూ. 40,000

జ. సంవత్సర ఆదాయం = రూ. 20,000
ఖర్చులకు రూ. 7,000 పోను మిగిలిన ఆదాయం = 20,000− 7000 = 13,000
రూ.13,000ను అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1000 అధికంగా వచ్చేట్లు పంచుకొనే విధానం
= రూ. 6,000, రూ. 7,000
= 6:7
పెట్టుబడుల మొత్తం = 6+7 → 65,000
(సమస్య నుంచి)
13→65,000
$1 \rightarrow \frac{65000}{13} = 5000$
వరుణ్ పెట్టుబడి 7 → 7× 5,000
= రూ. 35,000

10. A, B, Cలు వరుసగా రూ. 2,500, రూ.1,800, రూ. 2,000 పెట్టుబడి పెట్టి ఒక వ్యాపారం ప్రారంభించారు. 4 నెలల తర్వాత A తన పెట్టుబడి నుంచి రూ. 700 తీసుకొన్నాడు. తమ పెట్టుబడికి B రూ. 400, C రూ.300 కలిపారు. సంవత్సరం చివర రూ. 945 లాభం వస్తే B, C లాభాల తేడా?
1) రూ. 10 2) రూ. 20
3) రూ. 30 4) రూ. 40

జ. A, B, Cల లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలం లబ్ధాల నిష్పత్తి
= 2500×4 + (2500−700)×8 :1800×4 +(1800+400)×8:2000×4+(2000+300)×8
= 10000+14400:7200+17600:8000+18400 = 24400 : 24800 : 26400
= 61: 62: 66
మొత్తం లాభం= 61+62+66 →రూ.945
(సమస్య నుంచి)
189 →945; $1 \rightarrow \frac{945}{189}$
B, Cల లాభాల తేడా = 66 − 62 = 4
$\frac{945}{189} \times 4$ = రూ.20

మాదిరి ప్రశ్నలు

1. గోపాల్, భూపాల్ వరుసగా రూ. 3,000, రూ. 5,000 పెట్టుబడితో వ్యాపారం చేశారు. సంవత్సరాంతమున వచ్చిన లాభం రూ. 1880 అయితే గోపాల్ వాటా?
1) 705 2) 1175
3) 1435 4) 1715

2. రాణి రూ. 2525 మూలధనంతో కూరల వ్యాపారం ప్రారంభించిన కొంతకాలానికి వాణి రూ. 1,200 పెట్టుబడితో వ్యాపారంలో చేరింది. సంవత్సరాంతాన వచ్చిన మొత్తం రూ. 1664 లాభంలో రాణి వాటా రూ. 1212 అయితే వాణి ఎన్ని నెలల తర్వాత వ్యాపారంలో చేరింది?
1) 3 2) 4
3) 5 4) 6

3. లాల్ వర్తకం ప్రారంభించి కొంత కాలానికి పాల్‌ను భాగస్తునిగా చేర్చుకున్నాడు. వారి పెట్టుబడుల నిష్పత్తి 3:4. సంవత్సరాంతమున వారి లాభాల వాటాలు సమానంగా ఉన్న పాల్ వ్యాపారంలో ఉన్న కాలం ఎన్ని నెలలు?
1) 3 2) 6 3) 9 4) 12

4. ఒక వ్యాపారంలో A రూ.6,000ను 5 నెలలు, B రూ.10,000ను 4 నెలలు, C రూ.15,000ను 6 నెలలు పెట్టుబడిగా పెట్టారు. వారికి వచ్చిన లాభం రూ.8000 అయితే A వాటా?
1) రూ.4,500 2) రూ. 2,000
3) రూ. 1,500 4) రూ. 3,000

5. రూ.15,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత రూ.10,000లతో B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంతమున లాభం రూ.6,000 అయితే B వాటా?
1) రూ.2,000 2) రూ.3,000
3) రూ.4,000 4) రూ.5,000

6. రూ.30,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంత మున లాభాలను సమానంగా పంచుకున్నారు. అయితే B పెట్టుబడి?
1) రూ.15,000 2) రూ.25,000
3) రూ.35,000 4) రూ.40,000

7. A, B వరుసగా రూ. 8000, రూ.12,000లతో వ్యాపారం ప్రారంభించారు. వారు 10 శాతం లాభాన్ని దానధర్మాలు చేశారు. సంవత్సరాంతమునకు A వాటా రూ. 5400 అయితే మొత్తం లాభం?
1) రూ.13,500 2) రూ.15,000
3) రూ.14,800 4) రూ.12,000

8. A, B వరుసగా రూ.20,000, రూ.30,000లతో వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రూ. 10,000లను A అదనంగా పెట్టుబడి పెట్టాడు. కానీ రూ. 5000లను B వెనక్కు తీసుకొన్నాడు. సంవత్సరాంతానికి వారికి వచ్చిన లాభం రూ. 8400 అయితే A వాటా?
1) రూ. 2,500 2) రూ. 4,000
3) రూ. 4,400 4) రూ. 5,200

9. A, Bలు 9:6 నిష్పత్తిలో వ్యాపారం ప్రారంభించారు. సంవత్సరం చివరలో వచ్చిన లాభం రూ. 6,800ను పొరపాటున 6:9 నిష్పత్తిలో పంచుకున్నారు. అయితే Bకు వచ్చిన అదనపు లాభం?
1) రూ.2,720 2) రూ.4,080
3) రూ.1,360 4) రూ.2,180

10. A, B, C లు 2:3:5 నిష్పత్తిలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం తమ పెట్టుబడుల నుంచి ఒక్కొక్కరు వరుసగా 20%, 25%, 30% వెనక్కు తీసుకున్నారు. రెండో సంవత్సరం వారు పంచుకునే లాభాల నిష్పత్తి?
1) 32: 45: 70 2) 4: 5:6
3) 12:17:21 4) ఏదీకాదు

11. ముగ్గురు రైతులు ఒక తోటను అద్దెకు తీసుకొన్నారు. మొదటి వ్యక్తి 30 ఆవులను మూడు నెలలు, రెండో వ్యక్తి 20 ఆవులను 4 నెలలు, మూడో వ్యక్తి 15 ఆవుల్ని 8 నెలలు ఉంచారు. తోట మొత్తం అద్దె రూ.580 అయితే 3వ వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?
1) రూ. 200 2) రూ. 240
3) రూ. 320 4) రూ. 360

12. ఉమ్మడి వ్యాపారంలో A, Bలు 3:5 నిష్పత్తి పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించారు. B పెట్టుబడికి సమానంగా 6 నెలల తర్వాత C వాళ్లతో చేరాడు. ఒక సంవత్సరం చివర వచ్చిన లాభాన్ని వారు పంచుకొనే నిష్పత్తి?
1) 3: 5: 2 2) 1: 2 : 3
3) 3: 5: 5 4) 6: 10 : 5

సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 3; 5) 1; 6) 4; 7) 2; 8) 2; 9) 3; 10) 1; 11) 2; 12) 4.

ప్రధాన ఖరీఫ్ పంట ఏది?

అనాదిగా భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. శ్రామిక శక్తిలో మూడింట రెండువంతులకు వ్యవసాయం, దాని అనుబంధ కార్యక్రమాల వల్లనే జీవనాధారం లభిస్తోంది. అంతేకాకుండా దాదాపు 70 శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉండటం, భారతదేశ జాతీయ ఆర్థికాభివృద్ధి.. వ్యవసాయ రంగం అభివృద్ధిపై ఆధారపడి ఉండటం, పెరిగే జనాభాకు ఆహారాన్ని అందించడం, అనేక పరిశ్రమలకు ముడి సరుకులు అందించే దేశంగా ఉండటం, పెద్ద మొత్తాల్లో విదేశీ మారక ద్రవ్యం లభించడం మొదలైన అనేక కారణాల వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయాన్ని 'వెన్నెముక'గా చెప్పొచ్చు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ



భారతదేశం - వ్యవసాయం

భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులు రుతుపవనాలు తెచ్చే వర్షంపైన ఆధారపడి ఉండటం వల్ల భారతదేశ ఆర్థికస్థితిని రుతుపవనాలతో 'జూద మాడటం'తో అనవచ్చు. భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అయిన వాటిలో ఎగుమతి అయ్యే ముఖ్యమైన సరుకులు.. టీ, కాఫీ, ఆముదాలు, వేరుశనగ, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, పొగాకు, పత్తి, పంచదార, తోళ్లు, నూనెలు, జనపనార మొదలైనవి.

- 1900కి పూర్వం మన దేశ వ్యవసాయం మరీ పురాతన పద్ధతులలో సాగుతూ ఉండేది. 1908లో బిహార్‌లోని 'పూసా' వద్ద ఒక వ్యవసాయ కళాశాల, పరిశోధనా శాలను స్థాపించారు.
- 1937లో బ్రిటీష్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వ్యవసాయ శాఖల్ని ప్రారంభించింది.
- 1951 తర్వాత భారత వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంటే 1951లో మొదటి పంచవర్ష ప్రణాళికను రూపొందించి, అందులో వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాధాన్యతను ఇచ్చారు.
- భారతదేశంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం న్యూఢిల్లీలో ఉంది.
- వ్యవసాయోత్పత్తులను పెంచడానికి భారత ప్రభుత్వం 1963లో 'వ్యవసాయాభివృద్ధి బోర్డు' ఏర్పాటు చేసింది.

రాష్ట్రాలు/ప్రదేశం	పోడు/విస్తాపన వ్యవసాయం పేర్లు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ	పోడు వ్యవసాయం
కేరళ	పోనమ్
హిమాలయ	ఖిల్
జార్ఖండ్	కురువా
అసోం, ఈశాన్య రాష్ట్రాలు	జూమ్/ఝూం
మధ్యప్రదేశ్	బేవార్, పెండ
ఒడిశా	ధీటి
రాజస్థాన్	వాత్ర

ప్రస్తుతం మనదేశంలో విభిన్న ప్రాంతాల్లో వివిధ రకాలైన వ్యవసాయ పద్ధతులున్నాయి. వీటిని ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1. విస్తాపన వ్యవసాయం
2. తోట వ్యవసాయం
3. సాంద్ర వ్యవసాయం
4. జీవనాధార వ్యవసాయం
5. విస్తృత వ్యవసాయం
6. మిశ్రమ వ్యవసాయం

1. **విస్తాపన వ్యవసాయం:** దీన్ని స్థలమార్పిడి వ్యవసాయం లేదా సంచార వ్యవసాయం అని కూడా అంటారు. ఇది సాధారణంగా కొండ ప్రాంతాల్లోని గిరిజనులు చేసే వ్యవసాయం.
- ఈ వ్యవసాయంలో చెట్లను నరికి, వాటిని కాల్చి వ్యవసాయ భూములుగా మారుస్తారు. కొన్నేళ్ల తర్వాత అంటే భూసారం తగ్గాక ఆ భూమిని వదిలి, మరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ మళ్లీ వ్యవసాయం చేస్తారు. ఇది నిరంతరంగా కొనసాగుతుంది. అందుకే దీన్ని 'నరుకు - కాల్చు' వ్యవసాయం లేదా 'పోడు వ్యవసాయం' అని అంటారు.
- ఇటువంటి వ్యవసాయాన్ని మనదేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

2. **తోట వ్యవసాయం:** దీన్ని వాణిజ్య వ్యవసాయం అని కూడా అంటారు.
- ఈ పద్ధతిని మనదేశంలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టారు.
- లాభం లేదా ధనాన్ని సంపాదించడం కోసం 'నగదు పంటల'ను పండిస్తారు.
- ఈ వ్యవసాయానికి ఎక్కువ పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, భూమి అవసరం.
- గోధుమలు, తేయాకు, కాఫీ, రబ్బరు, బార్లీ, పత్తి, చెరకు, పొగాకు, సుగంధ ద్రవ్యాలు మొదలైన పంటలు వాణిజ్య వ్యవసాయంలో సాగు చేస్తారు.

3. **సాంద్ర వ్యవసాయం:** అధిక జనసాంద్రత ప్రాంతాల్లో ఈ రకమైన వ్యవసాయం చేస్తారు. ఇది అధికంగా వ్యవసాయ శ్రామికులను, అత్యధిక జీవ రసాయనిక ఎరువులను, నీటి పారుదలను ఉపయోగించుకొని అధిక దిగుబడి సాధించే విధానం.
- తక్కువ భూవిస్తీర్ణంలో పురాతన వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తారు.
- మనదేశంలో గంగానదీ పరీవాహక ప్రాంతం, కృష్ణా, గోదావరి, మహానది, కావేరి డెల్టా ప్రాంతాలు ఈ రకానికి ఉదాహరణగా చెప్పొచ్చు. దీనిలో సరాసరి దిగుబడి ఎక్కువ మోతాదులో ఉంటుంది.

4. **జీవనాధార వ్యవసాయం:** ఆహార అవసరాల కోసం రైతు కుటుంబం అంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి చేసే వ్యవసాయాన్ని జీవనాధార వ్యవసాయం అంటారు.
- దీనిలో ఆహార పంటలు మాత్రమే పండిస్తారు. కాబట్టి దీనిలో లాభం ఉండదు.
- దీంతో ఎక్కువగా ప్రచ్ఛన్న నిరుద్యోగం ఏర్పడుతుంది.

5. **విస్తృత వ్యవసాయం:** ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూమిలో ఎక్కువ పెట్టుబడితో చేసేదాన్ని విస్తృత వ్యవసాయం అంటారు.
- ఈ పద్ధతిలో వ్యవసాయ కూలీలు తక్కువగా ఉంటూ, యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తారు.
- ఇందులో సరాసరి దిగుబడి తక్కువ మోతాదులో ఉంటుంది.
- అమెరికా, కెనడా, రష్యా లాంటి దేశాల్లో ఈ పద్ధతి ఎక్కువగా అమల్లో ఉంది.

6. **మిశ్రమ వ్యవసాయం:** వ్యవసాయంతో పాటు పశుపోషణ లేదా కోళ్ల పెంపకం లేదా సెరికల్చర్ లేదా ఎపికల్చర్ వంటి కార్యకలాపాలు చేపడితే దాన్ని మిశ్రమ వ్యవసాయం అంటారు.

భారతదేశంలో పంట కాలాలు

వ్యవసాయ పంటలు రుతువుల మీద, సహజ వనరులైన మృత్తికలు, నీరు, సూర్యరశ్మిపై ఆధారపడి ఉంటాయి. వీటితోపాటు ఉష్ణోగ్రత, ఆర్ద్రత అంశాలు కూడా ప్రధాన మైనవి. ఏ ప్రాంతంలోనైనా రుతువులను బట్టి పంటలు మారుతూ ఉంటాయి.

భారతదేశంలో ప్రధానంగా మూడు రకాల పంటకాలాలు ఉన్నాయి. అవి..

1. ఖరీఫ్ 2. రబీ
3. జయాద్ లేదా జైద్

1. **ఖరీఫ్ (జూన్ నుంచి అక్టోబర్ మధ్య వరకు):**
- నైరుతి రుతుపవనాల రాకతో దాదాపు దేశమంతటా ఖరీఫ్ ప్రారంభమవుతుంది.
- జూన్, జూలైల్లో విత్తనాలు వేసే కాలం ప్రారంభమై సెప్టెంబర్, అక్టోబర్ మధ్య కాలంలో పంటకోతలు ప్రారంభమవుతాయి.
- వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ, కందులు, పెసలు, మినుములు, పత్తి, జనుము, వేరుశనగ, సోయాబీన్ ముఖ్యమైన ఖరీఫ్ పంటలు.

2. **రబీ (అక్టోబర్ మధ్య నుంచి ఏప్రిల్ వరకు):**
- ఈశాన్య రుతుపవనాల రాకతో దేశంలో రబీ కాలం మొదలవుతుంది.
- ఈ కాలంలోని పంటలు పెరిగేటప్పుడు చల్లని వాతావరణం, కోసేటప్పుడు వెచ్చని వాతావరణం అవసరం.
- రబీ పంటను శీతాకాలంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో విత్తి, ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు పంటలు కోస్తారు.
- పశ్చిమ విక్షోభాల వల్ల శీతాకాలంలో సంభవించే కొద్దిపాటి వర్షపాతం రబీ పంటలకు అత్యంత ఉపయోగకరం.
- దీనిలో ముఖ్యమైన పంటలు గోధుమ, బార్లీ, బఠాణీ, శనగ, ఆవాలు, పప్పుధాన్యాలు మొదలైనవి.

3. **జయాద్/ జైద్ (మే నుంచి జూన్ వరకు):**
- రబీ, ఖరీఫ్ పంట కాలాల మధ్య స్వల్ప వ్యవధిలో ఉన్న పంట రుతువును 'జయాద్' అంటారు.
- నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పుచ్చకాయలు, కర్బూజ, దోసకాయ, కూరగాయలు, పశువుల మేత వంటి స్వల్ప కాల పంటలు పండిస్తారు.

భారతదేశంలో ముఖ్య పంటలు

భారతదేశంలో పంటలను ముఖ్యంగా నాలుగు విధాలుగా విభజించొచ్చు. అవి..

1. ఆహార పంటలు
2. నగదు లేదా వాణిజ్య పంటలు
3. తోట పంటలు
4. ఉద్యానవన పంటలు

1. **ఆహారపంటలు:** వరి, గోధుమ, మొక్క జొన్న, జొన్న, సజ్జ, రాగి, పప్పుధాన్యాలు.
2. **నగదు లేదా వాణిజ్య పంటలు:** పత్తి, పొగాకు, జనుము, చెరకు, నూనె గింజలు.
3. **తోట పంటలు:** కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, రబ్బరు.
4. **ఉద్యానవన పంటలు:** కూరగాయలు, పండ్లు, పూలు మొదలైనవి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రధానమైన పంట రుతువులు? (కానిస్టేబుల్ - 2009)
   1) ఖరీఫ్, రబీ 2) ఖరీఫ్, వేసవి
   3) ఖరీఫ్, రబీ, వేసవి
   4) రబీ, వేసవి
2. సాగు చేయడంలో కార్బనిక ఎరువు, సహజ క్రిమినాశనుల మందులను ఉపయోగించే వ్యవసాయం? (కానిస్టేబుల్ - 2009)
   1) జీవనాధార వ్యవసాయం
   2) పోడు వ్యవసాయం
   3) కార్బనిక వ్యవసాయం
   4) మిశ్రమ వ్యవసాయం
3. వ్యవసాయంలో ఖరీఫ్ రుతువు దేన్ని తెలుపుతుంది? (కానిస్టేబుల్ - 2009)
   1) రుతుపవనాల ఆగమనం (జూన్-జూలై)
   2) రుతుపవనాల ఉపసంహరణ (అక్టోబర్- నవంబర్)
   3) వేసవి ఆరంభం (ఏప్రిల్-మే)
   4) పైవేవీ కావు

<u>సమాధానాలు:</u> 1) 3; 2) 3; 3) 1.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ప్రధాన ఖరీఫ్ పంట?
   1) గోధుమ 2) వేరుశనగ
   3) వరి 4) పొగాకు
2. భారతదేశంలో రబీ కాలంలో ప్రధాన పంట ఏది?
   1) వరి 2) గోధుమ 3) పత్తి 4) సజ్జ
3. 1908లో మనదేశంలో ఎక్కడ వ్యవసాయ కళాశాల, పరిశోధనాశాలను స్థాపించారు?
   1) న్యూఢిల్లీ 2) కటక్
   3) పుణే 4) పూసా
4. కేరళలో పోడు లేదా విస్తాపన వ్యవసాయానికి ఉన్న మరో పేరు?
   1) కురువా 2) పోనమ్
   3) జూమ్ 4) వాత్ర

<u>సమాధానాలు</u>

1) 3; 2) 2; 3) 4; 4) 2.

Understand the Author's Tone..

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.



BANK EXAMS

GENERAL ENGLISH

COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important to understand the tone of the author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation in English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment," So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
   1) It is the cheapest luxury man enjoys
   2) It is available free of cost
   3) It is cheaper whereas medicines in the shops are costly
   4) It is not mentioned
   5) It provides better treatment than costly medicines.
2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
   1) let others ridicule him
   2) show disrespect to Judges
   3) laugh, but simply smile at others
   4) let others laugh
   5) laugh at others
3. The writer feels laughter is to be prescribed to those who
   1) are seriously ill
   2) dislike medicines
   3) cannot buy medicines
   4) who are happy
   5) do not need medicines
4. What may sometime lock one's jaws?
   1) Laughter 2) Mirth
   3) Guffaw 4) Gurgle
   5) Titter
5. By quoting a wise saying in the last line the writer
   1) Reiterates the point that laughter is the best medicine for us
   2) Pity on those who laugh
   3) Guides us about what we should do from being laughed at
   4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
   5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went **forward** to meet her, and on reaching the tigress **stretched** out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
   1) Running threateningly
   2) Moving about in circles
   3) Attacking
   4) Targeting a victim
   5) Moving quietly without being seen or heard
7. The tigress walked straight up to the kid because
   1) It makes the kid joyous
   2) Running would frighten the kid
   3) Stalking was useless now
   4) The tigress was patient
   5) She was sure of her victim
8. The kid's behavior indicates that
   1) It was familiar with the sight of tigress
   2) It was attracted by the tigress's smell
   3) It was attracted to the tiger's food
   4) It took the tigress for a playmate
   5) It was not aware of the danger involved
9. The expression 'for the duration of a few heart beats' suggests
   1) The few seconds the tigress and the kid spent smelling each other
   2) The fear of the kid
   3) The excitement of the tigress
   4) The anxiety of the watcher
   5) The anxiety of the author
10. 'Queen' in the passage refers to
    1) The queen who came to see
    2) The lady
    3) The kid
    4) The tigress
    5) The author
11. The synonym of **forward** is
    1) Rearward 2) Onward
    3) Inward 4) Review
    5) Rejoice
12. The antonym of **'stretched'** is
    1) Expand 2) Prolong
    3) Lengthen 4) Elongate
    5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
    1) The total population
    2) A large part of the population
    3) Some part of the population
    4) Half of the population
    5) Less than half of the population
14. What is the underlying theme of the paragraph?
    1) India is a great military power
    2) India is a backward country
    3) India is fast developing into a big power
    4) India has poor economy
    5) India can never develop
15. What is the meaning of the line "India is as great as France"?
    1) India is small as compared to France
    2) India is greater than France
    3) India is on the same level as France
    4) India cannot be compared with France
    5) No other country can be compared with India

ANSWERS:

1) 1	2) 1	3) 2	4) 3
5) 3	6) 5	7) 5	8) 5
9) 4	10) 4	11) 1	12) 5
13) 3	14) 3	15) 3	